

'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+10 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 195

శనివారం 5-10-2024



అబార్షన్ హక్కెవరిది?


- ఫ్యామిలీలో



జీరో బ్రోకరేజీలకు ఇక చెల్లు!

- బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL







దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వరంగల్ శ్రీభద్రకాళి అమ్మవారు అన్నపూర్ణేశ్వరిగా దర్శనమిచ్చారు. అలంపూర్ జోగులాంబ అమ్మవారు, నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు.

• రూ.3.51 కోట్లతో ధనలక్ష్మి అలంకరణ



జోగులాంబ గద్వాల జిల్లాకేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి రూ.3,51,00,000 నగదుతో ధనలక్ష్మిగా అలంకరించారు. రూ.10 నుంచి రూ.500 కరెన్సీ నోట్లతో అమ్మవారి ప్రతిమను ఆకర్షణీయంగా అలంకరించారు. కరెన్సీ నోట్లతో పాటు చిల్లర నాణేలను అమ్మవారి ప్రతిమ ముందు ఉంచారు. - గద్వాల టౌన్

క్రిమినల్ కేసుల విచారణలో రాష్ట్ర ప్రభుత్వం సహకరించట్లేదు

- సుప్రీంకోర్టు మండిపాటు.. వట్టి జానయ్య కేసులో డీజీపీపై ఆగ్రహం
- ప్రభుత్వ వాదనలోని లోపాలపై అఫిడవిట్ దాఖలుకు ఆదేశం



సాక్షి, న్యూఢిల్లీ: క్రిమినల్ కేసుల విచారణలో తెలంగాణ ప్రభుత్వం సరిగ్గా సహకరించట్లేదని సుప్రీంకోర్టు శుక్రవారం మండిపడింది. సూర్యాపేటకు చెందిన బీఆర్ఎస్ మాజీ నేత వట్టి జానయ్య యాదవ్ దాఖలు చేసిన కేసు విచారణలో భాగంగా వర్చువల్‌గా హాజరైన రాష్ట్ర డీజీపీ జితేందర్‌ను ఉద్దేశించి సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో తమ ప్రాథమిక సందేహాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది సమాధానం చెప్పకపోవడంతో డీజీపీ హాజరుకు జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం గత విచారణ సందర్భంగా ఆదేశించడం తెలిసిందే. దీంతో తాజా విచారణకు డీజీపీ జితేందర్ వర్చువల్‌గా హాజరవగా క్రిమినల్ వ్యవహారాల్లో రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోవడం పదేపదే కనిపిస్తోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రభుత్వం తరపు న్యాయవాది వాదనలోని అసమానతలకు ఎవరు బాధ్యులని డీజీపీని నిలదీసింది. 'తప్పు ఎవరిది? మీ అధికారులదా లేదా రాష్ట్ర ప్రభుత్వానిదా? మీరు ఏ చర్య తీసుకున్నారు?' అని ప్రశ్నించింది. ఇలాంటి పొరపాట్లు మళ్లీ జరగవని... సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటామని డీజీపీ కోర్టుకు హామీ ఇచ్చినా సుప్రీంకోర్టు సంతృప్తి చెందలేదు. ఇప్పటికే తాము గమనించిన లోపాలను వివరించేందుకు స్పష్టమైన అఫిడవిట్ దాఖలు చేయాలని జస్టిస్ రాయ్ ఆదేశించారు. తాను బీఆర్ఎస్‌ను వీడి బీఎస్పీలో చేరడంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం తనపై 13 కేసులు పెట్టడాన్ని సవాల్ చేస్తూ గతేడాది సెప్టెంబర్ 20న వట్టి జానయ్య సుప్రీంకోర్టులో ఆరు స్పెల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై 2023 అక్టోబర్ 6న విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. జానయ్యపై నమోదు చేసిన 13 ఎఫ్ఐఆర్‌లలో అరెస్టు చేయొద్దని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది.

టీడీపీ నేత బొల్లినేనికి చుక్కెదురు

- మధ్యంతర ఉత్తర్వులకు హైకోర్టు నిరాకరణ
- ఈ నెల 14కు విచారణ వాయిదా



సాక్షి, హైదరాబాద్: తెలుగుదేశం పార్టీ కీలక నేత, నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్యకు చుక్కెదురైంది. మీడియాలో వస్తున్న వార్తలను కట్టడి చేయడం సాధ్యం కాదని తేల్చిచెప్పింది. హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌కు (సీసీఎస్) బదిలీ చేసిన కేసుపై కూడా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చిచెప్పింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ ఈ నెల 14కు వాయిదా వేసింది. తనకు పుట్టిన సంతానాన్ని మొదటి భార్యకే జన్మించినట్లు చూపించడానికి కృష్ణయ్య నకిలీ పత్రాలు సృష్టించినట్లు రెండో భార్య కృష్ణవేణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సైబరాబాద్ కమిషనరేట్‌లోని రాయదుర్గం ఠాణాలో కేసు నమోదైంది. బొల్లినేని కృష్ణయ్యతోపాటు ఆయనకు సహకరించిన లోటస్ హాస్పిటల్ ఎండీలు హేమ, ప్రసాద్‌లను నిందితులుగా చేర్చారు. కృష్ణవేణి రాయదుర్గం పరిధిలో నివసిస్తున్నప్పటికీ...నేరం నగరంలో జరిగినట్లు దర్యాప్తులో తేలింది. దీంతో ఈ కేసును సమగ్ర దర్యాప్తు నిమిత్తం సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో తమపై మీడియాలో వస్తున్న వార్తలను కట్టడి చేయాలని..ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ఎక్స్ వంటి వివిధ సామాజిక మాధ్యమాల్లోని పోస్టులను తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ కిమ్స్ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్యతో పాటు లోటస్ హాస్పిటల్ యజమానులు హేమమాలిని, ఆమె భర్త వీఎస్వీ ప్రసాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి...ఇప్పుడు ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని చెబుతూ, విచారణ వాయిదా వేశారు.

దసరా తర్వాతే ఎంబీబీఎస్ క్లాసులు!

దేశవ్యాప్తంగా ఇప్పటికే తరగతులు మొదలైనా 'స్థానికత' వివాదంతో రాష్ట్రంలో జాప్యం

తొలివిడత కౌన్సెలింగ్‌లో సీటు వచ్చిన వారిలో తాజాగా 4,271 మంది చేరిక



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎంబీబీఎస్ తరగతులు మరింత ఆలస్యం కానున్నాయి. జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) షెడ్యూల్‌కు అనుగుణంగా దేశవ్యాప్తంగా అన్ని మెడికల్ కాలేజీల్లోనూ ఎంబీబీఎస్ తరగతులు ఈ నెల ఒకటో తేదీ నుంచే మొదలయ్యాయి. కానీ రాష్ట్రంలో మాత్రం 'స్థానికత' విషయంలో తలెత్తిన వివాదం వల్ల కౌన్సెలింగ్ ఆలస్యం కావడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రాష్ట్రంలో ఆలస్యంగా కౌన్సెలింగ్ మొదలవగా ఇప్పుడు రెండో విడత వెబ్ కౌన్సెలింగ్ నడుస్తోంది. మొత్తం అన్ని కౌన్సెలింగ్‌లు పూర్తయ్యేసరికి ఈ నెలాఖరు వరకు సమయం పట్టవచ్చు. అయితే 15 శాతం జాతీయ కోటా సీట్లు కొన్ని కాలేజీల్లో భర్తీ కావడం, మొదటి కౌన్సెలింగ్‌లో సీట్లు పొందినవారు రిపోర్టు చేయడంతో రాష్ట్రంలో కొన్నిచోట్ల ఓరింటేషన్ తరగతులు ప్రారంభించాలని అనుకున్నారు. కానీ దసరా పండుగ ఉండటం, ఎక్కువ మంది వచ్చే పరిస్థితి లేకపోవడంతో తరగతులు ప్రారంభం కావట్లేదని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయ వర్గాలు అంటున్నాయి. ఏదిఏమైనా దసరా తర్వాతే తరగతులు మొదలవుతాయని చెబుతున్నాయి.

ఐదో విడత కౌన్సెలింగ్, మాప్ అప్ రౌండ్ లేనట్లే!

రాష్ట్రంలో ఇటీవల కన్వీనర్ కోటాకు సంబంధించి తొలివిడత వెబ్ కౌన్సెలింగ్ పూర్తవడం తెలిసిందే. ఆ కౌన్సెలింగ్‌లో 4,282 మందికి కన్వీనర్ కోటా సీట్లు కేటాయించగా వారిలో 11 మందిని మినహాయిస్తే మిగిలిన 4,271 మంది శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేటాయించిన కాలేజీల్లో చేరిపోయారు. ఈ స్థాయిలో చేరడం రికార్డని కాళోజీ వర్సిటీ వర్గాలు పేర్కొన్నాయి. జాతీయస్థాయి కౌన్సెలింగ్‌లు పూర్తవుతుండటం, ఇతర రాష్ట్రాల్లోనూ ఇప్పటికే కౌన్సెలింగ్‌లు జరగడంతో ఎక్కువ మంది విద్యార్థులు చేరినట్లు చెబుతున్నాయి. తొలివిడత కౌన్సెలింగ్‌లో మిగిలిన 11 సీట్లతో పాటు ఆ కౌన్సెలింగ్‌లో కేటాయించని దివ్యాంగులు తదితర సీట్లు ఇప్పుడు ఉన్నాయి. దీంతో రెండో విడత కౌన్సెలింగ్‌కు మరో 1,344 కన్వీనర్ కోటా సీట్లను భర్తీ చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత వెబ్ కౌన్సెలింగ్‌లో శుక్రవారం ప్రారంభమైంది. మొదటి విడతలో కొందరు తమకు వచ్చిన కాలేజీల్లో చేరినప్పటికీ ఇంకా మంచి కాలేజీల కోసం రెండో విడత కౌన్సెలింగ్‌లోనూ పాల్గొంటున్నారు. అలాంటివారు నచ్చిన కాలేజీలో చేరితే మిగిలిన సీట్లలో ఇతరులు చేరనున్నారు. రెండో విడత కౌన్సెలింగ్ తర్వాత కన్వీనర్ కోటాలో ఎక్కువ సీట్లు మిగిలే అవకాశం లేదని కాళోజీ వర్సిటీ వర్గాలు అంటున్నాయి. అందువల్ల ఈసారి ఐదో విడత కౌన్సెలింగ్‌కానీ, మాప్ అప్ రౌండ్‌కానీ ఉండకపోవచ్చని అంటున్నాయి.

తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



శ్రీనివాస్‌కు నియామక పత్రం అందిస్తున్న టీజీఓ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్‌రావు తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం శుక్రవారం కోఠిలోని ఐఎంఏ ఆడిటోరియంలో ఎన్నికైంది. తెలంగాణ కేంద్ర గెజిటెడ్ అధికారుల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన సభ్యుల ఎన్నికలను ప్రధాన ఎన్నికల అధికారిగా శ్యామ్, ఉప ఎన్నికల అధికారిగా డాక్టర్ రామారావుల నేతృత్వంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలు సభ్యుల అంగీకారం మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.శ్రీనివాస్‌లు, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్.రామాంజనేయులు, జనరల్ సెక్రెటరీగా సునీల్‌రాజ్, కోశాధికారిగా నామాల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా మాంచాల రవీందర్, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సభ్యులకు టీజీఓ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ప్రమాణ స్వీకారం జరిగింది.

ముగిసిన డిప్యూటీ సీఎం భట్టి విదేశీ పర్యటన

- శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్న భట్టి
- అమెరికా, జపాన్ దేశాల్లో పలు ప్రాంతాల పరిశీలన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విదేశీ పర్యటన ముగిసింది. ఈ నెల 24న అమెరికా, జపాన్ దేశాల పర్యటనకు వెళ్లిన భట్టి 11 రోజుల పర్యటనను ముగించుకుని శుక్రవారం రాత్రి 9:30 గంటలకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికాయి.

11 రోజుల పర్యటనలో....

విద్యుత్, ఆర్థిక శాఖ అధికారులతో కలసి రెండు దేశాల పర్యటనకు వెళ్లిన భట్టి బృందం అమెరికాలో జరిగిన అంతర్జాతీయ మైనింగ్ ఎగ్జిబిషన్ (మైనెక్స్)-2024కు హాజరైంది. కోమత్సు, హిటాచి, క్యాటర్ పిల్లర్ వంటి కంపెనీలు ఉత్పత్తి చేసిన అత్యాధునిక షావెల్స్, డంపర్లు, గనిలో ప్రమాదాలు జరగకుండా ఉండే రక్షణ వ్యవస్థలను పరిశీలించారు. ఆధునిక గ్రీన్‌ఎనర్జీ తయారీ పద్ధతులు, బొగ్గు ఉత్పత్తిలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, ఇందుకు అవసరమైన ఆధునిక సాంకేతికతలను పరిశీలించారు. భూగర్భ గనుల్లో వర్చువల్ రియాల్టీ ద్వారా గని వెలుపలే ఉండి లోపలి బొగ్గును తవ్వే సాంకేతికతను అధ్యయనం చేయడం భట్టి విదేశీ పర్యటనలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అమెరికాలోని అతిపెద్ద జలవిద్యుత్ డ్యామ్ అయిన హూవర్‌ను సందర్శించిన భట్టి బృందం జల విద్యుత్ విధానాలు, రక్షణ చర్యల గురించి తెలుసుకున్నారు. ఇక, జపాన్ పర్యటనలో భాగంగా యమనాషీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కేంద్రంలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సాంకేతికతతో పాటు సోలార్ విద్యుత్‌ను నిల్వ చేసుకునే ఫ్యూయల్ సెల్స్ టెక్నాలజీలను పరిశీలించారు. తోషిబా పరిశ్రమను సందర్శించి అక్కడ ఉత్పత్తి అవుతోన్న అత్యాధునిక ఫొటో వోల్టాయిక్ మాడ్యూల్స్ తయారీ టెక్నాలజీని తెలుసుకున్నారు. సెమీ కండక్టర్ల పరిశ్రమను సందర్శించి సెమీ కండక్టర్లు, అధిక సామర్థ్యం గల బ్యాటరీలు, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ సెమీకండక్టర్లను పరిశీలించిన భట్టి బృందం జపాన్ దేశం సమర్థవంతంగా నడుపుతున్న బుల్లెట్ ట్రైన్‌లో ప్రయాణించింది.

నల్లగొండ 'బీఆర్ఎస్ ఆఫీస్'పై యథాతథ స్థితి

- విచారణ ఈ నెల 21కి వాయిదా వేసిన హైకోర్టు సీజే ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: నల్లగొండ జిల్లా కార్యాలయ భవన క్రమబద్ధీకరణ అంశంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం యథాతథ స్థితి విధించింది. తదుపరి విచారణ వరకు ఈ మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. 'బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా కార్యాలయ భవనాన్ని క్రమబద్ధీకరించాలని ఆన్‌లైన్‌లో జూలై 3న చేసుకున్న దరఖాస్తును మున్సిపల్ కమిషనర్ తిరస్కరిస్తూ జూలై 20న ఉత్తర్వులు జారీ చేశారు. అనధికారిక నిర్మాణాన్ని 15 రోజుల్లో తొలగించాలని.. లేనిపక్షంలో మున్సిపల్ అధికారులే చర్యలు చేపడతారని పేర్కొన్నారు. కమిషనర్ ఉత్తర్వులను కొట్టేసి నల్లగొండ సర్వే నంబర్ 1506లోని ఎకరం స్థలంలో ఉన్న నిర్మాణాన్ని క్రమబద్ధీకరించేలా కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేయాలి. చట్ట ప్రకారం ఇతర పరిష్కార మార్గం ఉంటే ఆ మేరకు ఉపశమనం పొందే స్వేచ్ఛను పిటిషనర్‌కు గతంలో ఇదే అంశంపై విచారణ చేపట్టిన హైకోర్టు గత నెల ఉత్తర్వుల్లో ఇచ్చింది. ఇలాంటి వివాదాల అప్పీళ్ల విచారణకు ప్రభుత్వం మున్సిపల్ బిల్డింగ్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. అవి ఏర్పాటు కాకుండా ఎలాంటి ఉపశమనం పొందలేం. ట్రిబ్యునల్ ఏర్పాటు చేసే వరకు కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలి' అని నల్లగొండ బీఆర్ఎస్ తరఫున మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. భవన క్రమబద్ధీకరణ విషయమై గతంలోనే ఆదేశాలు ఇచ్చినా మళ్లీ రిట్ పిటిషన్ వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రూ. లక్ష జరిమానా విధించారు. ఈ మొత్తాన్ని నాలుగు వారాల్లో నల్లగొండ లీగల్ సర్వీసెస్ అథారిటీలో డిపాజిట్ చేయాలని ఆదేశించారు. సింగిల్ జడ్జి ఆదేశాలను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం స్టేటస్ కో విధిస్తూ విచారణ వాయిదా వేసింది.

మంత్రితో ముఖాముఖి సోమవారానికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: గాంధీభవన్‌లో ప్రతి బుధ, శుక్రవారాల్లో జరిగే మంత్రితో ముఖాముఖి కార్యక్రమం సోమ వారానికి వాయిదా పడ్డట్టు కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ సొంత జిల్లా నిజామాబాద్ పర్యటనలో ఉన్న నేపథ్యంలో.. ఈ కార్యక్రమం వాయిదా పడిందని తెలిపాయి. ప్రజలు సోమవారం గాంధీభవన్‌కు వచ్చి తమ విజ్ఞప్తులను.. ఆ కార్యక్రమానికి హాజరయ్యే మంత్రికి అందజేయాలని టీపీసీసీ శుక్రవారం ఒక ప్రకటనలో కోరింది.

ప్రజాభవన్ ముందు జేఎల్ అభ్యర్థుల బైఠాయింపు



ప్రజాభవన్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న జేఎల్ అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: జూనియర్ లెక్చరర్ల నియామకాలకు సంబంధించి త్వరగా నియామకపు ఉత్తర్వులు ఇచ్చేలా చొరవ తీసుకోవాలని అభ్యర్థులు ప్రజాభవన్‌కు పోటెత్తారు. 300 మంది అభ్యర్థులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డిని కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. అంతకుముందు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఇదే విషయమై విజ్ఞప్తి చేశారు. టీజీపీఎస్సీ చైర్మన్, సెక్రటరీతో మాట్లాడి డీఎస్సీ ఫలితాలతో పాటు 1,392 జూనియర్ లెక్చరర్ల తుది ఫలితాలు ఇచ్చేలా చూడాలని కోరారు. ఎమ్మెల్సీ కోదండరాంను కలిసి తమకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా టీజీపీఎస్సీ సెక్రటరీకి లేఖ రాస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ఎన్ఐసీ చేతికి ధరణి పోర్టల్

ఈనెల 29తో ముగియనున్న టెరాసస్ కంపెనీ గడువు

- సీజీజీ, టీఎస్ ఆన్‌లైన్, ఎన్ఐసీలకు అప్పగించే ప్రతిపాదనలపై చర్చ
- ఎన్ఐసీకి ఇవ్వడమే మేలన్న సీనియర్ ఐఏఎస్‌ల కమిటీ సిఫార్సు మేరకు నిర్ణయం
- ఇప్పటికే దేశంలోని పలు రాష్ట్రాల్లో భూరికార్డులు నిర్వహిస్తున్న నేషనల్ ఇన్ఫర్మేటిక్స్




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని భూమి రికార్డులు ప్రైవేటు కంపెనీ చేతుల్లోంచి జాతీయ ఏజెన్సీ చేతుల్లోకి వెళ్లబోతున్నాయి. ఈ మేరకు ధరణి పోర్టల్ నిర్వహణను పూర్తిగా 'నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ)'కు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, ఐటీ ముఖ్య కార్యదర్శి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, టీఎస్‌టీఎస్ ఎండీ నేతృత్వంలోని సీనియర్ ఐఏఎస్‌ల కమిటీ సిఫార్సు మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని రెవెన్యూ వర్గాలు వెల్లడించాయి. వాస్తవానికి ఇప్పటివరకు ధరణి లావాదేవీలు నిర్వహిస్తోన్న టెరాసస్ కంపెనీ కాంట్రాక్టు గడువు ఈనెల 29తో ముగియనుంది. ఆ తర్వాత పోర్టల్ నిర్వహణ బాధ్యతలను ఎవరికి అప్పగించాలన్న దానిపై సీనియర్ ఐఏఎస్‌ల కమిటీ చర్చించింది. ఎన్ఐసీతోపాటు సీజీజీ, టీఎస్ ఆన్‌లైన్‌లలో ఒక సంస్థకు పోర్టల్ నిర్వహణ ఇవ్వాలన్న దానిపై చర్చించిన కమిటీ.. చివరికి ఎన్ఐసీ పేరును సిఫారసు చేసింది. దీనితో ఈనెల 29 తర్వాత తెలంగాణ రాష్ట్రంలోని భూమి రికార్డులన్నీ ఎన్ఐసీ చేతుల్లోకి వెళుతున్నాయి.

ఎన్ఐసీకి అపార అనుభవం

నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ)కు భూరికార్డుల నిర్వహణలో 20 ఏళ్ల అనుభవం ఉందని రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. దేశంలోని 16 రాష్ట్రాల్లో భూముల రికార్డులను ఈ సంస్థ నిర్వహిస్తోంది. మన రాష్ట్రంలోని వెబ్‌ల్యాండ్, మాభూమితోపాటు పొరుగునే ఉన్న ఆంధ్రప్రదేశ్ భూమి రికార్డులను కూడా ఎన్ఐసీనే నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో జవాబుదారీతనం ఉండేందుకుగాను అనుభవం ప్రాతిపదికన జాతీయ ఏజెన్సీ అయిన ఎన్ఐసీకి భూముల రికార్డులను అప్పగించాలని సీనియర్ ఐఏఎస్‌ల కమిటీ సిఫార్సు చేసింది. ఈ భూరికార్డుల బదలాయింపు ప్రక్రియ సాంకేతికంగా త్వరలోనే ప్రారంభం కానుందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

దేశానికే రోల్‌మోడల్ ఆర్‌వోఆర్ చట్టం

- గులాబీ నేతలు ఆక్రమించిన భూముల్ని తిరిగి తీసుకుంటాం: మంత్రి పొంగులేటి
- దసరాలోగా అర్హులకు డబుల్ బెడ్రూంలు, స్మార్ట్ డిజిటల్ కార్డులిస్తామని వెల్లడి



నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో కొండా సురేఖ

నిజామాబాద్ అర్బన్: దేశానికే రోల్ మోడల్‌గా ఆర్‌వోఆర్ చట్టం ఉంటుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇకపై ఏ రాష్ట్రం కొత్త భూచట్టాన్ని తేవాలనుకున్నా ఆర్‌వోఆర్ చట్టాన్ని అనుసరించేలా దీన్ని సిద్ధం చేస్తున్నామని చెప్పారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లాస్థాయి సమీక్షలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ధరణి పోర్టల్‌తోపాటు గత ప్రభుత్వ తీరుతో లక్షలాది మంది భూ యజమానులు అభద్రతకు లోనై ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్నికల ముందు నాటి పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్‌రెడ్డి ధరణిని తీసేస్తామని హామీ ఇచ్చారన్నారు. అందులో భాగంగానే ఆర్‌వోఆర్ చట్టాన్ని తీసుకొస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. దీనిద్వారా ధరణిలో ఉన్న అనేక సమస్యలతోపాటు సాదా బైనామాకు సంబంధించిన భూములను కూడా చిత్తశుద్ధితో పరిష్కరిస్తామని చెప్పారు.

తొలివిడతగా ప్రతి నియోజకవర్గంలో 4 వేల ఇళ్లు..

గత ప్రభుత్వం అరకొరగా కట్టిన ఇళ్లను, మధ్యలో నిలిపివేసిన ఇళ్లను ప్రస్తుతం పూర్తి చేస్తామని.. ఆర్థిక ఇబ్బందులున్నా ఇందిరమ్మ ఇళ్లను కట్టిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. దసరాలోగా తొలివిడతగా ప్రతి నియోజకవర్గంలో 3,500 నుంచి 4,000 ఇళ్లను అర్హులకు అందిస్తామన్నారు. ప్రతి జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి చైర్మన్‌గా ఇళ్ల ఎంపిక ప్రక్రియను చేపడతారని వివరించారు. త్వరలోనే ఇళ్ల పంపిణీ విధివిధానాలను ప్రకటిస్తామన్నారు. గత పదేళ్లలో పింక్ షర్టు నేతలు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేశారని.. వాటన్నింటినీ తిరిగి తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రాంతాలలో స్మార్ట్ కార్డుల జారీకి సంబంధించిన సర్వే కొనసాగుతోందన్న మంత్రి పొంగులేటి.. ఈ నెల 7లోగా సర్వే పూర్తి చేసి దసరాలోగా ఫ్యామిలీ డిజిటల్ కార్డులు జారీ చేస్తామన్నారు. జనవరి నుంచి సన్నబియ్యం అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఖనిజ వనరుల అభివృద్ధి చైర్మన్ ఈరవత్రి అనిల్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పాల్గొన్నారు.

అమ్మా.. అమ్మా.. అంటూ..

కన్నతల్లి ఎదుటే బాలుడు సజీవ దహనం

- విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం.. ఊపిరాడక మృతి



రోదిస్తున్న తల్లి, తండ్రి

మానకొండూర్: ఆరేళ్ల బాలుడు మిట్టమధ్యాహ్నం ఇంట్లో గాఢనిద్రలో ఉన్నాడు.. హఠాత్తుగా శరీరానికి వేడి తాకింది. నిద్రలోంచి తేరుకున్న ఆ చిన్నారి చుట్టూ మంటలు.. అమ్మా.. అమ్మా.. అంటూ హాహాకారాలు చేస్తూ ప్రాణాలు కాపాడుకునేందుకు మరోగదిలోకి పారిపోయాడు. ఇంటి ఆవరణలో కొంత దూరంలో ఉన్న తల్లి మంటలను గమనించింది. కొడుకును కాపాడుకునేందుకు విశ్వప్రయత్నాలు చేసినా ఫలించలేదు. ఊపిరాడక ఆ చిన్నారి ప్రాణాలు వదిలాడు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఈదులగట్టెపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన ఈ విషాదంపై స్థానికులు తెలిపిన వివరాలివి. ఈదులగట్టెపల్లి గ్రామానికి చెందిన అగ్గిడి రాజు, అనిత దంపతులకు రితిక, కొడుకు సాయికుమార్ (6) సంతానం. సాయికుమార్ కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు స్కూల్లో యూకేజీ చదువుతున్నాడు. రాజు ఆటో డ్రైవర్, అనిత కూరగాయలు అమ్ముతుంది. దీంతోపాటు సీజన్‌లో టార్పాలిన్లు (పరదాలు) కిరాయికి ఇస్తూ ఉపాధి పొందుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో కూలర్ వేసుకుని సాయికుమార్ నిద్రిస్తున్నాడు. అనిత, రితిక ఇంటికి కొంతదూరంలో చెట్టు కింద కూర్చున్నారు. విద్యుదాఘాతంతో ఇంటి ఎదుట పందిరికి మంటలు అంటుకుని ఇంట్లోని టార్పాలిన్లకు వ్యాపించాయి. నిద్రలో ఉన్న సాయికుమార్ గమనించి 'అమ్మా.. అమ్మా.. మంటలు' అంటూ ఏడుస్తూ అరిచాడు. గమనించిన తల్లి అనిత ఇంటి వద్దకు పరుగు తీసింది. అప్పటికే మంటలు ఎగిసిపడుతున్నాయి. కొడుకును కాపాడుకునేందుకు తల్లి చేసే ప్రయత్నాలు ఫలించడం లేదు. ఈ క్రమంలో ఆమెకూ గాయాలయ్యాయి. మంటలు మరింత వ్యాపించడంతో బాలుడు తన ప్రాణాలు కాపాడుకునేందుకు.. ఇంట్లోని మరోగదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి అగ్నిమాపక శకటం చేరుకుని, మంటలార్పగా.. అప్పటికే మంటల వేడి తాళలేక, పొగతో ఊపిరి ఆడక బాలుడు మృతి చెందాడు. ఇంట్లోని సామగ్రి కాలిబూడిదైంది. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కొడుకు కళ్లెదుటే మంటల్లో కాలిపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మానకొండూర్ ఇన్‌చార్జి సీఐ స్వామి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

శనివారం 5-10-2024

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 12+10 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 195



'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'




కివీస్ ముందు తలవంచారు
టి20 ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో భారత జట్టు పరాజయం
-స్పోర్ట్స్‌లో



తలసరి ఆదాయం డబుల్!
రాబోయే దశాబ్దాల్లో జీవన ప్రమాణాలు మెరుగు: నిర్మల
- బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఇజ్రాయెల్‌కు మూడింది
హెజ్‌బొల్లా, హమాస్ తదితర గ్రూపులతో కలిసి ఇజ్రాయెల్‌పై మళ్లీ దాడులు చేస్తామని ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హెచ్చరించారు.
వివరాలు 6లో ▸



నేడే హరియాణా ఎన్నికలు
హరియాణా శాసనసభ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 90 నియోజకవర్గాల్లో నేటి ఉదయం 7కు పోలింగ్ ప్రారంభం కానుంది.
వివరాలు 6లో ▸



ధంగర్లకు ఎస్టీ హోదాపై నిరసన
ధంగర్ కులస్తులను ఎస్టీల్లో చేర్చినందుకు నిరసనగా మహారాష్ట్ర డిప్యూటీ స్పీకర్, గిరిజన నేతలు సెక్రటేరియట్ పైనుంచి దూకారు.
వివరాలు 6లో ▸



ఇంధన భద్రతకు సవాళ్లు
పశ్చిమాసియా ఘర్షణలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనే గాక ఇంధన భద్రతపైనా ప్రభావం చూపుతున్నాయని మోదీ అన్నారు.
వివరాలు 6లో ▸

'బాబు సిట్'ను పక్కన పెట్టిన 'సుప్రీం'

ఇక 'సీబీఐ సిట్'



కోట్ల మంది శ్రీవారి భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకునే స్వతంత్ర సిట్

తద్వారా దర్యాప్తుపై విశ్వసనీయత పెరుగుతుందన్న అత్యున్నత న్యాయస్థానం

- ప్రత్యేక సిట్ దర్యాప్తును పర్యవేక్షించాలని సీబీఐ డైరెక్టర్‌కి కోర్టు ఆదేశం
- ఈ మొత్తం వ్యవహారాన్ని రాజకీయ డ్రామాగా మారనివ్వబోమని వ్యాఖ్య
- నెయ్యిపై జూలైలో నివేదిక వస్తే సెప్టెంబర్‌లో ఎందుకు మాట్లాడారు?
- సీఎం చంద్రబాబును మరోసారి ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- రాష్ట్ర ప్రభుత్వ సిట్‌నే కొనసాగించాలన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. స్వతంత్ర దర్యాప్తుపై అభ్యంతరం లేదని
- సీఎం చెప్పినట్లు పత్రికల్లో చదివామన్న ధర్మాసనం
- ఆ కథనాలను పట్టించుకోవద్దన్న రోహత్గీ, లూథ్రా
- చంద్రబాబు వ్యాఖ్యలు కచ్చితంగా ప్రభావితం చేస్తాయి
- అందువల్ల స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని కోరిన కపిల్ సిబల్
- దర్యాప్తు బృందంలో ఇద్దరు సీబీఐ అధికారులు, ఇద్దరు రాష్ట్ర పోలీసులు, ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒకరు
- తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ ఆరోపణలపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు

- వివరాలు 8లో ▸

తప్పు చేసిన బాబు క్షమాపణ చెప్పాలి

మాజీ సీఎం వైఎస్ జగన్ డిమాండ్

- దేవుడిని రాజకీయాల్లోకి లాగొద్దని, పొలిటికల్ డ్రామా చేయొద్దని సుప్రీంకోర్టు అక్షింతలు వేసింది.. శ్రీవారి లడ్డూను రాజకీయం చేయొద్దని చెప్పింది
- సీఎం సొంతంగా వేసుకున్న 'సిట్'ను రద్దు చేసింది
- సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తు బృందం ఏర్పాటు
- బాబుకు దేవుడంటే భయం, భక్తి.. రెండూ లేవు
- ఇప్పటికైనా తిరుమల శ్రీవారి పాదాల చెంత తప్పయిందని వేడుకోవాలి

9లో



సిగ్గూ ఎగ్గూ లేకుండా

కోర్టు తీర్పు వక్రీకరణ

సీఎం చంద్రబాబును నిలదీసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

'ఎక్స్' వేదికగా టీడీపీ దారుణంగా అసత్య ప్రచారాలు.. కోర్టు చంద్రబాబును తప్పు పడితే మాపై దుష్ప్రచారం

9లో

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

40 మంది మృతి

దంతెవాడ-నారాయణపూర్ అడవుల్లో ఎదురు కాల్పులు

ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ ప్రకటన





రామకృష్ణ అలియాస్ కమలేశ్ (ఫైల్)



నీతి అలియాస్ ఊర్మిళ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు పార్టీకి వార్షికోత్సవాల వేళ గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 40 మంది మావోయిస్టు అగ్రనేతలు, దళ సభ్యులు చనిపోయినట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్-దంతెవాడ జిల్లాల సరిహద్దులో శుక్రవారం మధ్యాహ్నం 12:30 గంటలకు మొదలైన ఎదురుకాల్పులు రాత్రి 9 గంటల వరకు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ ఘటనలో మరణించిన 40 మందిలో తెలంగాణకు చెందిన సీనియర్ నేతలు నలుగురు ఉన్నట్టు తెలుస్తోంది. ఘటనా స్థలంలో పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం ఈ ఎన్‌కౌంటర్‌లో పోలీసులకు, భద్రతా దళాలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదు. ఈ భారీ ఎన్‌కౌంటర్‌తో సౌత్ అబూజ్‌మడ్‌తో పాటు నార్త్ బస్తర్ మావోయిస్టు కమిటీలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయని పోలీసులు ప్రకటించారు.

భారీ బలగాలతో ఆపరేషన్

భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) ఏర్పాటై

మిగతా 6వ పేజీలో ▸

నలుగురు తెలుగు నేతలు?

ఎన్‌కౌంటర్‌లో తెలంగాణకు చెందిన మావోయిస్టు అగ్రనేతలు ముగ్గురు లేదా నలుగురు చనిపోయారని ప్రచారం జరుగుతోంది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో తెలంగాణ నేతలు కీలక భూమిక పోషిస్తున్నారు. వార్షికోత్సవాల సందర్భంగా కేడర్‌లో ఆత్మస్థైర్యం నింపడంతోపాటు వారికి దిశానిర్దేశం చేసేందుకు అగ్రనేతలు సమావేశమైన సందర్భంగా ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన ఎన్‌కౌంటర్లలో 185 మంది మావోయిస్టులు మృతిచెందారు.

'జూబ్లీహిల్స్'.. అక్రమాలు ఫుల్!

సహకార హౌసింగ్ సొసైటీలో అవకతవకలు

- స్వలాభం కోసం పాలకవర్గంలోని కొందరి స్కెచ్
- చట్టాన్ని ఉల్లంఘిస్తూ కొత్తగా సభ్యత్వాలకు ఆహ్వానం
- సొసైటీలో లబ్ధిపొందిన వారు 10శాతానికి మించొద్దని నిబంధన
- ఇప్పటికే స్థలం పొందినవారు 30శాతానికిపైనే..
- అయినా మరో 800 మందిని చేర్చుకునేందుకు ప్లాన్
- రూ.5 లక్షలు కడితే సభ్యత్వం అంటూ ప్రచారం
- తెర వెనుక అనధికారిక రియల్ ఎస్టేట్ వ్యాపారం!
- సొసైటీ పాలక వర్గం తీరును నిరసిస్తూ కొందరు సభ్యుల కరపత్రాలు
- అయినా వెనక్కి తగ్గని పాలకవర్గం..



ప్రతిపాదిత వెంచర్ నమూనా

సాక్షి, హైదరాబాద్: సహకార హౌసింగ్ సొసైటీలు ఏవైనా.. సొసైటీలో ఇల్లు లేని వారికి తక్కువ ధరతో స్థలం అందేలా చూడటం, సభ్యులు చెల్లించే సొమ్మును, వారి ప్రయోజనాలను పరిరక్షించడం వాటి విధి. కానీ హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ అందుకు పూర్తి విరుద్ధంగా తయారైంది. 1962లో ఎంతో మంచి ఉద్దేశంతో ఏర్పాటైన ఈ సొసైటీ.. కొన్నేళ్ల నుంచి రూట్ మార్చుకుంది. చట్టాన్ని పట్టించుకునేది లేదు.. నిబంధనలను అమలు చేసేది లేదు.. పాలక వర్గానికి తోచిందే చట్టం, వారు పెట్టిందే నిబంధన అన్నట్టు మారింది. కొందరు వ్యక్తులు స్వలాభాపేక్షతో సొసైటీని ఆర్థిక వనరుగా మార్చుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వారు కొన్నేళ్లుగా సొసైటీని తమ చెప్పుచేతల్లో పెట్టుకున్నారని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న

మిగతా 2వ పేజీలో ▸

కర్రలతో దాడి చేసి.. పెట్రోల్ పోసి తగలబెట్టేశారు
7లో

మంత్రాల నెపంతో మహిళ దారుణ హత్య

ఇదండీ సంగతి



కార్యకర్తల కృషి వల్లే

పీసీసీ పీఠం



- నిజామాబాద్‌లో జరిగిన అభినందన సభలో బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్
- కార్యకర్త నుంచి అత్యున్నత స్థాయికి ఎదగాలంటే కాంగ్రెస్‌లోనే సాధ్యం
- వచ్చే ఎన్నికల్లో 90–100 అసెంబ్లీ, 15 ఎంపీ సీట్లు గెలుస్తాం
- స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలందరికీ న్యాయం చేస్తాం

- 7లో

నా ఫామ్‌హౌస్‌కు అధికారులను పంపండి



- ఒక్క అంగుళం ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్నా సొంతంగా కూల్చేస్తా..
- సీఎం రేవంత్‌కు కాంగ్రెస్ నేత కేవీపీ లేఖ
- బీజేపీ, బీఆర్ఎస్ నా ఫామ్‌హౌస్‌ను పావుగా వాడుకోవడం మనోవేదన కలిగిస్తోంది
- పార్టీకి నష్టం కలిగే పనిచేయను.. నాకు ఎలాంటి మినహాయింపులు వద్దు
- మూసీ ప్రక్షాళన, సుందరీకరణ ప్రాజెక్టును స్వాగతిస్తున్నట్టు వెల్లడి

2లో

గచ్చిబౌలి స్టేడియంలో క్రీడా వర్సిటీ

కొత్త క్రీడా ముసాయిదాపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- స్కిల్ వర్సిటీ తరహాలో పీపీపీ పద్ధతిలో ఏర్పాటుకు నిర్ణయం
- 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడా విధానం రూపకల్పనకు సూచన
- హైదరాబాద్‌లోని అన్ని క్రీడా మైదానాలను స్పోర్ట్స్ హబ్‌లోకి తేవాలని నిర్దేశం

8లో



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో జితేందర్‌రెడ్డి

'జూబ్లీహిల్స్'.. అక్రమాలు ఫుల్!

▶ మొదటి పేజీ తరువాయి


విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో పాతవారికి స్థలాలు మంజూరు కాకుండానే కొత్తగా సభ్యులను చేర్చుకునే అక్రమానికి తెరలేపారని మండిపడుతున్నారు. దీనికోసం దశాబ్దాలుగా ఉంటున్న వారిని సొసైటీ నుంచి తొలగించేందుకు ప్రయత్నించారని.. సంబంధిత అధికారులు దీన్ని తిరస్కరించారని సమాచారం. తమ పథకం బెడిసికొట్టినా.. కొత్త సభ్యత్వాలను మాత్రం ప్రారంభించడం గమనార్హం. టీవీ-5 చానల్ అధినేత కుమారుడు రవీంద్రనాథ్ అధ్యక్షుడిగా ఉన్న ఈ జూబ్లీహిల్స్ సొసైటీ లీలలు మరెన్నో ఉన్నాయని కొందరు సభ్యులు పేర్కొంటున్నారు.

సహకార సూత్రాల మేరకు ఏర్పాటై..

'ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సొసైటీ చట్టం'కింద 1962 జూలై 7న 'జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ (జేహెచ్‌సీహెచ్‌బీఎస్)'రిజిస్టర్ అయింది. సొసైటీ ఏర్పడినప్పుడు సభ్యుల సంఖ్య 300 మంది. సహకార సూత్రాలకు అనుగుణంగా సభ్యుల ప్రయోజనాలు కాపాడుతూ.. భూమి కొనుగోలు, అభివృద్ధి చేయాలన్నది నిబంధన. సొసైటీ కోసం 2,500 షేర్లను, ఒక్కో షేర్‌కు రూ.100 చొప్పున నిర్ణయించి.. మొత్తంగా రూ.2.5 లక్షల మూలధనంతో సొసైటీని ప్రారంభించారు. నిబంధనల మేరకు జూబ్లీహిల్స్‌లోనే ఈ సొసైటీ కార్యకలాపాలు నిర్వహించాలి. సభ్యుల్లో ఎవరైనా తన పేరిట, తన భార్య, పిల్లల పేరు మీద షేర్లు కొనుగోలు చేయవచ్చు. అయితే సొంత ఇల్లు లేనివారే సభ్యుడిగా ఉంటారు. 1964లో ప్రభుత్వం షేక్‌పేట్ సర్వే నంబర్ 403లో 1,195 ఎకరాలు, హకీంపేట్ సర్వే నంబర్ 102లో 203 ఎకరాలు కలిపి మొత్తంగా 1,398 ఎకరాలను కేటాయించింది. ఇందులో.. 1971లో 1,345.40 ఎకరాలను, 1972లో 40.67 ఎకరాలను కలిపి.. 1,386.07 ఎకరాలను సొసైటీకి అందజేసింది. సొసైటీ ఈ భూమిలో 1984 నుంచి 1991 మధ్య 3,035 మంది సభ్యులకు ప్లాట్లను అందజేసింది. సభ్యులకు ఒకసారి ప్లాట్ అందినా, లేదా సభ్యుడయ్యాక హైదరాబాద్ నగరంలో ఇల్లు ఉన్నా వారు మరో ప్లాట్ పొందేందుకు అనర్హులు.

విక్రయించడం చట్టవిరుద్ధం

ఒకరి ప్లాట్‌ను మరో సభ్యుడికి బదిలీ చేయడంగానీ, అసలు సభ్యత్వమే లేని వారికి విక్రయించడంగానీ చట్టవిరుద్ధం. ఒకవేళ ఏవైనా అనివార్య కారణాలతో సభ్యుడెవరైనా ప్లాట్ బదిలీ చేయాలని భావిస్తే.. దాన్ని సొసైటీకి అప్పగించాలి. ప్లాట్ పొందేటప్పుడు వారు చెల్లించిన మొత్తాన్ని వడ్డీతో సహా సొసైటీ తిరిగి చెల్లించాలి. ఈ స్థలాన్ని సొసైటీలో సీనియారిటీ ప్రకారం వెయిటింగ్‌లోని లబ్ధిదారులకు మంజూరు చేయాలి. వీరి నుంచి ప్రభుత్వ మార్కెట్ విలువ, ఇతర చార్జీలు వసూలు చేయవచ్చు.



సభ్యత్వ నమోదు పత్రంలో ప్లాట్‌కు సంబంధించి షరతులు

మేనేజింగ్ కమిటీ అనుమతి లేకుండా సభ్యుడు స్థలాన్ని విక్రయించడానికి వీలులేదు. అలా ఎవరైనా విక్రయిస్తే అది చట్టవిరుద్ధంగా, కొనుగోలు చేసినవారిని ఆక్రమణదారుగా పరిగణిస్తారు. ఇక సొసైటీలోని సభ్యులందరికీ ఇంటి స్థలం మంజూరుకాకుండా.. కొత్తగా సభ్యులను తీసుకోవద్దని నిబంధన చెబుతోంది. ఉదాహరణకు 90 మందికి స్థలాలు ఇచ్చే అవకాశం ఉంటే 100 మందిని సభ్యులుగా తీసుకోవాలి. లబ్ధిపొందని వారు 10 శాతానికి మించి ఉండటానికి వీలులేదు. కానీ జూబ్లీహిల్స్ సొసైటీలో స్థలాలు అందనివారు 30 శాతానికి పైనే..

800 మందిని తొలగించే ప్రయత్నం..

సొసైటీలో కేవైసీ (పూర్తి చిరునామా, ఇతర వివరాలు) లేదని, జనరల్ బాడీ సమావేశానికి హాజరుకావడం లేదని.. ఎక్కడ ఉంటున్నారో అడ్రస్ కూడా లేదని కారణాలు చూపుతూ దశాబ్దాలకుపైగా ఉన్న 800 మంది సభ్యుల తొలగింపునకు సొసైటీ పాలకవర్గం ఎత్తులు వేసింది. 2024 మార్చి 24లోగా కేవైసీ అందజేయాలంటూ సభ్యులను ఆదేశించింది. అనుకున్నదే తడవుగా వివరాలు ఇవ్వని 800 మందిని తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. జాబితా కూడా సిద్ధం చేసి పంపగా.. హౌసింగ్ అధికారులు దీనికి ససేమిరా అనడంతో తొలగింపు ప్రక్రియకు బ్రేక్ పడింది. అయితే అంగ బలం, ఆర్థిక బలంతో ఈ తొలగింపు జాబితాకు అధికారులు ఆమోదముద్ర వేసేలా తెర వెనుక ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలిసింది. సొసైటీ పాలకవర్గం తీరును నిరసిస్తూ కొందరు సభ్యులు కరపత్రాలు వేసి, పంచినా కూడా.. వెనక్కి తగ్గకపోవడం గమనార్హం.

'రియల్'దందా కోసమే..

సొసైటీలో అసలు స్థలమే లేనప్పుడు సభ్యులను తొలగించడం ఎందుకు? కొత్త వారిని చేర్చుకోవడం ఎందుకు? అనే ప్రశ్నలూ వస్తున్నాయి. ఇక్కడే సదరు అక్రమార్కులు చక్రం తిప్పడం ప్రారంభించారు. కొత్త సభ్యత్వాల పేర రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలుపెట్టారు. సొసైటీకి సంబంధం లేని వెంచర్‌లో అమ్మకాలు ప్రారంభించారు. అభివృద్ధి ప్రతిపాదనలకే పరిమితమంటూ అంటగడుతున్న ఆ వెంచర్ ఏంటి? ఎక్కడ ఉంది? ప్లాట్ల అమ్మకాల 'రియల్' కహానీ రెండో భాగంలో..

ప్రస్తుతం సొసైటీలో మొత్తం సభ్యుల సంఖ్య: 4,962 మంది	వీరిలో స్థలం పొందిన లబ్ధిదారులు: 3,035 మంది	ఇంకా ప్లాట్లు రానివారు: 1,927 మంది

సభ్యత్వ తొలగింపుపై చట్టం ఏం చెబుతోంది?

చట్టప్రకారం ఎవరి సభ్యత్వమైనా తొలగించాలంటే.. ఎందుకు తీసివేస్తున్నామో కారణాలు వెల్లడిస్తూ వారికి నోటీసులు జారీ చేయాలి. తర్వాత వారి వివరణను పరిశీలించాలి. దానిపై సంతృప్తి చెందకుంటే తీసివేతపై మేనేజ్‌మెంట్ కమిటీ నిర్ణయం తీసుకోవచ్చు. ఒకవేళ ఈ తొలగింపు చట్ట వ్యతిరేకమని సభ్యుడు భావిస్తే.. ట్రిబ్యునల్‌ను, ఆ తర్వాత కోర్టును ఆశ్రయించవచ్చు. అయితే తొలగింపుపై సొసైటీ నోటీసులు జారీచేసినా అవి చాలామందికి అందలేదని.. వారి వివరణ కూడా రాకుండానే, తొలగిస్తూ జాబితాను సిద్ధం చేశారని సమాచారం. ఇప్పటివరకు జూబ్లీహిల్స్ సొసైటీ సభ్యత్వం తొలగింపునకు సంబంధించి ఒక ఫిర్యాదు అందినట్టు తెలిసింది. ఇక కొత్తగా సభ్యులను చేర్చుకునే దానిపై కమిటీ నిర్ణయం తీసుకోవచ్చు. కానీ సొసైటీలో లబ్ధిపొందని వారు 10% దాటకుండా ఉండాలి. అలాంటిది స్థలం దక్కనివారు ఇప్పటికే 30% ఉన్నా.. కొత్త వారిని ఎలా తీసుకుంటున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై వివరణ కోరగా.. వివిధ కారణాలతో 800 మందిని తొలగించామని, ఆ స్థానంలో కొత్తవారిని తీసుకుంటున్నామని వెల్లడించారు.



మూడు దశాబ్దాలుగా ఎదురుచూపులే..

జూబ్లీహిల్స్ సొసైటీలో స్థలం మంజూరు కోసం మూడు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నవాళ్లు వందల సంఖ్యలో ఉన్నారు. వారికి స్థలం అందించే దిశగా చర్యలు లేవు. మొత్తం 1,927 మంది ఎదురుచూస్తుండగా.. పలు కారణాలతో 800 మందిని తొలగించారు. వారి స్థానంలో నిబంధనలకు విరుద్ధంగా 800 మందిని తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. మిగిలిన 1,145 మందికి స్థలాలు వచ్చే వరకు కొత్త వారిని చేర్చుకోవద్దని డిమాండ్ చేస్తున్నాం. క్లబ్ కోసమంటూ కొత్త వారిని చేర్చుకుంటే అసౌకర్యంగా మారుతుంది.

\- ప్రభాకర్‌రావు, సొసైటీ సభ్యుడు

10 శాతానికి మించి ఉండొద్దు..

కో-ఆపరేటివ్ చట్టంలోని సెక్షన్-19 ప్రకారం స్థలాలు ఉంటేనే కొత్త సభ్యులను చేర్చుకోవాలి. ప్రస్తుతానికి సొసైటీ వద్ద ఖాళీ స్థలం లేదు. అంతే కాదు స్థలం పొందని సభ్యులు 10శాతానికి మించి ఉండకూడదని హౌసింగ్ సొసైటీ నిబంధన. కొత్తవారి నుంచి షేర్ వ్యాల్యూ కేవలం రూ.300 తీసుకుని దాదాపు రూ.15 వేల కోట్ల విలువైన ఆస్తులపై వారికి కూడా హక్కులు వర్తింపజేస్తున్నారు. క్లబ్, స్కూల్, కమ్యూనిటీ సెంటర్ ఇలా అన్నింటిలో వారిని భాగస్వాములను చేస్తున్నారు. ఇది ఎంత వరకు సమంజసం?

\- విజయభాస్కర్‌రెడ్డి, సొసైటీ సభ్యుడు

సొసైటీది సహాయక పాత్ర మాత్రమే..

వివిధ కారణాలతో సొసైటీ నుంచి 800 మంది వెళ్లిపోయారు. వారికి నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. జనరల్ బాడీ ఆమోదంతోనే వారిని తొలగించాం. కొత్త సభ్యుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. 800 మందికి మించి తీసుకోం. వీరితోపాటు ఇంకా స్థలాలు రానివారు దాదాపు 1,200 మంది ఉన్నారు. ఈ రెండు వేల మంది కలిసి నిర్మించుకుంటున్న వెంచర్ జూబ్లీహిల్స్ ఫేజ్-4. కాస్ట్ టు కాస్ట్ (ఖర్చులు) ధరకే వీరికి ప్లాట్లు అందనున్నాయి. వీరంతా సొసైటీ సభ్యులే అయినందున మేం ఫెసిలిటేటర్‌గా ముందుకు వచ్చాం. వెంచర్‌ను నిపుణులైన కమిటీ పర్యవేక్షిస్తుంది. సొసైటీకి సంబంధించి ఒక్క రూపాయి కూడా వెంచర్ కోసం ఖర్చు చేయడం లేదు. చట్టప్రకారం, జనరల్ బాడీ అనుమతితోనే చర్యలు చేపడుతున్నాం.

\- రవీంద్రనాథ్, సొసైటీ అధ్యక్షుడు

అవినీతి మానేసి హామీలపై దృష్టిపెట్టండి

- సీఎం రేవంత్‌కు లేఖలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- దొడ్డు వడ్లకు కూడా రూ.500 బోనస్ ప్రకటించాలని డిమాండ్
- లేకపోతే రైతుల తరఫున పోరాడతామని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: మూసీ సుందరీకరణ పేరిట అవినీతి ఆలోచనలు మానుకొని ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు హితవు పలికారు. మూసీ ప్రక్షాళన కోసం రూ. లక్షన్నర కోట్లు ఖర్చు పెడతామంటున్న ముఖ్యమంత్రికి రైతు భరోసా, దొడ్డు వడ్లకు బోనస్ ఇచ్చేందుకు డబ్బులు లేవా? అని ప్రశ్నించారు. రాష్ట్ర రైతాంగానికి ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ దుయ్యబట్టారు. ఈ మేరకు సీఎం రేవంత్‌కు కేటీఆర్ శుక్రవారం లేఖ రాశారు. సీఎం నిర్వహించిన వ్యవసాయ సమీక్షలో దొడ్డు వడ్లకు రూ. 500 బోనస్, వర్షాకాలంలో రైతు భరోసా వంటి అంశాలపై చర్చించలేదని విమర్శించారు. గత సీజన్‌లోనూ రైతులకు వరి ధాన్యంపై బోనస్ చెల్లించకుండా ప్రభుత్వం మోసగించిందని ఆరోపించారు. కేవలం సన్న వడ్లకే బోనస్ ఇస్తామనే ప్రకటనతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. 80 శాతం మంది రైతులు దొడ్డు వడ్లు పండిస్తారని తెలిసి కూడా కేవలం సన్న వడ్లకే ప్రభుత్వం బోనస్ ఇస్తామని ప్రకటించడం సరికాదన్నారు. దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వకుంటే రైతుల తరఫున బీఆర్‌ఎస్ పోరాడుతుందని కేటీఆర్ హెచ్చరించారు.

రైతు భరోసా సంగతి తేల్చండి: వానాకాలం సీజన్ పూర్తయినా ప్రభుత్వం రైతు భరోసా సంగతి తేల్చడం లేదని కేటీఆర్ లేఖలో మండిపడ్డారు. రైతుబంధు పథకం పేరును రైతు భరోసాగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎకరాకు రూ. 15 వేలు ఇస్తామనే హామీని విస్మరించిందని, నేటికీ రైతులకు పెట్టుబడి సాయం అందించలేదని దుయ్యబట్టారు. రైతులకు బాకీ పడిన రైతు భరోసాను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 100 శాతం రుణమాఫీ చేస్తామని ప్రకటించినా 20 లక్షల మంది రైతులకు నేటికీ మాఫీ వర్తించలేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు అవుతున్నా రైతులకు మేలు జరగట్లేదని.. రేవంత్ చేతకానితనం అన్నదాతలకు శాపంగా మారిందని కేటీఆర్ ధ్వజమెత్తారు.

డబ్బులు దండుకోవడానికే హైడ్రా

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్: డబ్బులు దండుకోవడానికే సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా పేరుతో కూల్చివేతలను ముందుకు తీసుకొచ్చారని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. హైడ్రా.. ఒక దుర్మార్గమైన ఆలోచన అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలోని అంశాలను పక్కన పెట్టి, హైడ్రాను ముందుకు తీసుకురావడంలో ఆంతర్యమేమిటో చెప్పాలన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మైలార్‌గూడెం గ్రామానికి వచ్చిన ఆయన.. విలేకరులతో మాట్లాడారు. అఖిలపక్ష సమావేశం, కేబినెట్ నిర్ణయాలు లేకుండా హైడ్రాను తీసుకువచ్చి, కూల్చివేతల పేరుతో ప్రజలను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రుణమాఫీ పేరుతో ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. భువనగిరి మండలం చందుపట్లలో రైతులకు రుణమాఫీ చేయకుండా సాంకేతిక సమస్యల వల్ల కాలేదని చెప్పడం విడ్డూరమన్నారు. 9 నెలలుగా రైతుబంధు ఊసే లేదని, రైతులకు వడ్డీ లేని రుణాలను ఇస్తానని ప్రభుత్వం మరచిపోయిందని అన్నారు. రాష్ట్రంలో ఎంతవరకు రుణమాఫీ జరిగిందో పక్కాగా వివరాలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంపై సీఎం ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదో చెప్పాలన్నారు. వెంటనే కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. ఈ వివాదంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు తప్పుచేశారని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఢిల్లీకి సీఎం రేవంత్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదివారం రాత్రి ఢిల్లీ వెళ్లనున్నారు. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో తీవ్రవాద నిరోధంపై నిర్వహించనున్న అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, హోంమంత్రుల సమావేశానికి హాజరయ్యేందుకు ఆయన ఢిల్లీ వెళ్తున్నారని సీఎంవో వర్గాలు వెల్లడించాయి. తన పర్యటనలో భాగంగా ఇటీవల సంభవించిన వరదల్లో నష్టపోయిన వారికి పరిహారంగా కేవలం రూ. 500 కోట్లు మాత్రమే కేంద్రం మంజూరు చేసిన నేపథ్యంలో.. మరోమారు వరద నష్టంపై కేంద్రానికి ఆయన నివేదించనున్నారు. వీలును బట్టి కాంగ్రెస్ పార్టీ, కేంద్ర ప్రభుత్వ పెద్దలను కూడా ఆయన కలిసే అవకాశాలున్నాయి.

మూసీనది పునరుజ్జీవానికి ప్రజలు మద్దతివ్వాలి

మల్లన్నసాగర్ నుంచి 2టీఎంసీల నీరు మూసీనదికి తీసుకొస్తాం: మంత్రి ఉత్తమ్



మఠంపల్లి: నిజాం పరిపాలనా కాలం నుంచి ఉన్న మూసీనది కాలుష్యంగా మారుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం నది పునరుజ్జీవానికి చర్యలు చేపడుతుందని, దీనికి ప్రజలు మదతు తెలపాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సూర్యాపేట జిల్లాలోని మట్టపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ... మూసీనది పునరుజ్జీవం ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు, వేలాది మంది ప్రజలకు తాగునీరు అందుతుందన్నారు. మూసీ నది దశాబ్దాల కాలంగా కాలుష్యం కోరల్లో చిక్కుకున్నదని, నది పునరుజ్జీవానికి తమ ప్రభుత్వం చేస్తున్న కృషిని హర్షించాలని కోరారు. మూసీనది ప్రక్షాళన తర్వాత మల్లన్నసాగర్ నుంచి 2టీఎంసీల నీటిని గండిపేటకు...అక్కడి నుంచి మూసీనదిలోకి తీసుకొస్తామని తెలిపారు.

ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టండి: ఎంపీ చామల



సాక్షి, హైదరాబాద్: మానవ తప్పిదాల వలన కాలుష్యమైన మూసీ నదిని శుద్ధి చేసుకోలేమా అని ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. గత ప్రభుత్వాలు విస్మరించిన మూసీ ప్రక్షాళనకు రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకుంటే ప్రతిపక్షాలు కుట్రలకు పాల్పడి అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ కుట్రలను మూసీ పరీవాహక ప్రాంత రైతాంగం తిప్పికొట్టాలని శుక్రవారం ఓ ప్రకటనలో ఆయన కోరారు. మూసీ ప్రక్షాళనకు మద్దతుగా పరీవాహక ప్రాంత రైతులతో శనివారం నాగోల్‌లోని శుభం గార్డెన్స్‌లో సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చి మద్దతివ్వాలని ఎంపీ చామల కోరారు.

కేసీఆర్‌ది రైతు గుండె.. రేవంత్ రెడ్డిది రాతి గుండె

సీఎం మొనగాడు కాదు.. మోసగాడు

- కాంగ్రెస్ హామీల అమలుకు ఢిల్లీలో రాహుల్ ఇంటిని ముట్టడిస్తాం
- తొర్రూరు రైతుధర్నాలో మాజీ మంత్రి హరీశ్‌రావు



ధర్నాలో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో రాజయ్య, సత్యవతి, కవిత, ఎర్రబెల్లి, మధుసూదనాచారి, పల్లా తదితరులు

సాక్షి, మహబూబాబాద్: 'తెలంగాణ సాధించిన కేసీఆర్.. పదేళ్ల పాలనలో రైతు పక్షపాతిగా ఉన్నారు. ఆయనది రైతుగుండె.. కానీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులను మోసగించిన సీఎం రేవంత్‌రెడ్డిది రాతి గుండె'అని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అందరికీ రుణమాఫీ చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్న డిమాండ్లతో శుక్రవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో బీఆర్‌ఎస్ రైతు మహాధర్నా నిర్వహించింది. ఈ ధర్నాలో హరీశ్‌రావు మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు కల్లబొల్లి మాటలు చెప్పి, నేనే మొనగాడిని.. రాష్ట్రాన్ని బాగుచేసేది నేనే అని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి అసలు స్వరూపం బయట పడిందన్నారు. ఆయన మొనగాడు కాదు .. మోసగాడని ప్రజలు గ్రహించారని చెప్పారు. రుణ మాఫీ పై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఒకతీరు.. మంత్రి తుమ్మల మరోతీరు మాట్లాడి రైతులను అయోమయానికి గురి చేస్తున్నారని విమర్శించారు. సీఎం మాటలు నమ్మిన రైతులు రూ.2 లక్షలకు పైగా ఉన్న అప్పులు చెల్లించారని, రుణమాఫీ అవుతుందని అధిక వడ్డీకి డబ్బులు తెచ్చి ఇప్పు డు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకు సీఎం రేవంత్‌రెడ్డిని, ప్రభుత్వాన్ని విడిచి పెట్టేది లేదని హరీశ్ అన్నారు. హామీల అమలుకు దసరా తర్వాత ఢిల్లీలోని రాహుల్‌గాంధీ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. మంత్రుల్ని, ఎమ్మెల్యే లను నిలదీయాలని ఆయన పిలుపు నిచ్చారు. కాగా, ధర్నా సందర్భంగా ఓ తొండ తాటికొండ రాజయ్య చొక్కాలోకి వెళ్లడంతో కార్యకర్తలు అప్రమత్తమై దానిని తీసివేశారు. దీంతో కొంతసేపు నవ్వులు విరిశాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఈడబ్ల్యూఎస్ అమలుతో బీసీలకు తీవ్ర నష్టం

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలు వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, దీనిపై తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కోరారు. తెలంగాణ సచివాలయ మీడియా పాయింట్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుపై సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశానన్నారు. బీసీలకు ఇవ్వాల్సిన అంశాన్ని నిశితంగా పరిశీలించి, సరిచేయాలని సీఎంను కోరానని తెలిపారు. గతంలో మధ్యప్రదేశ్, కర్ణాటక హైకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ కాపీలను కూడా సీఎంకు ఇచ్చానని వెల్లడించారు. బీసీలకు న్యాయం జరగకపోతే ఏసీసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆశయాలు దెబ్బతింటాయని, ఆయన ఆలోచనలకు వ్యతిరేకంగా జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో డీఎస్సీలో ఈడబ్ల్యూఎస్ కింద 2050 వచ్చిన వాళ్లకు సీటు వస్తే..అదే 820 వచ్చిన బీసీలకు మాత్రం సీటు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కవితకు సీబీఐ చార్జిషీట్‌పై విచారణ

రౌజ్ అవెన్యూకోర్టులో వర్చువల్‌గా కవిత, నిందితుల హాజరు.. 19కి విచారణ వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానంపై సీబీఐ దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీట్‌పై విచారణ వాయిదా పడింది. శుక్రవారం రౌజ్ అవెన్యూ కోర్టుకు ఎమ్మెల్సీ కవిత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాతోపాటు ఈ కేసులోని నిందితులు వర్చువల్‌గా హాజరయ్యారు. గత విచారణలో భాగంగా.. చార్జిషీట్‌లో పేజీలు సరిగా లేవని, కొన్ని పేజీల్లో అక్షరాలు స్పష్టంగా లేవని కవిత సహా నిందితుల తరఫు న్యాయవాదులు న్యాయమూర్తికి తెలిపారు. వారితో ఏకీభవించిన కోర్టు.. చార్జిషీట్‌ను సరైన పద్ధతిలో పేర్చి ప్రతులను అందజేయాలని ఆదేశించారు. తదుపరి విచారణను అక్టోబరు 4కు వాయిదా వేశారు. తాజాగా ఈ కేసు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా ముందుకు వచ్చింది. అప్‌డేట్ చేసిన ప్రతులను నిందితులకు అందించేందుకు మరికొంత సమయం కావాలని సీబీఐ కోరింది. దీంతో ఈనెల 19కి వాయిదా వేస్తున్నట్లు ట్రయల్ కోర్టు వెల్లడించింది.

కూల్చివేతలపై వివరణ ఇవ్వండి: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో హైడ్రా కూల్చివేతలపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రెటరీ, హైడ్రాకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేస్తూ, ఆ లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. 'సరైన సర్వే నిర్వహించి ఆక్రమణలను గుర్తించే వరకు భవనాలను కూల్చివేయకుండా హైడ్రాకు ఆదేశాలు జారీ చేయాలి. బాధితులకు నోటీసులు జారీ చేయాలి. వారు ఇళ్లు ఖాళీ చేయడానికి లేదా కోర్టును ఆశ్రయించడానికి నెల రోజుల సమయం ఇవ్వాలి. పేదలను గుర్తించి సమగ్ర పునరావాసం అమలు చేయాలి. దేశవ్యాప్తంగా సరస్సులు, ప్రభుత్వ ఆస్తుల రక్షణకు సమగ్ర చట్టాన్ని రూపొందించేలా కేంద్రాన్ని ఆదేశించాలి'అని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం శుక్ర వారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం..ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేసింది.

నా ఫామ్‌హౌస్‌కు అధికారులను పంపండి

ఒక్క అంగుళం ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్నా సొంతంగా కూల్చేస్తా..

- సీఎం రేవంత్‌కు కాంగ్రెస్ నేత కేవీపీ లేఖ
- బీజేపీ, బీఆర్‌ఎస్ నా ఫామ్‌హౌస్‌ను పావుగా వాడుకోవడం మనోవేదన కలిగిస్తోంది
- పార్టీకి నష్టం కలిగే పనిచేయను.. నాకు ఎలాంటి మినహాయింపులు వద్దు
- మూసీ ప్రక్షాళన, సుందరీకరణ ప్రాజెక్టును స్వాగతిస్తున్నట్టు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: తన ఫామ్‌హౌస్‌లోని ఏ కట్టడమైనా ఒక్క అంగుళం ఎఫ్‌టీఎల్ లేదా బఫర్‌జోన్‌లో ఉన్నా సొంత ఖర్చులతో కూల్చుకునేందుకు సిద్ధంగా ఉన్నానని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ కేవీపీ రామచందర్‌రావు ప్రకటించారు. ''కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా నాకు చట్టం నుంచి ఏ మినహాయింపులు వద్దు. ఒక సాధారణ పౌరుడి విషయంలో చట్టం ఏవిధంగా వ్యవహరిస్తుందో, అదే విధంగా వ్యవహరిస్తే చాలు. ఎక్కువ-తక్కువలు అవసరం లేదు. మీరు, నేను కలగజేసుకోకుండా చట్టాన్ని తన పని చేసుకుపోనిద్దాం ''అని పేర్కొంటూ శుక్రవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి కేవీపీ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎటువంటి చెడ్డపేరు తేవడానికి తనలో నరనరాన ఉన్న కాంగ్రెస్ రక్తం అంగీకరించనందునే ఈ బహిరంగ లేఖ రాస్తున్నానని పేర్కొన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత గల కాంగ్రెస్ కార్యకర్తగా ప్రాంతాలకు అతీతంగా జాతీయ పార్టీ కాంగ్రెస్ బలోపేతానికి తన శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు.

మూసీ ప్రక్షాళనను స్వాగతిస్తున్నా..

హైదరాబాద్ శివార్లలోని అజీజ్‌నగర్‌లో ఉన్న తన ఫామ్‌హౌస్‌కు సంబంధిత అధికారులను పంపాలని.. వారు చట్టప్రకారం మార్క్ చేస్తే ఆ పరిధిలో కట్టడాలేవైనా ఉంటే 48 గంటల్లో కూల్చి, ఆ వ్యర్థాలను కూడా తొలగిస్తానని కేవీపీ లేఖలో పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వానికి ఎలాంటి భారం పడనివ్వబోనని తెలిపారు. అయితే మార్కింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని.. తేదీ, సమయాన్ని ముందే ప్రకటిస్తే ప్రతిపక్ష నాయకులు కూడా తీరిక చేసుకుని వచ్చి వీక్షించే అవకాశం కలుగుతుందని వెల్లడించారు. మూసీ ప్రక్షాళన, సుందరీకరణను స్వాగతిస్తున్నానని తెలిపారు. ఈ ప్రాజెక్టు విషయంలో బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు వారి స్వప్రయోజనాలను కాపాడుకోవడం కోసమే మాట్లాడుతున్నారని, వారిది మొసలి కన్నీరని విమర్శించారు. ''బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు మీ భుజంపై తుపాకీ పెట్టి నన్ను కాల్చాలని, తద్వారా మిమ్మల్ని ఇరుకున పెట్టాలనే ప్రయత్నం చేస్తున్నారు. వారు కాంగ్రెస్ సీఎంపై నిరాధార ఆరోపణలు చేయడానికి నన్ను, మా ఫామ్‌హౌస్‌ను పావుగా వాడుకోవడం మనోవేదన కలిగిస్తోంది. నేను కాంగ్రెస్‌లో క్రమశిక్షణ గల కార్యకర్తను. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకునే ప్రతి కార్యక్రమాన్ని త్రికరణ శుద్ధిగా సమర్థిస్తాను. ఈ విషయాన్ని ఒక కాంగ్రెస్ ముఖ్యమంత్రికి చెప్పవలసి రావడం బాధాకరమే అయినా తప్పడం లేదు''లేఖలో కేవీపీ పేర్కొన్నారు.

'మూసీ'లో రూ.లక్ష కోట్ల స్కాం: కౌశిక్‌రెడ్డి


హుజూరాబాద్‌లోనూ పేదల ఇళ్లకు రెడ్ మార్క్ వేస్తున్నారని ధ్వజం



సాక్షి, హైదరాబాద్: మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల కుంభకోణం దాగి ఉందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని ప్రశ్నించిన బీఆర్‌ఎస్ నేతలపై సీఎం రేవంత్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో పలువురు పార్టీ నేతలతో కలిసి కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. సీఎం ఉన్మాదిగా మారి పేదల ఇళ్లను కూల్చేస్తున్నారని.. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూరాబాద్ నియోజకవర్గంలోనూ పేదల ఇళ్లకు రెడ్ మార్క్ వేస్తున్నారని దుయ్యబట్టారు. తన నియోజకవర్గంలో ఒక్క ఇల్లు కూల్చినా హుజూరాబాద్ అగ్నిగుండం అవుతుందని హెచ్చరించారు. కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని నల్ల చెరువును బీఆర్‌ఎస్ నేతలు ఆక్రమించారన్న సీఎం వ్యాఖ్యలను ఖండించారు. నల్ల చెరువు పరిరక్షణ కోసం చుట్టూ కట్ట నిర్మించినా రైతులు కోర్టు కెక్కడంతో జీహెచ్‌ఎంసీ తొలగించిందన్నారు. హైదరాబాద్‌లో చెరువులు, కుంటల కబ్జాపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ సూట్‌కేసు కంపెనీల నుంచి రూ. కోట్లను అక్రమంగా బదిలీ చేశారని.. ఈ విషయాన్ని ఈడీ కూడా నిర్ధారించిందని ఆరోపించారు. సీఎం రేవంత్ వద్దే హోంశాఖ ఉండటంతో ఎమ్మెల్యే వివేక్‌ను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. కానీ త్వరలో చెన్నూరు ఉపఎన్నిక ఖాయమన్నారు.

అక్రమమైతే ఎవరిదైనా కూల్చాల్సిందే

- నాకు ఇప్పటివరకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు
- రూల్స్ ప్రకారం లేకుంటే మీరందరూ రండి నేనే దగ్గర ఉండి కూల్చివేస్తా: ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: అక్రమమైతే ఎవరి ఇళ్లు, ఫాంహౌస్ అయినా కూల్చాల్సిందేనని, కూల్చాలా..? వద్దా..? అనేది అధికారుల పని అని మండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ సచివాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారమే 20 ఏళ్ల క్రితం తాను ఫామ్‌హౌస్ కట్టుకున్నానని, అది ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని మాజీమంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి ఆరోపిస్తున్నారని ధ్వజమెత్తారు. రూల్స్ ప్రకారం లేకుంటే మీరందరూ తన వద్ద కు వస్తే తానే దగ్గరుండి కూల్చివేస్తానని స్పష్టం చేశారు. ఇప్పటివరకు తన ఫామ్‌హౌస్ వద్ద ఐదుసార్లు అధికారులు సర్వే చేశారని, అయినా ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని, నోటీసులు ఇవ్వనప్పుడు ఎలా కూలుస్తారని ప్రశ్నించారు. కేటీఆర్ జన్వాడ ఫామ్‌హౌస్‌కు పర్మిషన్ ఉందా.? లేదా..? అనేది అధి కారులు చూసుకుంటారన్నారు. మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫామ్‌హౌస్‌ల దగ్గరే తాను కట్టుకున్నానన్నారు. అప్పట్లో గ్రామ పంచాయతీ అనుమతితో కట్టుకున్నామని, ఒకవేళ ఆ అనుమతి చెల్లదంటే...ఆ నిబంధనలు అందరికీ వర్తిస్తాయని వ్యాఖ్యానించారు.


RAMRAJ
కాటన్
భారతీయ సంస్కృతి
ప్రతి నూలుపోగులో సంప్రదాయం విజయోత్సవంతో మన జాతికి చెందిన గౌరవమర్యాదలను కనుగొనండి
ఈ దసరాపండుగ సంప్రదాయాన్ని ప్రతిబింబించే వస్త్రధారణతో, పండుగ కాలపు విజయోత్సవస్ఫూర్తితో అడుగుపెట్టింది. ప్రతి వేడుక కోసం ఉత్పత్తి చేయబడుతోన్న మన సంప్రదాయ వస్త్రాలను మరియు ధోవతులను రామ్‌రాజ్ కాటన్ మీకు అందిస్తోంది. సదాచారం మరియు వారసత్వపు వస్త్రాల ద్వారా సంప్రదాయం మరియు సాంస్కృతిక విజయానికి చేయూతనివ్వండి.
SCAN QR CODE FOR STORE LOCATION
Power of Trust
India's Most Trusted Dhoti Brand
RAMRAJ COTTON SHOWROOMS
AMEERPET : MAHBOOB COMMERCIAL COMPLEX | LAKDIKAPOOL : VASAVI NAGAR | BODUPPAL : BUDHA NAGAR, KARACHI BAKERY | DILSUKH NAGAR : TIRUMALA COMPLEX | KOTHAPET : MARGADARSI CLY, RAMAKRISHANAPURAM
DR.A.S.RAO NAGAR : MK.REDDY'S MANSION, LAXMIPURAM | PARADISE : GROUND FLOOR, M.G.ROAD | TRIMULGHERRY : PLOT NO-67, P&T COLONY | KUKATPALLAY : BHAGYA NAGAR COLONY | VANASTHALIPURAM : GANESH NAGAR, SAHEBNAGAR KHURD VILLAGE
CHANDANAGAR : SERILINGAMPALLY | CHAMPAPET : PRESS COLONY | KONDAPUR : BAJAJ ELECTRONIC | MEHDIPATNAM : PILLAR NO: 33, RETHI BOWLI | SUCHITRA : PETBASHEERABAD VILLAGE | MADHAPUR : OPP: METRO PILLAR, HITECH CITY MAIN ROAD
CHIKKADPALLY : NEAR VENKASTEWARA TEMPLE, CHICKADPALLY MAIN ROAD | SUNCITY : OPP. AXIS BANK, GROUND FLOOR | SANGAREDDY : GROUND FLOOR, 10-27, POTHEREDDIPALLE | ZAHEERABAD : HANUMAN STREET, OPP. BSNL OFFICE, 9 MAIN ROAD
JANGAON : OPP. HDFC BANK, COLLECTORATE OFFICE LANE | CHINTAL: BESIDE BAJAJ ELECTRONICS, INDIAN PETROL PUMP LANE | HASTHINAPURAM : BESIDE SBI BANK,NAGARJUNA NAGAR | NAGARAM : SRICHAKRIPURAM MAIN ROAD, KUSHAIGUDA
SHADNAGAR : RAILWAY STATION ROAD,SHADNAGAR | GAJWEL : IDBI BANK, 10-3, GAJWEL MAIN ROAD | NACHARAM : OPP.VIJAYANTHI CINEMA, VEERA REDDY COLONY | MANIKONDA : KSN NILAYAM, PIPE LINE ROAD, PUPPALAGUDA
PRAGATI NAGAR : OPP. TO VIJETA SUPERMARKET, LAHARI ESTATES NEAR INCOIS | SHAMSHABAD : NEAR SATYAM HIGH SCHOOL RAL AGUDA ROAD | ISNAPUR : ISNAPUR X ROAD PHILLIPS CARBON BLACK LTD, TSIIC PASHAYLARAM
FOR ENQUIRIES : FRANCHISEE : +91 97511 47147 | DISTRIBUTOR : +91 90477 25147 | CORPORATE ORDERS : +91 95140 68147
Available @ Ramraj Showrooms & All leading Textile Shops | Shop Online at www.ramrajcotton.in

కర్మ ప్రారంభించకపోయినా (పాప పుణ్యాలు అంటుకుంటాయన్న ఆలోచనతో), చేస్తున్న కర్మలను ఆపినా మోక్షం లభించదు.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 5 అక్టోబర్ 2024

జైళ్లా... కులతత్వ కూపాలా!

కులతత్వం బందీఖానాలో మగ్గుతున్న మన జైళ్లకు ఎట్టకేలకు 'విముక్తి' లభించినట్టే! రాజ్యాంగం అమల్లోకొచ్చి 74 యేళ్లవుతున్నా మనుస్మృతిని మించి ఆలోచించని మన కారాగారాల దివాంధత్వాన్ని ఎండగడుతూ గురువారం సర్వోన్నత న్యాయస్థానం కీలక ఆదేశాలిచ్చింది. ఖైదీల పుట్టుక ఆధారంగా వారిపై వివక్ష ప్రదర్శించటం, పనులు అప్పజెప్పటం రాజ్యాంగ విరుద్ధమనీ, ఈ దురాచారాన్ని మూడు నెలల్లో కట్టిపెట్టి ఆ సంగతి తెలియజేస్తూ నివేదికలు దాఖలు చేయాలనీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం రాష్ట్రాలనూ, కేంద్ర పాలిత ప్రాంతాలనూ ఆదేశించటం హర్షించదగ్గ పరిణామం. జైళ్లు సంస్కరణాలయాలంటారు. నేరాలకు పాల్పడుతూ సమాజానికి తలనొప్పిగా మారిన వ్యక్తులను సంస్కరించటం ధ్యేయంగా కారాగారాలు ఏర్పడ్డాయి. కానీ అక్కడా బయటి సమాజంలాగే కులం కుళ్లు నిండివుందనీ, దాని ఆధారంగా భయంకరమైన వివక్ష కొనసాగుతున్నదనీ... రాజ్యాంగ అధికరణలను ఉల్లంఘిస్తూ జైళ్లలో అంటరానితనం, వెట్టిచాకిరీ రాజ్యమేలుతున్నాయనీ ఆంగ్ల వెబ్‌సైట్ 'ది వైర్'లో పనిచేస్తున్న పాత్రికేయురాలు సుకన్యా శాంత నాలుగేళ్ల క్రితం పరిశోధనాత్మక కథనం రాశారు. దాని ఆధారంగా నిరుడు సుప్రీంకోర్టులో ఆమె ప్రజాప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలు చేశారు. ఆ పిటిషన్ పర్యవసానంగానే తాజా తీర్పు వెలువడింది. వలస పాలకుల హయాంలో ఎప్పుడో 1894లో రూపొందిన కారాగారాల చట్టం ఆధారంగా తయారైన మాన్యువల్‌లోని అంశాలే అన్ని జైళ్లలో అమలవుతున్నాయి. వాటిని పాలకులెవరూ పట్టించుకోలేదని కాదు. 2016లో కేంద్రం నమూనా మాన్యువల్‌ను తీసుకొచ్చింది. నిరుడు నమూనా జైళ్ల చట్టం కూడా రూపొందింది. కానీ జైళ్లు, మాన్యువల్స్ ఏమాత్రం మారలేదు. కానీ అడిగేదెవరు?

నిర్బంధానికీ పుట్టుకకూ, నిర్బంధానికీ నిరక్షరాస్యతకూ, నిర్బంధానికీ నిస్సహాయతకూ మధ్య అవినాభావ సంబంధం ఉన్నదని మన దేశంలో పదే పదే రుజువవుతోంది. జైలు శిక్షలు అనుభవిస్తున్నవారు మాత్రమే కాదు, విచారణలో ఉన్న ఖైదీల్లో సైతం అత్యధికులు నిరుపేదలూ, నిరక్షరాస్యులూ, అట్టడుగు కులాలవారూ, ఆదివాసీలూ ఉండటం యాదృచ్ఛికం కాదు. ఈ వర్గాలవారు దాదాపు 65 శాతం వరకూ ఉంటారు. ప్రపంచ దేశాల్లో ఈ వర్గాల సగటు 32 శాతానికి మించదని అనేక నివేదికలు చెబుతున్నాయి. యూపీఏ ఏలుబడిలో చేయని నేరానికి అరెస్టయి తొమ్మిదేళ్లపాటు ఢిల్లీ, మహారాష్ట్ర జైళ్లలో మగ్గిన పౌరహక్కుల నాయకుడు ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ఇటీవల నిర్దోషిగా విడుదలయ్యాక మీడియా సమావేశంలో ప్రధానంగా ప్రస్తావించింది జైళ్లలోని కుల వివక్ష గురించే. జైళ్లలో కుల వ్యవస్థ అమలవుతోందనీ, ఖైదీలకు కులాన్నిబట్టి పనులు ఇవ్వాలని మాన్యువల్‌లో సైతం ఉన్నదనీ ఆయన చెప్పినప్పుడు అందరూ నివ్వెరపోయారు.

స్వాతంత్ర్యం వచ్చి 77 యేళ్లవుతున్నా ఈ దురాచారాలు అమలవుతున్నాయంటే బయటి సమాజంలో ఉండేవారు నమ్మలేరు. ఇవే దురాచారాలు సాధారణ పౌరులు పాటిస్తే వాటి పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. కఠిన శిక్షలు పడతాయి. కానీ ఎంతో నాగరికంగా కనబడే రాజ్యమే కారాగారాల్లో ఈ దారుణాలు అమలు చేయడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఉదాహరణకు దారి దోపిడీలు, ఇతరేతర నేరాలు చేస్తున్నవారు ఫలానా జాతులవారు గనుక వారిపై 'నేరస్త జాతులు' అనే ముద్రవేశారు వలసపాలకులు. రాజ్యాంగం అమల్లోకొచ్చాక అలాంటి దురాచారం రద్దయింది. కానీ ఇప్పటికీ జైళ్లలో సంచార, నేరస్త జాతులకు చెందినవారిగా కొందరిని వర్గీకరించి వారిని విడిగా ఉంచుతున్నారనీ, వారితో అమానవీయమైన పనులు చేయిస్తున్నారనీ సుప్రీంకోర్టు నిర్ధారించింది. అలాగే జైలు రిజిస్టర్‌లో కులం గురించిన కాలమ్ ఉండటం, ఖైదీలను కులాలవారీగా విభజించటం, అట్టడుగు కులాలవారితో మరుగుదొడ్లు శుభ్రం చేయించటం, ఇతర పారిశుద్ధ్య పనులు అప్పగించటం యథేచ్ఛగా కొనసాగుతున్నదని ధర్మాసనం గుర్తించింది. పుట్టుక ఆధారంగా వివక్ష ప్రదర్శించరాదని రాజ్యాంగంలోని 15(1) అధికరణ చెబుతోంది. 17వ అధికరణ అంటరానితనం నేరమంటున్నది. వెట్టి చాకిరీ చేయించరాదని 23వ అధికరణ అంటున్నది. ఇంకా 14వ అధికరణ పౌరులందరినీ సమానంగా చూడాలని, 21వ అధికరణ జీవించే, స్వేచ్ఛగా మసలే హక్కు కల్పించాలని నిర్దేశిస్తోంది. ఇవన్నీ ప్రాథమిక హక్కులు. ఈ హక్కులను రాజ్యమే ఉల్లంఘించటం ఎంత అపచారం!

మహారాష్ట్ర మాన్యువల్ 'నేరస్త మహిళలు, వ్యభిచార మహిళలు, తార్పుడుగత్తెలు, యువ మహిళా ఖైదీలు' అంటూ విభజించిందట. 'సాధారణ జైలుశిక్ష పడిన ఖైదీలు కిందికులాల వారైతే తప్ప తక్కువ స్థాయి పనులు అప్పగించరాదని ఉత్తరప్రదేశ్ మాన్యువల్ చెప్తోంది. ఫలానా కులస్తులను మాత్రమే పారిశుద్ధ్య పనికి వినియోగించాలనీ, కిందిస్థాయి కులాలవారు వండిన ఆహారాన్ని ఆధిపత్య కులాల ఖైదీలు నిరాకరించవచ్చనీ మరో మాన్యువల్ ప్రవచిస్తోంది. వివక్ష వెనక కుల,మత విశ్వాసాలుంటే పట్టించుకోరాదని బెంగాల్ మాన్యువల్ సుద్దులు చెబుతోంది. ఇవన్నీ చూస్తే జైళ్లలో మనకు తెలియని, మన రాజ్యాంగాన్ని అపహాస్యం చేసే మరో సమాంతర వ్యవస్థ అమలవుతున్నదని అర్థమవుతుంది. ఒక సమాజ నాగరికత స్థాయిని అక్కడి జైలుని చూసి చెప్పవచ్చని విఖ్యాత రచయిత దాస్తోవిస్కీ అన్నాడు. ఇన్ని దశాబ్దాలుగా మన మధ్యే కొనసాగుతూ వచ్చిన ఈ అధమస్థాయి వ్యవస్థ మూడు నెలల్లోపు కాదు, తక్షణం రద్దు కావాలని మానవీయతగల ప్రతి ఒక్కరూ కోరుకుంటారు.

ఆంగ్లం లేకుండా ఎదగ్గలమా?

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

ప్రపంచమంతా ఇంగ్లిష్ ప్రాధాన్యతను గుర్తిస్తోంది. యూరోపియన్ యూనియన్ ఇకనుంచీ జర్మన్‌కు బదులుగా ఇంగ్లిష్ అధికారిక భాషగా ఉంటుందని ప్రకటించింది. ప్రపంచంలోని చాలా దేశాలు తమ మాతృభాషతో పాటు ఆంగ్ల మీడియం పాఠశాల విద్యకు మారుతున్నాయి. కానీ భారతదేశం మాత్రం కాలాన్ని వెనక్కి తిప్పడానికి ప్రయత్నిస్తోంది. ఇంగ్లిష్ భాషను వలసవాదంతో ముడిపెట్టడం విధానపరమైన తప్పిదం. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యను నిర్వీర్యం చేసేందుకు నడుం బిగించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో మొదలైన ఆంధ్ర మోడల్ విద్యా ప్రయోగం దుష్ట రాజకీయ శక్తుల కుట్రవల్ల ఆగిపోకూడదు.

యావత్ ప్రపంచం ఇంగ్లిష్‌ను పాఠశాల స్థాయి బోధనా భాషగా స్వీకరిస్తున్న సమయంలో, భారతదేశం ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో ఇంగ్లిష్ విద్యకంటే వెనుకటి రోజులకు కాలాన్ని తిప్పుతోంది. ఇంగ్లిష్ భాషను వలసవాదంతో ముడిపెట్టడం ఒక ప్రధాన విధానపరమైన తప్పిదం. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇంగ్లిష్ ఒక వలస భాష అనే సిద్ధాంతాన్ని మరింత స్పష్టంగా తీసుకొస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత, భారతదేశంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మాధ్యమ విద్యపై జరిగిన మొట్టమొదటి అతి పెద్ద ప్రయోగాన్ని వెనక్కి తిప్పేశాయి. ఇప్పటికే కొత్త ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరి చేసిన సీబీఎస్ఈ సిలబస్‌ను ఉపసంహరించుకుంది. 'అమ్మ ఒడి' పేరుతో తల్లులకు సంవత్సరానికి ఇచ్చే 15,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని నిశ్శబ్దంగా నిలిపివేశారు. సహజంగానే, కూటమిలో భాగంగా అధికారంలోకి వచ్చిన మూడు పార్టీలు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మాధ్యమాన్ని ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించాయి. అవి ప్రైవేట్ రంగ ఇంగ్లిష్ మాధ్యమ విద్యకు గట్టిగా మద్దతు ఇచ్చాయి. ప్రభుత్వ రంగంలోని అన్ని పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యను నిర్వీర్యం చేసి మళ్లీ తెలుగు మీడియం వైపు మళ్లించేందుకు అన్ని విధాలా నడుం బిగిస్తామన్న స్పష్టమైన సంకేతంతో, ప్రైవేట్ ఇంగ్లిషు మీడియం స్కూళ్లు, కాలేజీల యజమాని నారాయణను మళ్లీ మంత్రిని చేశారు చంద్రబాబు. ఈ దిశ స్పష్టంగా ఉంది.

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కూడా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం విద్యను అనుమతించొద్దనే విషయంలో స్పష్టంగా ఉంది. ఎన్డీయేలోని ప్రధాన నేతలు నరేంద్ర మోదీ, అమిత్ షా, నితీష్ కుమార్, చంద్రబాబు నాయుడు అందరూ ఈ విషయమై ఒకే మాట మీద ఉన్నారు. నితీష్ కుమార్ అయితే తన సమావేశాల్లో పార్టీ నాయకుడైనా, అధికారి అయినా ఇంగ్లిష్‌లో మాట్లాడినా ఇష్టపడరు.

సుప్రీంకోర్టులోనూ, ప్రతి హైకోర్టులోనూ అన్ని వ్యవహారాలు ఆంగ్లంలో ఉండాలని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 348(1)(ఎ) పేర్కొన్నప్పటికీ, ప్రాంతీయ భాషను ఉపయోగించాలంటూ సుప్రీం కోర్టు, హైకోర్టులను కూడా ఒత్తిడి చేసే ప్రయత్నం జరుగుతోంది.

ఈ రకమైన విద్యా విధానం పట్ల ఆంధ్రప్రదేశ్‌లో లేదా జాతీయ స్థాయిలో కాంగ్రెస్ మౌనంగా ఉంది. రిజర్వేషన్లు ఉన్నా లేకపోయినా, భవిష్యత్తులో కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న యువత ప్రైవేట్ ఇంగ్లిషు మీడియంలో చదువుకున్న యువతతో పోటీపడే అవకాశం లేదని ఇది చూపుతోంది. అందరూ మాట్లాడిన 'ఆంధ్రా మోడల్' సృష్టించిన ఆశ నిరాశగా మారుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం విద్యా విస్తరణకు భారత కమ్యూనిస్టు పార్టీలు, గ్రూపులు కూడా అడ్డంకిగా మారాయి.



బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్, అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్

దేశంలో ఇంగ్లిష్ విద్య 1817లో ప్రారంభమైంది. ఇది భారతదేశంలో ఆ భాష ప్రవేశించిన 207వ సంవత్సరం. అక్టోబర్ 5న భారతీయ ఇంగ్లిష్ దినోత్సవం అనే విషయం తెలిసిందే. భారతదేశంలో ప్రతి సంవత్సరం ఒక్కో భాషా దినోత్సవ వేడుకలు జరుగుతాయి. కానీ ఇంగ్లిష్‌ను ప్రపంచ, భారతీయ అవకాశాల భాషగా నేర్చుకుని, దాని నుండి ప్రయోజనం పొందినవారు... అధికారం, సంపద, ప్రపంచ చలనశీలత భాషగా దాన్ని ఉపయోగిస్తున్నప్పటికీ ఒక భాషగా ఆంగ్ల దినోత్సవాన్ని జరుపుకోరు. పైగా బహిరంగ వేదికల నుండి దాన్ని వలస భాషగా ఖండిస్తూనే ఉంటారు.

ఇంగ్లిషు భాష నుండి అత్యధికంగా ప్రయోజనం పొందిన వ్యక్తులు అగ్రవర్ణాలు, ముఖ్యంగా బ్రాహ్మణులు, బనియాలు, కాయస్థులు, ఖత్రీలు. చారిత్రకంగా భారతీయ పాలక కులమైన క్షత్రియులు ఈ భాష శక్తిని ఇటీవలే గ్రహించారు. వారి పిల్లలను ఇంగ్లిష్ మాధ్యమంలో చదివిస్తున్నారు.

ఆంగ్లం వల్లే ప్రపంచ స్థాయి

కమలా హ్యారిస్ భారతీయ సంతతికి చెందిన బ్రాహ్మణ మహిళ. 245 సంవత్సరాల రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం ఉనికిలో ఉన్న అమెరికాకు మొదటి మహిళా అధ్యక్షురాలిగా అవతరించే అవకాశం ఉంది. ఆ దేశంలో ఇప్పటి వరకు ఏ శ్వేతజాతీయురాలూ అధ్యక్షురాలు లేదా ఉపాధ్యక్షురాలు కాలేదు. కమల ఇప్పటికే అమెరికా తొలి ఉపాధ్యక్షురాలు అయ్యారు. వలసరాజ్యాల కాలంలో ఇంగ్లిష్ భారత దేశానికి రాకపోతే, ప్రపంచ భాషగా ఇంగ్లిష్ లేకుండా ఉంటే ఇది సాధ్యమయ్యేదా? తమిళ బ్రాహ్మణ సంప్రదాయ కుటుంబంలో పుట్టి పెరిగిన అమ్మాయి అయిన ఆమె తల్లి శ్యామలా గోపాలన్ ఇంగ్లిష్ చదవకుండా ఉండి ఉంటే అమెరికా వెళ్లి తన జీవితాన్ని తీర్చిదిద్దుకుని తన ఇద్దరు కూతుళ్లు కమల, మాయలను చదివించి ఉండేవారా? ఒక సాధారణ మధ్యతరగతి ఒంటరి తల్లి కుటుంబం నుండి వచ్చిన కమల ఇంగ్లిష్ భాష లేకుండా, తన స్థాయికి తగ్గ లాయర్‌గా ఎదిగి, ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన దేశానికి ఉపాధ్యక్షురాలిగా ఎదిగి, ఇప్పుడు అత్యంత సంపన్నుడైన శ్వేతజాతి అమెరికన్ డోనాల్డ్ ట్రంప్‌ను అధ్యక్ష రేసులో సవాలు చేసే అవకాశాన్ని పొందగలదని మనం ఊహించగలమా?

పశ్చిమ భారతదేశానికి చెందిన ఖత్రీ కుటుంబానికి చెందిన రిషి సునాక్ తల్లిదండ్రులు ఇంగ్లిష్ భాషలో విద్య నేర్వకపోయి ఉంటే, రెండు వందల సంవత్సరాలకు పైగా భారతదేశాన్ని పాలించిన బ్రిటన్‌కు ఆయన ప్రధాన మంత్రి కావడం మనం ఊహించగలమా? భారతదేశం స్వాతంత్ర్యం సాధించే నాటికి అగ్రవర్ణాల ఇళ్లలోని సాంస్కృతిక వాతావరణాన్ని ఇంగ్లిష్ మార్చింది. కానీ ఆ భాష పరిధిని, శక్తిని ఉపయోగించి అనేక విధాలుగా ప్రయోజనం పొందిన అదే వ్యక్తులకు ఇప్పుడు రైతులు, కార్మికుల పిల్లలు ఆ భాష నేర్చుకోవడం ఇష్టం లేదు. ఇది వైరుధ్యం కాదా?

యూరప్ కూడా ఆంగ్లం దిశగా...

యూరోపియన్ యూనియన్ ఈ సంవత్సరం ఇకనుంచీ జర్మన్‌కు బదులుగా ఇంగ్లిష్ అధికారిక భాషగా ఉంటుందని ప్రకటించింది. ప్రపంచంలోని చాలా దేశాలు తమ మాతృభాషతో పాటు తమ పాఠశాలల్లో ఆంగ్ల మీడియం పాఠశాల విద్యకు మారుతున్నాయి. ఫ్రాన్స్, జపాన్, చైనా, రెండు కొరియన్ దేశాలు ఒకే జాతీయ భాషతో వ్యవహరిస్తున్నప్పటికీ, మొదటి నుండీ తమ పాఠశాలల్లో ఆంగ్లాన్ని బోధించడం ప్రారంభించాయి.

ప్రపంచీకరణ చెందిన ప్రపంచంలో భాషతో ముడిపడి ఉన్న జాతీయవాదం తగ్గుముఖం పట్టింది. రెండవ ప్రపంచ యుద్ధానంతర సందర్భంలో బ్రిటిషేతర దేశాలన్నీ తీవ్రమైన భాషాపరమైన మనోభావాలను కలిగి ఉండేవి. కానీ ప్రతి ఐరోపా దేశం కూడా ఇప్పుడు ఆర్థికాభివృద్ధికి ఇంగ్లిష్ తప్పనిసరి అని గ్రహించింది. మునుపటి ఫ్రెంచ్, స్పానిష్ కాలనీలు కూడా నెమ్మదిగా తమ పాఠశాలల్లో ఆంగ్ల బోధనకు మారుతున్నాయి.

భావోద్రేక భరితమైన మాతృభాష సిద్ధాంతంతో భారతదేశం అనేక చిన్న భాషలు మాట్లాడే జాతులుగా విభజించబడింది. శూద్రులు, దళితులు, ఆదివాసీలు తమదైన చిన్న భాషా ప్రపంచంలో ఇరుక్కుపోయారు. ఈ రకమైన భాషాపరమైన నిర్బంధం వారిని సరైన పౌరసత్వ పాత్రలోకి ఎదగనివ్వదు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించినటువంటి విద్యా ప్రయోగానికి దుష్ట రాజకీయ శక్తుల కుట్రతో చావుదెబ్బ తగలకూడదు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త
(నేడు ఇండియన్ ఇంగ్లిష్ డే)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇలా ఎంతకాలం?



1982లో ఇజ్రాయెల్ ఎడ తెరిపి లేని బాంబుదాడులు, గుళ్లవర్షంతో బీరూట్‌ను 70 రోజులు ముట్టడించింది. పశ్చిమ బీరూట్‌కు ఆహారం, నీటిని అందకుండా చేసింది. అప్పటి పీఎల్ఓ (పాలస్తీనా విముక్తి సంస్థ) సభ్యులు, సాధారణ పౌరుల నిష్పత్తి 1:80. మళ్లీ రాత్రి అత్యంత దారుణమైన దాడి బీరూట్ మీద జరిగింది. అయినప్పటికీ ఎవరూ కాల్పుల విరమణ గురించి మాట్లాడే ధైర్యం చేయడం లేదు. ఇది ఎంతకాలం సాగుతుంది?

– యఎల్ ముజ్రాహీ అర్నోద్, పరిశోధకురాలు

కూతుళ్ల లాంటివారు!



దశాబ్దాలుగా పాకిస్తానీలు తమను తాము ఉన్నత ముస్లింలుగా, కశ్మీరీలను వెన్నులేని వాళ్లుగా చిత్రించడానికి ప్రయత్నిస్తుంటారు. స్త్రీద్వేషి జకీర్ నాయక్‌ను పాకిస్తాన్ ఆహ్వానించింది. 'గైర్ మహరమ్' (స్థూలంగా పెళ్లాడదగినవాళ్లు) అని చెబుతూ ఆయన అనాథ బాలికలతో కలవడానికి నిరాకరించారు. ఎప్పటికీ ఇంత మూర్ఖులు కానంతగా కశ్మీరీలు విముక్తులయ్యారు. మన సమాజంలో అనాథ బాలికలను కూతుళ్లుగా పరిగణిస్తాం.

– యానా మీర్, మీడియా పర్సనాలిటీ

పోయినట్టేనా?



అంటే, ఇప్పుడు హరియాణా ఎన్నికల్లో బీజేపీ ముఖం – నడ్డా : మోదీ కాదు. అలాగే రెండుసార్లు ముఖ్యమంత్రిగా బయటికి తోయబడ్డ ఎం.ఎల్.ఖట్టర్‌ను బీజేపీ అభ్యర్థులు తమ ప్రచారాల్లో కోరుకోవడం లేదు. సంకేతాలను గమనించండి.

– స్వాతి చతుర్వేది, జర్నలిస్ట్

ఆ తర్వాత?



మొదటి మెట్టు – హిందువులు బీఫ్ తినరు. రెండో మెట్టు – హిందువులు మాంసం, చేపలు తినరు. మూడో మెట్టు – హిందువులు ఉల్లిగడ్డ, ఎల్లిగడ్డ, మసూర్ దాల్ (ఎర్ర కందిపప్పు) తినరు.

– దేవ్‌దత్ పట్నాయక్, రచయిత

అంత మాత్రమే!



హెజ్బొల్లా ప్రాథమికంగా మంచి పీఆర్ (ప్రజా సంబంధాలు)ను కలిగివున్న ఐసిస్ మాత్రమే. వాళ్లకు తోడు మర్మం తెలియని లెఫ్టిస్టు సమర్థకుల గుంపు.

– ఐమన్ దీన్, రచయిత, అల్ కాయదా మాజీ సభ్యుడు

లంక కామ్రేడ్ల నుంచి స్ఫూర్తి పొందాలి!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

భారత్ పొరుగు దేశమైన శ్రీలంకలో మార్క్సిస్టు నాయకులైన అనూర కుమార దిస్సనాయకే దేశ అధ్యక్షుడుగానూ, హరిణి అమరసూర్య ప్రధాన మంత్రిగానూ ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో ఆసియా రాజకీయాల్లో పెను ఆసక్తికర, ఆహ్వానించదగిన పరిణామాలకు ఆస్కారం ఏర్పడింది. భారత దేశంలోని ఎన్డీయే–ఆరెస్సెస్ వినాశకర కూటమి ప్రభుత్వం శ్రీలంకలోని మితవాద పక్ష పాలకులతో 'జోడీ' కట్టి చిరకాలంగా వర్ధిల్లుతున్న భారత్–శ్రీలంక స్నేహపూర్వక సంబంధాలలో 'చిచ్చు' పెట్టింది. ఈ విషమ పరిణామానికి సకాలంలో విరుగుడుగా వచ్చిందే సింహళంలో వామపక్ష పరిపాలన.

శ్రీలంక సమగ్రాభివృద్ధిని కాంక్షించి, పాక్షిక ధోరణుల్లో గాక శ్రీలంక ప్రత్యేక అవసరాలను దృష్టిలో పెట్టుకుని అధికారాన్ని చేపట్టారు మార్క్సిస్టు నాయకులు. అలాంటి పరిణామాన్నే భారతదేశంలోనూ ఆవిష్కరించగల అవకాశం ఉన్నా... చీలి కలు పీలికలుగా ఉన్న వామపక్షాలు ఒకే తాటిపైకి రాలేకపోతున్నాయి. నాయకులు తమ పదవులను త్యజించి విస్తృత ప్రాతిపదికన ఒకే ఒక పార్టీగా ఆవిర్భవించడానికి కృషి చేయడం లేదు. ఎన్డీయే కూటమి దుష్ట ఇజ్రాయెల్‌తో కలిసి దేశంలోని ప్రగతివాద శక్తులపై నిఘాపెట్టి నానా ఇబ్బంది పెట్టిన చరిత్ర తెలియంది కాదు. ఈ ప్రమాదం నుంచి దేశాన్ని రక్షించుకోవాలంటే దేశంలోని వామ పక్షాలన్నీ 'చిల్లర తగాదాలు' మానుకుని ఐక్య వామపక్ష ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లాలి. ఇందుకు శ్రీలంక చూపిన 'ఐక్య ఉద్యమ స్ఫూర్తి'ని భారత వామపక్షాలన్నీ తక్షణం పొందాల్సిన అవసరం ఉంది.

ఇదే సందర్భంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దేశంలో ఆచరణలో నిజమైన ఫెడరల్ వ్యవస్థను పాదుకొల్పడానికి కేంద్ర, రాష్ట్రాల మధ్య సమతులమైన అధికారాల పంపిణీ నొక్కి వక్కాణించారు. ఫెడరల్ వ్యవస్థ సూత్రాల ప్రకారం, కేంద్రం ఇప్పుడు రాష్ట్రాల నుంచి వసూలు చేస్తున్న సెస్‌లు, ఇతర పన్నులను అదే దామాషా ప్రకారం రాష్ట్రాలకు పంచి తీరాల్సిందేనని భట్టి కోరారు.

దీన్నిబట్టి చూస్తే, ఇరుగు–పొరుగైన శ్రీలంకలో అంతటి భారీ స్థాయిలో వామపక్ష నేతల ఆధ్వర్యంలో క్రమానుగతంగా సాగక తప్పని పరిస్థితులు ఎందుకు వచ్చాయో భారత వామపక్షాల నేతలు కేవలం గుర్తించడమేగాదు, ఆచరణలో దేశంలో ఐక్య ఉద్యమ నిర్మాణానికి పునాదుల్ని పటిష్టం చేసుకొనక తప్పదు. ఇటాలియన్ మాఫియా నుంచి, ఇజ్రాయెల్ గూఢచారుల నుంచి భారతదేశ తక్షణ రక్షణకు దేశంలోని వామపక్షాలన్నీ సిద్ధం కావాలి. నిరుపేదలైన షెడ్యూల్డ్ తరగతులకు చెందిన అట్టడుగు వర్గాల ప్రజలపైనే 13 రాష్ట్రాలలో దారుణమైన అత్యాచారాలు నమోదయ్యాయని తాజా నివేదికలు సాధికారికంగా ప్రకటించాయి. వీటన్నింటికి ముగింపు ఎప్పుడు? ఫెడరల్ వ్యవస్థ పునరుద్ధరణ ద్వారానేనని ఆ నివేదికలు తెలియజేస్తున్నాయి.

రెండో మాట



శ్రీలంక అధ్యక్షుడు అనూర కుమార దిస్సనాయకే

ఎన్డీయే – ఆరెస్సెస్ కూటమి ప్రభుత్వ నాయకులు ఈ దశలో, ముఖ్యంగా చైతన్యశీలి అయిన ప్రస్తుత సుప్రీం ప్రధాన న్యాయమూర్తి 2025 నాటికి గానీ పదవీ విరమణ చేసే అవకాశం లేదు కాబట్టి, ఆ లోగా 'ఒక దేశం, ఒకే ఎన్నిక, ఒకే ప్రధాని' అన్న నినాదంతో ప్రస్తుత కేంద్ర పాలకులు ఏ అఘాయిత్యం చేసే అవకాశం లేదు. ఈలోపు దేశీయ వామపక్షాలు, సంబంధిత వర్గాలన్నీ ఒక్క తాటిపై కదిలి రాగల కార్యాచరణ వ్యూహానికి శ్రీకారం చుట్టాలి.

శ్రీలంకలో కమ్యూనిస్టు – మార్క్సిస్టుల అనుభవం సుదీర్ఘ కాలంలో నేటి అమూల్యమైన దీర్ఘకాలిక ఫలితాన్ని శ్రీలంక ప్రజలకు ప్రసాదించగల్గింది. లంక పరిణామం ఆసియాలోని చుట్టుపట్ల దేశాల ప్రజాబాహుళ్యానికి సహితం ఆదర్శంగా పరిణమించింది. భారత వామపక్షాలు ఈ అవకాశాన్ని అంది పుచ్చుకుని ఏకం కావాలి. శ్రీలంక వామపక్షాలు సాధించి ఆదర్శనీయమైన విజయం నుంచి భారత ప్రజల భవిష్యత్తుకు అనువైన ఉమ్మడి వ్యూహ రచనకు నడుం బిగించాలి. ఇందుకు మొదటి షరతుగా నాయకత్వం రూపకల్పనకు అవసరమైన వ్యూహాన్ని సమష్టిగా రూపొందించుకోవాలి. ఇది తప్ప మరో మార్గం లేదు. ఈ సందర్భంగా శ్రీలంకలో భారత మాజీ హైకమిషనర్‌గా పనిచేసిన గోపాలకృష్ణ గాంధీ శ్రీలంక పరిణామాల్ని సమీక్షిస్తూ... విప్లవాత్మక భావాలు మార్చుకోకుండానే ప్రజాస్వామిక ధోరణులు కూడా బలపడటానికి అనువుగా రాజకీయ పక్షాల సిద్ధాంత ధోరణులు కూడా ఉండాలనీ, ఈ ధోరణుల్ని శ్రీలంక వామపక్షాలు పెంచుకుంటూ మార్పునకు అనుగుణమైన వ్యూహరచనను ఆశ్రయించాయనీ అన్నారు. భారత్–శ్రీలంక సంబంధాలలో కూడా పెను మార్పులకు అవకాశం ఉందని గోఖలే ఆశాభావం వెలిబుచ్చారు.

abkprasad2006@yahoo.co.in

విద్యారంగ మార్పుల గమ్యం ఎటువైపు?

అభిప్రాయం



ప్రొ॥ కె. లక్ష్మీనారాయణ

అందరికీ విద్య లేకుండా ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టదన్నాడు భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్. నేటి బాలలే రేపటి పౌరులు అన్నాడు తొలి ప్రధాని నెహ్రూ. కానీ దేశంలో ఇప్పటికీ అక్షరాస్యత రేటు 77% దాటలేదు. తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకుంటే అక్షరాస్యత రేటు 66% కూడా లేదని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. తమ మేనిఫెస్టోలో విద్యారంగానికి బడ్జెట్లో 15% నిధులు కేటాయిస్తామని చెప్పి 7.3% మాత్రమే కేటాయించింది కాంగ్రెస్. పక్కన ఉన్న తమిళనాడులో 13.4%, ఆంధ్రప్రదేశ్‌లో కూడా విద్యకు 12.6% నిధులు కేటాయించారు.

పాఠశాల విద్యను తీసుకుంటే పాఠశాలల మూసివేతలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. 2022 –23 సంవత్సరంలో దాదాపు 8,500 పాఠశాలల్లో 20 మంది కన్నా తక్కువ విద్యార్థులు ఉన్నారు. 1,864 స్కూళ్లలో విద్యార్థులే లేరు. నిజానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ప్రభుత్వ పాఠశాలల దగ్గరలోనే విద్యాశాఖ అధికారులు ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు ఇవ్వడం. చట్ట ప్రకారం ప్రభుత్వ పాఠశాలకు కనీసం ఒక్క కిలోమీటర్ దూరం ఉంటే తప్ప అనుమతులు ఇవ్వకూడదు. విద్యార్థుల సంఖ్య తగ్గడానికి మరొక ప్రధానమైన కారణం ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య లేకపోవడం. ఇంకా బతుకుదెరువు కోసం గ్రామాల నుండి పట్టణాలకు వలసలు, జనాభా తగ్గుదల మొదలైన అంశాలు విద్యార్థులు తగ్గిపోవడానికి కారణాలు కావచ్చు. ఇంకా ఈ విషయంపై లోతైన అధ్యయనం చేసి కారణాలను కనుక్కోకుండా, ఆ కారణాలను నిర్మూలించకుండా, తక్కువ విద్యార్థులు ఉన్నారని అక్కడ ఉన్న టీచర్లను వేరే స్కూళ్లకు పంపించడం, విద్యార్థులే లేరని పాఠశాలలను మూసివేయడం మూర్ఖత్వం.

పాఠశాలల్లో ఒక ప్రణాళిక ప్రకారం బోధన జరుగుతుందా లేదా చూసుకోవాలంటే విద్యాశాఖ అధికారులు ఉండాలి. అటువంటి అధికారుల పోస్టులు దాదాపు అన్నీ ఖాళీగా ఉన్నాయి. దిగజారుతున్న ఈ పరిస్థితులను చక్కబెట్టి సుమారు 30 వేల పాఠశాలలను అభివృద్ధి చేసే బదులు, నియోజకవర్గానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్ స్థాపిస్తామని అంటున్నారు. కామన్ స్కూల్‌కు భిన్నంగా ఇప్పటికే రకరకాల అంతరాలతో భ్రష్టు పడుతున్న



పాఠశాల విద్యకు ఇంటర్నేషనల్ స్కూల్ ఇంకొక అంతరాల దొంతర తయారు కాబోతున్నది.

అలాగే ఉన్నత విద్యలో ప్రభుత్వ రంగంలో ఉన్న 17 స్టేట్ యూనివర్సిటీలను సమగ్రంగా అభివృద్ధి చేసే బదులు భూకబ్జాదారులకు, విద్యా వ్యాపారులకు, కంపెనీలకు ప్రైవేటు యూనివర్సిటీలు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు ఇచ్చారు. ప్రభుత్వ రంగంలో కాకుండా ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిలో 50 ఎకరాల భూమిలో ఒక 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ యూనివర్సిటీలలో 2 వేలకు పైగా ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక ఈ యూనివర్సిటీలలో బోధనేతర సిబ్బంది ఖాళీలు తీసుకుంటే అవి వేల సంఖ్యలో ఉంటాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఒక్కసారి కూడా యూనివర్సిటీలలోని పోస్టులను భర్తీ చేయలేదు.

ప్రస్తుతమున్న యూనివర్సిటీలను, ఇంజనీరింగ్ కళాశాలలను, పాలిటెక్నిక్ కళాశాలలను, ఐటీఐలను సమగ్రంగా అభివృద్ధి చేసి నైపుణ్యాలను నేర్పవచ్చు. అలా చేయకుండా కొత్తగా స్కిల్ యూనివర్సిటీని స్థాపించడం ఎవరికోసమనే ప్రశ్న తలెత్తక మానదు. ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలో భాగంగా 19 పేరెన్నిక గల విదేశీ కంపెనీలు హైదరాబాదుకు రాబోతున్నాయని తెలుస్తున్నది. ఇక్కడ 2 వేల మందికి నైపుణ్యాలను నేర్పిస్తామని అంటున్నారు. ఈ విదేశీ కంపెనీలకు నైపుణ్యం కలిగిన తక్కువ జీతానికి పనిచేసే, బానిస మనస్తత్వం కలిగిన కార్మికులను తయారుచేయడానికి వస్తుందా ఈ స్కిల్ యూనివర్సిటీ అనే అనుమానం కలుగుతుంది. ఇక్కడ ఫ్యాకల్టీని నియమించడంలో, విద్యార్థులకు అడ్మిషన్ కల్పించడంలో రిజర్వేషన్ల పద్ధతి పాటిస్తారా? ఫీజులు ఎంత ఉంటాయి అన్న వివరాలు ఇంకా అధికారికంగా తెలియవలసి ఉంది.

పాఠశాల స్థాయి నుండి అన్ని వసతులతో కూడిన వ్యాయామ విద్య లేకుండా స్పోర్ట్స్ యూనివర్సిటీని స్థాపించడం అర్థరహితం. వేలాది ప్రభుత్వ పాఠశాలలకు ఆట స్థలాలు లేవు. క్రీడా పరికరాలు లేవు. అన్ని పాఠశాలలో పీఈటీ / పీడీ పోస్టులు మంజూరు చేయబడలేదు. పట్టణాలలో మెజారిటీ ప్రైవేటు పాఠశాలలకు ఆట స్థలాలే లేవు. అటువంటి పరిస్థితులలో స్పోర్ట్స్ యూనివర్సిటీని స్థాపిస్తామనడం పునాది లేకుండా భవనం నిర్మించడమే.

మొత్తానికి గత తొమ్మిది నెలల్లో తెలంగాణ విద్యారంగంలో వచ్చిన మార్పుల గురించి సమాజంలో లోతైన చర్చ జరగవలసి ఉన్నది.

వ్యాసకర్త హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీలో ఆచార్యులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.తదియ తె.4.43 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి చవితి, **నక్షత్రం:** స్వాతి రా.8.01 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** రా.2.06 నుండి 3.50 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.43 నుండి 7.29 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.12 నుండి 11.58 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** మ.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.54, **సూర్యాస్తమయం:** 5.45.



ఫిర్యాదులపై సత్వరం స్పందన

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మహిళా కమిషన్‌కు వస్తున్న ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని మహిళా కమిషన్‌చైర్‌పర్సన్ నేరెళ్ళ శారద అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషన్ కార్యాలయంలో ఆమె అధికారులతో సమావేశమయ్యారు. ఇప్పటి వరకు కమిషన్ తీసుకున్న చర్యలకు సంబంధించిన పురోగతిపై సమీక్షించారు. మహిళలు ఇస్తున్న ఫిర్యాదులపై సత్వర స్పందనతో పాటు క్రమం తప్పకుండా ఫాలోఅప్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాల వారీగా కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

చెరువులో పడి ముగ్గురు పిల్లల మృతి

- గాలానికి చిక్కి బయటకు వచ్చిన ఓ మృతదేహం
- చెరువులో గాలించగా మరో రెండు మృతదేహాలు లభ్యం
- మేడ్చల్ జిల్లా కొల్తూర్‌లో విషాదం


మణిహర్ష | మనోజ్ | హర్షవర్ధన్

శామీర్‌పేట్: ఆటలో భాగంగా మట్టి గణపతిని చేసిన ముగ్గురు పిల్లలు.. ఆ ప్రతిమను నిమజ్జనం చేయడానికి ప్రయత్నిస్తూ చెరువులో పడి మృతి చెందారు. మేడ్చల్ జిల్లా కొల్తూర్‌లో శుక్రవారం ఈ విషాదకర ఘటన జరిగింది. చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తుల గాలానికి ఓ మృతదేహం చిక్కడంతో ఈ దుర్ఘటన వెలుగులోకి వచ్చింది. వేర్వేరు పాఠశాలల్లో చదువుతున్న బాలేకర్ మణిహర్ష (14), సలేంద్రి హర్షవర్ధన్(13), ఈరబోయిన మనోజ్ (10) స్నేహితులు. దసరా సెలవుల నేపథ్యంలో వీరు శుక్రవారం మట్టి గణపయ్యను చేసి పూజలు చేస్తూ ఆడుకున్నారు. నిమజ్జనం కోసం చెరువు వద్దకు తీసుకెళ్లారు. ఆ ప్రయత్నంలో ప్రమాదవశాత్తు నీటిలో పడి మునిగిపోయారు. చెరువు వద్ద కొందరు వ్యక్తులు చేపల కోసం నీటిలో గాలాలు వేశారు. ఓ వ్యక్తి గాలానికి ఏదో తగిలినట్లు అనిపించడంతో పైకి లాగగా.. మనోజ్ మృతదేహం కనిపించింది. దీంతో వారు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. గజ ఈతగాళ్లతో చెరువులో గాలించగా.. మిగతా ఇద్దరి మృతదేహాలు లభించాయి. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. జీనోమ్ వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

టీజీపీఎస్సీ కార్యాలయం వద్ద పోస్టర్ల కలకలం

- తెలుగు అకాడమీ కార్యాలయం వద్ద కూడా...
- తొలగింపు చర్యలు చేపట్టిన అధికారులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తులు టీజీపీఎస్సీకి వ్యతిరేకంగా అంటించిన పోస్టర్ల ఘటన కలకలం సృష్టించింది. శుక్రవారం ఉదయం కార్యాలయానికి వచ్చిన ఉద్యోగులు, సిబ్బంది ఆ పోస్టర్లను చూసి అవాక్కయ్యారు. ప్రధానంగా కమిషన్ కార్యాలయం గేటు వద్ద, ప్రహరీ గోడమీద పోస్టర్లు వెలిశాయి. పోటీపరీక్షలకు తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రామాణికం కానప్పుడు వాటిని కొనుగోలు చేయొద్దని, తప్పు జరిగినా టీజీపీఎస్సీ ఒప్పుకునే పరిస్థితిలో లేదని పోస్టర్లలో పేర్కొన్నారు. కనీసం తప్పుల్లేకుండా 150 ప్రశ్నలు తయారు చేయలేని టీజీపీఎస్సీ ఎందుకని అందులో నిలదీశారు. అదేవిధంగా హైదర్‌గూడలోని తెలుగు అకాడమీ ఎదుట కూడా ఈ పోస్టర్లు వెలిశాయి. వీటిని చాలాచోట్ల గుర్తించిన అధికారులు వెనువెంటనే తొలగించారు. గ్రూప్‌-1 ప్రశ్నపత్రాలకు సంబంధించి న్యాయస్థానం పరిధిలో విచారణ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. తెలుగు అకాడమీ పుస్తకాలు పోటీ పరీక్షలకు ప్రామాణికం కాదని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అధికారులు కోర్టులో వివరణ ఇచ్చిన నేపథ్యంలో ఈ పోస్టర్లు వెలిసినట్లు తెలుస్తోంది.

విద్యా విధానంలో మార్పులు అత్యవసరం

- అప్పుడే నాణ్యమైన విద్యను అందించేందుకు వీలవుతుంది
- తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



సాక్షి,హైదరాబాద్: రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే ప్రస్తుతమున్న విధానాల్లో మార్పులు అత్యవసరమని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి స్పష్టం చేశారు. శుక్రవారం ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు విద్యార్థులకు వసతులను మెరుగుపర్చాలని ఆయన అభిప్రాయపడ్డారు. జిల్లాల వారీగా ఎస్టీయూ బాధ్యులతో ఆయన మాట్లాడి క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. పర్వత్‌రెడ్డి, జి.సదానందంగౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి సంబంధించి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలన్నారు. ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల సప్లిమెంటరీ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలన్నారు. జీవో 317పై నియమించిన కేబినెట్ సబ్ కమిటీ ద్వారా త్వరితగతిన ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు బదిలీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పీఆర్సీ గడువు ముగిసి ఏడాది గడిచిందని, వెంటనే నూతన పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.





ఇజ్రాయెల్‌కు మూడింది

ఎంతోకాలం ఉనికిలో ఉండదు

- ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హెచ్చరిక
- దానిపై దాడులు సరైనవే
- వారి నేరాలకు ఇది కనిష్ఠ శిక్ష
- హెజ్‌బొల్లా, హమాస్‌పై ఇజ్రాయెల్ నెగ్గలేదు
- ముస్లిం దేశాలన్నీ ఒక్కటవాలని పిలుపు
- చారిత్రక మసీదులో చేతిలో తుపాకీతో ప్రసంగం
- నాలుగేళ్ల తర్వాత తొలిసారి జనం ముందుకు





ప్రసంగిస్తున్న ఖమేనీ (ఇన్‌సెట్లో) చేతిలో తుపాకీ

టెహ్రాన్: బద్ధ శత్రువైన ఇజ్రాయెల్‌కు ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ (85) స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఆ దేశంపై ఇటీవల తాము చేసిన క్షిపణి దాడుల పట్ల హర్షం వ్యక్తం చేశారు. యూదు పాలకుల నేరాలకు ఇది కనిష్ఠ శిక్ష అని పేర్కొన్నారు. తమ సైనిక దళాలు అద్భుతమైన కార్యం నిర్వర్తించాయని కొనియాడారు. అవసరమైతే హెజ్‌బొల్లా, హమాస్ తదితర గ్రూపులతో కలిసి ఇజ్రాయెల్‌పై మరోసారి దాడులు చేస్తామని తేల్చిచెప్పారు. ''ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పాలస్తీనా, లెబనాన్‌లో జరుగుతున్న పోరాటాలకు మద్దతిస్తున్నాం. శత్రువును ఓడించి తీరతాం'' అని ప్రకటించారు. ''అఫ్గానిస్తాన్ నుంచి యెమన్ దాకా, ఇరాన్ నుంచి గాజా, లెబనాన్ దాకా ముస్లిం దేశాలన్నీ ఈ ప్రయత్నంలో ఒక్కటి కావాలి. ఉమ్మడి శత్రువైన ఇజ్రాయెల్‌కు మర్చిపోలేని గుణపాఠం నేర్పాలి'' అంటూ పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్ ఎక్కువ కాలం ఉనికిలో ఉండబోదని జోస్యం చెప్పారు. ఇజ్రాయెల్‌పై ఇరాన్ ఇటీవలి క్షిపణి దాడుల తర్వాత తొలిసారిగా ఆయన ప్రజలకు దర్శనమిచ్చారు. శుక్రవారం టెహ్రాన్‌లోని మొసల్లా మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ జన సందోహాన్నిఉద్దేశించి చరిత్రాత్మక ప్రసంగం చేశారు. రైఫిల్ చేబూని ఆద్యంతం భావోద్వేగపూరిత ప్రసంగం చేశారు. ఖమేనీ బహిరంగంగా మాట్లాడడం నాలుగేళ్ల తర్వాత ఇదే తొలిసారి కావడం గమనార్హం. హెజ్‌బొల్లా చీఫ్ నస్రల్లాను బంకర్ బాంబులతో ఇజ్రాయెల్ హతమార్చిన వెంటనే ఆయనను హుటాహుటిన సురక్షిత ప్రాంతానికి తరలించినట్టు వార్తలు రావడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇలా జనం మధ్యలోకి రావడమే గాక చరిత్రాత్మక మసీదును వేదికగా చేసుకుని ప్రసంగించడానికి చాలా ప్రాధాన్యత ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. ఇజ్రాయెల్‌కు గట్టి హెచ్చరిక సంకేతాలు పంపడంతో పాటు ఆ దేశంపై పోరులో ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గేది లేదని పశ్చిమాసియాలోని హమాస్, హెజ్‌బొల్లా, హౌతీల వంటి సాయుధ గ్రూపులకు భరోసా ఇవ్వడం ఖమేనీ ఉద్దేశమని విశ్లేషిస్తున్నారు. పశ్చిమాసియాలో భీకర యుద్ధం తప్పదని కూడా ఖమేనీ ప్రసంగం సంకేతాలిచ్చిందంటున్నారు. ప్రధానంగా ఫార్సీలోనూ, పాలస్తీనా, లెబనాన్ మద్దతుదారు కోసం మధ్యలో అరబిక్‌లోనూ ఆయన 40 నిమిషాలపాటు మాట్లాడారు. ''గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ నేతృత్వంలో పాలస్తీనా ప్రజలు చేసిన దాడిలో న్యాయముంది. పాలస్తీనా పౌరుల చర్య చట్టబద్ధమే. ఇజ్రాయెల్‌పై మా దాడులు కూడా చట్టబద్ధమే''అని ఉద్ఘాటించారు.

నస్రల్లా మార్గం స్ఫూర్తిదాయకం

ఖమేనీ ప్రసంగానికి ముందు టెహ్రాన్‌లో హెజ్‌బొల్లా అధినేత హసన్ నస్రల్లా సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ తోపాటు ఇరాన్ ఉన్నతాధికారులు, ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ జనరల్స్ హాజరయ్యారు.

చేతిలో రైఫిల్ వెనక...

ఖమేనీ తన ప్రసంగం సందర్భంగా రైఫిల్ చేతబట్టడం అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. అది రష్యాలో తయారైన డ్రాగనోవ్ రైఫిల్. ఇజ్రాయెల్ విషయంలో వెనకడుగు వేసే సమస్యే లేదని, తీవ్ర ప్రతిఘటన తప్పదని తన చర్య ద్వారా ఆయన స్పష్టమైన సంకేతాలిచ్చినట్టు భావిస్తున్నారు. శత్రువుపై పోరాడాలని, విశ్వాసాన్ని బలోపేతం చేసుకోవాలని ప్రజలకు ఖమేనీ పిలుపునివ్వడం కూడా ఇందుకు బలం చేకూరుస్తోంది. ఇజ్రాయెల్ చేతిలో ఇరాన్ వరుసగా ఎదురుదెబ్బలు తింటున్న నేపథ్యంలో డీలా పడ్డట్టు కన్పిస్తున్న సైన్యంతో పాటు దేశ ప్రజల్లో నైతిక స్థైర్యం పెంచేందుకు ఆయన ప్రయత్నించారంటున్నారు.

ఆ మసీదే ఎందుకు?

ఖమేనీ దేశ ప్రజలకు సందేశం ఇచ్చేందుకు రాజధాని టెహ్రాన్‌లోని చరిత్రాత్మక ఇమామ్ ఖొమేనీ మసీదును ఎంచుకున్నారు. 18వ శతాబ్దంలో నిర్మించిన ఈ మసీదుకు ఇరాన్‌లో విశేషమైన ప్రాముఖ్యముంది. దీన్ని గతంలో షా మసీదుగా పిలిచేవారు. 1979 నాటి ఇస్లామిక్ విప్లవంలో ఈ మసీదు కీలక పాత్ర పోషించింది. నగరంలో ఇదో ల్యాండ్‌మార్క్. ప్రజా పోరాటాలకు, నిరసన గళానికి చిహ్నం. అప్పట్లో ఈ మసీదు కేంద్రంగానే ప్రజలు ఉద్యమించారు. ఇరాన్ పాలకుడు షా మొహమ్మద్ రెజా పహ్లవీని గద్దె దించారు. అనంతరం అయతొల్లా రుహొల్లా ఖొమేనీ నాయకత్వంలో ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్‌గా ఆవిర్భవించింది. ఇస్లామిక్ జాతీయవాద నినాదం కింద పలు రాజకీయ పక్షాలు ఏకమవడానికి ఈ మసీదు వేదికగా ఉపయోగపడింది.

బీరుట్‌పై నిప్పుల వాన

- భవనాలు ధ్వంసం, భారీగా మంటలు
- భూతల దాడులూ చేస్తున్న ఇజ్రాయెల్
- హెజ్‌బొల్లా కమ్యూనికేషన్స్ హెడ్ మృతి
- ప్రతి దాడుల్లో ఇజ్రాయెల్‌కూ నష్టం

బీరుట్: లెబనాన్ రాజధాని బీరుట్ దక్షిణ శివార్లపై ఇజ్రాయెల్ సైన్యం విరుచుకుపడింది. గురువారం అర్ధరాత్రి తర్వాత భారీగా వైమానిక దాడులు నిర్వహించింది. క్షిపణుల దాడిలో పెద్ద సంఖ్యలో భవనాలు కంపించిపోయాయి. పెద్ద ఎత్తున మంటలు, పొగ వెలువడుతున్న దృశ్యాలు కనిపించాయి. ఈ దాడుల్లో ప్రాణనష్టం, ఆస్తినష్టంపై వివరాలు ఇంకా తెలియరాలేదు. జనం కకావికలమై సురక్షిత ప్రాంతాలకేసి పరుగులు తీస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దక్షిణ లెబనాన్‌లో క్రైస్తవులు అధికంగా ఉండే మార్జయూన్ నగరంపైనా తొలిసారిగా దాడులకు దిగింది. బాంబు దాడుల్లో నలుగురు వైద్య సిబ్బంది మరణించినట్టు సమాచారం. లెబనాన్‌లోని హెజ్‌బొల్లా మిలిటెంట్లను లక్ష్యంగా చేసుకొని దాడులు నిర్వహించినట్లు ఇజ్రాయెల్ చెబుతోంది. హెజ్‌బొల్లా నిఘా ప్రధాన కార్యాలయంపై భారీగా దాడి చేసినట్టు పేర్కొంది. గత 24 గంటల్లో 100 మందికి పైగా మిలిటెంట్లను హతమార్చినట్టు తెలిపింది. శుక్రవారం నాటి దాడుల్లో హెజ్‌బొల్లా కమ్యూనికేషన్స్ విభాగం చీఫ్ రషీద్ స్కఫీ మరణించినట్టు ప్రకటించింది. భూతల దాడులు కూడా కొనసాగుతున్నట్టు వివరించింది. స్కఫీ 2000 నుంచీ ఆ బాధ్యతల్లో కొనసాగుతున్నాడు. గత 20 రోజుల్లో ఇజ్రాయెల్ దాడుల్లో 1,400 మందికి పైగా లెబనాన్‌వాసులు మరణించారు. 12 లక్షల మందికి పైగా నిర్వాసితులై శరణార్థులుగా మారారు. ఇజ్రాయెల్ దాడుల కారణంగా బీరుట్‌కు 50 కిలోమీటర్ల దూరంలోని లెబనాన్–సిరియా మాస్నా బోర్డర్ క్రాసింగ్‌ను మూసివేశారు. హెజ్‌బొల్లాకు ఇరాన్ నుంచి సిరియా గుండా ఆయుధాలు సరఫరా కాకుండా ఈ ప్రాంతంలో దాడులు చేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. హెజ్‌బొల్లా కూడా శుక్రవారం అర్ధరాత్రి తర్వాత నుంచి పెద్ద ఎత్తున ప్రతి దాడులకు దిగింది. ఉత్తర ఇజ్రాయెల్‌పైకి భారీ సంఖ్యలో రాకెట్లు ప్రయోగించింది. దాంతో లోయర్ గలిలీ తదితర ప్రాంతాల్లో భారీ నష్టం సంభవించినట్టు సమాచారం. పలుచోట్ల భారీగా మంటలు చెలరేగాయి. భూతల దాడుల్లో మరో ఇద్దరు ఇజ్రాయెల్ సైనికులు మరణించినట్టు సైన్యం ధ్రువీకరించింది. మరోవైపు గాజాపైనా ఇజ్రాయెల్ దాడుల తీవ్రతను పెంచింది. ఓ స్కూలు భవనంపై జరిగిన దాడికి పలువురు చిన్నారులు బలైనట్టు తెలుస్తోంది.

హౌతీ లక్ష్యాలపై... అమెరికా, బ్రిటన్ దాడులు

వాషింగ్టన్: యెమన్‌లోని హౌతీ ఉగ్ర సంస్థపై అమెరికా, బ్రిటన్ భారీగా దాడులకు దిగాయి. ఆయుధ వ్యవస్థలు, స్థావరాలు తదితర 12 లక్ష్యాలపై యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు బాంబుల వర్షం కురిపించాయి. వీటిలో హొడైడా విమానాశ్రయం బాగా దెబ్బ తిన్నట్టు హౌతీ మీడియా ధ్రువీకరించింది. మరికొన్ని బాంబులు రాజధాని సనాలో తీవ్ర నష్టం కలిగించాయి. హౌతీ రెబెల్స్ గత వారం బాబ్ ఎల్ మండెబ్ జలసంధి గుండా వెళ్తున్న మూడు అమెరికా నౌకలపై బాలిస్టిక్ మిసైళ్లు, యాంటీ షిప్ క్రూయిజ్ మిసైళ్లు, డ్రోన్లు ప్రయోగించడం తెలిసిందే. వాటన్నింటినీ మధ్యలోనే అడ్డుకుని కూల్చేసినట్టు అమెరికా పేర్కొంది. తాజా దాడులు వాటికి ప్రతీకారమేనని భావిస్తున్నారు.

తటస్థంగా ఉంటాం

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై జీసీసీ నిర్ణయం

దోహా: ఇజ్రాయెల్‌తో ఇరాన్ ఘర్షణల నేపథ్యంలో తాము తటస్థంగా ఉంటామని గల్ఫ్ అరబ్ దేశాలు స్పష్టం చేశాయి. అంతేకాదు.. ప్రాంతీయ ఘర్షణలతో చమురువనరులకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నందున ఉద్రిక్తతలను తగ్గించాలని ఇరాన్‌కు సూచించాయి. దాడులు, ప్రతిదాడుల నేపథ్యంలో ఈ వారం ఖతార్ ఆధ్వర్యంలో దోహాలో జరిగిన సమావేశానికి గల్ఫ్ కో ఆపరేషన్ కౌన్సిల్(జీసీసీ) సభ్యులైన సౌదీ అరేబియా, యూఏఈ, బహ్రెయిన్, ఒమన్, కువైట్ హాజరయ్యాయి. అయితే గల్ఫ్ ప్రాంతంలోని చమురు వనరులపై దాడులు చేస్తామని ఇరాన్ బెదిరించలేదు కానీ, ఇజ్రాయెల్‌కు మద్దతిచ్చే వారి ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఉద్రిక్తతలను తగ్గించడంపైనే ప్రధానంగా జీసీసీ నేతలు చర్చలు జరిపారు. చమురు ఎగుమతిలో అగ్రశ్రేణి దేశమైన సౌదీ అరేబియా ఇటీవలి కాలంలో ఇరాన్‌తో రాజకీయ సంబంధాలను కొనసాగిస్తోంది. ఇది ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించడానికి ఉపయోగపడింది. కానీ, ఈ సంబంధాలు సంక్లిష్టంగా ఉన్నాయి. 2019లో సౌదీ అరేబియా ప్రధాన రిఫైనరీపై దాడి జరిగింది. అప్పటి నుంచి ఇరాన్‌కు ఆ దేశం వీలైనంత దూరంగా ఉంటోంది. తన చమురు ఎగుమతుల్లో కూడా తాత్కాలికంగా 5 శాతానికి పైగా తగ్గించుకుంది. అయితే అప్పటి దాడిలో తమ ప్రమేయం లేదంటూ ఇరాన్ ఖండిస్తూ వస్తోంది.


రేపు భూమిని తాకనున్న సౌర జ్వాలలు!

ఉపగ్రహాలు, గ్రిడ్లపై పెను ప్రభావం ● ఆఫ్రికాలో రేడియో బ్లాకౌట్లు

సౌరప్రకోపం భూమిని అల్లాడించనుంది. సూర్యుని కొంతకాలంగా అల్లకల్లోలంగా ఏఆర్3842 సన్‌స్పాట్ మరోసారి బద్దలైంది. ఎక్స్9.1 కేటగిరీలోకి వచ్చే అత్యంత అత్యంత శక్తిమంతమైన సోలార్ ఫ్లేర్‌కు దారితీసింది. దీని దెబ్బకు భూమి ఎగువ వాతావరణమంతా పూర్తిగా అయోనీకరణం చెందింది! ఈ పేలుడు ధాటికి పుట్టుకొచ్చిన శక్తిమంతమైన సౌర జ్వాలలు ఆదివారం భూమిని గట్టిగా తాకనున్నాయి. ఇప్పటికే సూర్యునిలో సంభవించిన కరోనల్ మాస్ ఎజెక్షన్ (సీఎంఈ) దీనికి తోడవనుంది. ఫలితంగా భూ అయస్కాంత తుపాన్లు ఏర్పడి, పెద్దపెట్టున విడుదలయ్యే రేడియేషన్ ప్రపంచమంతటా ప్రభావం చూపనుంది. దెబ్బకు ఉపగ్రహాలతో పాటు పలు దేశాల్లో పవర్ గ్రిడ్లతో పాటు నావిగేషన్ వ్యవస్థలు కూడా మొరాయించే ప్రమాదముంది. ముఖ్యంగా ఆఫ్రికాతో పాటు అట్లాంటిక్ దక్షిణ ప్రాంతంలోని పలు దేశాల్లో షార్ట్‌వేవ్ రేడియో బ్లాకౌట్లు సంభవించవచ్చని సైంటిస్టులు హెచ్చరించారు. రేడియో ఆపరేటర్లకు కనీసం అరగంటకు సిగ్నల్స్ అందబోవని వివరించారు. వీటి వల్ల అరోరాలు (కాంతి వలయాలు) ఏర్పడనున్నాయి.

కొంతకాలంగా ఉగ్ర రూపు

సూర్యుడు ప్రస్తుతం తన 25వ సౌరచక్రం మధ్యలో ఉన్నాడు. దాంతో కొంతకాలంగా ఉగ్రరూపు దాలుస్తున్నాడు. సోలార్ మాగ్జిమంగా పేర్కొనే ఈ పరిస్థితులు ఊహించిన దానికంటే ముందే సంభవిస్తున్నట్టు సైంటిస్టులు అంచనా వేస్తున్నారు. ఈ పరిణామంసూర్యునిపై నిరంతర పేలుళ్లకు, సన్‌స్పాట్స్‌కు, సీఎంఈలకు దారితీస్తుంది. ఇవి భూమిపై పరిస్థితులను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. - సాక్షి, నేషనల్ డెస్క్



నేడే హరియాణా ఎన్నికల సమరం



చండీగఢ్: హరియాణా శాసనసభ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. రాష్ట్రంలో మొత్తం 90 నియోజకవర్గాల్లో శనివారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. రాష్ట్రంలో 2.03 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని హరియాణా ఎన్నికల కమిషనర్ పంకజ్ అగర్వాల్ శుక్రవారం చెప్పారు. 20,623 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మొత్తం 1,031 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో 101 మంది మహిళలు ఉన్నారు. అలాగే ఈసారి ఏకంగా 464 మంది స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, ఐఎన్‌ఎల్‌డీ–బీఎస్పీ, జేజేపీ–ఆజాద్ సమాజ్ పార్టీ పోటీ పడుతున్నాయి. ముఖ్యమంత్రి నాయబ్‌సింగ్ సైనీ, కాంగ్రెస్ నేత భూపీందర్‌సింగ్ హుడా, రెజ్లర్ వినేశ్ ఫోగాట్, జన నాయక్ జనతా పార్టీ అగ్రనేత దుష్యంత్ చౌతాలా తదితరులు తమ అదృష్టం పరీక్షించుకుంటున్నారు.

డిమాండ్లు నెరవేర్చక పోతే ఆమరణ దీక్షే

మమత ప్రభుత్వానికి డాక్టర్ల 24 గంటల డెడ్‌లైన్



కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ప్రభుత్వం తమ డిమాండ్లను 24 గంటల్లోనే పరిష్కరించకుంటే ఆమరణ దీక్షకు దిగుతామని జూనియర్ డాక్టర్లు హెచ్చరించారు. ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో ఆగస్టు 9న ట్రెయినీ వైద్యురాలి హత్యోదంతంపై న్యాయం చేయాలంటూ జూనియర్ డాక్టర్లు నిరసనలను కొనసాగిస్తుండటం తెలిసిందే. డిమాండ్లను నెరవేరుస్తామంటూ సీఎం మమతా బెనర్జీ హామీ ఇవ్వడంతో జూనియర్ డాక్టర్లు కొన్ని రోజులు విధుల్లో పాల్గొన్నారు. అయితే, ప్రభుత్వం కొన్నింటిని మాత్రమే నెరవేర్చిందంటూ తిరిగి విధులను బహిష్కరించి నిరసనలను కొనసాగిస్తున్నారు. జూనియర్ డాక్టర్ల ప్రతినిధి దేబాశీష్ హల్దర్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ..'రాష్ట్ర ప్రభుత్వానికి 24 గంటల టైమిస్తున్నాం. డిమాండ్లను పూర్తి స్థాయిలో అమలు చేయకుంటే ఆమరణ దీక్షకు కూర్చుంటాం'అని హెచ్చరించారు.

మోదీ చక్రవ్యూహం ఫలించదు: రాహుల్



న్యూఢిల్లీ: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి పరాభవం తప్పదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. ప్రధాని నరేంద్ర మోదీ చక్రవ్యూహాన్ని రాష్ట్ర ప్రజలు ఛేదిస్తారని చెప్పారు. హరియాణా ఆర్థిక వ్యవస్థను బీజేపీ ప్రభుత్వం అస్తవ్యస్తంగా మార్చిందని మండిపడ్డారు. నిరుద్యోగం అనే వ్యాధిని బీజేపీ వ్యాప్తి చేసిందని, దాంతో యువత భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ సర్కారు నిర్వాకం వల్ల దేశంలోనే అత్యధిక నిరుద్యోగం హరియాణాలో ఉందన్నారు. ఈ మేరకు రాహుల్ గాంధీ ఇటీవల విజయ సంకల్ప్ యాత్రలో మహిళా బృందంతో తాను మాట్లాడిన వీడియోను శుక్రవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు.

యుద్ధ క్షేత్రంలోకి వేలాదిగా భారతీయులు

ఇదే మోదీ స్కిల్ డెవలప్‌మెంట్: ఖర్గే ఎద్దేవా



న్యూఢిల్లీ: పశ్చిమాసియా యుద్ధంలో పాలుపంచుకుంటున్న ఇజ్రాయెల్ 15 వేల మంది భారతీయ కార్మికులను నియమించుకునేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్‌తో సహకారం అందిస్తోందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు. ఏజెంట్ల మాయమాటలకు మోసపోయిన మన యువత ఇప్పటికే రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలోకి వెళ్లి ప్రాణాలు పోగొట్టుకున్నారని ఆయన గుర్తు చేశారు. మోదీ ప్రభుత్వ యువజన వ్యతిరేక విధానాల ఫలితంగా దేశంలో నిరుద్యోగసమస్య ఎంత తీవ్రస్థాయిలో ఉందో ఈ ఉదాహరణలే చెబుతాయన్నారు. ఖర్గే శుక్రవారం 'ఎక్స్'లో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.



ఇంధన భద్రతకు సవాళ్లు

పశ్చిమాసియా, ఉక్రెయిన్ ఘర్షణలపై మోదీ

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో నానాటికీ పెచ్చరిల్లుతున్న ఘర్షణలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనే గాక ఇంధన భద్రతపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వెలిబుచ్చారు. శుక్రవారం కౌటిల్య ఎకనమిక్ కాన్‌క్లేవ్ మూడో వార్షిక సదస్సులో ప్రధాని ప్రసంగించారు. పశ్చిమాసియా కల్లోలానికి తోడు రెండేళ్లకు పైగా సాగుతున్న ఉక్రెయిన్–రష్యా యుద్ధాన్ని ప్రస్తావించారు. భారత ఇంధన అవసరాలు 85 శాతానికి పైగా దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. వీటిలో అధిక భాగం పశ్చిమాసియా నుంచే వస్తుంది. ఈ కల్లోల పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రపంచమంతా భారత్ వైపే చూస్తోందని మోదీ అన్నారు. అంతర్జాతీయ సమాజంలో మనకు పెరుగుతున్న ప్రతిష్ఠకు ఇది నిదర్శనమని అభిప్రాయపడ్డారు. ''సైన్స్, టెక్నాలజీ మొదలుకుని ఇన్నొవేషన్ల దాకా ఆకాశమే హద్దుగా భారత్ సాగుతోంది. రిఫామ్, పెర్‌ఫామ్, ట్రాన్స్‌ఫామ్ నినాదంతో దూసుకుపోతోంది. మూడోసారి అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఏకంగా రూ.15 లక్షల కోట్ల మేర పెట్టుబడులకు సంబంధించిన నిర్ణయాలు తీసుకున్నాం. పథకాలు తీసుకొచ్చాం. ఎన్డీఏ పదేళ్ల పాలనలో భారత ఆర్థిక ముఖచిత్రాన్నే సమూలంగా మార్చేశాం. మన ఆర్థిక వృద్ధిపై ప్రపంచ నేతలంతా ఎంతగానో నమ్మకం పెట్టుకున్నారు'' అని చెప్పుకొచ్చారు. 2047కల్లా అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు అన్ని రంగాల్లోనూ సంస్కరణలను కొనసాగించేందుకు కృతనిశ్చయంతో ఉన్నట్టు మోదీ స్పష్టం చేశారు.

మహారాష్ట్రలో ధంగర్లకు ఎస్టీ హోదాపై నిరసన.. సెక్రటేరియట్ భవనం నుంచి దూకిన నేతలు

నెట్ అడ్డుగా ఉంచటంతో అందరూ క్షేమం

ముంబై: మహారాష్ట్రలోని ధంగర్ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చినందుకు నిరసనగా రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ నరహరి జిర్వాల్ సహా గిరిజన నేతలు సెక్రటేరియట్ భవనం మంత్రాలయం మూడో అంతస్తు నుంచి దూకారు. అయితే, పోలీసులు ముందు జాగ్రత్తగా దిగువన రెండో అంతస్తులో నెట్‌లో పడటంతో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. అయితే, ఈ ఘటన మంత్రాలయం సముదాయంలో శుక్రవారం మధ్యాహ్నం 12.40 గంటల సమయంలో ఉద్రిక్తతకు దారితీసింది. దూకిన వారిలో జిర్వాల్‌తోపాటు ఎన్సీపీకే చెందిన ఎమ్మెల్యే కిరణ్ లహమతే, బీజేపీ గిరిజన ఎంపీ హేమంత్ సవర తదితరులున్నారు. వీరిని పోలీసులు నెట్ నుంచి బయటకు తీశారు. అనంతరం ఈ నేతలంతా గ్రౌండ్ ఫ్లోర్‌లో బైఠాయించారు. కోటా విషయమై సీఎం షిండే వెంటనే తమతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని వారు డిమాండ్ చేశారు. మంత్రాలయం భవనం పైనుంచి గతంలో ఆత్మహత్యకు యత్నించిన ఘటనలున్నాయి. దీంతో, అక్కడ పోలీసులు నెట్‌ను ఏర్పాటు చేసి ఉంచారు. కాగా, గిరిజనులకు సంబంధించిన నిర్ణయాలపై అధికార కూటమిలోని అంతర్గత విభేదాలను ఈ ఘటన మరోసారి బహిర్గతం చేసింది.



సురక్షితంగా నెట్‌లోకి పడిపోయిన డిప్యూటీ స్పీకర్ జిర్వాల్ తదితరులు

వైట్‌హౌస్ ఫెలోస్‌గా ఇద్దరు భారతీయులు

వాషింగ్టన్: 2024–25 సంవత్సరానికిగాను అమెరికా అధ్యక్షుడి నివాసం వైట్‌హౌస్ ఫెలోస్‌గా భారతసంతతికి చెందిన ఇద్దరు నియమితులయ్యారు. వీరు బోస్టన్‌కు చెందిన పద్మినీ పిళ్లై, న్యూయార్క్ వాసి నళినీ టాటా. అమెరికా వ్యాప్తంగా 15 మంది అసాధారణ ప్రతిభావంతులు ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ఎంపికయ్యారు. వీరు వైట్‌హౌస్ సీనియర్ స్టాఫ్, కేబినెట్ సెక్రటరీలు, ఉన్నతాధికారులతో ఏడాది కలిసి పనిచేస్తారు. అధ్యక్ష భవనంలోని కేబినెట్ వ్యవహారాల కార్యాలయంలో నళిని, సామాజిక భద్రత విభాగంలో పద్మిని పని చేస్తారు.



పద్మిని



నళిని

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

▶ మొదటి పేజీ తరువాయి

20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 20 వరకు వార్షికోత్సవాలు నిర్వహించాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో దంతెవాడ జిల్లా బర్సూర్, నారాయణపూర్ జిల్లా ఓర్చా పోలీస్ స్టేషన్ల నడుమ గోవల్, నెందూర్, తుల్‌తులీ గ్రామాల సమీపంలో మావోయిస్టు అగ్రనేతలు సమావేశమైనట్లు గురువారం మధ్యాహ్నం పోలీసులకు సమాచారం అందింది. దీంతో సీఆర్‌పీఎఫ్, జిల్లా రిజర్వ్ గార్డ్స్, బీఎస్ఎఫ్, కోబ్రా, ఎస్టీఎఫ్ విభాగాలకు చెందిన 1,500 మంది జవాన్లు ఆపరేషన్ ప్రారంభించారు. శుక్రవారం మధ్యాహ్నం ఇరువర్గాల మధ్య ఎదురు కాల్పులు మొదలయ్యాయి. సాయంత్రం 4 గంటల సమయానికి ఏడుగురు మావోయిస్టులు చనిపోయినట్టుగా బయటకు సమాచారం అందింది. రాత్రి వరకు కాల్పులు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో గంటగంటకు మృతుల సంఖ్య పెరుగుతూ వచ్చింది.

40మంది మృతి

రాత్రి 9 గంటల సమయానికి 40 మంది మావోయిస్టులు మరణించినట్లు తెలిసింది.

మృతుల్లో....

అర్ధరాత్రి వరకు అందిన సమాచారం ప్రకారం ఎన్‌కౌంటర్‌లో తూర్పు బస్తర్ డివిజన్‌కు చెందిన అగ్రశ్రేణి నక్సలైట్ డీవీసీఎం నీతి అలియాస్ ఊర్మిళ, కొప్పె, ఎస్‌జెడ్‌సీఎం రామకృష్ణ కమలేశ్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో నీతి స్వస్థలం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా ఈరంగూడ గంగులూరు. ఇక రామకృష్ణది ఏపీలోని ఉమ్మడి కృష్ణా జిల్లా పెనమలూరు మండలం తమ్ముల రోడ్డు పాలంకి.

మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా బస్తర్ ఏరియా ఉంది. ఇక్కడ ఏడు జిల్లాలు ఉండగా సుక్మా, బీజాపూర్, దంతెవాడ, బస్తర్ జిల్లాలను దండకారణ్యంగా.. కాంకేర్, నారాయణపూర్, కొండగావ్ జిల్లాలు పూర్తిగా, బీజాపూర్, దంతెవాడ జిల్లాలో కొంత భాగాన్ని అబూజ్‌మడ్‌గా పిలుస్తారు. ఆపరేషన్ గ్రీన్ హంట్ మొదలయ్యాక దండకారణ్యంలోనే మావోయిస్టులు, పోలీసుల ఘర్షణలు చోటుచేసుకున్నాయి. మావోయిస్టు పార్టీ అగ్రనేతలు ఇక్కడే ఉన్నట్టుగా ప్రచారం సాగు తోంది. శుక్రవారం అబూజ్‌మడ్‌లో ఇంద్రావతి నది పరివాహక ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఏకంగా 40 మంది మావోయిస్టులు చనిపోవడం కామ్రేడ్లకు గట్టి ఎదురుదెబ్బగా, భద్రతా దళాల ఘన విజయంగా చెప్పుకోవచ్చు.

'ఎస్సీ వర్గీకరణ తీర్పు'పై పిటిషన్లు కొట్టివేత

న్యూఢిల్లీ: రిజర్వేషన్ల విషయంలో షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ) ఉప వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉందంటూ ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఎస్సీ కులాల వర్గీకరణ విషయంలో ఏడుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఈ ఏడాది ఆగస్టు 1న చరిత్రాత్మక తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. వర్గీకరణ విషయంలో రాష్ట్రాలకు రాజ్యాంగబద్ధమైన అధికారం ఉందని 6:1 మెజార్టీతో ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ తీర్పును మళ్లీ సమీక్షించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది. ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పులో ఎలాంటి పొరపాటు లేదని స్పష్టంచేసింది. సుప్రీంకోర్టు రూల్స్–2013 ప్రకారం తీర్పుపై పునఃసమీక్ష అవసరం లేదని పేర్కొంది. రివ్యూ పిటిషన్లను కొట్టివేస్తున్నట్లు వెల్లడించింది,. ఈ మేరకు ధర్మాసనం సెప్టెంబర్ 24న జారీ చేసిన ఉత్తర్వును శుక్రవారం సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు.

భారత్ మ్యాప్‌ను తప్పుగా చూపిన ఇజ్రాయెల్

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌ను పాకిస్తాన్‌లో భాగంగా భారత్ మ్యాప్‌ను ఇజ్రాయెల్ తప్పుగా చూపించింది. తీవ్ర విమర్శలు వ్యక్తం కావడంతో అధికార వెబ్‌సైట్ నుంచి దానిని తొలగించింది. అది వెబ్‌సైట్ ఎడిటర్ తప్పిదం వల్లే భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి ర్యువెన్ అజర్ వివరణిచ్చారు. శుక్రవారం ఓ యూజర్ 'ఎక్స్'లో.. ఇజ్రాయెల్‌కు భారత్ అండగా ఉంటుంది. కానీ, ఇజ్రాయెల్ కూడా భారత్ తోడుగా నిలుస్తుందా? ఇజ్రాయెల్ అధికార వెబ్‌సైట్‌లో పెట్టిన భారత్ మ్యాప్‌లో జమ్మూకశ్మీర్‌ను చూడండి'అంటూ ఆ యూజర్ ఎత్తి చూపారు. దీనికి ర్యువెన్ అజార్ స్పందించారు. 'వెబ్‌సైట్ ఎడిటర్ తప్పిదమది. గమనించినందుకు ధన్యవాదాలు. ఆ మ్యాప్‌ను తొలగిస్తున్నాం'అని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో పలు దేశాలతో ఇజ్రాయెల్ తలపడుతున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఇటీవల ఐరాస సర్వప్రతినిధి సభలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన.. ఇరాన్, ఇరాక్, సిరియా, యెమెన్ వంటి దేశాలతో సహవాసం శాపమనీ, ఈజిప్ట్, సౌదీ అరేబి యా, భారత్ వంటి దేశాలతో స్నేహాన్ని ఆశీర్వాదంగా పేర్కొనడం తెలిసిందే. ఆయన చూపించిన రెండు మ్యాపుల్లోనూ పాలస్తీనా ప్రాంతాలైన వెస్ట్‌బ్యాంక్, గాజాలను ఇజ్రా యెల్‌లో అంతర్భాగంగానే చూపడం గమనార్హం.

కార్యకర్తల కృషి వల్లే పీసీసీ పీఠం

- నిజామాబాద్‌లో జరిగిన అభినందన సభలో బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్
- కార్యకర్త నుంచి అత్యున్నత స్థాయికి ఎదగాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యం
- వచ్చే ఎన్నికల్లో 90–100 అసెంబ్లీ, 15 ఎంపీ సీట్లు గెలుస్తాం
- స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలు అందరికీ న్యాయం చేస్తాం



సభలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి అభివాదం చేస్తున్న తుమ్మల, కోమటిరెడ్డి, పొంగులేటి, కొండా సురేఖ, పొన్నం, దీపాదాస్ మున్షీ, సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్ అలీ, మధుయాష్కీ, వీహెచ్, వేం నరేందర్‌రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్ తదితరులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సాధారణ కార్యకర్త నుంచి అత్యున్నత స్థాయి పదవుల వరకు చేరుకోవాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. తనకు పీసీసీ పీఠం దక్కడమే ఇందుకు నిదర్శనమని.. ఈ గౌరవం కార్యకర్తల కృషి ఫలితమేనని చెప్పారు. శుక్రవారం నిజామాబాద్‌లోని పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో మహేశ్‌కుమార్ గౌడ్ సన్మాన సభ జరిగింది. ఈ సభకు సగానికిపైగా మంత్రివర్గం తరలివచ్చింది. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. తండ్రి మరణంతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, విదేశాల్లో ఉండటంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీతక్క, జూపల్లి కృష్ణారావు రాలేకపోయారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ మాట్లాడుతూ 38 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక కష్టనష్టాలు చవిచూశానని.. కానీ కష్టపడినందుకు పార్టీ నాయకత్వం గుర్తించి కలలో కూడా ఊహించని రీతిలో వడ్డీతో సహా పీసీసీ పీఠం అప్పగించిందన్నారు.

డీఎస్ ఆశీర్వాదం తీసుకొనేవాడిని..

దివంగత మాజీ పీసీసీ చీఫ్ ధర్మపురి శ్రీనివాస్‌తో తనకు కొన్ని విభేదాలు ఉన్నప్పటికీ రాజకీయ గురువుగానే భావిస్తానని మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. కరాటే మాస్టర్‌గా ఉన్న తనను రాజకీయాల్లోకి తీసుకొచ్చి ప్రోత్సహించిన డీఎస్.. 1986లో తనను ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా చేశారని గుర్తుచేసుకున్నారు. ఒకవేళ డీఎస్ బతికి ఉంటే పీసీసీ చీఫ్ హోదాలో వెళ్లి ఆయన ఆశీర్వాదం తీసుకొనేవాడినని చెప్పారు.

సోషల్ ఇంజనీరింగ్‌తో ముందుకు..

రాహుల్ గాంధీ ఆలోచనా విధానంతో ముందుకు వెళతామని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఇందులో భాగంగానే సోషల్ ఇంజనీరింగ్, బీసీ గణన జరుగుతోందని చెప్పారు. ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేసే పనిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలందరికీ న్యాయం చేస్తామన్నారు. 2028 ఎన్నికల్లో రాహుల్ గాంధీ, సోనియా గాంధీ ఆధ్వర్యంలో, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి రాష్ట్రంలో 90 నుంచి 100 అసెంబ్లీ సీట్లు, ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో 15 ఎంపీ సీట్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అన్ని సీట్లు గెలుస్తామని జోస్యం చెప్పారు.

పీసీసీ కమిటీలో, డీసీసీల్లో 60 శాతం బీసీలకే పదవులు..

పీసీసీ కమిటీతోపాటు జిల్లా కాంగ్రెస్ కమిటీల్లోనూ 60 శాతం పదవులను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల వారికే కేటాయించనున్నట్లు మహేశ్‌గౌడ్ తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు కొదవ లేదన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఎలాంటి రాజకీయ అండ లేనప్పటికీ పార్టీ అత్యున్నత గుర్తింపు ఇచ్చిందని చెప్పారు. కార్యకర్తలకు ఎలా న్యాయం చేయాలో కాంగ్రెస్ అధిష్టానానికి తెలుసన్నారు.

కార్యకర్తలే కాంగ్రెస్ బలం: దీపాదాస్ మున్షీ

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని బలమన్నారు. నిజామాబాద్ కాంగ్రెస్ బలహీనంగా ఉందని గతంలో విన్నానని.. కానీ అభినందన సభకు ఇంత భారీగా కార్యకర్తలు, అభిమానులు రావడం చూస్తుంటే పార్టీ బలం పుంజుకుంటున్నట్లు కనిపిస్తోందని చెప్పారు.

కోడి కత్తి తగిలి ఒకరి మృతి

భీమిని: మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం మాడవెల్లి గ్రామ పంచాయతీ పరిధి బొత్తపల్లి శివారులో పందెంకోడి కత్తి తెగి ఒక వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం బొత్తపల్లి గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద కోడి పందేలు ఆడుతుండగా బండి మధునయ్య (43) చేతికి కోడి కత్తి తగిలి తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే ప్రైవేట్ వాహనంలో బెల్లంపల్లి ఆస్పత్రికి తరలించగా.. ఆయనను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దసరా పండుగ సందర్భంగా కన్నెపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన వ్యక్తులు ఈ కోడిపందేల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది. దీనిపై కన్నెపల్లి ఎస్‌ఐ గంగారాంను వివరణ కోరగా ఈ ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని.. విచారణ చేపడుతున్నామన్నారు.

కర్రలతో దాడి చేసి.. పెట్రోల్ పోసి తగులబెట్టేశారు

మంత్రాల నెపంతో మహిళ దారుణ హత్య

- ఏడుగురిపై కేసు నమోదు
- మెదక్ జిల్లా కాట్రియాలలో ఘటన



ముత్తవ్వ (ఫైల్)

రామాయంపేట(మెదక్): మంత్రాలు చేస్తోందనే అనుమానంతో మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల గ్రామానికి చెందిన డ్యాగల ముత్తవ్వ (48) అనే మహిళను గురువారం రాత్రి దారుణంగా హతమార్చారు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ముత్తవ్వ మంత్రాలు చేస్తుండటంతోనే కొంతకాలంగా తాము తరచూ అనారోగ్యం పాలవుతున్నామని ఆమె ఇంటి సమీపంలోనే ఉంటున్న పాలివారు కక్ష పెంచుకున్నారు. గురువారం సాయంత్రం గ్రామంలో ముత్తవ్వ తన భర్తతో కలసి దుర్గామాత ఉత్సవాల్లో పాల్గొంది. రాత్రి భర్త ఇంకా ఉత్సవాల వద్దే ఉండగా ఆమె ఒంటరిగా ఇంటికి చేరుకుంది. ఈ నేపథ్యంలో ముందస్తు పథకం ప్రకారం పాలివారు అప్పటికే ముత్తవ్వ ఇంటి సమీపంలో కాపుకాశారు. ఆమెను ఇంటిలో నుంచి బయటకు లాక్కొచ్చి.. విచక్షణా రహితంగా కర్రతో దాడి చేశారు. ఆపై ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. తల్లి పరిస్థితి చూసి ముత్తవ్వ కుమారుడు డయల్ 100కు సమాచారం అందజేశాడు. తీవ్ర గాయాలతో ఒళ్లంతా కాలిపోయి అపస్మారక స్థితికి చేరుకున్న ముత్తవ్వను పోలీసులు చికిత్స నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. ముత్తవ్వ గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలికి కూతురుతో పాటు కుమారుడు ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి గ్రామానికి చెందిన డ్యాగల రామస్వామి, మురళి, శేఖర్, లక్ష్మి, రాజ్యలత, మహాలక్ష్మి, పోచమ్మపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకట్‌రాజాగౌడ్ తెలిపారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సంఘటనాస్థలిని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

కొడుకు కళ్లెదుటే..

మంత్రాల నెపంతో ముత్తవ్వపై దాడి చేసిన నిందితులు, కుమారుడు రవి చూస్తుండగానే ఆమె ఒంటిపై పెట్రోల్ పోసి తగులబెట్టారు. కన్నతల్లి మంటల్లో కాలిపోతుండగా రవి విలవిలలాడాడు. అతను అడ్డుకోవడానికి ప్రయత్నించగా నిందితులు బెదిరించి నెట్టివేశారు.

ఉరితాడు బిగించుకుని.. సెల్ఫీ వీడియో తీసుకుని

- టిప్పర్ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం
- పోలీసులు కొట్టారని మనస్తాపం
- వెంటనే ఆస్పత్రికి తరలించిన స్థానికులు



మెడకు ఉరితాడు బిగించుకుని సెల్ఫీ వీడియో తీసుకుంటున్న నాగరాజు

శాలిగౌరారం, తిరుమలగిరి(తుంగతుర్తి): చేయని తప్పుకు స్టేషన్‌కు పిలిచి పోలీసులు కొట్టారని మనస్తాపం చెందిన ఓ యువకుడు సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన శెనిగ నాగరాజు, సూర్యాపేట జిల్లా తొండ గ్రామంలోని బాలాజీ క్రషర్ మిల్లులో టిప్పర్ డ్రైవర్‌గా కొంతకాలం పనిచేశాడు. క్రషర్ యజమాని నుంచి రెండు నెలల జీతం రావాల్సి ఉండటంతో ఇటీవల నాగరాజు క్రషర్ యజమాని వెంకన్నకు ఫోన్‌చేసి జీతం డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. ఇదిలావుంటే.. నాగరాజుతో పాటు మరో నలుగురు వ్యక్తులు కలసి క్రషర్ మిల్లులో డీజిల్ దొంగతనం చేశారని మిల్లు యజమాని వెంకన్న గురువారం తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక ఎస్‌ఐ వి.సురేశ్ నాగరాజుతో పాటు ఇతర నలుగురు డ్రైవర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిచి విచారించారు. ఈ ఘటనపై మనస్తాపానికి గురైన నాగరాజు శుక్రవారం తన పొలం వద్ద చెట్టుకు ఉరితాడు బిగించుకొని ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీసుకుని స్నేహితులకు పంపాడు. ఈ వీడియో చూసిన అతని స్నేహితుడు వీరస్వామి.. సమీపంలోని రైతులకు ఫోన్‌చేసి విషయం చెప్పాడు. వెంటనే వారు నాగరాజు వద్దకు వస్తుండగా, అతను చెట్టుపై నుంచి కిందకి దూకాడు. దీంతో మెడకు ఉరి బిగుసుకొని కొట్టుమిట్టాడుతుండటంతో రైతులు వెంటనే నాగరాజును నకిరేకల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నాగరాజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు అతడి కుటుంబ సభ్యులు తెలిపారు.

ఫిర్యాదుతో విచారించాము..

క్రషర్ మిల్లు యజమాని ఫిర్యాదు మేరకు నాగరాజుతో పాటు మరో నలుగురిని విచారించామని ఎస్‌ఐ సురేశ్ తెలిపారు. తాము నాగరాజును కొట్టలేదని చెప్పారు. కాగా, క్రషర్ మిల్లు యజమానిని వెంటనే అరెస్టు చేయాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ డిమాండ్ చేశారు.


గిరిజనులను ఇబ్బందులు పెట్టొద్దు

అటవీ అధికారులతో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్

సాక్షి, హైదరాబాద్: గిరిజనులకు చాలా చోట్ల పట్టాలు ఇచ్చి తీరా వ్యవసాయం చేద్దామంటే బోరు వేయకుండా, కరెంట్ కనెక్షన్ ఇవ్వకుండా అటవీ అధికారులు అడ్డు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ తెలిపారు. అలాంటప్పుడు ఆ భూములకు పట్టాలు ఎందుకిచ్చారని అధికారులను ప్రశ్నించారు. అడవుల్లో నివసించే గిరిజనులను ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు. శుక్రవారం అరణ్య భవన్‌లో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం, పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియాల్ ఆధ్వర్యంలో డీఎఫ్‌వోలు, ఇతర అధికారులతో హుస్సేన్ నాయక్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గిరిజనుల సమస్యల గురించి ఆయన ప్రస్తావించారు. అటవీ అధికారుల బాధ్యత అడవుల రక్షణ మాత్రమే కాదని అక్కడ నివసించే గిరిజనుల రక్షణ బాధ్యత కూడా వారు తీసుకోవాలని సూచించారు. గిరిజనులు ఎక్కువగా ఉన్నచోట అటవీ అధికారులు టూరిజం డెవలప్‌మెంట్ చేయాలని తద్వారా వారికి ఉపాధి లభిస్తుందన్నారు. అటవీ అధికారులకు ఆయుధాలు ఎందుకు లేవని ప్రశ్నించగా ఆ అంశం ప్రభుత్వం దృష్టిలో ఉందని పీసీసీఎఫ్ తెలియజేశారు. అంతకుముందు అటవీశాఖలోని గిరిజన అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యల గురించి ఆయన తెలుసుకున్నారు.

ఉగాండాలో జనగామ ఇంజనీర్ కాల్చివేత

సెక్యూరిటీ గార్డు చేతిలో హత్య



తిరుమలేశ్ (ఫైల్)

జనగామ: బతుకుదెరువు కోసం ఉగాండాకు వెళ్లిన జనగామ జిల్లాకేంద్రానికి చెందిన ఓ ఇంజనీర్ శుక్రవారం ఉదయం తన కంపెనీలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డు చేతిలో హత్యకు గురయ్యాడు. జనగామ జిల్లా కేంద్రంలోని గిర్నిగడ్డకు చెందిన ఎటికల తిరుమలేశ్ (42) నల్లగొండ జిల్లాకు చెందిన రాయల్ టెక్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో ప్రాజెక్టు ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. 2014 నుంచి అతను కంపెనీ పనిపై ఉగాండాలో ఉంటున్నాడు. అతనితోపాటు భార్య, కుమారుడు అక్కడే ఉండగా, కూతురు నిజామాబాద్‌లోని అమ్మమ్మ వద్ద ఉండి చదువుకుంటోంది. ఇదిలా ఉండగా తిరుమలేశ్ పనిచేస్తున్న కంపెనీ కార్యాలయం ఉగాండాలోని కంపాలా జిల్లాలో ఉండగా.. ప్రాజెక్టు పని పరిశీలనకోసం, ఆయన పక్కనే ఉన్న సరోటా జిల్లాలోని సెంబాబులే సైట్ వద్దకు వెళ్లాడు. అదే సమయంలో అక్కడే పనిచేస్తున్న ఓ సెక్యూరిటీ గార్డు తన వద్ద ఉన్న గన్‌తో తిరుమలేశ్‌పై కాల్పులు జరపడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. అక్కడ ఉన్నవారు సెక్యూరిటీ గార్డును పట్టుకునే ప్రయత్నం చేస్తుండగా గార్డు కూడా తనను తాను కాల్చుకుని చనిపోయాడు. ఈ ఘటనతో గిర్నిగడ్డలో విషాదఛాయలు అలుముకున్నాయి. తిరుమలేశ్ తల్లి, ఇతర కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కంపెనీ అధికారులు ఈ సంఘటన జరిగిన ప్రాంతంలోని ఓ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించి పోస్టుమార్టం చేయిస్తున్నట్లు తిరుమలేశ్ సోదరుడు చిన్నా తెలిపారు. తిరుమలేశ్ తండ్రి కిష్టయ్య కరోనా సమయంలో మృతిచెందారు.

ఇక సీబీఐ సిట్

'బాబు సిట్'ను పక్కన పెట్టిన 'సుప్రీం'

శ్రీవారి లడ్డూ నెయ్యి కల్తీ ఆరోపణలపై సుప్రీంకోర్టు ఉత్తర్వులు

ప్రత్యేక సిట్ దర్యాప్తును పర్యవేక్షించాలని సీబీఐ డైరెక్టర్‌కి ఆదేశం

ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది ప్రజల మనోభావాలు ముడిపడి ఉన్నందున తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై స్వతంత్ర, నిష్పాక్షిక దర్యాప్తు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ స్థానంలో ఈ వ్యవహారంపై దర్యాప్తు చేసేందుకు ఓ స్వతంత్ర ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో సీబీఐ డైరెక్టర్ నామినేట్ చేసిన ఇద్దరు సీనియర్ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసిన ఇద్దరు సీనియర్ పోలీసు అధికారులు, ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) చైర్‌పర్సన్ నామినేట్ చేసిన ఓ అధికారి ఉంటారు. ఈ సిట్ దర్యాప్తును సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షించాలి. ఈ మొత్తం వ్యవహారాన్ని ఎంతమాత్రం రాజకీయ డ్రామాగా మారనివ్వబోం. రాజకీయ పోరాటాలకు న్యాయస్థానాన్ని వేదిక కానివ్వబోము.

\- సుప్రీంకోర్టు

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యి కల్తీ జరిగిందన్న ఆరోపణలపై విచారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది ప్రజల మనోభావాలు ముడిపడి ఉన్నందున ఈ వ్యవహారంపై స్వతంత్ర, నిష్పాక్షిక దర్యాప్తు అవసరమని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. తద్వారా దర్యాప్తు విశ్వసనీయత పెరుగుతుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ స్థానంలో ఈ వ్యవహారంపై దర్యాప్తు చేసేందుకు తామే ఓ స్వతంత్ర ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ సిట్‌లో సీబీఐ డైరెక్టర్ నామినేట్ చేసిన ఇద్దరు సీనియర్ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసిన ఇద్దరు సీనియర్ పోలీసు అధికారులు, ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) చైర్‌పర్సన్ నామినేట్ చేసిన ఓ అధికారికి స్థానం కల్పించింది. ఈ సిట్ దర్యాప్తును స్వయంగా పర్యవేక్షించాలని సీబీఐ డైరెక్టర్‌ను ఆదేశించింది. ఈ మొత్తం వ్యవహారాన్ని ఎంతమాత్రం రాజకీయ డ్రామాగా మారనివ్వబోమంది. రాజకీయ పోరాటాలకు న్యాయస్థానాన్ని వేదిక కానివ్వబోమని తేల్చి చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్, జస్టిస్ కల్పతి వెంకటరామన్ విశ్వనాథన్ ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులతో నెయ్యి కల్తీపై స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలను పరిష్కరిస్తున్నట్లు ప్రకటించింది.

స్వతంత్ర దర్యాప్తు కోసం వైవీ తదితరుల పిటిషన్లు...

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యిలో జంతు కొవ్వులను కలిపారన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపణలపై వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఓ కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ సీనియర్ నేత, ప్రముఖ ఆర్థికవేత డాక్టర్ సుబ్రమణియన్ స్వామి ఇటీవల సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. అలాగే లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారంలో దర్యాప్తు, స్వతంత్ర విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తిని నియమించాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి కూడా పిల్ దాఖలు చేశారు. ఇదే అంశంపై ఇతర రాష్ట్రాలకు చెందిన సంపత్, శ్రీధర్, సురేష్ చవంకే వేర్వేరుగా రెండు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నాలుగు వ్యాజ్యాలపై ఇటీవల విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. నెయ్యిలో జంతు కొవ్వులు కలిపారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన రాజకీయ ప్రకటనలపై అసహనం వ్యక్తం చేసింది. శ్రీవారి లడ్డూ నెయ్యిలో జంతు కొవ్వులు కలిశాయనేందుకు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను కొనసాగించాలా?లేక స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలన్న అనే విషయంపై కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి చెప్పాలని సొలిసిటర్ జనరల్ (ఎస్‌జీ) తుషార్ మెహతాను ఆదేశించిన విషయం తెలిసిందే.

పత్రికా కథనాలను పట్టించుకోకండి....

తాజాగా శుక్రవారం ఈ వ్యాజ్యాలు మరోసారి విచారణకు వచ్చాయి. ఈ సందర్భంగా తుషార్ మెహతా స్పందిస్తూ.. ఇది దేశవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల మనోభావాలకు సంబంధించిన వ్యవహారమని పేర్కొనగా.. ధర్మాసనం స్పందిస్తూ, దేశం కాదని.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల మనోభావాలకు సంబంధించిందని తెలిపింది. ఈ వ్యవహారంలో ఆహార భద్రత కూడా ముడిపడి ఉందని ధర్మాసనం పేర్కొంది. తాము రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌కు వ్యతిరేకం కాదని, అయితే కేంద్ర ప్రభుత్వానికి చెందిన అధికారుల పర్యవేక్షణలో దర్యాప్తు జరగడం సబబుగా ఉంటుందని మెహతా చెప్పారు. ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. స్వతంత్ర సంస్థ ద్వారా దర్యాప్తు చేయిస్తే అభ్యంతరం లేదని ముఖ్యమంత్రి చెప్పినట్లు తాము పత్రికల్లో చదివామని గుర్తు చేసింది. ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, టీటీడీ తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా జోక్యం చేసుకుంటూ పత్రికలు చాలా రాస్తున్నాయని, వాటిని పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. టీటీడీ ఈవో చెప్పిన వాస్తవాలను వక్రీకరించాయని లూథ్రా తెలిపారు. దర్యాప్తు విషయంలో ఏ నిర్ణయం తీసుకున్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, దాన్ని కోర్టు పర్యవేక్షించినా కూడా ఇబ్బంది లేదని నివేదించారు.

సీఎం వ్యాఖ్యలతో సిట్ దర్యాప్తు నిష్పాక్షికంగా జరిగే అవకాశమే లేదు...

ఈ సమయంలో వైవీ సుబ్బారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ జోక్యం చేసుకుంటూ.. ముఖ్యమంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ దర్యాప్తు నిష్పాక్షికంగా ఉండేందుకు అవకాశం లేదన్నారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు భిన్నంగా సిట్ దర్యాప్తు ఉండబోదని తెలిపారు. ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలకు ఓ విలువ ఉంటుందన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలు ఖచ్చితంగా సిట్ దర్యాప్తుపై ప్రభావం చూపుతాయన్నారు. ఈ సమయంలో ముకుల్ రోహత్గీ జోక్యం చేసుకుంటూ 100 రోజుల పాలనపై ముఖ్యమంత్రి మాట్లాడారని చెప్పారు. ఆయన మాట్లాడిన సందర్భం వేరన్నారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) జూలైలో నివేదిక ఇచ్చిందన్నారు. దాని ఆధారంగా ముఖ్యమంత్రి మాట్లాడారని తెలిపారు. ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. జూలైలో నివేదిక వస్తే ముఖ్యమంత్రి సెప్టెంబర్‌లో ఎందుకు మాట్లాడారని ప్రశ్నించింది. ఆరోపణలు చాలా తీవ్రమైనవని, అందులో ఎలాంటి సందేహం లేదని వ్యాఖ్యానించింది. దీనిపై సిబల్ జోక్యం చేసుకుంటూ.. ఎన్‌డీడీబీ తన నివేదికలో ఎక్కడా జంతు కొవ్వు కలిసినట్లు చెప్పలేదని, వెజిటబుల్ ఫ్యాట్ మాత్రమే ఉన్నట్లు చెప్పిందని నివేదించారు. అయితే ఇందుకు విరుద్ధంగా జంతు కొవ్వు అంటూ ముఖ్యమంత్రి రాజకీయ ప్రకటనలు చేశారన్నారు. ఈ నేపథ్యంలో స్వతంత్ర దర్యాప్తు అవసరం ఎంతైనా ఉందని, ఆ దిశగా ఆదేశాలు జారీ చేయాలని ధర్మాసనాన్ని కోరారు.

కల్తీ నెయ్యిని కొండపైకి ఎందుకు అనుమతించారు..?

అనంతరం ధర్మాసనం స్పందిస్తూ.. జూలై 6, 12వ తేదీల్లో వచ్చిన ట్యాంకులను వెనక్కి పంపామని, ఆ నెయ్యిని లడ్డూ తయారీలో అసలు ఉపయోగించలేదని టీటీడీ ఈవో పలుమార్లు చెప్పారని గుర్తు చేసింది. మరి అలాంటప్పుడు కల్తీ జరిగిందని దేని ఆధారంగా చెబుతున్నారని ప్రశ్నించింది. ఆ రెండు తేదీల్లో వచ్చిన ట్యాంకర్లలో కల్తీ నెయ్యి ఉందని లూథ్రా పేర్కొనగా.. అలాంటప్పుడు కల్తీ నెయ్యిని కొండపైకి ఎందుకు అనుమతించారని సిబల్ ప్రశ్నించారు. అప్పుడు అధికారంలో ఉన్నది తాము కాదని, మీరేనని ఆయన లూథ్రాకు గుర్తు చేశారు. దీనిపై ధర్మాసనం జోక్యం చేసుకుంటూ స్వతంత్ర దర్యాప్తు అవసరమని, తద్వారా కోట్ల మంది భక్తుల్లో విశ్వాసం కలిగించినట్లు అవుతుందని తెలిపింది. అందుకే ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను పక్కనబెట్టి తామే ప్రత్యేక సిట్‌ను ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేస్తూ ఆ మేరకు ఉత్తర్వులు వెలువరించింది.

ధర్మాసనం ఉత్తర్వుల సారాంశం ఇదీ..

'జూలై 6, 12వ తేదీల్లో రెండు ట్యాంకర్లలో సరఫరా చేసిన నెయ్యి కల్తీ అయినట్లు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లోని ఆరోపణల ప్రకారం కల్తీ అయిన నెయ్యిని లడ్డూ ప్రసాదంలో వినియోగించినట్లు చెప్పారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది భక్తుల మనసులను గాయపరిచినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. నెయ్యి కల్తీపై దర్యాప్తు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను కొనసాగించాలా? లేక స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలా? అనే విషయంపై కేంద్ర హోంశాఖతో సంప్రదించి ఏ విషయం మాకు చెప్పాలని గత విచారణ సమయంలో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను కోరాం. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌లోని సభ్యులు సీనియర్ అధికారులని, వారికి మంచి పేరు ఉందని మెహతా ఈ రోజు మాకు చెప్పారు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ద్వారా దర్యాప్తును కొనసాగించాలని, అయితే ఆ దర్యాప్తును కేంద్ర ప్రభుత్వ అధికారులు పర్యవేక్షిస్తారని ఆయన మాకు నివేదించారు'

రాజకీయ పోరాటాలకు వేదికగా చేసుకునేందుకు అనుమతించం...

"మేం ఆరోపణలు, ప్రత్యారోపణల జోలికి వెళ్లడం లేదు. ఇక్కడ మేం ఓ విషయం స్పష్టంగా చెప్పదలచుకున్నాం. కోర్టును రాజకీయ పోరాటాలకు వేదిక వాడుకునేందుకు అనుమతించం. కోట్ల మంది భక్తుల మనోభావాలను పరిగణలోకి తీసుకుంటూ.. వారికి ఉపశమనం కలిగించేందుకు వీలుగా సీబీఐ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులతో కూడిన స్వతంత్ర సిట్‌ను దర్యాప్తు నిమిత్తం ఏర్పాటు చేస్తున్నాం. ఈ ప్రత్యేక సిట్ దర్యాప్తు సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో జరగాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ స్థానంలో సీబీఐ డైరెక్టర్ నామినేట్ చేసిన ఇద్దరు సీబీఐ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసిన ఇద్దరు పోలీసు అధికారులు, ఎఫ్ఎస్ఎస్ఏఐ చైర్‌పర్సన్ సిఫారసు చేసిన ఓ అధికారి ప్రత్యేక సిట్‌లో ఉంటారు'

సర్కార్‌పై సమరానికి సై!

- 'హైడ్రా', హామీల అమలుపై నిలదీసేందుకు బీజేపీ కార్యాచరణ
- కాంగ్రెస్ సర్కారును ఇరుకున పెట్టేలా కార్యక్రమాలు
- వివిధ సమస్యలు, అంశాల వారీగా పోరాటాలకు ప్రణాళిక
- స్థానిక సంస్థల సమస్యలు, గ్రామాల్లో పెండింగ్ బిల్లులపైనా ఆందోళనలు
- బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయం



'కొత్త' కాంబినేషన్‌తో ముందుకు!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సర్కారుపై సమరానికి 'కమల దళం'సై అంటోంది. ఆరు గ్యారంటీలు, రైతులు, ఇతర వర్గాలకు ఇచ్చిన హామీల అమలుపై నిలదీసేందుకు.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే పలు అంశాలపై ఆందోళనలు, నిరసనలు ప్రారంభించగా.. విస్తృతస్థాయిలో దీర్ఘకాలిక, స్వల్పకాలిక పోరాటాలు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది.

హైడ్రా, మూసీ అంశాలపై..

'హైడ్రా' కూల్చివేతలు, మూసీ సుందరీకరణ ప్రాజెక్టుతో క్షేత్రస్థాయిలో పేదలు, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫోకస్ చేయాలని బీజేపీ నేతలు నిర్ణయించారు. 'హైడ్రా' విషయంలో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా 2, 3 రోజుల్లో కార్యాచరణను ఖరారు చేయాలని.. ఇందిరాపార్కు వద్ద ధర్నా, ఇతర రూపాల్లో ఆందోళనలు నిర్వహించడం ద్వారా పేదల పక్షాన బీజేపీ నిలుస్తోందనే భరోసాను కల్పించాలని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఇటీవల బీజేపీ చేపట్టిన 24 గంటల రైతుదీక్షకు మంచి స్పందన వచ్చిందని.. దీక్షలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇతర ముఖ్యనేతలు పాల్గొనడంతో వారి మధ్య సమన్వయం పెరిగిందని అంటున్నారు. ఇది కలసివచ్చే అంశమని చెప్తున్నారు. ఇక స్థానిక సంస్థల సమస్యలు, పెండింగ్ బిల్లులపై నిరసనలు, ఆందోళనలను ప్రారంభించినా.. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు, పంచాయతీలు, మండలాల్లో నిధుల లేమి తదితర అంశాలపై భారీగా కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ నేతలు నిర్ణయించారు.

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎంపీ ఈటల రాజేందర్, పార్టీ శాసనసభాపక్ష (బీజేఎల్పీ) నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఇతర నాయకులు ఓ టీమ్‌గా ఏర్పడి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా వరుస కార్యక్రమాలు చేపడుతుండటం కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతోందని పార్టీ నేతలు అంటున్నారు. ప్రజా సమస్యలపై గళమెత్తుతున్న ఈ ఇద్దరు నేతలు పార్టీలో కొత్త సమీకరణాలకు తెరతీస్తున్నారా? అనే చర్చ సాగుతోందని పేర్కొంటున్నారు. ఈ ఇద్దరు చొరవగా అసెంబ్లీలోని కార్యాలయంలో బీజేఎల్పీ సమావేశాన్ని నిర్వహించి.. ప్రజాప్రతినిధులు, నేతల మధ్య సమన్వయం, సయోధ్య సాధించడంలో విజయం సాధించారని అభిప్రాయపడుతున్నారు. ఇటీవల ధర్నాచౌక్ వద్ద నిర్వహించిన 24 గంటల రైతు హామీల సాధన దీక్ష కూడా విజయవంతం కావడం 'కొత్త' కాంబినేషన్‌కు మరింత కలసి వచ్చిందని అంటున్నారు. దీనిని మరింత విస్తృతంగా కొనసాగించేందుకు.. హైడ్రాతో పేదలకు ఎదురవుతున్న ఇబ్బందులు, గ్రామీణ స్థానిక సంస్థల్లో నిధుల లేమి, సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోవడంపై నిరసనలు, ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారని పేర్కొంటున్నారు.

దూకుడు పెంచిన నేతలు..

- జమ్మూకశ్మీర్ ఎన్నికల ఇన్‌చార్జిగా బిజీగా ఉన్న కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఇటీవల 'హైడ్రా', మూసీ కూల్చివేతలపై తీవ్రంగా స్పందించారు. పేదల జోలికొస్తే కాంగ్రెస్ సర్కార్ పతనాన్ని శాసిస్తామంటూ హెచ్చరించారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వివిధ ప్రభుత్వ శాఖల్లో అవినీతి పెరిగిందంటూ బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి సంచలన ఆరోపణలతో అందరి దృష్టిని ఆకర్షించారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలోని చెరువుల పరిధిలో పేదలు, మధ్యతరగతి వర్గాల ఇళ్లను కూల్చడంపై ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగడుతూ, క్షేత్రస్థాయిలో బాధిత ప్రజలను కలసి భరోసా కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. గ్రామాల్లో తమ సొంత డబ్బులతో చేపట్టిన పనులకు ఇంకా బిల్లులు చెల్లించలేదంటూ మాజీ సర్పంచ్‌లు చేస్తున్న ఆందోళనకు ఈటల మద్దతిచ్చారు. వెంటనే బిల్లులు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శంకర్‌పల్లిలో రామ్‌రాజ్ స్టోర్ ప్రారంభం



శంకర్‌పల్లిలో స్టోర్‌ను ప్రారంభిస్తున్న రాంచంద్రయ్య

శంకర్‌పల్లి:రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ స్టోర్ ను శుక్రవారం ఆ సంస్థ సీనియర్ ప్రచారక్ కొరిగింజ రాంచంద్రయ్య ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథులుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. స్టోర్ యజమాని వంశీకృష్ణగౌడ్ మాట్లాడుతూ.. శంకర్‌పల్లిలో ఏర్పాటు చేసిన స్టోర్‌తో మండల ప్రజలతో పాటు చుట్టు పక్క ప్రాంతాల వారుసద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హెచ్‌ఎండీఏ ఏపీవోకు బెయిల్

సాక్షి, హైదరాబాద్: హెచ్‌ఎండీఏ అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి సుధీర్ కుమార్‌కు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఎనిమిది వారాల పాటు దర్యాప్తు అధికారులకు అందుబాటులో ఉండాలని షరతు విధించింది. నిజాంపేటలోని ప్రగతినగర్ ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూమిలో అక్రమ నిర్మాణాలకు అనుమతి ఇచ్చారన్న హైడ్రా ఫిర్యాదు మేరకు పలువురు అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదైంది. తనపై సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ హెచ్‌ఎండీఏ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సుధీర్‌కుమార్ మాధవరం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ శ్రీదేవి శుక్రవారం విచారణ చేపట్టారు.

గచ్చిబౌలి స్టేడియంలో క్రీడా వర్సిటీ

- కొత్త క్రీడా ముసాయిదాపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- స్కిల్స్ వర్సిటీ తరహాలో పీపీపీ పద్ధతిలో ఏర్పాటుకు నిర్ణయం
- 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడా విధానం రూపకల్పనకు సూచన
- హైదరాబాద్‌లోని అన్ని క్రీడా మైదానాలను స్పోర్ట్స్ హబ్‌లోకి తేవాలని నిర్దేశం
- క్రికెట్, హాకీ, ఫుట్‌బాల్ తదితర 14 క్రీడా కోర్సుల నిర్వహణకు ఓకే



క్రీడా ముసాయిదాపై సమీక్షలో మాట్లాడుతున్న సీఎం. చిత్రంలో జితేందర్‌రెడ్డి, కేకే, శివసేనారెడ్డి

సాక్షి, హైదరాబాద్: కొత్త క్రీడా పాలసీని 2036 ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకుని రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తెచ్చే విధంగా క్రీడా విధానం ఉండాలని సూచించారు. అద్భుతమైన క్రీడాకారులను తయారు చేయా లన్నారు. గచ్చిబౌలిలోని క్రీడా ప్రాంగణంలో స్పోర్ట్స్ యూని వర్సిటీని ప్రారంభించాలని చెప్పారు. దాదాపు 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాంగణంలో ఇప్పటికే వివిధ క్రీడలకు రెడీమేడ్ సదుపాయాలున్నాయని.. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వాటిని అధునాతనంగా తీర్చిదిద్దాలని సూచించారు. శుక్రవారం సచివాలయంలో కొత్త క్రీడా విధానంపై సీఎం రేవంత్ సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు కె. కేశవరావు, జితేందర్‌రెడ్డి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, సీఎంవో అధికారులు శేషాద్రి, షాన వాజ్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి వివిధ దేశాలు, ఇతర రాష్ట్రాలు అనుసరి స్తున్న విధానాలపై సమావేశంలో చర్చించారు.క్రీడల్లో రాణించడానికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు అందుబాటు లోకి తేవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని సీఎం అన్నారు.

చైర్మన్‌ను నియమించాలి...

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)లో ఏర్పాటు చేసినట్లుగానే స్పోర్ట్స్ యూనివర్సిటీని కూడా అదే తరహాలో ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ నిర్ణయించారు. స్పోర్ట్స్ యూనివర్సిటీని యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సి టీగా తీర్చిదిద్దాలని సూచించారు. క్రీడా విశ్వవిద్యాలయానికి చైర్మన్‌ను నియమించాలని.. వర్సిటీకి స్వయం ప్రతిపత్తి ఉండేలా చూడాలని ఆదేశించారు. స్పోర్ట్స్ యూనివర్సిటీలో ప్రాథమికంగా 14 కోర్సులను నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. క్రికెట్, హాకీ, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, స్విమ్మింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, అక్వాటిక్స్ క్రీడలను స్పోర్ట్స్ హబ్‌లో పొందుపరిచారు.

ప్రముఖ క్రీడా మైదానాలన్నీ ఒకే గొడుకు కిందకు..

ప్రముఖ క్రీడా మైదానాలన్నింటినీ స్పోర్ట్స్ హబ్ పరిధిలోకి తీసుకురావాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. ఎల్బీ స్టేడియం, హకీంపేట స్పోర్ట్స్ స్కూల్, కోట్ల విజయ భాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ సైక్లింగ్ వెలోడ్రమ్ లాంటి వాటన్నింటినీ గుర్తించి ఒకే గొడుగు కిందకు తేవాలని చెప్పారు.

చదువుకు ఆటంకం లేకుండా..

రాష్ట్రవ్యాప్తంగా వివిధ క్రీడల్లో ప్రతిభావంతులను గుర్తించి వారి చదువులకు ఆటంకం లేకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు అవసరమైన శిక్షణ అందించాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఈ క్రమంలో వారికి ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేలా కొత్త పాలసీ ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భౌగోళిక అనుకూల పరిస్థితులతోపాటు తెలంగాణ ప్రాంత యువతకు ఆసక్తి ఉన్న క్రీడలకే ప్రాధాన్యమివ్వాలని సూచించారు. దేశ, విదేశాల కోచ్‌లను రప్పించాలని, అక్కడున్న వర్సిటీల సహకారం తీసుకొనేలా అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవాలన్నారు.

ప్రోత్సాహకాలకు స్పష్టమైన విధానం..

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించే క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాల విషయంలో స్పష్టమైన విధానాన్ని అనుసరించాలని సీఎం అభిప్రాయపడ్డారు. ఏ స్థాయి పోటీల్లో విజయం సాధించిన వారికి ఎంత ప్రోత్సాహకం అందించాలి? ఎవరికి ఉద్యోగం ఇవ్వాలనే విషయంలో మార్గదర్శకాలను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. ముసాయిదాకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్లను పరిశీలించి పలు మార్పుచేర్పులను సూచించారు.

ప్రతి ఒక్కరికీ వైద్య శిబిరాలు అవసరం

హైకోర్టులో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సీజే జస్టిస్ అలోక్ అరాధే



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే. చిత్రంలో సీహెచ్.పంచాక్షరి, ఎ.రవీందర్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఉరుకుల పరుగుల జీవితంలో ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవడం ఇబ్బందిగా మారిందని.. అలాంటి వారికి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో అవసరమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్ఎల్ఎస్ఏ) సేవలు అభినందనీయమని కొనియాడారు. హైకోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన మల్టీ స్పెషాలిటీ ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని శుక్రవారం ఉదయం 10 గంటలకు హైకోర్టు సీజే, టీఎస్ఎల్ఎస్ఏ ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే ప్రారంభించారు. ఉస్మానియా ఆసుపత్రి, నిర్మాణ్ ఆర్గనైజేషన్ (ఎన్‌జీవో)తో కలసి టీఎస్ఎల్ఎస్ఏ ఈ కార్యక్రమం చేపట్టింది. టీఎస్ఎల్ఎస్ఏ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సుజోయ్‌పాల్, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలితోపాటు ఇతర న్యాయమూర్తులు పాల్గొన్నారు. బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.రవీందర్‌రెడ్డి, ఉస్మానియా సూపరింటెండెంట్ రాకేశ్‌కుమార్, నిర్మాణ్ సీఈవో మయూర్ పట్నాల హాజరయ్యారు. హైకోర్టు న్యాయవాదులు, సిబ్బందికి ఉచిత ఆరోగ్య సేవలను అందించడమే లక్ష్యంగా శిబిరం ఏర్పాటు చేశామని టీఎస్ఎల్ఎస్ఏ సభ్యకార్యదర్శి సీహెచ్.పంచాక్షరి వెల్లడించారు.

మంత్రి కొండా సురేఖపై రూ. 100 కోట్లకు మరో దావా వేస్తా

సినీ హీరో నాగార్జున వెల్లడి

కుటుంబాన్ని కాపాడుకోవడంలో తాను సింహాన్ని అని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: మంత్రి కొండా సురేఖ తమ కుటుంబాన్ని ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యల ఉదంతం గురించి సినీ హీరో నాగార్జున మరోసారి స్పందించారు. మంత్రిపై ఇప్పటికే క్రిమినల్ పరువునష్టం కేసు వేశామని.. ఆమెపై రూ. 100 కోట్లకు మరో పరువునష్టం దావా వేసేందుకు సిద్ధమవుతున్నామని ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ చెప్పారు. మంత్రి కొండా సురేఖ కేవలం సమంతపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని క్షమాపణ చెప్పారని.. కానీ తనకు, తన కుటుంబానికి మాత్రం ఒక్క ముక్క క్షమాపణ కూడా చెప్పలేదని నాగార్జున మండిపడ్డారు. ఒకవేళ ఇప్పుడు తనకు, తన కుటుంబానికి ఆమె క్షమాపణ చెప్పినా దావా విషయంలో వెనక్కి తగ్గబోనని తేల్చిచెప్పారు. సినీ పరిశ్రమలోని వ్యక్తులను సున్నిత లక్ష్యాలుగా చేసుకోవడాన్ని ఇకపై ఎంతమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. 'కొంతకాలంగా ఒక దాని తర్వాత ఒకటి సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఎప్పటికప్పుడు ఇదే చివరిదని అనుకున్నా. కానీ దైవానికి ఇంకేవో ప్రణాళికలు ఉన్నట్లు అనిపిస్తోంది. అయినా పరవాలేదు. నేనెప్పుడూ బలమైన వ్యక్తిత్వంగల వాడినని నమ్ముతా. నా కుటుంబాన్ని కాపాడే విషయంలో నేను ఓ సింహాన్ని. అదృష్టవశాత్తూ మొత్తం తెలుగు సినీ పరిశ్రమంతా మాకు అండగా నిలిచింది. ఇదంతా మా నాన్న మంచితనం, ఆశీర్వాదమేనని భావిస్తున్నా' అని నాగార్జున పేర్కొన్నారు.

'గ్రూప్-1' పిటిషన్లపై తీర్పు రిజర్వు

పిటిషనర్లు, టీఎస్‌పీఎస్సీ వాదనలు విన్న హైకోర్టు

ఈ నెల 21 నుంచి మెయిన్స్ నేపథ్యంలో కీలకంగా మారిన తీర్పు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష 'కీ', రీనోటిఫికేషన్, అందులో ఎస్టీ రిజర్వేషన్లను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లలో హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. "ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల జాబితాను ప్రచురించే ముందు ప్రాథమిక కీపై వచ్చిన అభ్యంతరాలను నిష్పక్షపాతంగా పరిగణించాలి. అభ్యంతరాలపై పూర్తి పరిశీలన జరిగిన తర్వాతే మెరిట్ జాబితా ప్రకటించాలి. కానీ టీఎస్పీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్ విషయంలో ఈ మేరకు చర్యలు తీసుకోలేదు. తప్పుగా వచ్చిన ప్రశ్నలను తొలగించి మళ్లీ మెరిట్ జాబితా ప్రకటించేలా ఆదేశించాలి''అని వికారాబాద్‌కు చెందిన దామోదర్‌రెడ్డితోపాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే రీనోటిఫికేషన్, ఎస్టీ రిజర్వేషన్లను సవాల్ చేస్తూ మరికొందరు పిటిషన్లు వేశారు. వీటన్నింటిపై న్యాయమూర్తి జస్టిస్ పుల్ల కార్తీక్ శుక్రవారం మరోసారి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా 'తప్పుగా ఇచ్చిన ప్రశ్నలను తొలగించి మెరిట్ జాబితా ప్రకటించేలా కమిషన్‌ను ఆదేశించాలి'అని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరారు. ప్రిలిమ్స్ 'కీ'పై అభ్యంతరాలను స్వీకరించామని, సబ్జెక్టుల వారీగా నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి పరిశీలించాకే తుది కీ సిద్ధం చేసి విడుదల చేశామని కమిషన్ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును వాయిదా వేశారు. అక్టోబర్ 21వ తేదీ నుంచి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కోర్టు తీర్పు కీలకంగా మారింది.

మంత్రి వ్యాఖ్యలు దిగ్భ్రాంతికరం

కాంగ్రెస్ పార్టీ మహిళా వ్యతిరేక మనస్తత్వానికి నిదర్శనం: అశ్వినీ వైష్ణవ్



సాక్షి, న్యూఢిల్లీ: సినీ నటులు సమంత, అక్కినేని నాగార్జునలపై తెలంగాణ మంత్రి (కొండా సురేఖ) చేసిన వ్యాఖ్యలు దిగ్భ్రాంతికరమని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. దీనిపై రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకత్వం మౌనం వహించడాన్ని తప్పుబట్టారు. ఈ మేరకు శుక్రవారం ఆయన 'ఎక్స్'వేదికగా విమర్శలు చేశారు. ''తెలంగాణ మంత్రి సినీ ప్రముఖులను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. కాంగ్రెస్ మహిళా వ్యతిరేక మనస్తత్వాన్ని సూచిస్తున్నాయి. మన దేశానికి ఎంతో గర్వకారణమైన వినోద పరిశ్రమను కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా చూస్తోందో అర్థమవుతోంది. మన సమాజంలో ఇలాంటి విమర్శలకు స్థానం లేదు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వం మౌనం.. అలాంటి వ్యాఖ్యలకు మద్దతు ఇస్తున్నట్లుగా కనిపిస్తోంది''అని కేంద్ర మంత్రి విమర్శించారు.

మంత్రి కొండా సురేఖపై పరువునష్టం కేసు విచారణ వాయిదా

నేడు లేదా సోమవారం విచారణకు వచ్చే అవకాశం

సిటీ కోర్టులు: తమ కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ హీరో నాగార్జున నాంపల్లి కోర్టులో దాఖలు చేసిన పరువునష్టం కేసు విచారణ వాయిదా పడింది. రాజకీయ లబ్ధి కోసం తమ కుటుంబం గురించి మంత్రి మాట్లాడిన మాటలతో చాలా బాధపడ్డామని స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ ఎక్సైజ్ కోర్టులో సెక్షన్ 356 బీఎన్ఎస్ కింద వేసిన పిటిషన్‌లో నాగార్జున పేర్కొన్నారు. పూర్తి అసంబద్ధ మాటలతో తమ కుటుంబ పరువును రోడ్డుకు లాగిన మంత్రి కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆయన పిటిషన్‌లో కోరారు. అయితే ఈ కేసు విచారణలో భాగంగా శుక్రవారం పిటిషనర్, సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేయాల్సి ఉండగా జడ్జి సెలవులో ఉండటంతో విచారణ వాయిదా పడింది. కేసు విచారణ శనివారం లేదా సోమవారం జరిగే అవకాశం ఉంది.

తప్పు చేసిన బాబు క్షమాపణ చెప్పాలి


చంద్రబాబు తీరును సుప్రీం కోర్టు తప్పు పట్టిందని ఎకనమిక్ టైమ్స్‌లో వచ్చిన కథనాన్ని చూపుతున్న వైఎస్ జగన్

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ డిమాండ్

ఇంత స్పష్టంగా సుప్రీంకోర్టు ఆదేశించినా.. చంద్రబాబులో ఏ మాత్రం పశ్చాత్తాపం కనిపించలేదు. ఆయనకు వ్యక్తిత్వం ఉంటే ముందు ప్రజలను క్షమాపణ కోరాలి. తర్వాత స్వామి వారిని వేడుకోవాలి. నిజానికి సుప్రీం కోర్టు ఎవరిని తప్పు పట్టింది? ఎవరు దేవుడి దగ్గర దోషిగా నిలబడాలి? మన ఖర్మ ఏమిటంటే.. చంద్రబాబు వంటి అన్యాయమైన నాయకుడు మనకున్నాడు. రాబోయే రోజుల్లో బాబు పాపం.. దేవుడి కోపం రాష్ట్ర ప్రజలపై పడకూడదు. అది చంద్రబాబుకే పరిమితం కావాలి. ఆయన మాట్లాడింది పచ్చి అబద్ధం అని తెలిసినా ఆయన్ను మోస్తున్న కూటమికి, ఆ నాయకులకే దేవుడి కోపం పరిమితం కావాలని దేవుణ్ని వేడుకుంటున్నాను. ఇవన్నీ వెలుగులోకి వచ్చాయంటే దేవుడి దయతోనే. వేంకటేశ్వరస్వామే నడిపిస్తారు. ఆయనే వారికి మరిన్ని మొట్టికాయలు వేస్తాడు. - వైఎస్ జగన్

గత నెల 30న సుప్రీంకోర్టు అడిగిన ప్రశ్నలివి

- కల్తీ నెయ్యి వాడలేదని ఈవో చెప్పినా, లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు ఉందని ముఖ్యమంత్రి ఎలా చెబుతారు?
- ఆధారాలు లేకపోయినా సీఎం మీడియా ముందు అలా ఎలా మాట్లాడుతారు?
- ఒకవైపు విచారణ జరుగుతుండగా.. ఆ వ్యాఖ్యలతో సిట్ ప్రభావితం కాదా?
- తమ నివేదిక తప్పు కావచ్చని స్వయంగా ఎన్‌డీడీబీ రిపోర్టులోనే రాశారు కదా?
- ఎన్‌డీడీబీ నివేదికపై సెకండ్ ఒపీనియన్ ఎందుకు తీసుకోలేదు? అదొక్కటే కాదు దేశంలో ఎన్నో ల్యాబ్స్ ఉన్నాయి కదా?
- ముఖ్యమంత్రి ప్రకటనకు పూర్తి విరుద్ధంగా ఈవో ప్రకటన ఉంది. సీఎం చేసిన ప్రకటనకు ఎలాంటి ఆధారాలు లేవు. దర్యాప్తునకు ఆదేశించినప్పుడు పదాల గారడీ ఎంత మాత్రం అవసరం లేదు. ఎన్‌డీడీబీ నివేదిక జూలైలో వస్తే దానిపై ముఖ్యమంత్రి ఎందుకు సెప్టెంబరులో మాట్లాడినట్లు?
- జూలైలోనే ఎందుకు మాట్లాడలేదు?
- మీడియాతో మాట్లాడ్డానికి ముందు లడ్డూలను పరీక్షించడం సరైనదని సీఎం భావించలేదా?
- అసలు బహిరంగ ప్రకటనలు ఎందుకు చేయాలి? దాని వల్ల సిట్ దర్యాప్తు ప్రభావితం కాదా? అది కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బ తీస్తుందని తెలియదా?
- సిట్ ఏర్పాటు చేసినా, ఇంకా కల్తీ నెయ్యిపై ప్రకటన ఎలా చేస్తారు? మీడియాతో ఎలా మాట్లాడతారు?

సాక్షి, అమరావతి: సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంటనే క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడారనే అంశంపై దాఖలైన వ్యాజ్యంపై శుక్రవారం సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించిన తర్వాత తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టులో శుక్రవారం, సెప్టెంబరు 30న జరిగిన పరిణామాలను గమనిస్తే సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి మత విశ్వాసాలను ఎలా కావాలని, రాజకీయ దుర్బుద్ధితో రెచ్చగొడుతున్నారనేది సుప్రీంకోర్టు అర్థం చేసుకుంది కాబట్టే ఘాటైన వ్యాఖ్యలు చేసిందన్నారు. దేవుణ్ని రాజకీయాల్లోకి లాగొద్దని.. పొలిటికల్ డ్రామాలు చేయొద్దంటూ చంద్రబాబుకు మొట్టికాయలు వేసిందన్నారు. చంద్రబాబు స్వయంగా వేసుకున్న 'సిట్'ను కూడా రద్దు చేసిందని చెప్పారు. సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సీబీఐ నుంచి ఇద్దరు అధికారులు.. వారికి సహకారం అందించడానికి రాష్ట్ర పోలీసు శాఖ నుంచి ఇద్దరు, ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) నుంచి ఒక అధికారి సభ్యులుగా స్వతంత్ర దర్యాప్తు బృందం(సిట్)ను సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిందన్నారు. దేవుడంటే భయం, భక్తి ఉంటే తక్షణమే ప్రజలకు క్షమాపణ చెప్పాలని చంద్రబాబును వైఎస్ జగన్ డిమాండ్ చేశారు. చేసిన తప్పుకు క్షమించాలని తిరుమల శ్రీవారి పాదాల చెంత వేడుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

చంద్రబాబుకు భయం, భక్తి లేవు

తిరుమల పవిత్రతను, స్వామివారి ప్రసాదం విశిష్టతను రాజకీయ దుర్బుద్ధితో.. కావాలని అబద్ధాలు చెప్పి, జంతువుల కొవ్వు వాడి లడ్డూలు తయారు చేసి భక్తులకు ఇస్తే, వారవి తిన్నట్లు సీఎం చంద్రబాబు అసత్య ప్రచారం చేశారు. అలా ఆయన తిరుమల లడ్డూను, శ్రీవెంకటేశ్వరస్వామి విశిష్టతను, తిరుమల ప్రతిష్టను అపవిత్రం చేశారు. వీటన్నింటికీ సంబంధించి నేను సాక్ష్యాధారాలతో సహా చూపించాను. కోర్టు కూడా మొట్టికాయలు వేసింది. కోట్లాది మంది భక్తుల విశ్వాసాన్ని, నమ్మకాన్ని దెబ్బ తీస్తూ, చంద్రబాబు ఎలా అబద్ధాలు చెప్పాడనేది చూస్తే.. చంద్రబాబు సీఎం అయ్యాక, తను నియమించుకున్న ఐఏఎస్ అధికారి, టీటీడీ ఈవో చంద్రబాబు ప్రకటనలకు విరుద్ధంగా స్వయంగా ప్రకటనలు చేశారు. చంద్రబాబు మామూలుగా మంచి వ్యక్తి అయితే, ఇన్ని ఆధారాలు కనిపిస్తుంటే, కొద్దో గొప్పో సిగ్గు పడాలి. తన మాటలకు వ్యతిరేకంగా ఇన్ని సాక్ష్యాధారాలు కనిపించినప్పుడు, దేవుడంటే భయం, భక్తి ఉన్న వారెవరైనా పశ్చాత్తాప పడతారు. ప్రజలకు క్షమాపణ చెబుతారు. కానీ చంద్రబాబుకు పశ్చాత్తాపం ఉండదు. ఆయనకు దేవుడంటే భయం, భక్తి రెండూ లేవు.

ప్రధానికి లేఖ.. 'సుప్రీం'లో పిటిషన్

ఒక అబద్ధానికి రెక్కలు కట్టి గోబెల్స్ ప్రచారంలో భాగంగా రాజకీయ దురుద్దేశంతో అబద్ధాలు ఆడి, తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాశస్త్యం, లడ్డూ విశిష్టతను అపవిత్రం చేస్తూ చంద్రబాబు అన్న మాటలపై మేము ప్రధానికి లేఖ రాశాం. సుప్రీంకోర్టును సైతం ఆశ్రయించాం. సుప్రీంకోర్టు సైతం ఈ కేసు వినేటప్పుడు.. కోర్టులో న్యాయమూర్తులు ఎలా స్పందించారో ఒకసారి గుర్తు చేసుకొండి (గత సోమవారం సుప్రీంకోర్టులో వాదనల సందర్భంగా న్యాయమూర్తులు ఏమన్నారన్నది చదివి వినిపించారు). ఇవన్నీ నేషనల్ మీడియాలో రిపోర్ట్ అయ్యాయి. ఆ రోజు (గత నెల 30న) సుప్రీంకోర్టు ఇంకా చాలా చెప్పింది. (వాటిని ప్రస్తావిస్తూ.. ఆ కాపీ స్లైడ్లో చూపారు) సీఎం చంద్రబాబును ఆక్షేపిస్తూ, సుప్రీంకోర్టు స్వయంగా ఈ వ్యాఖ్యలు చేసింది.

తప్పులను ఎత్తిచూపిన సుప్రీంకోర్టు

ఎఫ్ఐఆర్ సెప్టెంబర్ 25న రిజిస్టర్ చేస్తే.. అంతకు ముందే సెప్టెంబరు 18న ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి స్టేట్‌మెంట్ ఇచ్చారు. సిట్ ఏర్పాటైంది సెప్టెంబరు 26న అయితే.. అంతకన్నా ముందే ఎలా ప్రకటన ఇచ్చారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. సీఎం బహిరంగ వ్యాఖ్యలు కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బ తీస్తుందని చెప్పింది. ఇన్ని రకాలుగా చంద్రబాబును సుప్రీంకోర్టు ఆక్షేపించింది. మళ్లీ ఇవాళ కూడా న్యాయస్థానం కల్తీ నెయ్యి వాడలేదని ఈవో చెప్పిన విషయాన్ని ప్రస్తావిస్తూ చంద్రబాబు చేసిన తప్పును ఎత్తి చూపింది. చంద్రబాబు తాను స్వయంగా ఏర్పాటు చేసుకున్న సిట్ ను రద్దు చేస్తూ.. సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో ఇద్దరు సీబీఐ అధికారులు, ఇద్దరు రాష్ట్ర అధికారులు సహాయ పడతారని చెబుతూ వీరికి తోడు ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) నుంచి ఒకరు నియమితులవుతారని.. వీరందరూ లడ్డూకు సంబంధించిన విషయంపై నివేదిక ఇస్తారని ఆదేశించింది. అయినా అన్ని సాక్ష్యాధారాలను ప్రజల ముందు ఉంచాం. సుప్రీంకోర్టుకూ అందజేశాం. రేపు విచారణలో ఇదే స్పష్టమవుతుంది.

సుప్రీం కోర్టు గత నెల 30న విచారణ అనంతరం జారీ చేసిన తీర్పును చూపుతూ.. అందులోని అంశాలను వైఎస్ జగన్ చదివి విన్పించారు.

> 1. The present writ petitions pertain to an issue which affects the sentiments of crores of people living in the entire world.

ప్రస్తుత వ్యాజ్యాలు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల మనోభావాలను ప్రభావితం చేస్తున్న అంశానికి సంబంధించినవి.

> 3. However, some press reports also show that the Executive Officer of the Tirumala Tirupati Devasthanam Trust (for short 'TTD') had made a statement to the contrary that adulterated ghee was never used.

గత ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వు కలిసిన నెయ్యి వాడారంటూ సెప్టెంబరు 18న ఏపీ సీఎం ప్రకటించారు.. కానీ.. కొన్ని మీడియా రిపోర్టులను చూస్తే.. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి ఎన్నడూ వాడలేదని టీటీడీ ఈవో స్పష్టం చేశారు.

> 10. It could thus be seen that a statement was made by the Chief Minister on 18.09.2024, which was even prior to the FIR being lodged on 25.09.2024 and the SIT being constituted on 26.09.2024.

సెప్టెంబరు 25న ఎఫ్ఐఆర్ నమోదైంది.. సెప్టెంబరు 26న సిట్ ఏర్పాటైంది.. అంతకన్నా ముందే సెప్టెంబరు 18న లడ్డూల తయారీలో జంతువుల కొవ్వు కలిసిన నెయ్యి వాడినట్లు సీఎం ప్రకటించారు.

> 11. We are, *prima facie*, of the view that it was not appropriate on the part of a high constitutional functionary to go in public to make a statement which can affect the sentiment of crores of people and when investigation to find out adulterated ghee was used to make laddus was underway.

ప్రాథమిక ఆధారాలను బట్టి చూస్తే.. రాజ్యాంగపరమైన ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తి కోట్ల మంది ప్రజల మనోభావాలను ప్రభావితం చేసేలా బహిరంగ ప్రకటన చేయడం సరి కాదు.. లడ్డూల తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారని దర్యాప్తులో తేలకుండానే అలాంటి ప్రకటన చేయడం సరికాదు.

అబద్ధాలకు రెక్కలుకట్టి గోబెల్స్ ప్రచారం చేస్తావా?

సీఎం చంద్రబాబును నిలదీసిన వైఎస్ జగన్

వంద రోజుల పాలన, హామీల అమలులో వైఫల్యం..

- వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి శ్రీవారితో ఆడుకుంటావా?
- రాజకీయ దుర్బుద్ధితో శ్రీవారి ప్రతిష్టను, లడ్డూ ప్రసాదం విశిష్టతను దెబ్బ తీస్తావా?
- కోట్లాది మంది భక్తుల మనోభావాలను గాయపరుస్తావా?
- ఆ నెయ్యి వాడలేదని ఈవో చెబుతున్నా పదే పదే అబద్ధాలా?
- తప్పులను వెనకేసుకు రావడం ఏ విధంగా సనాతన ధర్మం?



సనాతనా ధర్మం అంటే ఏమిటో అసలు ఆ మనిషికి తెలుసా? సాక్షాత్తు నువ్వు కూడా కూటమిలో ఉన్నావు. చంద్రబాబు నీ కళ్ల ఎదుటే తప్పు చేశాడు. దేవుడి విషయంలో చంద్రబాబు చేసిన తప్పు నీకే కాదు ఆరేళ్ల పిల్లాడికి కూడా కన్పిస్తోంది. నీ కళ్ల ఎదుటే వేంకటేశ్వరస్వామి ప్రతిష్టను తగ్గిస్తూ.. విశిష్టతను దెబ్బతీస్తూ కావాలనే దుర్బిద్ధితో చంద్రబాబు రాజకీయం చేస్తున్నాడు. రాజకీయ లబ్ధి పొందేందుకు కోట్ల మంది శ్రీవారి భక్తుల్లో ఒక అనుమానాన్ని రేకెత్తించాడు. తిరుమల తిరుపతి దేవస్థానానికి అపవిత్రతను ఆపాదించే ప్రయత్నం చేస్తూ.. లడ్డూ విశిష్టతను తగ్గించే ప్రయత్నం చేశారు. అందులో నీవు కూడా భాగమే. - వైఎస్ జగన్

సాక్షి, అమరావతి : 'వంద రోజుల పాలన వైఫల్యం.. సూపర్ సిక్స్‌తో సహా ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీస్తుండటంతో వారి దృష్టి మళ్లించాలనే రాజకీయ దురుద్దేశంతో కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామితో ఆడుకుంటావా?' అని సీఎం చంద్రబాబును వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ నిలదీశారు. ఒక అబద్ధానికి రెక్కలు కట్టి గోబెల్స్ ప్రచారం చేసి.. తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాశస్త్యం, లడ్డూ విశిష్టతను అపవిత్రం చేస్తావా? అంటూ మండిపడ్డారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారంటూ ఆరోపిస్తున్న సీఎం చంద్రబాబు చేసిన తప్పులు, చెప్పిన అబద్ధాలను 'మీడియా' ఎదుట సాక్ష్యాధారాలతో సహా మరోసారి వివరించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

టీటీడీలో గొప్ప వ్యవస్థ

జూలై 6, జూలై 12న వచ్చిన ట్యాంకర్లలో నెయ్యి నాణ్యత పరీక్షించిన తర్వాత వాటిని లోపలికి అనుమతించ లేదు. తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)లో స్వామి వారి ప్రసాదాలు, అడ్డూ, అన్న ప్రసాదాల తయారీకి అవసరమైన ముడి సరుకులు, నెయ్యి కొనుగోలు చేయడానికి అత్యంత గొప్ప, పటిష్టమైన వ్యవస్థ ఉంది. 2014–19 మధ్య నాణ్యత లేదని 14 నెయ్యి ట్యాంకర్లు వెనక్కు పంపగా.. మా హయాంలో 2019–24 మధ్య 18 ట్యాంకర్లు వెనక్కు పంపారు. నెయ్యి, ముడిసరుకుల సేకరణకు ఈ-టెండర్ల ద్వారా బిడ్లు నిర్వహిస్తారు. ఎల్-1కు 65 శాతం, ఆ తర్వాత బిడ్లో ఉన్న వారికి అదే ధరకు 35 శాతం ఇస్తారు.

ఆ నెయ్యి వాడలేదని టీటీడీ ఈవోనే చెప్పారు

తిరుమలకు టెండర్ ప్రకారం సరఫరా చేసే నెయ్యి ట్యాంకర్లు.. తమతో ఎన్ఏబీఎల్ గుర్తింపు పొందిన ల్యాబ్ నుంచి క్వాలిటీ సర్టిఫికెట్ తీసుకురావాలి. ఆ సర్టిఫికెట్‌తో వచ్చినా, తిరుపతిలో ప్రతి ట్యాంకర్ శాంపిల్ మూడు సార్లు టెస్ట్ చేస్తారు. అలా జూలై 6, 12 తేదీల్లో వచ్చిన ట్యాంకర్లు తిరుపతిలో చేసిన నాణ్యత పరీక్షలో ఫెయిల్ అయితే, వాటిని వెనక్కు పంపారు. అవే శాంపిల్స్‌ను ఎన్డీడీబీకి పంపిస్తే, జూలై 23న రిపోర్ట్ వచ్చింది. దాంతో ఆ ట్యాంకర్లు వెనక్కు పంపడంతో పాటు, ఆ కంపెనీ వారికి నోటీసులు కూడా ఇచ్చారు. నాణ్యత లేని నెయ్యి వాడలేదని ఈవో స్పష్టంగా చెప్పినా (ఆ వీడియోను చూపారు).. తన 100 రోజుల పాలనలో అన్ని రంగాల్లో విఫలమైన చంద్రబాబు, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ.. సెప్టెంబరు 18న ఎన్డీఏ సమావేశంలో తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలిపిన నెయ్యి వాడారంటూ దారుణ ఆరోపణలు చేశారు. (అందుకు సంబంధించిన వీడియో చూపుతూ) ఆ వెంటనే రెండు రోజులకు, అంటే సెప్టెంబరు 20న టీటీడీ ఈవో ఇదే విషయంపై మాట్లాడుతూ.. కల్తీ నెయ్యి ట్యాంకర్లు నాలుగింటిని వెనక్కి పంపేశామని.. ఆ నెయ్యిని లడ్డూ తయారీలో వాడనే లేదని స్పష్టం చేశారు. (ఆ వీడియోను ప్రదర్శించారు) అయినా కూడా మళ్లీ సెప్టెంబర్ 22న మాట్లాడిన చంద్రబాబు.. ఏ మాత్రం భయం, భక్తి లేకుండా తనకు రాజకీయ ఉద్దేశాలే ముఖ్యమని, స్వామి వారు అన్నా, తిరుపతి అన్నా భయం, భక్తి లేదని నిరూపిస్తూ.. తాను అంతకు ముందు చెప్పిన పచ్చి అబద్ధాలను మరోసారి వల్లె వేశారు. తిరుమలకు వచ్చిన ఆ నాలుగు ట్యాంకర్ల నెయ్యి వాడినట్లు (ఆ వీడియోను చూపుతూ) చెప్పారు.

తప్పును గుడ్డిగా సమర్థించడం సనాతన ధర్మమా?

'చంద్రబాబుతో పాటు నువ్వు కూడా ఆ అబద్ధాలకు రెక్కలు కట్టి ప్రచారం చేస్తున్నప్పుడు ఇంకా సనాతన ధర్మం గురించి నువ్వు ఏం మాట్లాడతావు? ఆ తప్పును గుడ్డిగా వెనకేసుకొస్తూ సనాతన ధర్మం గురించి మాట్లాడతావా? ఇది ఎంత వరకు ధర్మం' అంటూ వైఎస్ జగన్ నిలదీశారు. తప్పు చేయలేదు కాబట్టే సాక్ష్యాధారాలతో సహా నిజాలు చెప్పగలుగుతున్నామని స్పష్టం చేశారు. 'చంద్రబాబు మాటలకు ఆయన నియమించుకున్న టీటీడీ ఈవో చెబుతున్న మాటలకు తేడా ఏమిటో స్పష్టంగా ఆధారాలతో సహా చూపిస్తున్నాం. తిరుమల తిరుపతి దేవస్థానంలో దశాబ్దాలుగా అమలవుతున్న గొప్ప సంప్రదాయాలను గుర్తు చేస్తున్నాం. పటిష్టమైన వ్యవస్థను మనమే దెబ్బతీసేలా.. మనంతట మనమే మన గుడిని.. మన స్వామి వారిని.. శ్రీవారి లడ్డూ విశిష్టతను తగ్గించుకునేలా మాట్లాడి.. మనమే సనాతన ధర్మం గురించి గొప్పలు చెప్పుకోవడం ఎంత వరకు సబబు?' అంటూ ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

సిగ్గూ ఎగ్గూ లేకుండా కోర్టు తీర్పు వక్రీకరణ

సీఎం చంద్రబాబును నిలదీసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

- 'ఎక్స్' వేదికగా టీడీపీ దారుణంగా అసత్య ప్రచారాలు
- కోర్టు చంద్రబాబును తప్పు పడితే మాపై దుష్ప్రచారం
- చంద్రబాబు వంటి నాయకుడు ఉండడం మన ఖర్మ


టీడీపీ అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో చేస్తున్న అసత్య ప్రచారం

సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశించినా.. చంద్రబాబులో ఏ మాత్రం పశ్చాత్తాపం కనిపించలేదు. ఆయనకు వ్యక్తిత్వం ఉంటే ముందు ప్రజలను క్షమాపణ కోరాలి. తర్వాత తిరుమలలో స్వామి వారిని తప్పు చేశానని వేడుకోవాలి. కానీ, అవేవీ చేయకుండా చంద్రబాబుని కోర్టు తిడితే.. నీ పాపం పండింది జగన్.. అంటూ మమ్మల్ని తిట్టినట్టు వక్రీకరిస్తూ ట్వీట్ చేశారు. - వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'సుప్రీంకోర్టు మీకు మొట్టికాయలు వేస్తూ తీర్పు ఇస్తే.. సిగ్గూ ఎగ్గూ లేకుండా ఆ తీర్పును వక్రీకరిస్తారా? మీరు చేసిన తప్పులను సుప్రీంకోర్టు ఎత్తి చూపుతూ మిమ్మల్ని నిలదీస్తే మాకు అక్షింతలు వేసిందంటూ దుష్ప్రచారం చేస్తారా?' అంటూ సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మండిపడ్డారు. శుక్రవారం 'ఎక్స్'లో తెలుగుదేశం పార్టీ అధికారిక ఖాతా(హ్యాండిల్)లో చేసిన పోస్టింగ్స్ చూస్తే.. 'తప్పు జరిగిందని తెలిసినా, దేవుడి పట్ల ఇంత దారుణంగా వ్యవహరించినా చంద్రబాబులో కనీస పశ్చాత్తాపం కనిపించడం లేదు' అంటూ దుయ్యబట్టారు. టీడీపీ అధికారిక ఖాతా నుంచి 'ఎక్స్'లో చేసిన ఆ పోస్టింగ్స్‌లో ఏం రాశారన్నది చదివి వినిపిస్తూ 'తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిపిన కల్తీ వ్యవహారంపై సుప్రీంకోర్టు సీరియస్ కావడంతో అబద్ధం మీద అబద్ధాలు చెప్పుకుంటూ పోతున్నారు. మనిషి అన్నాక కొద్దిగానైనా దేవుడంటే భక్తి ఉండాలి. కనీస ఇంగిత జ్ఞానం ఉండాలి. ఇంత దారుణంగా వక్రీకరణ చేయడమా?' అంటూ వైఎస్ జగన్ తీవ్రంగా ఆక్షేపించారు. వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ ఇంకా ఏమన్నారంటే..

ఎంత నీచానికైనా దిగజారుతాడు

సుప్రీంకోర్టు నిజానికి చంద్రబాబుకు అక్షింతలు వేస్తే, దాన్ని నేషనల్ మీడియా మొత్తం రాసిందంటూ.. గత సోమవారం సుప్రీంకోర్టులో వాదనల తర్వాత, ప్రతి నేషనల్ టీవీ, న్యూస్ పేపర్ చంద్రబాబును ఆక్షేపిస్తూ.. ఏం రాశాయన్నది చదివి వినిపించారు. 'కీప్ గాడ్ అవే ఫ్రమ్ పాలిటిక్స్ సుప్రీం కోర్ట్ టెల్స్ నాయుడు' అని ప్రతి నేషనల్ ఛానల్, ప్రతి ఇంగ్లిష్ పేపర్ చంద్రబాబును తప్పు పట్టింది. ఆయన్ను సుప్రీంకోర్టు తిట్టినా, ఆక్షేపించినా, టీడీపీ సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారం, రాస్తున్న అబద్ధాలు చూస్తుంటే, ఆయన ఎంత నీచానికి దిగాడన్నది తెలుస్తుంది. 'తిరుమల లడ్డూ కల్తీపై సుప్రీంకోర్టు సీరియస్. మీ పాపం పండింది జగన్..' అంటూ ఏ మాత్రం సిగ్గూ, ఎగ్గూ లేకుండా వక్రీకరిస్తున్నారు. నిజానికి సుప్రీంకోర్టు చంద్రబాబును తిడితే, దాన్నీ వక్రీకరిస్తూ.. మీ పాపం పండింది.. వైవీ సుబ్బారెడ్డిపై సుప్రీంకోర్టు ఆగ్రహం అని రాశారు. ఇంత దారుణంగా వక్రీకరిస్తూ, చంద్రబాబు దిగజారిపోయిన పరిస్థితి. ఇంకా వక్రీకరణలో భాగంగా తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిపిన కల్తీ వ్యవహారంపై సుప్రీం సీరియస్ కావడంతో జగన్ రెడ్డి బావ ధర్మారెడ్డి, బాబాయి సుబ్బారెడ్డి, మామ కరుణాకర్ రెడ్డి అడ్డంగా బుక్కయ్యారని పెద్ద అబద్ధం రాశారు. చివరగా, ఒకటి గుర్తు పెట్టుకొండి. ఇవన్నీ వెలుగులోకి వచ్చాయంటే దేవుడి దయతోనే. వాళ్లు శ్రీ వేంకటేశ్వరస్వామితో ఆడుకుంటున్నారు. అన్నీ స్వామే చూసుకుంటారు. ఇటువంటి అన్యాయాలు చేస్తున్న వ్యక్తులకు శ్రీవారే మరిన్ని మొట్టికాయలు వేస్తారు' అని చెప్పారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం


శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకెళ్తూ ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, తిరుపతి/తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఆరంభానికి నాందిగా ఆలయంలో గురువారం ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వైఖానస ఆగమోక్తంగా పవిత్ర గరుడ పతాకాన్ని (ధ్వజపటం) సా. 5.45 నుండి 6 గంటల మధ్య మీన లగ్నంలో బంగారు ధ్వజస్తంభ శిఖరాగ్రంలో అర్చకులు ఆవిష్కరించి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉత్సవ మూర్తులైన మలయప్ప, శ్రీదేవి, భూదేవి సమక్షంలో గోధూళి వేళలో కంకణ భట్టాచార్యులుగా రామకృష్ణ దీక్షితులు క్రతువును నిర్వహించి మంగళ ధ్వనులు, వేద మంత్రోచ్చారణల మధ్య ఉత్సవ వైభవానికి పతాకావిష్కరణ చేశారు. ఇక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు శుక్రవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు ఏడుతలల స్వర్ణశేషవాహనం (పెద్ద శేషవాహనం)పై తిరుమాడ వీధుల్లో భక్తులను అనుగ్రహించారు. శుక్రవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు శ్రీవేంకటేశ్వర స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు.

ఇది కోట్లాది మంది భక్తుల విజయం

వైఎస్సార్‌సీపీ ఎంపీ, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ : లడ్డూ వివాదంపై స్వతంత్ర ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును స్వాగతిస్తున్నామని వైఎస్సార్‌సీపీ ఎంపీ, మాజీ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఇది కోట్లాది మంది భక్తుల విజయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో లడ్డూ కల్తీ అయిందని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బ తీశాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కల్తీ జరగలేదని, అసలు లడ్డూను పరీక్షించలేదని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 12+10 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 195
శనివారం 5-10-2024



'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'



చోరీ కోసం..
మహారాష్ట్రకు చెందిన రోషన్ సిటీలో రూ.30 లక్షలు కాజేశాడు. -2లో



ఓల్డేజ్.. ఓల్టేజ్..
డ్యాన్సు చేస్తే వృద్ధాప్య ప్రభావం ఉండదని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. -6లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





భాగ్యలక్ష్మికి బతుకమ్మ కళ

చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి చెంత విరివిల్లు విరిసింది. మహిళా లోకం పులకించింది. దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వద్ద బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ఒకవైపు చిరుజల్లులు కురుస్తున్నా లెక్కచేయకుండా మహిళలు బతుకమ్మ ఆడారు. సంబరాలకు బీజేపీ ఎంపీ డీకే అరుణ, మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు వానంతి శ్రీనివాసన్, రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు హాజరయ్యారు.

– చార్మినార్





టపాసుల అక్రమ నిల్వలపై డేగకన్ను

- నగర వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ నిఘా
- ఫీల్‌ఖానాలో వ్యాపారి పట్టివేత
- రూ.15 లక్షల విలువైన టపాసుల స్వాధీనం



సాక్షి, సిటీబ్యూరో: దసరా, దీపావళి పండగలు సమీపిస్తున్న నేపథ్యంలో నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు అప్రమత్తమయ్యారు. టపాసుల అక్రమ నిల్వలు, వాటిని విక్రయించే వారిపై డేగకన్ను వేశారు. శుక్రవారం ఫీల్‌ఖానాలో అక్రమంగా టపాసులు నిల్వ ఉంచిన వ్యాపారిని మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర తెలిపారు. షాహినాయత్‌గంజ్ ప్రాంతానికి చెందిన శ్యామ్ యాదవ్ ఫీల్‌ఖానా కేంద్రంగా సీజనల్ వ్యాపారాలు చేస్తుంటాడు. శ్యామ్ ప్రస్తుతం పెద్ద ఎత్తున టపాసులకు అక్రమంగా తీసుకువచ్చి, జనావాసాల మధ్య నిలువ చేశాడు. దీనికి సంబంధించి ఇతడికి ఎలాంటి అనుమతులు లేవు. శ్యామ్ వ్యవహారంపై సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రామకృష్ణకు సమాచారం అందింది. ఆయన నేతృత్వంలో ఎస్సై డి.శ్రీకాంత్ గౌడ్ నేతృత్వంలోని బృందం శుక్రవారం దాడి చేసి పట్టుకుంది. అతడి నుంచి రూ.15 లక్షల విలువైన టపాసులు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం బేగంబజార్ పోలీసులకు అప్పగించింది.

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

సాక్షి, రంగారెడ్డిజిల్లా: డీఎస్సీ–2024 నందు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శనివారంతో ముగియనుంది. ఎల్బీనగర్‌లోని బహదూర్‌గూడ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతుంది. అభ్యర్థులు తమ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్ల జిరాక్స్ ప్రతులతో హాజరు కావాల్సి ఉంది. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు ఒక ప్రకటనలో సూచించారు.

మనకూ కావాలి | ఆ 'కిల్లర్స్'

నగరంలో రాంగ్ రూట్, నో ఎంట్రీ ఇబ్బందులు

- అడ్డదిడ్డంగా దూసుకొస్తున్న వాహనాలు
- ప్రమాదాలతో పాటు ట్రాఫిక్ అవస్థలు
- స్పైక్స్ ఏర్పాటు చేస్తున్న మహారాష్ట్రలోని రాణె అధికారులు
- ఫలితాల అధ్యయనం తర్వాత పరిశీలించాలి: నిపుణులు



థానేలోని మ్యానువల్ స్పైక్ సిస్టమ్



ముంబైలో..

రాంగ్ రూట్: నగరంలోని ఎల్బీనగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం సమీపంలో రాంగ్ రూట్‌లో వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ ఉన్న చార్మినార్ ఎక్సైజ్ ఠాణా ఇన్‌స్పెక్టర్ మహ్మద్ సాదిక్ అలీ మృతి చెందాడు. ఆయన స్నేహితుడు నారాయణగూడ ఎక్సైజ్ ఠాణా ఎస్సై ఖాజీవలీ మోహినుద్దీన్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన ఈ ఏడాది ఫిబ్రవరి 14న జరిగింది.

నో ఎంట్రీ: ఓయూ పోలీసుస్టేషన్ పరిధిలోని హబ్సిగూడ ప్రాంతంలో లారీ, టస్కర్లు ఇద్దరు చిన్నారులను బలిగొన్నాయి. కేవలం 13 రోజుల వ్యవధిలో ఈ ప్రమాదాలు జరిగాయి. జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో ఆరో తరగతి చదివే శ్రీకామేశ్వరి (10) స్కూలు ముగిసిన తర్వాత తన తల్లి సంతోషితో కలిసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తోంది. గత నెల 17న వెనుక వైపు నుంచి ఢీ కొట్టిన లారీ కామేశ్వరిని బలిగొంది. గౌతమ్ మోడల్ స్కూల్లో పదో తరగతి చదివే సాత్విక (16) గత నెల 29న ఆటోలో వెళ్తూ.. వెనుక నుంచి ఢీ కొట్టిన టస్కర్‌కు బలైంది. ఈ ప్రమాదాలకు కారణమైన ఈ రెండు వాహనాలూ అనుమతి లేని సమయాల్లోనే (నో ఎంట్రీ) నగరంలోకి ఎంటర్ అయినవే.

కేవలం ఈ మూడు ఉదంతాలే కాదు.. రాంగ్‌రూట్, నో ఎంట్రీ ఉల్లంఘనల కారణంగా ప్రతి ఏడాది నగరంలో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయి. కేవలం ప్రాణనష్టం ఉన్న, సంచలనాత్మకమైనవి మాత్రమే రికార్డుల్లోకి ఎక్కుతున్నాయి. ఈ ఇబ్బంది కేవలం ఇక్కడ మాత్రమే కాదు.. దేశంలోని అన్ని మెట్రోలనూ వేధిస్తోంది. దీనికి పరిష్కారంగా మహారాష్ట్రంలోని ముంబై, థానె, రాణె సహా అనేక మున్సిపల్ కార్పొరేషన్లు స్పైక్ స్పీడ్ బ్రేకర్లను పరిచయం చేశాయి. 2023 నుంచి అమలులో ఉన్న ఈ స్పైక్స్‌ను కిల్లర్ స్పైక్స్‌గా పిలుస్తున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

నగరంలో నానాటికీ పెరుగుదల..

ఆయా రహదారుల్లో ఉన్న పరిస్థితులు, ట్రాఫిక్ రద్దీ, వాహనాల రాకపోకలు తదితరాలను పరిగణనలోకి తీసుకునే ట్రాఫిక్ పోలీసులు రాజధానిలోని కొన్ని మార్గాలను వన్‌వేగా మారుస్తారు. రోడ్డు ప్రమాదాలతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించడానికి వాణిజ్య, భారీ వాహనాల ప్రవేశానికి వేళలు నిర్ధారిస్తూ ఉంటారు. వీటికి సంబంధించి నిబంధనలు ఉన్నప్పటికీ.. అమలు చేయడానికి, అడ్డుకోవడానికి మాత్రం సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేదు. ఈ కారణంగా కేవలం ఈ–చలాన్ జారీ చేయడం మినహా మరే ఇతర కఠిన చర్యలు తీసుకోలేకపోతున్నారు. దీంతో ఉల్లంఘనుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. రాంగ్ సైడ్ డ్రైవింగ్ కేసుల్నే తీసుకుంటే 2022 కంటే 2023లో 52.4 శాతం అధికంగా నమోదయ్యాయి. 2022లో 2,77,422 కేసులు నమోదు కాగా.. గత ఏడాది ఈ సంఖ్య ఏకంగా 5,23,382కు చేరింది.

మహారాష్ట్రీయుల వినూత్న ఆలోచన..

ఈ రెండు సమస్యలకు పరిష్కారంగా మహారాష్ట్ర మున్సిపల్, ట్రాఫిక్ అధికారులు స్పైక్ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నారు. ముంబై నుంచి మొదలైన వీటి ఏర్పాట్లు అనేక మున్సిపాలిటీలకు విస్తరించింది. లోహంతో తయారు చేసే ఈ స్పీడ్ బ్రేకర్లకు మధ్యలో ఓ దిశలో పైకి లేచి ఉండే స్పైక్స్ ఉంటాయి. ఆ మార్గాన్ని బట్టి వీటిని ఫిట్ చేస్తూ ఉంటారు. దాని పై నుంచి వెళ్లే వాహనం సవ్యదిశలో ఉంటే.. టైరు ఎక్కిన వెంటనే ఆ స్పైక్స్ లోపలకు వెళ్లిపోతాయి. వ్యతిరేక దిశలో వాహనం వస్తే మాత్రం స్పైక్స్ దాని టైరులోకి చొచ్చుకుపోయి ఛిద్రం చేస్తాయి. రాంగ్ రూట్ వాహనాలకు చెక్ చెప్పడానికి ఇవి ఉపకరిస్తున్నాయి. కొన్ని స్పైక్ స్పీడ్ బ్రేకర్లను ఆటోమేటిక్ విధానంలో ఏర్పాటు చేస్తున్నారు. వీటి సమీపంలో ఉండే సీసీ కెమెరాలను కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను అనుసంధానిస్తున్నారు. అనుమతి లేని సమయాల్లో వచ్చే భారీ వాహనాలను ఈ కెమెరాల ద్వారా ట్రాఫిక్ సిబ్బంది గుర్తిస్తారు. ఆపై కంట్రోల్ రూమ్ నుంచే స్పైక్స్‌ను ఆపరేట్ చేసి పైకి వచ్చేలా చేస్తారు.

అనేక అంశాలు అధ్యయనం చేయాలి..

నగరంలోని పరిస్థితులు, ఇతర కారణాల నేపథ్యంలో ఉల్లంఘనులకు చెక్ చెప్పడానికి స్పైక్ స్పీడ్ బ్రేకర్స్/బారియర్స్‌ను ఇక్కడా వాడొచ్చు. మహారాష్ట్రలోని వివిధ నగరాల్లో దాదాపు ఏడాదిన్నరగా వీటిని వినియోగిస్తున్నారు. వాటి పనితీరుతో పాటు ఇప్పటి వరకు ఏవైనా అపశ్రుతులు చోటుచేసుకున్నాయా? ఏవైనా ప్రమాదాలు జరిగాయా? వాటిని అక్కడి అధికారులు ఎలా అధిగమించారు? ఇలాంటి అనేక అంశాలను అధ్యయనం చేయాలి. ఆపై నగరంలోని పరిస్థితులతో అన్వయించి వీటి ఏర్పాటుపై నిర్ణయం తీసుకోవాలి.

– వరప్రసాద్, రవాణా రంగ నిపుణుడు

సిగ్నల్ ఫ్రీకి ఓకే

కేబీఆర్ పార్కు చుట్టూ త్వరలో పనులు

- 6 జంక్షన్ల వద్ద ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు
- రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులు.. జీఓ జారీ

సాక్షి, సిటీబ్యూరో: కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న ఆరు జంక్షన్ల వద్ద సిగ్నల్ ఫ్రీ ప్రయాణాలకు ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల కోసం ఇటీవల పచ్చజెండా ఊపిన ప్రభుత్వం.. పనులు చేపట్టేందుకు టెండర్లు పిలవాల్సిందిగా జీహెచ్‌ఎంసీకి సూచించింది. ఇందుకు అవసరమైన నిధుల్ని రాష్ట్ర బడ్జెట్ (2024–25) నుంచే విడుదల చేయనున్నట్లు స్పష్టం చేసింది. ఈమేరకు ఆర్థికశాఖ అనుమతించింది. హైసిటీ ప్రాజెక్టు కింద బడ్జెట్‌లో కేటాయించిన నిధుల నుంచి వీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొంది. కేబీఆర్ పార్కు చుట్టూ పనుల కోసం రెండు ప్యాకేజీలుగా పనులు చేపట్టేందుకు రూ.826 కోట్లు ఇటీవల మంజూరైన విషయం విదితమే. పనుల్లో జాప్యం లేకుండా చేపట్టేందుకు ఈపీసీ పద్ధతిలో టెండర్లు పిలవడంతో పాటు అవసరమైన భూసేకరణ సైతం సమాంతరంగా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. పనుల పర్యవేక్షణకు ప్రాజెక్ట్ మానిటరింగ్ కమిటీని నియమించుకోవాల్సిందిగా పేర్కొంది. ఈమేరకు మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దానకిశోర్ శుక్రవారం ఉత్తర్వు జారీ చేశారు. ఈ నేపథ్యంలో గతంలో ఎస్సార్‌డీపీ కింద రోడ్డు నంబర్ 45 వద్ద ఫస్ట్ లెవెల్ ఫ్లై ఓవర్, జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ జంక్షన్ వద్ద రెండో లెవెల్ ఫ్లై ఓవర్ల పనులకు జారీ చేసిన రూ.586 కోట్ల పరిపాలన అనుమతులు ఉపసంహరించుకుంది.

ఒకటో ప్యాకేజీలో రూ.421 కోట్లతో చేపట్టనున్న పనులు..

- అండర్‌పాస్ రోడ్డు నంబర్ 45 నుంచి కేబీఆర్ పార్కు, యూసుఫ్‌గూడ వరకు అండర్‌పాస్.
- కేబీఆర్ పార్కు ఎంట్రన్స్ జంక్షన్ నుంచి రోడ్డు నంబర్ 36 వైపు 4లేన్ల ఫ్లై ఓవర్.
- యూసుఫ్‌గూడ వైపు నుంచి రోడ్ నంబర్ 45 జంక్షన్ వైపు 2 లేన్ల ఫ్లై ఓవర్.
- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు నుంచి కేన్సర్ హాస్పిటల్ జంక్షన్ వైపు 2 లేన్ల అండర్‌పాస్.
- పంజగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు 3లేన్ల ఫ్లై ఓవర్.
- కేబీఆర్ ఎంట్రన్స్ జంక్షన్ నుంచి పంజగుట్ట వైపు 3 లేన్ల అండర్‌పాస్.

రెండో ప్యాకేజీలో రూ.405 కోట్లతో..

- ఫిల్మ్‌నగర్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు 2 లేన్ల అండర్‌పాస్.
- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి రోడ్డు నంబర్45 వైపు 2 లేన్ల ఫ్లై ఓవర్.
- మహారాజా అగ్రసేన్ జంక్షన్ నుంచి రోడ్డు నంబర్ 45 జంక్షన్ వైపు 2 లేన్ల అండర్‌పాస్.
- ఫిల్మ్‌నగర్ జంక్షన్ నుంచి మహారాజా అగ్రసేన్ జంక్షన్ వైపు 2 లేన్ల ఫ్లై ఓవర్.
- కేన్సర్ హాస్పిటల్ జంక్షన్ నుంచి ఫిల్మ్‌నగర్ జంక్షన్ వైపు 2 లేన్ల అండర్‌పాస్.
- ఫిల్మ్‌నగర్ జంక్షన్ నుంచి రోడ్డు నంబర్ 12 వైపు 2 లేన్ల ఫ్లై ఓవర్.
- కేబీఆర్ పార్కు నుంచి మహారాజా అగ్రసేన్ జంక్షన్ వైపు 2 లేన్ల అండర్‌పాస్.
- మహారాజా అగ్రసేన్ జంక్షన్ నుంచి రోడ్డు నంబర్ 10 వైపు 2 లేన్ల ఫ్లై ఓవర్.



ఫిల్మ్‌నగర్ జంక్షన్ వద్ద ప్రతిపాదిత ఫ్లై ఓవర్, అండర్‌పాస్



కేబీఆర్ పార్కు చుట్టూ ఇలా..

సీఎం ఇంటి ఎదుట సాష్టాంగ నమస్కారం

- మాదిగల ఉద్యోగాలను కబ్జా చేస్తున్నారు
- ఉపవర్గీకరణ చేసి ఎస్సీల ఉద్యోగాలు భర్తీ చేయాలి
- టీఎండీ నాయకుల డిమాండ్

బంజారాహిల్స్: ఎస్సీ రిజర్వేషన్‌ను ఉపవర్గీకరణ చేసి ఎస్సీలకు కేటాయించిన ఉద్యోగాలు భర్తీ చేయండంటూ జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ఎదుట సాష్టాంగ నమస్కారం దండోరా కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ అధికార ప్రతినిధి, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ మాదిగ దండోరా(టీఎండీ) నాయకులు దేవని సతీష్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నేతలు సాష్టాంగ నమస్కారం చేసి సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 9న ఎల్బీ స్టేడియంలో జరిగే డీఎస్సీ టీచర్ ఉద్యోగాల నియామకంలో ఎస్సీల వాటా 15 శాతం కేటాయించాలన్నారు. చెరువులు, కుంటలు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూములను కాపాడేందుకు హైడ్రా పెట్టి కాపాడినట్లే మాదిగలకు వచ్చే ఉద్యోగాలను కబ్జా చేస్తున్న వారి నుంచి కాపాడాలన్నారు. ఎస్సీ వర్గీకరణ మీద సుప్రీంకోర్టు ఇచ్చిన తర్వాత కూడా న్యాయపరమైన చిక్కులు ఎలా వస్తాయని ప్రశ్నించారు.

మిమ్మల్ని అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. నిజంగానే న్యాయపరమైన చిక్కులు ఉంటే వాటిని సరిజేసి ఎస్సీ రిజర్వేషన్ ఉప వర్గీకరణ చేసి ఎస్సీ ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. సీఎం రాష్ట్రానికి తండ్రి లాంటి వారని, మాదగల హక్కులను కాపాడాలంటూ విజ్ఞప్తి చేశారు. శనివారం సెక్రటేరియట్ ఎదుట సాష్టాంగ నమస్కారం దండోరా జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో టీఎండీ రాష్ట్ర అధ్యక్షుడు శ్యాంసుందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మోజెస్ మాదిగ, ప్రకాష్, ప్రసన్న, చెన్నయ్య, శివ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం ఇంటి వద్ద సాష్టాంగ నమస్కారం చేస్తున్న టీఎండీ నాయకులు

గార్బేజ్ ఫ్రీ సిటీ కోసం కృషి చేయాలి

అధికారులకు ఆమ్రపాలి ఆదేశం

సాక్షి, సిటీబ్యూరో: నగరాన్ని గార్బేజ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. శుక్రవారం అడిషనల్, జోనల్ కమిషనర్లతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. గతంలో శానిటేషన్ మెరుగు పడేందుకు తీసుకున్న చర్యలు, ప్రస్తుతం తీసుకోవాల్సిన చర్యలపై ఫోకస్ చేయాలన్నారు. అవసరమైతే జోనల్ కమిషనర్లు, ఘనవ్యర్థాల నిర్వహణ విభాగం ఇంజినీర్లతో చర్చించి తుది నివేదికను రెండు రోజుల్లో అందజేయాలని శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్‌ను ఆదేశించారు. మార్కెట్లలో వ్యర్థాలను ఒకే చోట వేసే విధంగా డస్ట్ బిన్‌లను, వాణిజ్య మార్గాల్లో లిట్టర్ బిన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. స్వచ్ఛ ఆటోలకు జీపీఎస్ ఉపకరణాలు అమర్చినందున రూట్ మ్యాప్ కనుగుణంగా ఇంటింటి చెత్తను పూర్తి స్థాయిలో సేకరించేలా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. గార్బేజ్ ఫ్రీ సిటీగా నగరాన్ని తీర్చిదిద్దాలని సూచించారు.

వన్ స్టేట్.. వన్ కార్డు

కుటుంబానికంతటికీ ఒకే ఐడీ నంబర్

- సభ్యులకు వేర్వేరుగా సంఖ్యలు
- నగరంలోని 24 నియోజకవర్గాల్లో.. డిజిటల్ ఫ్యామిలీ కార్డుల జారీకి పైలట్ సర్వే

సాక్షి, సిటీబ్యూరో: ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్టులో భాగంగా గ్రేటర్ నగరంలోని 24 నియోజకవర్గాల్లోని ఒక్కో కాలనీలోనూ సర్వే జరుగుతోంది. ఇంతకీ ఈ డిజిటల్ ఫ్యామిలీ కార్డు కోసం జరుపుతున్న సర్వేలో ఏమేం సేకరిస్తారు? దీని వల్ల ప్రయోజనమేమిటి? తదితర అంశాలు ఇలా ఉన్నాయి.. ప్రస్తుతం వ్యక్తిగత గుర్తింపుగా ఎక్కడైనా ఆధార్‌ను అంగీకరిస్తున్నారు. కానీ ఒక కుటుంబాన్ని గుర్తించేందుకు ఎలాంటి కార్డులు లేవు. ఈ ఫ్యామిలీ కార్డుల ద్వారా కుటుంబాన్ని గుర్తించవచ్చు. అంటే రాష్ట్రంలో ఒక కుటుంబాన్ని గుర్తించేందుకు 'వన్ స్టేట్– వన్ కార్డ్'గా ఈ కార్డు ఉపకరిస్తుంది. కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే ఇలాంటి కార్డులున్నాయి. రాజస్థాన్‌లో జన్ ఆధార్ స్కీమ్ కింద 10 అంకెలతో కూడిన ఫ్యామిలీ ఐడీలు, 11 అంకెలతో కూడిన వ్యక్తిగత ఐడీలు ఇచ్చారు. హరియాణాలో పరివార్ పెహచాన్ పాత్ర (పీపీపీ) కింద 8 అంకెలతో కూడిన ఫ్యామిలీ ఐడీ కార్డులిచ్చారు. కర్ణాటకలో 12 అంకెలతో కూడిన 'కుటుంబ' ఐడీలను జారీ చేశారు. ఉత్తరప్రదేశ్‌లో 12 అంకెలతో కూడిన డిజిట్ ఫ్యామిలీ కార్డును వినియోగిస్తున్నారు. అక్కడ రేషన్ కార్డుగా దాన్నే వినియోగిస్తున్నారు.

వ్యక్తిగత ఐడీలు..

తెలంగాణలో కుటుంబాన్ని ఒక యూనిట్‌గా గుర్తించేందుకు ఫ్యామిలీకార్డు ఉపకరిస్తుంది. కుటుంబంలోని అందరికీ ఒకే ఐడీ నంబర్ ఉండటంతో పాటు కుటుంబ సభ్యులకు వ్యక్తిగతంగా వేర్వేరు ఐడీలిస్తారు. కుటుంబాల ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా దేశంలోని అందరికీ ఆధార్ కార్డులిచ్చినట్లే రాష్ట్రంలోని అందరికీ ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డులిస్తారు. కుటుంబంలోని మహిళల్లో పెద్ద వారిని కుటుంబ పెద్ద(హెడ్ ఆఫ్ ది ఫ్యామిలీ)గా గుర్తిస్తారు. వ్యక్తిగత ఐడీలు జారీ అయ్యాక మారవు. శాశ్వతంగా అవే ఉంటాయి. కుటుంబంలోని కుమారుల పెళ్లిళ్లు జరిగి కోడళ్లు వస్తే కుటుంబంలో కొత్త సభ్యులుగా చేర్చేందుకు, మరణించిన వారిని తొలగించేందుకు వీలుంటుంది. అంతేకాకుండా ఉమ్మడి కుటుంబం చిన్న కుటుంబాలుగా విడిపోతే కొత్త కుటుంబంగా అప్‌డేట్ చేసే అవకాశం ఉంటుంది. సాధ్యమైనంత వరకు కుటుంబం మొత్తం కలిసి ఉన్న ఫొటో తీసుకుంటారు. నగరంలో 8వ తేదీ వరకు సర్వే జరిపి, 9న స్క్రూటినీ చేసి 10వ తేదీన ప్రభుత్వానికి నివేదిక పంపనున్నారు.

ఒకే చోట అన్ని వివరాలు..

ప్రస్తుతం ఒక కుటుంబంలోని వారు వివిధ పథకాల కింద వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్నప్పటికీ ఆ వివరాలు ఒకే చోట లేవు. ఈ డిజిటల్ కార్డులు వచ్చాక అన్ని వివరాలు ఒక్క మౌజ్ క్లిక్‌తో తెలియనున్నాయి. ప్రభుత్వానికి చెందిన 30 శాఖల సమాచారం సంబంధిత శాఖల ఉంది తప్ప ఒకదానికొకటి అనుసంధానంగా లేవు. కొత్త కార్డుల వల్ల ప్రజలకెదురవుతున్న ఇబ్బందులు తప్పుతాయని, ఈ కార్డుల పైలట్ ప్రాజెక్ట్ పనుల ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రేషన్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, సీఎం రిలీఫ్‌ఫండ్‌తో సహా ఒక కుటుంబం ఏ పథకాలు వినియోగించుకుంటుందో తెలుస్తుందన్నారు. అంతేకాదు.. హెల్త్ ప్రొఫైల్‌లో భాగంగా గతంలో చేయించుకున్న ఆరోగ్యపరీక్షల వంటి వివరాలు కూడా ఉండటం వల్ల మరోసారి ఆరోగ్య పరీక్షల కోసం ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదు.



నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆదాయం

◆ ఆరు నెలల్లో రూ.1436 కోట్లు.. ◆ 45 శాతం ఆర్జించిన ఆర్టీఏ



సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉపరవాణా కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్

సాక్షి, సిటీబ్యూరో: వాహనాలపై విధించే జీవితకాల, త్రైమాసిక తదితర పన్నుల ద్వారా ఉమ్మడి రంగారెడ్డి పరిధిలో ఇప్పటి వరకు రూ.1436 కోట్ల ఆదాయాన్ని ఆర్జించినట్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉపరవాణా కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. ఈ ఏడాది రాష్ట్ర వార్షిక ఆదాయ లక్ష్యం రూ.3195 కోట్లు కాగా, ఇందులో 45 శాతం వరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచే సాధించినట్లు చెప్పారు. శుక్రవారం మణికొండలోని ఉపరవాణా కమిషనర్ కార్యాలయంలో రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలకు చెందిన రవాణా అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల్లో ఇప్పటి వరకు సాధించిన ఆదాయం వివరాలను ఆయన వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా రూ.802 కోట్లు, మేడ్చల్–రూ.595 కోట్లు, వికారాబాద్ రూ.39 కోట్ల చొప్పున ఆదాయాన్ని ఆర్జించినట్లు పేర్కొన్నారు. త్రైమాసిక పన్నుల ద్వారా రూ. 161 కోట్లు, జీవిత కాల పన్నుల ద్వారా రూ.1120 కోట్లు, ఫీజుల ద్వారా రూ.92 కోట్లు సర్వీస్ ఛార్జీల ద్వారా రూ.21 కోట్లు, గ్రీన్ టాక్స్ ద్వారా రూ.10 కోట్లు, తనిఖీల ద్వారా రూ.32 కోట్ల ఆదాయం లభించిందన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అర్ధ వార్షిక ఆదాయ లక్ష్యం రూ.1792 కోట్లు కాగా, ప్రస్తుతం రూ.1436 కోట్లతో 80 శాతం లక్ష్యాన్ని చేరుకున్నట్లు సంతృప్తి వ్యక్తం చేశారు. వార్షిక ఆదాయ లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనదారులు సకాలంలో చెల్లించాలని సూచించారు. తాము నిర్వహించే తనిఖీల్లో పట్టుబడితే భారీ జరిమానా విధించవలసి వస్తుందని హెచ్చరించారు. సమీక్షా సమావేశంలో వివిధ జిల్లాల రవాణా అధికారులు సుభాష్ చందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కిరణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సుశీల్ రెడ్డి, నవీన్, వాసు, కృష్ణవేణి, మున్ని, అనూష, ఉపాసిని తదితరులు పాల్గొన్నారు.

చోరీ కోసం మహారాష్ట్ర టు హైదరాబాద్

- తన వెంటే స్నేహితులనూ తీసుకొచ్చిన రోషన్ కదమ్
- పాట్ మార్కెట్‌లోని జ్యువెలరీ కార్ఖానాలో పనికి చేరిక
- నాలుగో రోజే రూ.30 లక్షల నగదుతో అంతా పరారీ
- 24 గంటల్లో కేసును ఛేదించిన నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్



సాక్షి, సిటీబ్యూరో: మహారాష్ట్రకు చెందిన రోషన్ కదమ్..జ్యువెలరీ కార్ఖానాలను టార్గెట్‌గా చేసుకుని నగరానికి చేరుకున్నాడు. తన వెంట ముగ్గురు స్నేహితులు, ఓ కారును తెచ్చుకుని సికింద్రాబాద్‌లోని లాడ్జిలో బస చేశాడు. ఓ సంస్థలో ఉద్యోగంలో చేరిన నాలుగో రోజే రూ.30 లక్షలు తీసుకుని స్నేహితులతో కలిసి ఉడాయించాడు. దీనిపై సమాచారం అందుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు 24 గంటల్లో పట్టుకున్నట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర శుక్రవారం వెల్లడించారు. సతారా జిల్లాకు చెందిన రోషన్‌కు నగరం కేంద్రంగా జరిగే పసిడి వ్యాపారంపై అవగాహన ఉంది. ఇక్కడి పసిడి కార్ఖానాల యజమానులు తక్కువ జీతానికి పని చేసే ఉద్యోగుల కోసం ఇతర రాష్ట్రాలపై ఆధారపడతారని గ్రహించాడు. దీంతో ఓ కార్ఖానాను దోచుకోవాలనే పథకాన్ని తన స్నేహితులు ముజామిల్, పృథ్వీరాజ్, ప్రసాద్‌లకు చెప్పాడు. వాళ్లూ అంగీకరించడంతో అంతా కలిసి కారులో గత నెల 28న నగరానికి చేరుకుని సికింద్రాబాద్‌లోని ఓ లాడ్జిలో బస చేశారు. గత నెల 30వ తేదీన రోషన్ పాట్ మార్కెట్‌లోని పసిడి కార్ఖానాలో చేరాడు. గురువారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఈ సంస్థ యజమానితో కలిసి 400 గ్రాముల బంగారు ఆభరణాలను సమీపంలోని ఎస్ఎం జ్యువెలర్స్‌లో ఇచ్చి, నగదు తీసుకురావడానికి వెళ్లాడు. తాము అలా వెళ్తున్న విషయం ఫోన్ ద్వారా స్నేహితులకు చెప్పి కారులో సహా ఆ సమీప ప్రాంతానికి రమ్మని చెప్పాడు. బంగారు ఆభరణాలు ఇచ్చి, రూ.30 లక్షల నగదు తీసుకుని ఓ బ్యాగ్‌లో పెట్టుకున్నారు. కార్ఖానా యజమాని ముందు నడుస్తుండగా..రోషన్ నగదు బ్యాగ్‌తో కాస్త వెనుక వస్తున్నాడు. అదును చూసుకుని యజమాని కళ్లుగప్పి తమ కారులో ఎక్కి మిగిలిన ముగ్గురితో కలిసి ఉడాయించాడు. బెంగళూరు పారిపోయిన తర్వాత నగదు పంచుకుందామని, ఆపై ఎవరి దారిన వాళ్లు వెళ్దామని ఈ నలుగురూ భావించారు. పసిడి కార్ఖానా యజమాని ఫిర్యాదుతో మార్కెట్ ఠాణాలో కేసు నమోదైంది. ఈ నేరంపై సమాచారం అందుకున్న ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. ఇన్‌స్పెక్టర్ కె.సైదులు నేతృత్వంలో ఎస్సైలు పి.గగన్‌దీప్, శ్రీనివాసులు దాసు సాంకేతిక ఆధారాలతో పాటు ఇతర అంశాలను బట్టి దర్యాప్తు చేశారు. 24 గంటల్లోనే నలుగురు నిందితుల్లో రోషన్, ముజామిల్‌లను పట్టుకున్నారు. వీరి నుంచి రూ.29.92 లక్షల నగదు, కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితులను మార్కెట్ పోలీసులకు అప్పగించిన టాస్క్‌ఫోర్స్... పరారీలో ఉన్న మిగిలిన ఇద్దరి కోసం గాలిస్తోంది.

హైటెక్ సిటీ ట్రాఫిక్ కష్టాలపై నజర్

◆ వివిధ శాఖల అధికారులతో జలమండలి ఎండీ పర్యటన
◆ తీసుకోవాల్సిన చర్యలపై కసరత్తు



సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్, హైటెక్ సిటీ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం జలమండలి, జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖలు సంయుక్త కార్యాచరణకు సిద్ధమయ్యాయి. మూడు శాఖల సమన్వయంతో ట్రైడెంట్ హోటల్ నుంచి యశోదా ఆసుపత్రి వరకు ఉన్న ఐదు కిలోమీటర్ల వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యాయి. శుక్రవారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, సైబరాబాద్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి కలిసి పర్యటించారు. లెమన్ ట్రీ హోటల్ నుంచి ట్రైడెంట్ హోటల్ వరకు రోడ్డు విస్తరణ నేపథ్యంలో..అక్కడున్న ఎయిర్ వాల్వ్‌లను సమీపానికి తరలించడానికి జాయింట్ సీపీతో చర్చించారు. అవి తరలిస్తే.. రోడ్డు విస్తరణ పనులు చేపడతామని జాయింట్ సీపీ పేర్కొనడంతో ఎలాంటి ఇబ్బందులు కాకుండా తరలింపు ప్రక్రియను చేపడతామని ఎండీ భరోసా కల్పించారు.

క్షేత్ర స్థాయిలో పనుల పరిశీలన..

మాదాపూర్ యశోదా ఆసుపత్రి వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో ధ్వంసమైన సీవరేజ్ పైపులైన్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పరిశీలించారు. వాటిని సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. ఒక్కసారి ఇక్కడి పనులు పూర్తయితే..మాదాపూర్, మైండ్ స్పేస్, హైటెక్ సిటీ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇక్కట్లు కొంత వరకు తొలగిపోతాయి. తర్వాత వారు పర్వతా నగర్ లో పర్యటించారు. పర్వత నగర్ చౌరస్తా దగ్గర రోడ్డుకు ఇరువైపులా ఉన్న రెండు మ్యాన్ హోళ్ల నుంచి మురుగు పొంగడం, ప్రతిరోజూ ఒక ఎయిర్‌టెక్ మిషన్..ఆ సమస్యను పరిష్కరించడానికి పనిచేయడం, ట్రాఫిక్ మళ్లింపు కోసం ఓ కానిస్టేబుల్ విధులు నిర్వర్తించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నిత్యం ఈ ప్రాంతాన్ని

కొత్త సీవరేజ్ లైన్

రహదారిపై మురుగు పొంగి సీవరేజ్ ఫిర్యాదులు రావడంతో.. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు పర్వత నగర్ సిగ్నల్ నుంచి రోడ్ నంబర్.45 వరకు కొత్త సీవరేజ్ పైపు లైన్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు సంబంధిత ప్రతిపాదనల్ని సిద్ధం చేయాలని ఎండీ సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్–2 స్వామి, జీఎం, మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

చౌరస్తా నుంచి సున్నం చెరువు వరకు పర్యటించి.. అక్కడున్న ఔట్ లెట్ ను ప్రైవేట్ వ్యక్తులు ధ్వంసం చేసినట్లు గుర్తించారు.

ఆర్గానిక్ కెమిస్ట్రీలో లింగయ్యకు డాక్టరేట్



సాక్షి, సిటీబ్యూరో: నిరుపేద కుటుంబానికి చెందిన బొంత లింగయ్య ఉస్మానియా వర్సిటీ ఫార్మర్ వీసీ ప్రొఫెసర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆర్గానిక్ కెమిస్ట్రీలో డాక్టరేట్ సాధించాడు. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం ఏపూరు గ్రామానికి చెందిన ఆయన సీఎస్ఐఆర్‌లో ఆలిండియా 63వ ర్యాంకు సాధించాడు. శుక్రవారం యూనివర్సిటీలో నిర్వహించిన వైవాలో 'సింథసిస్ ఆఫ్ యాంటీ క్యాన్సర్ యాక్టివిటీ ఆఫ్ డ్రగ్స్'పై పరిశోధనా ప్రతాలు సమర్పించినందుకు గానూ లింగయ్యకు డాక్టరేట్ అందజేశారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు?

● ఆర్థిక లావాదేవీల నేపథ్యంలోనే ఘటన..
● ఫోన్ డేటా ఆధారంగా చిక్కిన నిందితుడు

బంజారాహిల్స్ : ఆర్ఎంపీ భార్య హత్య కేసులో నిందితుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో హత్య జరిగినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. గత నెల 30న యూసఫ్‌గూడ సమీపంలోని నవోదయ కాలనీలో నివసించే ఆర్ఎంపీ మర్ల ఉమా మహేశ్వర్ రావు భార్య సుధారాణి హత్యకు గురైన విషయం తెలిసిందే. సుధారాణికి కొంత కాలంగా పరిచయం ఉన్న మృతురాలి కుటుంబ సభ్యులకు సంబంధం ఉన్న జావిద్ అనే వ్యక్తితో ఆర్థిక లావాదేవీల వ్యవహారంలో ఇద్దరి మధ్య గొడవ జరుగుతోంది. ఈ వ్యవహారంలో ఇద్దరి మధ్య తేడా రావడంతో జావిద్ ఆమెపై పగ పెంచుకున్నాడు. సుధారాణి ఒంటరిగా ఉన్న సమయంలో ఆమెకు ఫోన్ చేసి నేరుగా ఆమె ఇంటికి వెళ్లాడు. పథకం ప్రకారం హత్య చేసి ఇంట్లోని బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తమ విచారణలో గుర్తించారు. పరారీలో ఉన్న నిందితుడిని ఫోన్ డేటా ఆధారంగా నగరంలో శుక్రవారం పోలీసులకు చిక్కినట్లు సమాచారం. హత్యకు గల కారణాలను లోతుగా విచారిస్తున్నారు. అధికారికంగా పోలీసులు ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు.

డిజిటలైజేషన్‌తో కోర్టుల పనిభారం తగ్గుతుంది

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే,

సిటీ కోర్టులు: నాంపల్లి కోర్టులో డిజిటలైజేషన్ సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిజిటలైజేషన్ సెంటర్‌ను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు. దీని ద్వారా కోర్టులకు పనిభారం కూడా తగ్గుతుందని తెలిపారు. నాంపల్లి సెషన్స్ కోర్టు జడ్జి బి.సురేశ్, నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రాజావర్ధన్ రెడ్డి మాట్లాడుతూ..డిజిటలైజేషన్ సెంటర్ ముఖ్య ఉద్దేశం..పాత ఫైల్స్ పాడవకుండా అప్‌లోడ్ చేసి పరిరక్షించడమే అన్నారు. దీని ద్వారా ప్రతి ఫైల్ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండే అవకాశం ఉంటుందన్నారు.



డిజిటలైజేషన్ సెంటర్‌లో హైకోర్టు సీజే అలోక్ అరాధే తదితరులు

యూత్ లిటరరీ ఫెస్ట్ అభినందనీయం



యూత్ లిటరరీ ఫెస్ట్‌లో మాట్లాడుతున్న మామిడి హరికృష్ణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: యువత సృజనాత్మకతకు యూత్ లిటరరీ ఫెస్ట్ పెద్దపీట వేసిందని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితి, డీవైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో యూత్ లిటరరీ ఫెస్ట్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. కొత్త రచయితలను తయారు చేయడమే లక్ష్యంగా యూత్ ఫెస్ట్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందచారి మాట్లాడుతూ.. యువత రచనలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు కొత్త రచనలకు బాటలు వేయాలని సూచించారు. తెలంగాణ సాహితీ ఉపాధ్యక్షులు అనంతోజు మోహన కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి పానగంటి వెంకటేష్, ప్రముఖ రచయిత్రి నస్రీన్‌ఖాన్, డీవైఎఫ్ఐ అధ్యక్షులు కోట రమేష్, నగర కార్యదర్శి ఎండీ జావేద్, తంగిరాల చక్రవర్తి, సలీమా, రేఖ, శరత్‌చంద్ర పాల్గొన్నారు.

సంబరంగా బతుకమ్మ వేడుకలు







తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్ర భారతిలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పసుమతి పరకాల బృందం ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఖాళీ–భద్రకాళీ నృత్యరూపకం అలరించింది. అదేవిధంగా బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు మణిమంజరి ఆధ్వర్యంలో సాగిన బతుకమ్మ సంబరాలలో మహిళలు సందడి చేశారు. – గన్‌ఫౌండ్రీ

ఈ వాహనాలు ఎవరివి?

పోలీసు ఆధీనంలో 1212 వెహికిల్స్

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు ఆధీనంలో ఉన్నో 1212 వాహనాల యజమానులు ఎవరైనా ఉంటే సంప్రదించి, క్లెయిమ్ చేసుకోవాలని కొత్వాల్ సీవీ ఆనంద్ శుక్రవారం కోరారు. వివిధ పోలీసుస్టేషన్ల పరిధి నుంచి స్వాధీనం చేసుకున్న వీటిలో అన్ని రకాలైనవి ఉన్నట్లు తెలిపారు. వీటి వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. హైదరాబాద్‌పోలీస్. జీఓవీ. ఐఎన్) పొందుపరిచామన్నారు. గోషామహల్ పోలీసుస్టేడియంలోని ఆఫీసులోనూ ఈ వాహనాలను వివరాలు ఉన్నాయని తెలిపారు. నిర్ణీత సమయంలో తర్వాత నిబంధనల ప్రకారం వేలం వేయాలని నిర్ణయించినట్లు తెలిపిన కమిషనర్ అభ్యంతరాలు ఉంటే వెల్లడించాలని కోరారు. యజమానులు, హైపోథికేషన్ చేసుకున్న వాళ్లు బంజారాహిల్స్‌లోని ఐసీసీసీని కమిషనర్ కార్యాలయాన్ని సంప్రదించాలని చెప్పారు.

చంద్రబాబుపై ముందు పోరాడాలి

● మందకృష్ణ గత ఎన్నికల్లో బాబుకే మద్దతిచ్చారు..
● తెలంగాణ మాదిగ సంఘాల జేఏసీ చైర్మన్ పిడమర్తి రవి



సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

పంజగుట్ట: మాదిగ వర్గీకరణ అమలు విషయంలో మందకృష్ణ మాదిగ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కన్నా ముందు ఏపీ సీఎం చంద్రబాబునాయుడుపై ఉద్యమం చేయాలని తెలంగాణ మాదిగ సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో మందకృష్ణ మాదిగలందరూ తెలుగుదేశానికి ఓటు వేయాలని బహిరంగంగా ప్రకటించారని, మాదిగల మద్దతుతోనే కూటమి గెలిచిందని చెప్పారు. అయినా వర్గీకరణపై చంద్రబాబు ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబును ప్రశ్నించాల్సిన మందకృష్ణ మాదిగలమీద ప్రేమతో సుప్రీంకోర్టు తీర్పు రాగానే అరగంటకే స్పందించి తానే మొదట వర్గీకరణ చేస్తానని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన రేవంత్ రెడ్డిని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. నువ్వు గెలిపించిన చంద్రబాబును అడగడం చేతకాదని, ఇప్పటివరకు చంద్రబాబు కనీసం అపాయింట్‌మెంట్ అయినా ఇచ్చాడా అని ప్రశ్నించారు. సమావేశంలో వరప్రసాద్, రాపోలు రాములు, మల్లికార్జున్, నర్సింహారావు, బోరెల్లి సురేష్, బొమ్మర సమ్మన్న, శిరుమర్తి రాజు, నక్క మహేష్, దేవరకొండ నరేష్, జోగు గణేష్, మీసాల మహేష్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్


సాక్షి, సిటీబ్యూరో : విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఇద్దరు టీచర్లు సస్పెన్షన్‌కు గురయ్యారు. బండ్లగూడ–2 మండలం చంద్రికపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ ఉపాధ్యాయులు వి.లాల్, పి.వెంకట్‌రెడ్డిలను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాలు జారీ చేశారు.

నేడు గడ్డిఅన్నారం పాలకవర్గం ప్రమాణస్వీకారం



బాటసింగారంలోని మార్కెట్‌లో సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: గడ్డిఅన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ నూతన పాలకవర్గం శనివారం బాటసింగారంలోని మార్కెట్ ఆవరణలో ప్రమాణస్వీకారం చేయనుంది. మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులు చేయనున్న ప్రమాణస్వీకారోత్సవానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కతో పాటు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి హాజరు కానున్నారు. ఈ మేరకు సభా ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి సీఐ అంజిరెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు.



పండుగ వేళ.. గృహ శోభ!

సాక్షి, హైదరాబాద్‌: పండుగొస్తుందంటే చాలు కొత్త బట్టలు కొనుక్కోవడం ఎలాగైతే ఆనవాయితో.. ఇంటిని అందంగా అలంకరించుకోవడమూ అంతే! విజయ దశమి, దీపావళి ఇలా వరుస పండుగల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఇంటిని అందంగా ముస్తాబు చేసేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. ఇంట్లోని వస్తువులను శుభ్రం చేయడం, రంగులు వేయించడం వంటివి చేస్తుంటారు. అయితే ఇంటి అలంకరణలో అందమైన దీపాలది ప్రత్యేక స్థానమని నిపుణులు చెబుతున్నారు. మార్కెట్‌లో లభ్యమయ్యే రంగురంగుల లైటింగ్స్‌తో గృహ శోభ రెట్టింపవుతుందని సూచిస్తున్నారు.

- సంప్రదాయమైన దీపాంతలు, కొవ్వొత్తులకు కాలం చెల్లింది. వీటి స్థానంలో సిరామిక్ లేదా మార్బుల్ పల్లెంలో మట్టి దీపాంతలను వెలిగించండి. వీటిని హాల్, పూజ గదిలో పెట్టండి. డిస్కౌంట్ ధరల్లో వినూత్న డిజైన్స్ మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. మరింత సృజనాత్మకత కావాలంటే బంగారపు వర్ణం ఉండే ఎలక్ట్రిక్ దీపాంతలు కూడా లభ్యమవుతాయి.
- ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీలు బహుళ రంగుల లైట్లు, పోర్టబుల్ లైట్లు, లాంతర్లు వంటి వినూత్న లైటింగ్ ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకొచ్చాయి. వీటిని స్మార్ట్‌ఫోన్‌తో ఆపరేట్ చేసుకోవచ్చు కూడా. వైర్‌లెస్ ఉత్పత్తులు కావటంతో మొబైల్‌తో మనకు ఎంత కావాలంటే అంత కాంతి స్థాయి, రంగులను ఎంపిక చేసుకోవచ్చు.
- పండుగ సీజన్‌లో ఇంటి ప్రధాన ద్వారం, మెయిన్ ఎంట్రన్స్ లేదా భవనం మీద ఓం, స్వస్తిక్ వంటి చిహ్నాలను పెట్టుకోవచ్చు. ఇవి ఎల్‌ఈడీ లైట్లతో తయారు చేసిన ఉత్పత్తులు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి.
- రంగురంగుల బాటిల్స్‌లో కొవ్వొత్తులను పెట్టి గోడల మూలల్లో లేదా ప్రధాన ద్వారానికి ఇరువైపులా, ఇంటి చుట్టూ వేలాడదీయవచ్చు. దీంతో ఇల్లు రకరకాల వర్ణాల్లో అందంగా దర్శనమిస్తుంటుంది.
- చేతితో తయారు చేసిన మట్టి దీపాంతలు, లాంతర్లు చాలా కామన్. వీటికి బదులుగా అకార్డియన్ పేపర్ లాంతర్లు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. ఇవి పగటి పూట సూర్యరశ్మిని సేకరించి.. రాత్రి సమయాల్లో ప్రకాశిస్తాయి. వీటిని హెవీ డ్యూటీ నైలాన్‌తో తయారు చేస్తారు. ఈ లాంతర్ సెట్‌లు వివిధ డిజైన్స్, రంగుల్లో దొరుకుతాయి.
- ఈ మధ్య కాలంలో నీళ్లలో తేలియాడే కొవ్వొత్తులు బాగా ప్రాచుర్యం పొందాయి. అలంకరణ ప్రాయంగా వీటిని పూల కుండీల్లో, మొక్కలున్న ప్రాంతాల్లో, స్విమ్మింగ్‌పూల్, ఫౌంటేన్ వంటి మీద అమర్చుకోవచ్చు.





మాల్స్ అదుర్స్

సాక్షి, హైదరాబాద్‌: కరోనా మహమ్మారి ప్రభావం రిటైల్ రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపించింది. దీంతో షాపింగ్ మాల్స్ విలవిల్లాడిపోయాయి. ఆన్‌లైన్ కొనుగోళ్ల వృద్ధి చూశాక ఇక ఆఫ్‌లైన్‌లోని రిటైల్ రంగం కోలుకోవడం కష్టమేమో అనిపించింది. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. కరోనా ప్రభావం నుంచి షాపింగ్ మాల్స్ శరవేగంగా కోలుకున్నాయి. మాల్స్‌లోని రిటైల్ దుకాణాలలో కొనుగోలుదారుల సందడి, మల్టీప్లెక్స్‌లలో వీక్షకుల తాకిడి పెరగడంతో మాల్స్ నిర్వాహకులలో కొత్త ఉత్సాహం నెలకొంది. మరోవైపు దేశవ్యాప్తంగా కొత్త షాపింగ్ మాల్స్ వస్తున్నాయి.

- షాపింగ్ మాల్స్, హైస్ట్రీట్‌లలో వాణిజ్య కార్యకలాపాలు పెరిగాయి. ఈ ఏడాది ప్రథమార్థంలో హైదరాబాద్‌లో రిటైల్ లీజులు 137 శాతం పెరిగాయని సీబీఆర్‌ఈ నివేదిక వెల్లడించింది. అయితే రిటైల్ మార్కెట్ పరిమాణం ఇంకా పెరగాల్సి ఉందని, ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్ రిటైల్ రంగం చాలా వెనకబడి ఉంది.
- ఫ్యాషన్, హోమ్‌వేర్, డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ వంటి రిటైలర్ల డిమాండ్‌ను బట్టి షాపింగ్ మాల్స్‌లో లీజు లావాదేవీలు జరుగుతుంటాయి. ఈ ఏడాది ముగింపు నాటికి దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాలలో రిటైల్ లీజులు 17–28 శాతం మేర పెరిగి 55–60 లక్షల చ.అ.లకు చేరుతుందని అంచనా వేసింది. 2019లో అత్యధికంగా 68 లక్షల చ.అ. లీజు లావాదేవీ లు జరిగాయి. 2021లో 39 లక్షలు, 2022లో 47 లక్షల చ.అ. రిటైల్ లీజు కార్యకలాపాలు పూర్తయ్యాయి.
- హైదరాబాద్‌లో పలు ప్రాంతాలలో షాపింగ్ మాల్స్ నిర్మాణం తుదిదశలో ఉన్నాయి. డిమాండ్ ఉన్న ప్రాంతాలలో నిర్మాణం పూర్తి కాకముందే లీజులు జరుగుతున్నాయి. గత ఏడాది డిమాండ్ అంతంత మాత్రంగానే ఉండటంతో పూర్తయ్యే దశకు చేరినా లీజు లావాదేవీలు ఆశించిన స్థాయిలో జరగలేదు. అయితే ఈ ఏడాది కొంత సానుకూల వాతావరణం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు నగరంలో 2.5 లక్షల చ.అ. రిటైల్ స్థల లీజు లావాదేవీలు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంలో కేవలం లక్ష చ.అ. స్థలం మాత్రమే లీజుకు పోయింది. రిటైల్ లీజులలో స్టోర్‌ల వాటా 33 శాతం ఉండగా.. ఫ్యాషన్, అపరెల్స్ షోరూమ్‌ల వాటా 30 శాతం, ఫుడ్ కోర్టుల వాటా 11 శాతంగా ఉంది.



ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని హెచ్‌ఎంటీ హిల్స్‌, రాంనరేష్‌ నగర్‌ కాలనీలో రూ.75.50 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్‌ నార్నె శ్రీనివాసరావు, అధికారులతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదర్‌నగర్‌ డివిజన్‌ అభివృద్ధికి బాటలు వేస్తూ సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు సదుపాయాలు కల్పించాలని వినతి



జోనల్‌ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: శివమ్మ కాలనీ రామాలయం పక్కన, అంబీర్‌ చెరువు కట్ట మీద నిర్వహించే బతుకమ్మ, దసరా ఉత్సవాలకు తగిన సదుపాయాలు కల్పించాలని జోనల్‌ కమిషనర్‌కు కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అదే విధంగా కూకట్‌పల్లి సర్కిల్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ డి. గోవర్ధన్‌ గౌడ్‌, ఎస్‌ఈ చిన్నారెడ్డిలకు కూడా వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్‌ గౌడ్‌, పద్మయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవి రంగారావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: వివేకానంద నగర్‌ డివిజన్‌ పరిధిలోని ఏఎస్‌ రాజు కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవి అధికారులను కోరారు. డ్రైనేజీ లైన్‌లో మట్టి పేరుకుపోయి అపార్టుమెంట్‌లోకి డ్రైనేజీ నీరు వస్తున్నదని కాలనీ అసోసియేషన్‌ వారు కార్పొరేటర్‌ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో శుక్రవారం హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ అండ్‌ ఎస్‌బీ జనరల్‌ మేనేజర్‌ ప్రభాకర్‌, మేనేజర్‌ ప్రియాంక, కాలనీ వాసులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. అపార్టుమెంట్‌ వాసులకు ఇబ్బంది లేకుండా త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఎర్రవెల్లి సతీష్‌రావు, సెక్రటరీ పీఎస్‌ రాజు, నరసింహ నాయుడు, కిశోర్‌, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డిజిటల్‌ కార్డు కోసం వివరాల సేకరణ



కుత్బుల్లాపూర్‌ : ఫ్యామిలీ డిజిటల్‌ కార్డుల జారీ కోసం కుటుంబ వివరాలను కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ అధికారులు సేకరిస్తున్నారు. గ్రేటర్‌ పరిధిలోని నియోజకవర్గాల వారీగా ఒక్కో ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని సర్వే ప్రారంభించారు. అందులో భాగంగా అయోధ్య నగర్‌లో ఉప కమిషనర్‌ నరసింహ ఆధ్వర్యంలో 15 బృందాలుగా విడిపోయి ఒక్కొక్కరు ప్రతి రోజు 30 కుటుంబాల వివరాలను సేకరించనున్నారు. మొత్తం కాలనీలో 900 పైగా ఇళ్లు ఉండగా.. ఈనెల 8వ తేదీ లోగా ఈ ప్రక్రియ పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ డిజిటల్‌ కార్డు జారీ కోసం సహకరించాలని కోరా రు. కుటుంబంలోని అందరి ఆధార్‌ కార్డులతో పాటు వారు లబ్ధి పొందిన వివరాలు, ఫోన్‌ నెంబర్‌ తీసుకొని ఫార్మాట్‌ చేస్తున్నారు. అయోధ్య నగర్‌లో జరుగుతున్న సర్వేను ట్యాక్స్‌ ఇన్‌స్పెక్టర్లు, బిల్‌ కలెక్టర్లు ఇతర అధికారులు దగ్గరుండి చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఆయా కుటుంబాల్లో పుట్టిన, మరణించిన వారి వివరాలతో పాటు కొత్తగా ఫ్యామిలీ, ఇల్లు ఇక్కడ ఉండి విదేశాలకు వెళ్లిన వారి వివరాలతో ఎంట్రీ చేస్తూ ముందుకు సాగుతున్నారు.

నవ దుర్గ.. నృత్యరూపకం



మాదాపూర్‌: శిల్పారామంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలు, ఫోక్‌ ఫెస్టివల్‌, చేనేత ఎగ్జిబిషన్‌లు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. శిల్పారామంకు వచ్చిన సందర్శకులు పలు రకాల ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. ఇందులో గద్వాల్‌, పోచంపల్లి, కోట, కాశ్మీరిసిల్క్‌, జాంధానీ, మస్లిన్‌, బెంగాలీ కాటన్‌ తదితర ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఫోక్‌ ఆర్ట్‌ ఫెస్టివల్‌ ముగింపు కార్యక్రమంలో భాగంగా బతుకమ్మ, చెక్క భజన, లంబాడి నృత్యం, నల్లమోలు లక్ష్మి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనలో నవ దుర్గ స్తోత్రం నృత్య రూపకంతో సందర్శకులను ఆకట్టుకున్నారు. శిల్పారామం సిబ్బంది, సందర్శకులతో కలసి బతుకమ్మ ఆడారు.



స్కిన్‌వి బయోసైన్సెస్‌ -యూకే మైక్రోబిరా లిమిటెడ్‌ ఎంఓయూ



ఒప్పందం చేసుకున్న ఇరు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలోని స్టార్టప్‌ స్కిన్‌వి బయోసైన్సెస్‌ సంస్థ, యూకేలోని మైక్రోబిరా లిమిటెడ్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. యాంటీ మైక్రోబయల్‌ రెసిస్టెన్స్‌(ఏఎంఆర్‌)ను ఎదుర్కోవడానికి పని చేస్తాయి. స్కిన్‌వి బయోసైన్సెస్‌, మైక్రోబిరా లిమిటెడ్‌ మధ్య జాయింట్‌ వెంచర్‌ ఏఎంఆర్‌కి వ్యతిరేకంగా పోరాటంలో ఒక అద్భుతమైన ముందడగు అని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కిన్‌వి బయోసైన్సెస్‌ సహ వ్యవస్థాపకుడు, డైరెక్టర్‌ డాక్టర్‌ పి రత్నాకర్‌, మైక్రోబిరా లిమిటెడ్‌ సీఈఓ మరియాన్‌ ఇస్మాయిల్‌, ఎస్పైర్‌ బయోనెస్ట్‌ వ్యవస్థాపక డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ రెడ్డన్న ప్రసంగించారు.

స్నో కింగ్‌డమ్‌లో దాండియా

గచ్చిబౌలి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా.. స్నో కింగ్‌ డమ్‌లో దాండియా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ఎండీ పువ్వాడి హరిత తెలిపారు. శుక్రవారం కొత్తగూడలోని శరత్‌ సిటీ క్యాపిటల్‌ మాల్‌లోని కింగ్‌డమ్‌లో పలువురు మోడళ్లు దాండియా ఆడి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచు ప్యాలెస్‌లు, మంచు పర్వతాలు, బ్లాక్‌ సీల్స్‌, ఓక్‌ చెట్లు, ఇగ్లూలు, ధృవపు ఎలుగు బంట్ల బొమ్మలు చూపరులను ఆకట్టుకుంటాయని తెలిపారు. గుజరాతి, రాజస్థానీ సంస్కృతి ప్రతిబింబించే రీతిలో మంచులో 9 రోజుల పాటు దాండియాను నిర్వహిస్తున్నామని, పెద్దలకు రూ.750, పిల్లలకు రూ.650 రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు.



వైభవంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు

నియోజకవర్గ జంట సర్కిళ్ల పరిధిలో దసరా నవరాత్రోత్సవాల సందర్భంగా అమ్మవార్లను ప్రత్యేక అలంకరణలు చేశారు. ఉదయం నుంచి భక్తులు ఆలయాలకు విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. –కూకట్‌పల్లి



ప్రగతి నగర్‌లో అమ్మవారి పూజలో పాల్గొన్న బాబూరావు తదితరులు



బాలాజీనగర్‌ డివిజన్‌ ఆంజనేయ నగర్‌ కాలనీలో అమ్మవారి పూజలో భక్తులు



ఎల్లమ్మ ఆలయంలో లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు



శంకరమఠంలో మహేశ్వరి అలంకరణలో..

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హెచ్‌సీయూ డిపో మేనేజర్‌ మురళీధర్‌రెడ్డి

రాయదుర్గం: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు హెచ్‌సీయూ డిపో మేనేజర్‌ ఎం మురళీధర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ ప్రత్యేక బస్సులను ఈనెల 12వ తేదీ వరకు నడుపుతామన్నారు. లింగంపల్లి నుంచి ఎంజీబీఎస్‌ వరకు, గచ్చిబౌలి నుంచి మహబూబ్‌నగర్‌ వైపు, లింగంపల్లి నుంచి జహీరాబాద్‌ వైపు బస్సులు ఉంటాయని వివరించారు. వివరాల కోసం హెచ్‌సీయూ ఏఎం(టి) రవికుమార్‌ను ఫోన్‌ నంబర్‌ 7382814235లో సంప్రదించాలని సూచించారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు అరుదైన గౌరవం

ఆక్స్‌ఫర్డ్‌ యూనివర్సిటీ ప్రెస్‌ ప్రాజెక్ట్‌ అడ్వైజరీ బోర్డుకు ప్రొ.ప్రమోద్‌ కె నాయర్‌



రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్‌కు అరుదైన గౌరవం లభించింది. హెచ్‌సీయూ ప్రొ. ప్రమోద్‌ కె నాయర్‌ ఆక్స్‌ఫర్డ్‌ యూనివర్సిటీ ప్రెస్‌ ప్రాజెక్ట్‌ అడ్వైజరీ బోర్డుకు నామినేట్‌ అయ్యారు. ఆక్స్‌ఫర్డ్‌ యూనివర్సిటీ ప్రెస్‌(ఓయూపీ) నుంచి ఆక్స్‌ఫర్డ్‌ ఇంటర్‌సెక్షన్స్‌ అని పిలువబడే ఇంటర్‌ డిసిప్లినరీ అకడమిక్‌ పబ్లిషింగ్‌ ఇనీషియేటివ్‌ అడ్వైజరీ బోర్డులో చేరడానికి హెచ్‌సీయూ స్కూల్‌ ఆఫ్‌ హ్యూమానిటీస్‌లోని స్కూల్‌ ఆఫ్‌ ఇంగ్లిష్‌ విభాగంలో సీనియర్‌ ప్రొఫెసర్‌ ప్రమోద్‌ కె నాయర్‌ను నామినేట్‌ చేశారు.ఓయూపీ అనేది ప్రపంచంలోనే అతిపెద్ద యూనివర్సిటీ ప్రెస్‌. ప్రపంచంలో పరిశోధక ,సాహిత్య, అధ్యయన రంగంలో భారత్‌ నుంచి పరిశోధకుడుగా గుర్తింపు పొందారు. ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

ప్రతిరోజూ 'సాయి సచ్చరిత్ర' పఠనం

రాయదుర్గం: విజయదశమి సందర్భంగా టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో రోజూ 'సాయి సచ్చరిత్ర పఠనం ' ఉంటుందని ఆలయ నిర్వాహకులు రవీందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ప్రతిరోజూ ఆలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని మంజీరా పైప్‌లైన్‌ నూతన రోడ్డు పనులకు శనివారం పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేయనున్నారు. మంజీరా పైప్‌లైన్‌ లీకేజీలతో రోడ్డంతా గుంతలు పడిందన్నారు. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో గత సంవత్సరం రూ.40 కోట్లతో నూతన పైప్‌లైన్‌ పనులు ప్రారంభించామన్నారు. పైప్‌లైన్‌ పూర్తి అయినందున నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.4.31 కోట్ల నిధులతో చేపడుతున్నామన్నారు. హఫీజ్‌పేట్‌ ఫ్లైఓవర్‌ నుంచి విజేత సూపర్‌ మార్కెట్‌ వరకు రూ.1.97 కోట్లు, విజేత సూపర్‌ మార్కెట్‌ నుంచి మై హోమ్‌ జువెల్‌ వరకు రూ.1.95 కోట్లు, ఆర్టీసీ కాలనీ నుంచి మురళీధర్‌ సొసైటీ వరకు రూ.39.50 లక్షలతో రోడ్డు పనులకు శ్రీకారం చుట్టనున్నామన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

కుత్బుల్లాపూర్‌: కార్మికులు వ్యక్తిగత ఆరోగ్యం పై శ్రద్ధ చూపాలని ఈఎస్‌ఐ డాక్టర్‌ కిరణ్‌కుమార్‌ అన్నారు. శుక్రవారం జీడిమెట్ల డివిజన్‌ గోదావరి హోమ్స్‌లోని టీఎన్‌ఆర్‌నగర్‌ కమిటీ హాల్‌లో మున్సిపల్‌ కార్మికులు, ఎంటమాలజీ సిబ్బందికి వైద్య శిబిరం, పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఉ.నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన శిబిరంలో 125 మంది కార్మికులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఉప కమిషనర్‌ నరసింహ పాల్గొన్నారు.

ఆస్ట్రేలియా ప్రతినిధుల బృందానికి సన్మానం



ఆస్ట్రేలియా ప్రతినిధుల బృందాన్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌, కార్పొరేటర్‌ రోజాదేవి రంగారావు తదితరులు



కూకట్‌పల్లి: ఆస్ట్రేలియా దేశానికి చెందిన ప్రజా ప్రతినిధుల బృందం శుక్రవారం తెలంగాణ శాసన సభ కార్యాలయాన్ని సందర్శించింది. అనంతరం కూకట్‌పల్లిలోని రామాలయంలోని స్వామివారిని దర్శించుకున్నారు. అక్కడ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌, వివేకానందనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవి, ఆలయ నిర్వాహకులు ఆస్ట్రేలియాకు చెందిన మంత్రులు రిచర్డ్‌ రీయుర్డాన్‌, శ్రీ బ్రాండ్‌ బట్టిన్‌లను ఘనంగా సన్మానించారు. ప్రసాదాన్ని, షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో రామారావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: రేషన్‌ కార్డుదారులకు ప్రథమంగా 2025 జనవరి నుంచి సన్నబియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని, అందులో భాగంగా రైతుల నుంచి క్వింటాల్‌కు రూ. 500 అదనపు బోనస్‌తో కొనుగోలు కేంద్రాలలో సన్న ధాన్యం సేకరించటానికి అనుమతి ఇచ్చిందని జిల్లా అదనపు కలెక్టర్‌ (లోకల్‌ బాడీస్‌) డి.విజయేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వర్షా కాలానికి సంబంధించి ×ధాన్యం సేకరణపై సంబంధిత జిల్లా అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ధాన్య సేకరణ కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, రైస్‌ మిల్లుల యజమానులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ... రైతులు తడి, తాలు, దుమ్ము లేకుండా ధాన్యాన్ని తూర్పారబట్టి, ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా చైతన్య పరచాలని ఆదేశించారు. వరికోత సమయంలో వరి నూర్పిడి యంత్రాల వారితో మాట్లాడి ఒక క్రమపద్ధతిలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి వచ్చేలా చూసుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ మన జిల్లాలోని కొనుగోలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు ధాన్యాలకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలన్నారు. సన్న, దొడ్డు వరి ధాన్యాన్ని వేర్వేరుగా రైస్‌ మిల్లులకు తరలించటంతోపాటు రిజిస్టర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్రభుత్వ నియమాల ప్రకారం అన్నీ రకాల ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలు సోమవారం వరకు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైస్‌ మిల్లుల యజమానులు సన్నధాన్యం దిగుమతుల సమయంలో తగిన జాగ్రతలు పాటించాలన్నారు. రైస్‌ మిల్లుల వద్దకు వరి ధాన్యం తరలించే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. రైతు విక్రయించిన ధాన్యానికి 48 గంటలలో నేరుగా వారి ఖాతాలో డబ్బులు జమ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి,జిల్లా పౌరసరఫరాల శాఖ జీఎం, డీఎస్‌ఓ, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, రైస్‌ మిల్లర్లు పాల్గొన్నారు.

వీడిన స్పందన హత్యకేసు మిస్టరీ

స్నేహితుడే అంతమొందించాడు

- బండరాయితో తలపై మోది హత్య
- నిందితుడిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించిన మియాపూర్‌ పోలీసులు



నిందితుడు మనోజ్‌ కుమార్‌

మియాపూర్‌: వివాహిత హత్యకేసు మిస్టరీ వీడింది. తన ప్రేమను అంగీకరించకపోవడం , ఇతరులతో సన్నిహితంగా ఉండడం జీర్ణించుకోలేక ఆమె స్నేహితుడే బండరాయితో మోది స్క్రూడ్రైవర్‌తో విచక్షణంగారహితంగా పొడిచి హత్యచేశాడు. అతడిని మియాపూర్‌ పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు.సీఐ దుర్గా రామలింగప్రసాద్‌ తెలిపిన వివరాల ప్రకారం... గచ్చిబౌలి సుదర్శన్‌నగర్‌కు సమీపంలోని ఆర్‌ఎంఓయూ కాలనీలోని గ్రీన్‌ అవెన్యూ అపార్ట్‌మెంట్‌లో నివాసముండే మండల మనోజ్‌ కుమార్‌ అలియాస్‌ బాలు(29) ప్రైవేటు ఉద్యోగి. దీప్తిశ్రీనగర్‌ కాలనీలోని సీబీఆర్‌ ఎస్టేట్‌లో నివాసముండే స్పందన (29) 2017లో ఒకే కళాశాలలో ఇంటర్‌ చదివారు. దీప్తిశ్రీనగర్‌కు చెందిన వినయ్‌కుమార్‌ కూడా వారితో పాటు చదివాడు. కాగా స్పందన వినయ్‌కుమార్‌లు ప్రేమించుకున్నారు. పెద్దల సమక్షంలో 2022లో వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత కొద్దిరోజులకే భార్య, భర్తల మధ్య మనస్పర్థల కారణంగా వేర్వేరుగా ఉంటున్నారు. స్పందన తన తల్లి నమ్రత దగ్గర దీప్తిశ్రీనగర్‌ సీబీఆర్‌ ఎస్టేట్‌ అపార్ట్‌మెంట్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటుంది.

తన ప్రేమ అంగీకరించలేదని హత్య

భర్తతో విభేధాల కారణంగా ఒంటరిగా ఉంటున్న స్పందనకు మనోజ్‌కుమార్‌ దగ్గరయ్యాడు. అప్పుడప్పుడు ఇంటికి వస్తూ వెళ్తుండేవాడు. ఈ క్రమంలో మనోజ్‌ ప్రేమిస్తున్నానని స్పందనకు ప్రపోజ్‌ చేశాడు. ఆమె తిరస్కరించి స్నేహితుడిగా ఉండాలని మందలించింది. స్పందన తన ప్రేమను తిరస్కరించడంతో పాటు ఇతర స్నేహితులతో సన్నిహితంగా ఉండడం చూసిన మనోజ్‌ జీర్ణించుకోలేకపోయాడు. ఎలాగైనా స్పందనను చంపేయాలని అనుకున్నాడు.ఈ క్రమంలోనే స్పందన తల్లి నమ్రత ఇంట్లోలేని సమయం చూసి పథకం ప్రకారం వచ్చి ఇంట్లో పడుకున్న స్పందన తలపై బండరాయితో మోదాడు. అనంతరం స్క్రూడ్రైవర్‌తో ముఖంపై విచక్షణంగా రహితంగా పొడిచి దారుణంగా హత్య చేశాడు. అనంతరం బయట నుండి తాళం వేసి వెళ్లిపోయాడు. సాయంత్రం స్పందన తల్లి నమ్రత ఇంటికి వచ్చి చూసేసరికి స్పందన బెడ్‌పై రక్తపు మడుగులో పడి మృతి చెంది ఉంది. మృతురాలి తల్లి నమ్రత మియాపూర్‌ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. అపార్ట్‌మెంట్‌, కాలనీలో సీసీ కెమెరాలు, మృతురాలి ఫోన్‌ సీడీఆర్‌ డేటా ఆధారంగా స్పందనను హత్యచేసింది స్నేహితుడు మనోజ్‌ అని గుర్తించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా స్పందనను హత్యచేసింది తానేనని ఒప్పుకున్నాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

వేడుకలకు అన్ని రకాల ఏర్పాట్లు



కట్టమీది స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్‌, అధికారులు

ఆల్విన్‌కాలనీ: బతుకమ్మ, దసరా వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ అన్నారు. శివమ్మ కాలనీ, అంబీర్‌ చెరువు కట్ట మీద స్థలాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మైదానంలో గుంతలు పూడ్చి, లైటింగ్‌, మంచినీటి సౌకర్యం తదితర మౌలిక సదుపాయాలతో పాటు చెరువులోని గుర్రపుడెక్కను తొలగించి చెరువుకు మెట్లు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణ గౌడ్‌, అనిల్‌ రెడ్డి, శివరాజ్‌ గౌడ్‌, పాండుగౌడ్‌, సీహెచ్‌. భాస్కర్‌, వెంకట్‌నాయక్‌, షౌకత్‌అలీ మున్నా, యాదగిరి, అగ్రవాసు, బాలస్వామి, జీహెచ్‌ఎంసీ అధికారులు ఎస్‌ఆర్‌పీ నాయక్‌, వర్కు ఇన్‌స్పెక్టర్‌ రవికుమార్‌, ఎంటమాలజీ సూపర్‌వైజర్‌ డి.నరసింహులు, వాటర్‌వర్క్స్‌ సూపర్‌వైజర్‌ శివ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ నగర్‌లో ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ సబిహాబేగం

మోతీనగర్‌: కాలనీలు, బస్తీల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అల్లాపూర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ సబిహా బేగం అన్నారు. అల్లాపూర్‌ డివిజన్‌ పరిధిలోని శివాజీ నగర్‌లో శుక్రవారం శివాజీ నగర్‌ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అక్షయ ఆకృతి ఎన్‌జీఓస్‌ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజహితం కోసం చేస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. వైద్యుల సూచనల మేరకు ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డివిజన్‌ అధ్యక్షులు లింగాల ఐలయ్య, సంక్షేమ సంఘం అధ్యక్షుడు విజయ్‌గౌడ్‌, తులసిరాం, సంజీవరెడ్డి, బాలయ్య, మధురాచార్య, గీత తదితరులు పాల్గొన్నారు.

వెంకట్‌రావునగర్‌లో బతుకమ్మ వేడుకలు



కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం కూకట్‌పల్లిలోని వెంకట్‌రావు నగర్‌ చౌరస్తాలో మహిళలు అందరూ కలిసి బతుకమ్మలను పేర్చి ఆటాపాటలతో సందడి చేశారు. అనంతరం ఐడీఎల్‌ చెరువు వద్ద బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకువచ్చి ఆడి, పాడారు. అనంతరం కుంటలో నిమజ్జనం చేశారు.

జేఎన్‌టీయూలో..





కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూలో ఎన్‌ఎస్‌ఎస్‌, జేఎన్‌టీయూ ప్రొటెక్షన్‌ ఫోర్స్‌ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ రెక్టార్‌ ప్రొఫెసర్‌ విజయ్‌ కుమార్‌ రెడ్డి, ప్రిన్సిపాల్‌ జీ.వి. నరసింహారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్‌ కో ఆర్డినేటర్‌ శోభారాణి, వీఆర్‌ఓ ప్రసన్న ప్రారంభించారు. కార్యక్రమంలో చందన, ప్రసన్న, సుశ్రుత, స్పందన, సిరి, మృదుల, లాస్య, షర్మిల తదితరులు పాల్గొన్నారు.



ఆదర్శ రైతు రామచందర్‌ మృతి

సుభాష్‌నగర్‌: అక్కడ గజం స్థలం విలువ 80 వేల నుంచి లక్ష రూపాయలు పలుకుతుంది. చుట్టూ నూతన హంగులతో విల్లాలు ఎత్తైన భవనాలు.. మధ్యలో ఆ రైతు.. తాతల నాటి నుంచి సంపాదించిన 25 ఎకరాల స్థలం. తన ఒంట్లో ఉన్న చివరి రక్తం వరకు మట్టినే నమ్ముకుని వ్యవసాయం చేశాడు. తన నలుగురు కుమారులకు అన్నం మెతుకు విలువ చెప్పి, వ్యవసాయం యొక్క గొప్పతనాన్ని వివరించాడు. చివరికి వృద్ధాప్యంలోనూ వ్యవసాయం చేస్తూ కన్నుమూశాడు. చివరకు కుమారులు తన తండ్రి యొక్క భౌతిక కాయాన్ని తమ వ్యవసాయ పొలం చుట్టూ వాహనంలో తిప్పి అంత్యక్రియలు నిర్వహించారు. కొంపల్లి మున్సిపల్‌ దూలపల్లి కి చెందిన ఆదర్శ రైతు పెద్దనోల్ల రావి చెట్టుకింద రామచందర్‌ (84) అనారోగ్యంతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. రామచందర్‌ గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఆదర్శ రైతుగా ఎంపికై స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. మట్టిని అమ్ముకోకు, నమ్ముకుని జీవించు అన్నది రామచందర్‌ పదేపదే చెప్పంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అతని అంత్యక్రియలకు గ్రామస్తులు, రాజకీయ నాయకులు హాజరయ్యారు. అయనకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సాక్షి
హైదరాబాద్
శనివారం । 5 । అక్టోబర్ । 2024

స్వర్ణకవచ శివదుర్గాదేవిగా కీసరగుట్ట అమ్మవారు



కీసర: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కీసరగుట్ట శ్రీభవానీ శివదుర్గా అమ్మవారు శుక్రవారం భక్తులకు స్వర్ణకవచ శివదుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన చండీ హోమంలో ఆలయ చైర్మన్ నాగలింగం దంపతులు, ఈఓ సుధాకర్‌రెడ్డి, పండితులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 338 దరఖాస్తులు

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 338 దరఖాస్తులు అందాయి. గృహనిర్మాణ శాఖకు సంబంధించి 79, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 52, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 35, విద్యుత్ శాఖకు సంబంధించి 35, ఎస్సీ సంక్షేమ శాఖకు సంబంధించి 29, ప్రవాసీ ప్రజావాణి ద్వారా 4, ఇతర శాఖలకు సంబంధించి 104 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య దరఖాస్తులు స్వీకరించారు.

ఆత్మీయ సత్కారం



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: టీపీసీసీ అధ్యక్షుడిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా నిజామాబాద్‌కు వెళ్లిన మహేష్‌కుమార్‌గౌడ్‌కు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నిజామాబాద్ పాత కలెక్టరేట్ కార్యాలయ గ్రౌండ్‌లో నిర్వహించిన అభినందన సభకు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ హాజరై మహేష్ కుమార్‌గౌడ్‌ను సత్కరించారు. ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రామగుండం థర్మల్ ప్రాజెక్ట్‌ను జెన్‌కోతోనే చేపట్టాలి



సాక్షి, సిటీబ్యూరో: రామగుండంలోని పాత 62.5 మెగావాట్ల ప్లాంట్ స్థానంలో కొత్తగా నిర్మించతలపెట్టిన 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను పూర్తిగా తెలంగాణ జెన్‌కో ఆధ్వర్యంలోనే చేపట్టాలని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం విద్యుత్‌సౌధ సహా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయాల్లో భోజన విరామ సమయంలో ఇంజినీర్లు ధర్నాకు దిగారు. విద్యుత్ యాజమాన్యం తీరును తప్పుబడుతూ నినాదాలు చేశారు.

బతుకమ్మ ఆడితే నష్టమేంటో..?

రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ ఎంపీ డీకే అరుణ మండిపాటు



చార్మినార్: బతుకమ్మ ఆడితే రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన కష్టమేమిటో.. నష్టమేమిటో.. బతుకమ్మ ఆడేందుకు అనుమతి ఇవ్వకుండా ఆపే ప్రయత్నం చేసిన పనికి సిగ్గుపడాలి ఇక్కడి ప్రభుత్వం అంటూ రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ ఎంపీ డీకే అరుణ మండిపడ్డారు. దసరా శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం చార్మినార్ భాగ్యలక్ష్మీ దేవాలయం వద్ద బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు చార్మినార్ భాగ్యలక్ష్మీ దేవాలయానికి చేరుకుని గౌరమ్మ పూజలు నిర్వహించారు. వర్షాన్ని సైతం పట్టించుకోకుండా బీజేపీ మహిళలు భాగ్యలక్ష్మీ దేవాలయం ప్రాంగణంలో బతుకమ్మలను పేర్చి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చార్మినార్‌లో బతుకమ్మ వేడుకలకు అనుమతి ఇవ్వకపోతే.. న్యాయస్థానం తమకు అనుమతి ఇచ్చిందన్నారు. దేవాలయం వద్ద బతుకమ్మ ఆడితే శాంతి భద్రతలకు విఘాతం ఎలా కలుగుతుందో రాష్ట్రంలోని మహిళలకు చెప్పాలన్నారు. 10 ఏళ్లుగా కొనసాగిన రాక్షస పాలనకు చరమగీతం పాడిన ప్రజలు.. త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు. బీజేపీ బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు వాసంతి శ్రీనివాసన్, రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, మాజీ ఎమ్మెల్యేల చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఉమమహేంద్ర పాల్గొన్నారు.

'హ్యాపీ ఫెస్టివ్ ధమాకా' ఆఫర్లు

సాక్షి, సిటీబ్యూరో: రానున్న పండుగల నేపథ్యంలో హ్యాపీ స్టోర్స్ ఆధ్వర్యంలో 'హ్యాపీ ఫెస్టివ్ ధమాకా' ఆఫర్లను అందిస్తోంది. ఇందులో భాగంగా ప్రత్యేక ఆఫర్లతో పాటు డిస్కౌంట్లు, క్యాష్ బ్యాక్‌లను, 7 విభిన్న బహుమతులను అందిస్తున్నామని హ్యాపీ మొబైల్స్ సీఎండీ కృష్ణ పవన్ తెలిపారు. విభిన్న రకాల మొబైల్స్‌కు విలువైన ప్రత్యేక బహుమతులతో పాటు అన్ని రకాల యాక్సెసరీస్‌పైనా 65 శాతం వరకు తగ్గింపు ఆఫర్లు ఉన్నాయన్నారు. తమ స్టోర్లలో 300లకు పైగా మోడల్స్, 500లకు పైగా యాక్సెసరీస్ అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

జేఎన్‌టీయూలో కబడ్డీ సెలక్షన్ ట్రయల్స్

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ హైదరాబాద్ యూనివర్సిటీలో కబడ్డీ సెలక్షన్ ట్రయల్స్ శుక్రవారం నిర్వహించారు. ఈ ట్రయల్స్‌లో వివిధ కళాశాలల నుంచి దాదాపు 300 మంది పాల్గొన్నారు. ఈ సెలక్షన్లు జేఎన్‌టీయూ యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎస్ఎస్ దిలీప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఇండోర్ కబడ్డీ మ్యాట్‌పై ఈ సెలక్షన్లు జరిగాయి. కార్యక్రమాన్ని ఫిజికల్ డైరెక్టర్ డా.నల్లగొండ అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు చెన్నైలో జరిగే సౌత్ జోన్ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈనెల 30 నుంచి వచ్చేనెల 3 వరకు జరిగే టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూ జట్టు పాల్గొంటుంది. కార్యక్రమంలో కెమిస్ట్రి ప్రొఫెసర్ సత్యనారాయణ పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

యువతను స్కిల్డ్ మ్యాన్ పవర్‌గా మారుస్తాం

- హైదరాబాద్ అభివృద్ధికి రూ.10వేల కోట్ల కేటాయింపు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మాదాపూర్: రాష్ట్ర ప్రగతికి అడ్డుపడే రాజకీయాలు ప్రజలకు నష్టం చేస్తాయని రోడ్లు భవనాల సినిమాటోగ్రఫీ శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని నోవాటెల్‌లో శుక్రవారం అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్ 2024ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ ప్రక్షాళన చేస్తామని జైకా నుంచి రూ.వెయ్యి కోట్లు రుణం తీసుకున్న బీఆర్ఎస్ నాయకులు అధికారం పోగానే మూసీ ప్రక్షాళన వద్దని గగ్గోలు పెడుతున్నారని అన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే రాజకీయాలు తగవని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న అర్బన్ కల్చర్‌కు అనుగుణంగా రాష్ట్రంలో కూడా పట్టణీకరణ జరగాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం.. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేందుకు, అభివృద్ధికి బలమైన పునాదులు వేయడంతో పాటు అనేక మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు వివరించారు. హైదరాబాద్ దశదిశ మార్చేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుందని, అందులో భాగంగానే రోడ్లు, ఆర్ఓబీలు, ఆర్‌యూబీలు, కొత్త లింక్‌రోడ్లు నిర్మించడం వంటి కీలకమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా అర్బన్ ప్రాంతాల్లో ఘనవ్యర్థాల నిర్వహణ సవాల్‌గా మారిందన్నారు. అందుకోసం ఎస్టీపీలను నిర్మించి మెరుగైన మురుగు నీటి వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

మౌలిక సదుపాయాలకు 'స్పీడ్'

ప్రస్తుతం ఓఆర్ఆర్ పరిధిలో దాదాపు 40శాతం జనాభా నివసిస్తోందని 2028 నాటికి 50శాతం దాటే అవకాశం ఉందన్నారు. దానికి అనుగుణంగా హైదరాబాద్‌లో పట్టణ విస్తరణ, మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. అగ్నిమాపక వ్యవస్థ, ట్రాఫిక్ నియంత్రణ, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. మౌలిక సదుపాయాలను వేగవంతం చేసేందుకు స్పీడ్(స్మార్ట్, ప్రొయాక్టివ్, ఎఫిసియంట్, ఎఫెక్టివ్ డెలివరీ) వంటి ప్రణాళికలతో 19 ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, కొత్త విమానాశ్రయాల నిర్మాణం, శాటిలైట్ టౌన్స్ ఏర్పాటు, మెట్రో విస్తరణ, జీహెచ్ఎంసీ పునర్వ్యవస్థీకరణ, సికింద్రాబాద్ ఇతర నగరాల్లో ఎలివేటెడ్ కారిడార్లు, రీజినల్ రింగ్ రోడ్, హైకోర్టు భవన నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ కాంప్లెక్స్, ఉస్మానియా నూతన భవన నిర్మాణం వంటి ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. హైకోర్టు భవనంలో పీపీపీ మోడల్‌లో పార్కింగ్ నిర్మించే అంశంపై ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. యువతను స్కిల్డ్ మ్యాన్ పవర్‌గా మార్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అమెరికన్ కాన్సుల్ జనరల్ హైదరాబాద్ ఫ్రాంక్ పి టల్లూటో, ఫోనిక్స్ గ్రూప్ చైర్మన్ సురేష్ చుక్కపల్లి, అలార్డ్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పూనమ్ కశ్యప్, రాంబాబు బూరుగు, అసోచాం రాష్ట్ర ప్రతినిధి దినేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలి

రాష్ట్ర ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు ట్రస్మా వినతి

కవాడిగూడ: రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఉన్న బడ్జెట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించాలని ట్రస్మా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ఎన్‌రెడ్డి, కె.అనిల్‌కుమార్, కోశాధికారి కె.శ్రీకాంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ జి. రమేష్‌ను ట్రస్మా ఆధ్వర్యంలో కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న బడ్జెట్ పాఠశాలల సమస్యలను వివరించినట్లు వారు శుక్రవారం ఓ ప్రకటన ద్వారా పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల సమస్యలను పరిష్కరించి కార్పొరేట్ పాఠశాలలను నియంత్రించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డిస్ట్రిక్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు(డీసీఈబీ) ప్రకారం ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు ఒకే కామన్ ఫీజు విధానం ఉండాలని డైరెక్టర్‌ను కోరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, అధికార ప్రతినిధి చింతల రాంచందర్, ముఖ్య సలహాదారు అనంతరెడ్డి, ఉపాధ్యక్షుడు పీవీ రామనర్సయ్య, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు బానాల రాఘవ, నేతలు జయరాం ప్రసాద్, పి.వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

తెలంగాణ వైద్యమండలి భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న హెల్త్ సెక్రెటరీ డాక్టర్ క్రిస్టినా జెడ్ చోంగ్తు తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి(టీఎంసీ) నూతన భవనాన్ని డీఎంహెచ్ ఆవరణలో శుక్రవారం హెల్త్ సెక్రెటరీ డాక్టర్ క్రిస్టినా జెడ్ చోంగ్తు అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ భవనం వైద్యుల ఆత్మగౌరవాన్ని పెంపొందించే విధంగా అధునాతన సౌకర్యాలతో నిర్మించారని, దేశంలోనే ఇతర వైద్య మండలికి ఆదర్శంగా ఉందన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైద్యమండలి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసే గెజిట్ జీఓ ఇవ్వడంలో విశేషంగా కృషి చేశారని ఆమె అన్నారు. అనంతరం వైద్యమండలి చైర్మన్ డాక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ.. భవన నిర్మాణం ప్రజారోగ్య పరిరక్షణ, అర్హులైన డాక్టర్ల అభ్యున్నతికి రేయింబవళ్లు కృషి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో యువ ప్రతిభావంతులైన వైద్యులు మండలి సభ్యులుగా అధిక మెజార్టీతో విజయం సాధించామని తెలిపారు. రాష్ట్రంలో నకిలీ వైద్యులపై కేసులు ఫైల్ చేశామని తెలిపారు. ఐఎంఏ ఎలక్టెడ్ ప్రెసిడెంట్ డాక్టర్ ద్వారకానాథ్, డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బి.రాకేష్, డాక్టర్ వైఎస్.రావు, డాక్టర్ రవికుమార్, ఉస్మానియా సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్, మండలి వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్, పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేష్, ఎథిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నగరంలో నేడు

- డా.బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు కొనసాగే వేడుకల్లో సీఎం, మంత్రులు, అధికారులు పాల్గొంటారు.
- టీ హబ్ వేదికగా తెలంగాణ బ్లాగర్స్ 'ది తెలంగాణ ఐకాన్ అవార్డ్స్–2024' కార్యక్రమం జరుగుతుంది.

రెడ్డి జేఏసీ సన్మానసభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రెడ్డి జేఏసీ, చైర్మన్, కో చైర్మన్లు

రాంగోపాల్‌పేట్: రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన హైటెక్‌సిటీలోని శిల్పారామంలో నిర్వహించే రెడ్డి ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్ల సన్మానసభను విజయవంతం చేయాలని చైర్మన్, కో చైర్మన్లు అప్పమ్మగారి రాంరెడ్డి, పైళ్ల హరినాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్క్‌లేన్‌లోని సాలిటైర్ హోటల్లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కొత్తగా ఎన్నికైన రెడ్డి ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా నియమితులైన వారందరినీ ఒక చోట చేర్చి సన్మానించాలనే ఉద్దేశ్యంతో ఈ సభను ఏర్పాటు చేశామని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులను సభకు ఆహ్వానించినట్లు తెలిపారు. ఎన్నికల్లో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి మిగతా కార్పొరేషన్లతో పాటు తమ కార్పొరేషన్‌ను ప్రకటించారని గుర్తు చేశారు. సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారని, కార్పొరేషన్ విధి విధానాలు, దాని అమలు గురించి ఇదే వేదిక నుంచి సీఎంకు విన్నవిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 ఎన్నికల మ్యానిఫెస్టోలో రెడ్డి కార్పొరేషన్ పెట్టి కూడా 8 ఏళ్ల పాటు హామీ నిలబెట్టుకోలేదని, దీని కోసం అనేక పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. రెడ్డి కార్పొరేషన్ కోసం పోరాటాలు చేసి రాజకీయాలకు అతీతంగా ఉన్న జేఏసీ ప్రతినిధులను చైర్మన్, డైరెక్టర్లను నియమిస్తారనే ఆశాభావాన్ని రెడ్డి జేఏసీ మహిళా చైర్‌పర్సన్ వసంతరెడ్డి కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి రెడ్డి సామాజికవర్గ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాధవరెడ్డి, మహేందర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, లావాణ్యారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, పుష్పలతారెడ్డి, రాధికారెడ్డి, నీరజారెడ్డి పాల్గొన్నారు.

అడుగడుగునా సీసీ కెమెరాలతో నిఘా

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- టీ–20 మ్యాచ్‌కు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి
- రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు



ఉప్పల్ అంతర్జాయ క్రికెట్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు

ఉప్పల్: ఉప్పల్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 12న ఇండియా–బంగ్లాదేశ్ టీ–20 మ్యాచ్ విజయవంతం చేసేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు సూచించారు. ఈ మేరకు ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, హెచ్‌సీఏ ప్రతినిధులతో కలిసి శుక్రవారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. సెక్యూరిటీ పరంగా ఎలాంటి లోపాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. టికెట్ల పంపిణీలో గందరగోళం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అడుగడుగునా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెంచాలన్నారు. ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అంతకుముందు డీసీపీ పద్మజ, హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు, ఇతర విభాగాల అధికారులతో కలిసి స్టేడియంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌సీఏ ఉపాధ్యక్షుడు దల్జీర్‌సింగ్, ఎస్‌వోటీ డీసీపీ రమణారెడ్డి, డీసీపీ ఉషావిశ్వనాథ్, ఎస్‌బీ డీసీపీ కరుణాకర్, అరవింద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్న కుర్రాడిలాగా ఏంటీ ఆ డ్యాన్సులు? అంటూ ఎవరైనా ఆక్షేపించినా వెనకడుగు వేయనక్కర్లేదు. ఎందుకంటే డ్యాన్సులు చేస్తే వృద్ధుల్లో కుర్రతనం ఇనుమడిస్తుందని, వృద్ధాప్య ప్రభావం కనుమరుగవుతుందని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. వృద్ధాప్యంపై యుద్ధంలో మిగిలిన అన్నిరకాల శారీరక వ్యాయామాల కన్నా డ్యాన్స్ ది బెస్ట్ అని తేల్చడం విశేషం. సిటీలోని ప్రతి డ్యాన్స్ స్టూడియో తమ నేమ్ బోర్డులో ఫిట్‌నెస్ అనే పదాన్ని చేర్చుకుంటున్న నేపథ్యంలో పెద్దవాళ్లు సైతం డ్యాన్సర్లుగా మారేందుకు ఇలాంటి సర్వే ఫలితాలు తోడ్పడనున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో





ఓల్డేజ్.. ఓల్డేజ్.. డ్యాన్స్‌తో వృద్ధాప్యం వెనక్కి

ఇవీ తెలుసుకోండి..

శక్తి సామర్థ్యాలు పెరుగుతాయి. అవయవాల పనితీరు మెరుగుపడుతుంది. అలాగే సంతోషకారక హార్మోన్లు విడుదల అవుతాయి అని ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ (క్యుయుటి) కూడా నిర్ధారించింది.

- అంతర్గత ఆరోగ్య సమస్యలున్నవారికి నృత్యాలు సరిపడవు. కాబట్టి నృత్యాన్ని ఎంచుకునే ముందు ఫ్యామిలీ డాక్టర్ అభిప్రాయం తీసుకోవడం అవసరం.
- సోలో డ్యాన్సింగ్ సులభమైనది, పెద్దలకు బాగా నప్పుతుంది. అదే విధంగా ఓరియంటల్ డ్యాన్స్, బాలె డ్యాన్స్, ఇండియన్ డ్యాన్స్, ట్యాప్ డ్యాన్స్.. వంటివి చేయవచ్చు.



- మోకాలు, హిప్, కాలి మడమ నొప్పులు.. వంటివి ఉన్నవారి కోసం సీటెడ్ డ్యాన్స్ కూడా ఉంది.
- బాల్ రూమ్ డ్యాన్స్‌నే సీనియర్స్ బాగా ఇష్టపడతారు.. ఎందుకంటే ఇవి కపుల్ డ్యాన్స్ క్లాసెస్ కావడంతో పెద్దలకు చాలా ఉపయుక్తం. – ఈ డ్యాన్సుల్లో ఇతరులతో సోషలైజింగ్ ఉంటుంది కాబట్టి, ప్రాధాన్యత కలిగిన వారిమే అనే అభిప్రాయంతో హుషారు వస్తుంది.
- పెద్దల్లో ట్యాంగో, క్విక్ స్టెప్, వియన్నీస్ వాల్ట్జ వంటివి జ్ఞాపకశక్తి వృద్ధి చెందేందుకు దోహదం చేస్తాయి.
- చా– చా– చా, రుంబా, సాంబా, ప్యాసో.. వంటి విదేశీ నృత్యాలు చూడడానికి కాస్త సులభంగా అనిపించినా చేసేందుకు కొంత సంక్లిష్టంగా ఉంటాయి. అలాగే వీటికి మరింత శారీరక సామర్థ్యం అవసరం కాబట్టి వీటిని ఎంచుకోకపోవడమే ఉత్తమం.
- లైన్ డ్యాన్సింగ్ పెద్ద వయసులో ఉన్న వారికి అత్యంత ఆదరణ పొందుతోన్న నృత్యశైలి. అమెరికాలో ఇది బాగా పాపులర్. ఈ నృత్యంలో డ్యాన్సర్లు ఒకరితో ఒకరు టచ్ చేయాల్సిన అవసరం ఉండదు.



- అధ్యయనాల్లో ఆసక్తికర అంశాలు వెల్లడి
- పెద్దవారిలో అల్జీమర్స్ వంటి వ్యాధులకు నృత్యంతో చెక్
- పెద్దవారికి నప్పేవిగా ప్రత్యేక నృత్యాల ఎంపిక
- ఆరోగ్య సమస్యలుంటే ముందస్తు వైద్య సలహా అవసరం

వృద్ధాప్యాన్ని జయించడంలో శారీరక శ్రమను మించిన ప్రత్యామ్నాం లేదు. దీనిని ఇప్పుడిప్పుడే ఆధునికులు గుర్తిస్తున్నారు. జిమ్‌లు, యోగాసనాలు.. వగైరా ఎన్నో వ్యాయామ శైలులు.. ఒక్కో వ్యాయామం ద్వారా ఒక్కో రకమైన ప్రయోజనం. అదే క్రమంలో నృత్యం ద్వారా వృద్ధాప్యాన్ని జయించవచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి.



స్టడీ ఇదీ.. ఫలితం ఇదీ..

అన్ని వ్యాయామాలూ ఆరోగ్యానికి ఉపయోగపడేవే అయినా నృత్యం వల్ల వృద్ధాప్య సమస్యలకు చాలా మంచిదని ఫ్రంటియర్స్ ఇన్ హ్యూమన్ న్యూరోసైన్స్ జర్నల్‌లో ప్రచురించిన తాజా పరిశోధన నిర్ధారించింది. వయసు పరంగా మీదపడే శారీరక మానసిక సమస్యలను ఎదుర్కోడంలో ఎండ్యురెన్స్‌ట్రైనింగ్, డ్యాన్సింగ్ రెండింటి మధ్యా వ్యత్యాసాన్ని పరిశీలించినప్పుడు డ్యాన్స్ మరింత లాభదాయకమని తేలిందని పరిశోధనకు సారథ్యం వహించిన జర్మన్ సెంటర్ ఫర్ న్యూరో డీజెనరేటివ్ డిసీజెస్‌కు చెందిన డాక్టర్ కేథరిన్ అంటున్నారు. సగటున 68 ఏళ్ల వయసున్న వందలాది మందికి 18 నెలల పాటు నృత్య శిక్షణ, ఎండ్యురెన్స్, ఫ్లెక్సిబిలిటీ ట్రైనింగ్ ఇచ్చారు. అయితే వీరిలో నృత్యాన్ని ఎంచుకున్నవారి బ్రెయిన్‌లోని హిప్పో క్యాంపస్ ప్రాంతంలో మరింత ఆరోగ్యకరమైన వృద్ధి కనిపించింది. వృద్ధాప్య ప్రభావాన్ని పెంచి తత్సంబంధిత అల్జీమర్స్ తరహా వ్యాధుల్ని దరిచేర్చడంలో కీలకం ఈ ప్రాంతమే. ఈ పరిశోధన ఫలితాలను అనుసరించి బ్రెయిన్‌పై యాంటీ ఏజింగ్ ప్రభావాలను చూపే సరికొత్త ఫిట్‌నెస్ ప్రోగ్రామ్‌ను జిమ్మిన్ (జామ్మింగ్, జిమ్నాస్టిక్) అనే పేరుతో శబ్దాలను (మెలొడీస్, రిథమ్) పుట్టించే ఒక కొత్త పద్ధతిని వీరు రూపొందించారు.

నృత్యం ఆరోగ్యకరం..

ప్రతి ఒక్కరూ ఎంత కాలం వీలైతే అంత కాలం స్వతంత్రంగా, ఆరోగ్యవంతంగా జీవించాలని కోరుకుంటారు. శారీరక శ్రమ దీనికి ఉపకరిస్తుంది. దీనిలో నృత్యం భాగమైతే శరీరానికి, మైండ్‌కి కొత్త సవాళ్లను, చురుకుదనాన్ని అందించడం అనివార్యం అని నగరానికి చెందిన డ్యాన్స్ మాస్టర్ బాబీ అంటున్నారు. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్నవారికి ఇది మరింత మేలు చేస్తుందనేది తమ వద్ద శిక్షణకు వస్తున్నవారి విషయంలో రుజువైందన్నారు.



ఏజింగ్.. నథింగ్..

శారీరక వ్యాయామం ద్వారా వృద్ధాప్యాన్ని నిరోధించవచ్చనేది గతంలో కూడా రుజువైనదే అయినప్పటికీ.. ఒకదానికన్నా మరొకటి ఎలా, ఎందులో మెరుగు అనేది మాత్రం నిర్ధారణ కాలేదు. సంప్రదాయంగా చేసే సైక్లింగ్, వాకింగ్ తదితర వ్యాయామాలు సాధారణంగా రిపిటీటివ్‌గా ఉంటాయి. అయితే నృత్యంలో ఎప్పటికప్పుడు కొత్త కొత్త సవాళ్లు, సరదాలు ఎదురవుతుంటాయి. ఈ పరిశోధన కోసం ఎంచుకున్నవారికి జాజ్, స్క్వేర్, లాటిన్, అమెరికన్, లైన్ డ్యాన్స్.. ఇలా విభిన్న రకాలుగా నృత్యశైలులను మారుస్తూపోయారు. 'నృత్యం అంటే స్టెప్స్, చేతులు తిప్పే విధానాలు, వేగం, రిథమ్.. ఇవన్నీ తరచూ మారుతుంటాయి. దీంతో వారికి ఇది నిరంతరం నేర్చుకునే ప్రక్రియగా ఉంటుంది.' అని నగరానికి చెందిన నృత్యశిక్షకుడు పృథ్వీ చెప్పారు.



నల్లగండ్ల చందన బ్రదర్స్ షాపింగ్ మాల్ ప్రారంభించిన వైష్ణవి చైతన్య

చందనలో బేబీ..

శేరిలింగంపల్లి: నల్లగండ్లలో చందన బ్రదర్స్ షాపింగ్‌మాల్‌ను సినీనటి 'బేబీ' ఫేమ్ వైష్ణవి చైతన్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాల్ మొత్తం కలియతిరిగి కాసేపు సందడి చేశారు. మాల్ మేనేజింగ్ డైరెక్టర్ జానా సురేష్ మాట్లాడుతూ 40 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల్లో చందనా బ్రదర్స్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేశారు. వినియోగ దారుల అభిరుచికి అనుగుణంగా రకరకాల వస్త్రాలను అందుబాటులో ఉంచడంతోనే ప్రజలు తమపట్ల ఆసక్తి కనబరుస్తున్నారని, ఈ నేపథ్యంలోనే తెలుగు రాష్ట్రాల్లో విస్తరణ జరుగుతోందన్నారు. దసరా, దీపావళి పర్వదినాలను పురస్కరించుకొని 51 శాతం వరకూ తగ్గింపు ఇవ్వడంతోపాటు ప్రతి రూ.1000ల వస్త్రాల కొనుగోలుపై ఒక కూపన్ లక్కీడ్రా, బంపర్‌డ్రాలో ప్రతి రోజూ బంగారం గెలుపొందవచ్చన్నారు. ప్రతి చిన్న అవసరానికి, ఫంక్షన్‌కు మొదట గుర్తొచ్చేది 'చందన బ్రదర్స్' షాపింగ్ మాల్ మాత్రమేనని, మహిళల అభిరుచికి అనుగుణంగా దుస్తులను అందుబాటులో ఉంచడం ఈ సంస్థ ప్రత్యేకత అని వైష్ణవి చైతన్య అన్నారు.



నేడే చూడండి!

- 'బాలు గాని టాకీస్' వినూత్న ప్రచారం..
- ప్రసాద్ ల్యాబ్స్ వేదికగా ప్రదర్శన
- అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసే రీతిలో
- ప్రదర్శనలో టికెట్ కౌంటర్, గోలీసోడా, మైక్ రిక్షా

సాక్షి, సిటీబ్యూరో: ఏదైనా సినిమా రిలీజ్ అయితే చాలు ఇప్పుడంటే.. ఆన్‌లైన్ బుకింగ్, సోషల్ మీడియా, లేదా టీవీ ప్రచారం వల్ల తెలుస్తుంది.. కానీ 80, 90వ దశకంలో అలాకాదు.. సినిమా రిలీజ్‌కు వారం రోజుల ముందే థియేటర్ యజమానులు రిక్షా బండిపై ప్రచారం నిర్వహించేవారు.. ఊరూరా మైక్ ప్రచారంలో భాగంగా నేడే చూడండి.. బాబు మీ అభిమాన థియేటర్‌లో అంటూ ఆ సినిమా గురించి ప్రచారం నిర్వహించేవారు.. అదే రీతిలో 'బాలుగాని టాకీస్' సినిమా ప్రివ్యూ ప్రసాద్ ల్యాబ్స్ వేదికగా వినూత్న రీతిలో జరిగింది.. టూరింగ్ టాకీస్, పాత టిక్కెట్ కౌంటర్, గోలీసోడా, పల్లీ, సమోసా, నేల టిక్కెట్టు వంటి అనుభూతులను నగర ప్రజలకు గుర్తు చేశారు. యువ దర్శకులు విశ్వనాథ్ సారథ్యంలో రూపుదిద్దుకున్న 'బాలుగాని టాకీస్' ప్రివ్యూ షో ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా దర్శకులు విశ్వనాథ్ మాట్లాడుతూ.. ఆనాటి సినిమా అంటే అందరికీ ఓ మధుర జ్ఞాపకం. నా సినిమా ప్రివ్యూ ద్వారా మరోసారి అప్పటి రోజులను గుర్తు చేయాలని ఈ ఏర్పాట్లు చేశామన్నారు. బాలుగాని టాకీస్ ప్రముఖ ఓటీటీలో వీక్షించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సినిమా ముఖ్యతారాగణం.. శివ రామచంద్రవరపు, శరణ్య శర్మ, మ్యూజిక్ డైరెక్టర్ స్మరణ్ తదితరులు పాల్గొని సందడి చేశారు.







నగరంలో నవరాత్రి తాలి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఎక్కడ చూసినా దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఒక్కోరోజు ఒక్కో నైవేద్యం అమ్మవారికి సమర్పించుకుంటారు. అమ్మవారి మండపాలు, దేవాలయాల్లోనే కాకుండా పలు హోటల్స్ కూడా ప్రత్యేకమైన వంటకాలను కస్టమర్లకు అందిస్తున్నాయి. మైండ్‌స్పేస్ సోషల్‌లో నవరాత్రి స్పెషల్ ఫుడ్‌ను అక్టోబర్ 11 వరకూ అందిస్తోంది.

నవరాత్రి డిలైట్స్..

అలాగే నవరాత్రి డిలైట్స్ పేరిట రాడిసన్ బ్లూ హోటల్‌లో అక్టోబర్ 12 వరకూ నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక వంటకాలను ఆహారప్రియులకు అందించనున్నారు. మధ్యాహ్నం 12.30 నుంచి 3.30 వరకూ ఈ ప్రత్యేక వంటకాలు అందుబాటులో ఉంటాయి. ముఖ్యంగా గుజరాత్ స్పెషల్ వంటకాలు ఆహార ప్రియులను మైమరపింపచేస్తున్నాయి.

ఆశ్చర్యపరుస్తున్న ఇవాన్





చౌ.. చౌ.. భౌ..భౌ!

సాక్షి, సిటీబ్యూరో: ఈ ఫొటోలో ఉన్న జంతువు పేరేంటో తెలుసా..? సడన్‌గా చూసి ఎలుగుబంటి అనుకుంటున్నారా? ఎందుకైనా మంచిది మరోసారి చూడండి.. అయినా మీకు ఎలుగుబంటే కనిపిస్తుందా..? అయితే మీరు తప్పులో కాలేసినట్టే.. ఎందుకంటే ఎలుగుబంటి కాదు.. అదో బుజ్జి కుక్క పిల్ల. ఈ కుక్క పేరు చౌ.. చౌ..! ఈ కుక్కలు చైనాలో ఉంటాయి.. అంబర్‌పేటకు చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగి ఈ కుక్కను చైనా నుంచి తెప్పించుకుని ఇవాన్ అనే పేరుతో పిలుస్తున్నారు. నల్ల రంగులో ఉండటంతో చాలామంది దీన్ని ఎలుగుబంటి అనుకుంటున్నారు. యజమాని దగ్గరికి వెళ్లి మరీ దీని గురించి ఆరా తీస్తున్నారు. చివరకు అది కుక్క అని తెలిసి అందరూ ఆశ్చర్యపోతున్నారు.

దక్షిణాదిలో సీఎఫ్‌ఏ అవార్డ్స్

- టాలీవుడ్ కాస్ట్యూమ్ డిజైనర్లు, ఫ్యాషన్ నిపుణులకు గుర్తింపు..
- వెల్లడించిన ఆర్వీ వల్లభనేని స్టూడియోస్..

సాక్షి, సిటీబ్యూరో: టాలీవుడ్ సినిమా వైభవానికి తోడ్పడుతున్న సాంకేతిక నిపుణులు, కాస్ట్యూమ్ డిజైనర్ల ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చేందుకు దక్షిణ భారత్‌లో అతిపెద్ద అవార్డుల వేడుకను నిర్వహించనున్నామని ఆర్వీ వల్లభనేని స్టూడియోస్ ప్రకటించింది. కాస్ట్యూమ్, ఫ్యాషన్ అవార్డ్స్ (సీఎఫ్ఏ) పేరుతో అందిస్తున్న ఈ అవార్డులను తొలిసారిగా అందించనున్నారు. దీని పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం హైటెక్ సిటీలోని ట్రైడెంట్ హోటల్స్‌లో నిర్వహించారు. నవంబర్ 30, డిసెంబర్ 1వ తేదీల్లో నగరంలోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్ వేదికగా నిర్వహించనున్నట్లు ఆర్వీ వల్లభనేని స్టూడియోస్ ప్రతినిధులు వల్లభనేని గోపీచంద్ తెలిపారు. టాలీవుడ్ విజువల్ స్టోరీ టెల్లింగ్, ఫ్యాషన్లను రూపొందించడంలో కీలక పాత్ర పోషించిన కాస్ట్యూమ్ డిజైనర్లు, ఫ్యాషన్ నిపుణుల అసాధారణ ప్రతిభను దీని ద్వారా గుర్తించనున్నామన్నారు. అనంతరం 'అవర్ థ్రెడ్ అవర్ ప్రైడ్' పేరుతో ప్రదర్శించిన వీడియో విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఖాలిద్ అల్ బలూషి, డాక్టర్ కబీర్ కెవి, డాక్టర్ అజితా సురభి, అరుణ శ్రీ సుకల, శివానీ గుప్తా పాల్గొన్నారు.







హైటెక్స్‌లో 'డిజైన్ డెమోక్రసీ'

సాక్షి, సిటీబ్యూరో: గృహాలంకరణ, ఇంటీరియర్ ఉత్పత్తుల్లో వైవిధ్యానికి, విశేషాలకు అద్దంపడు తూ ఏర్పాటైన డిజైన్ డెమోక్రసీ ఆకట్టుకుంది. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం ప్రారంభమైన ఈ ప్రదర్శనలో శైలేష్ రాజ్‌పుత్ స్టూడియో, అర్జున్ రాఠీల అత్యాధునిక లైటింగ్ డిస్‌ప్లేల నుంచి స్మితా మోక్ష్ కదారి ఆర్ట్ గ్యాలరీకి చెందిన అద్భుత కళాఖండాల వరకూ ప్రదర్శనలో కొలువుదీరాయి. ఇందులో భాగమైన తెలంగాణ మ్యూజియం ప్రదర్శన స్థానిక కళాకారుల ప్రతిభకు, నైపుణ్యానికి అద్దం పట్టింది. పర్యావరణ అను కూల పదార్థాలు ఇంటీరియర్ డిజైన్ ఎలా మారుస్తున్నాయో దానిపై 'ది ఫ్యూచర్ ఆఫ్ సస్టెయిన బుల్ డిజైన్' సెషన్ నిర్వహించడంతో పాటు డిజైనింగ్‌లో సాంకేతిక ప్రక్రియలో ఏఐ, విఆర్ ఆటోమేషన్ ప్రభావాన్ని తొలిరోజు చర్చించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, జాతీయ బ్యాడ్మింటన్ శిక్షకులు పుల్లెల గోపీచంద్, ఫిక్కీ ఫ్లో మాజీ చైర్‌పర్సన్ పింకీరెడ్డి, డిజైన్ డెమోక్రసీ వ్యవస్థాపకులు పల్లికా శ్రీవాస్తవ్, శైలజా పట్వారీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రదర్శన 7 వరకూ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం ॥ 5-10-2024





పాకీజ.. సైబర్ క్రైమ్ సబ్ ఇన్‌స్పెక్టర్, సైబర్ నేరాలను అరికట్టడంలో తన వంతు పాత్ర పోషిస్తూనే సోషల్ మీడియాలో స్త్రీలపై పిచ్చి కూతలు కూసే పోకిరీల పనిపడుతున్న ధీర మహిళ. మన పిల్లలకు ఏది మంచి... ఏది చెడు అనేది మనమే నేర్పించాలి. లేదంటే జీవితం విలువ తెలియక తమ భవిష్యత్తుతోపాటు దేశ భవిష్యత్తును కూడా నాశనం చేస్తారని హెచ్చరిస్తున్నారామె.

దసరా నవరాత్రుల సందర్భంగా రోజుకొక ప్రముఖ మహిళతో ముఖాముఖి..

సాక్షి డిజిటల్ యూ ట్యూబ్‌లో...

https://www.youtube.com/watch?v=PPytC6C9ZTI సాక్షి @ నవశక్తి

'అగ్రరాజ్యంలో' అదే చర్చ

అబార్షన్ హక్కెవరిది?



ట్రంప్ కమలా హ్యారిస్

స్త్రీ హక్కులను గుర్తిస్తే..
వాళ్ల నిర్ణయాధికారాన్ని సమ్మతించినట్లే!
వాళ్ల సాధికారతను గౌరవించినట్లే!
అయితే ఇప్పుడు పేచీ అంతా అక్కడే..
మ్యారిటల్ రేప్ నుంచి అబార్షన్ కేస్ వరకు..
అమె చాయిస్‌ను అడిగేవాళ్లు లేరు సరికదా..
ఆమె అలా అడగడమే సరికాదని వాదిస్తున్నారు..
అగ్రరాజ్యమైన అమెరికా నుంచి
అభివృద్ధి చెందుతున్న దేశాల వరకు!

అనిత (పేరు మార్చాం) ఎకనామిక్ ఎనలిస్ట్. ఆంట్రప్రెన్యూర్ కావాలనేది ఆమె లక్ష్యం. అందు కోసం పెళ్లి, పిల్లలనే జంఝాటాలూ వద్దనుకుంది. కానీ తనంటే చాలా ఇష్టపడే ఓ ఇన్వెస్టర్ పెళ్లి ప్రపోజల్ తేవడంతో, ఇంట్లో వాళ్లూ బలవంత పెట్టడంతో పెళ్లికి ఒప్పుకుంది.. తనకున్న లక్ష్యాన్ని వివరించి, పిల్లల్ని కనే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేసి మరీ! అందుకు సరే అంటూ అనిత చేయి అందుకున్నాడు అతను. అయితే ఫ్యామిలీ ప్లానింగ్ ఫెయిలై అనిత గర్భం దాల్చింది. అబార్షన్ ఆప్షన్‌ను ఎంచుకుంది. పెళ్లికి కాంప్రమైజ్ అయినట్టుగా, ప్రెగ్నెన్సీకీ కాంప్రమైజ్ అవమని ఒత్తిడి తెచ్చాడు భర్త. అలా కుదరదని తేల్చిచెప్పి, అబార్షన్ కోసం ఫ్యామిలీ డాక్టర్‌ని సంప్రదించింది. 'భర్త అంగీకారం ఉంటేనే ప్రొసీడ్ అవుతాను' అంది డాక్టర్. హతాశురాలైంది అనిత!

బాగా చదువుకున్నవాడు, లోకం తెలిసిన అనిత భర్తకే భార్య హక్కు గురించి తెలియకపోతే.. మిగిలిన వాళ్ల పరిస్థితేంటి! తొమ్మిది నెలలు మోసి, కని, పెంచే ఆమె అన్నిరకాలుగా సిద్ధంగా ఉందా లేదా అనేది తెలుసుకోవాలి! ఎందుకంటే ఆమె శరీరం మీద ఆమెదే సంపూర్ణ అధికారం! హర్ బాడీ.. హర్ చాయిస్! అందుకే ఇష్టం లేని గర్భాన్ని అవసరంలేదనుకునే హక్కు ఆమెకు ఉంటుంది.

ఇప్పుడు అమెరికా అధ్యక్ష ఎన్నికల్లోనూ ఇదే ప్రధానాంశం అయింది. దీనిమీద.. అధ్యక్ష బరిలో ఉన్న ట్రంప్, కమలా హ్యారిస్‌ల మధ్య వేడిగా వాడిగా చర్చ సాగుతోంది. డెమోక్రాట్స్ అభ్యర్థి కమలా హ్యారిస్.. స్త్రీలకు అబార్షన్ హక్కు ఉండాలని గట్టిగా చెబుతున్నారు. ఇది స్త్రీ నిర్ణయాధికారాన్ని, సాధికారతను సూచిస్తుందని ఆమె అభిప్రాయపడుతున్నారు. రిపబ్లికన్ అభ్యర్థి ట్రంపేమో దీనికి సంబంధించి తన వైఖరిని మాటిమాటికీ మారుస్తూ వస్తున్నారు. నిన్నమొన్న జరిగిన డిబేట్‌లో కూడా 'అబార్షన్ రైట్' అంశాన్ని రాష్ట్రాలకే వదిలిపెట్టాలనే నిర్ణయానికి మద్దతిచ్చాడు. ట్రంప్ మాటల మీద మిగతా వాళ్ల అభిప్రాయాలెలా ఉన్నా.. స్వయానా ఆయన సతీమణి మెలానియా ట్రంప్ మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అబార్షన్ అనేది స్త్రీ ఇష్టానికే వదిలిపెట్టాలి, అది ఆమె హక్కు.. ఈ విషయంలో రాజీకి చోటే లేదంటూ స్పష్టంగా చెప్పారు. అంతేకాదు, 'ప్రాథమిక హక్కయిన వ్యక్తి స్వేచ్ఛను నేను సంరక్షిస్తాను' అని చెప్పారు. దీంతో ఆమె మాటలు వైరల్ అయ్యాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికలపై కన్ను వేసి ఉంచిన ప్రపంచం యావత్తూ దీని మీద చర్చనూ మొదలుపెట్టింది.

అసలు ఈ అబార్షన్ రైట్ అనేది స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు నెలవైన అమెరికాలో ఎందుకంత వివాదమవుతోంది? ఆ నేపథ్యం ఏంటంటే..

అమెరికాలో అబార్షన్‌కి సంబంధించి స్త్రీ స్వేచ్ఛను సవాలు చేసేలా ఉన్న నియమ నిబంధనల మీద 1969 ప్రాంతంలో పెద్ద ఉద్యమమే సాగింది 'మై బాడీ.. మై చాయిస్' నినాదంతో. ఈ క్రమంలో 1973లో ఆ దేశ సుప్రీంకోర్ట్.. రో (Roe) వర్సెస్ వేడ్ (Wade) కేసులో గర్భస్రావం హక్కును ప్రాథమిక/ రాజ్యాంగ హక్కుగా తీర్పునిచ్చింది. అయితే అదే అమెరికా సుప్రీంకోర్ట్ 2022లో ఆ తీర్పును తిరగరాస్తూ అబార్షన్‌పై 1973 కంటే ముందున్న నియమ నిబంధనలే సరైనవని వ్యాఖ్యానిస్తూ మరో తీర్పునిచ్చింది. దీని మీద అమెరికా అంతటా మళ్లీ నిరసనలు వెల్లువెత్తాయి. ఆ తీర్పు తర్వాత దాదాపు రెండువందల మందికి పైగా మహిళల మీద అబార్షన్ నేరం కింద కేసులు నమోదైనట్టు ఓ నివేదిక తెలిపింది. అప్పటి నుంచి అబార్షన్ రైట్ కోసం అమెరికాలో పోరాటం సాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు, వాటిని వ్యతిరేకిస్తూ మెలానియా వెలిబుచ్చిన తన అభిప్రాయంతో మళ్లీ ఒకసారి ప్రపంచంలోని దేశాలన్నీ అబార్షన్‌కి సంబంధించి తమ దేశాల్లోని చట్టాలు, అవి మహిళలకు ఇస్తున్న వెసులుబాటు, వాళ్ల హక్కుల్ని గౌరవిస్తున్న తీరుతెన్నులను పరిశీలించుకుంటున్నాయి. మనమూ మన దగ్గరున్న చట్టాన్ని ఒకసారి పరికిద్దాం!

గర్భం దాల్చాలా? వద్దా? అనేది మహిళే నిర్ణయించుకోవాల్సిన విషయం. దీన్ని ఆమె స్వేచ్ఛకే వదిలేయాలని మన చట్టం చెబుతోంది. మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్ 1971, సెక్షన్ 3 ప్రకారం.. గర్భస్రావం తప్పనిసరైనప్పుడు దానికి గర్భిణి అంగీకారం మాత్రమే చాలు. 2017లో అనిల్‌కుమార్ వర్సెస్ అజయ్ పత్రీచా కేసులో 'గర్భం దాల్చాలా వద్దా అనే అంశంలో తుది నిర్ణయం మహిళదే. వైవాహిక బంధానికి సమ్మతించినంత మాత్రాన ఆ పురుషుడి బిడ్డకు తల్లి నౌతానని ఆమె అంగీకరించినట్టు కాదు' అని సుప్రీంకోర్ట్ వ్యాఖ్యానించింది. దీన్నిబట్టి అబార్షన్ సమయంలో పురుషుడి అనుమతి అవసరం లేదు. స్త్రీ అంగీకారం మాత్రమే చాలు అని అర్థమవుతోంది. అయితే భర్త అనుమతి లేకుండా అబార్షన్ చేయించుకుంటే అది నేరం కాకపోయినప్పటికీ, ఆ కారణాన్ని చూపి భర్త విడాకులు కోరే అవకాశం ఉంటుంది.

మొత్తంగా చూస్తే..

అబార్షన్‌కి సంబంధించిన చట్టాల్లో మనం అమెరికా కంటే మెరుగే అని తెలుస్తోంది. ఆ విషయంలో మన చట్టం.. స్త్రీ హక్కును గౌరవిస్తోంది. ఆచరణలో మటుకు సమాజం ఇంకా చైతన్యవంతం కావాలి.

– సరస్వతి రమ

ఎంచుకునే స్వేచ్ఛను ఇవ్వాలి

మదర్‌హుడ్ అంటే ఒకరకంగా స్త్రీల మీద టాక్సేషన్ లాంటిదే! ఎందుకంటే తొమ్మిది నెలలు మాత్రమే కాదు పిల్లలు పెరిగి, వాళ్లు ఇండిపెండెంట్ అయ్యే వరకు కూడా స్త్రీల కెరీర్ పాజ్‌లోనే ఉంటుంది. పర్‌ఫార్మెన్స్ బేస్డ్ ఉద్యోగాల సొసైటీలో ఇదంతా అవరోధంగానే ఉంటుంది. ఇలాంటప్పుడే మదర్‌హుడ్ కావాలా? కెరీర్ కావాలా అని ఎంచుకునే పరిస్థితి ఎదురవుతుంది. రెండూ కావాలనుకునే వాళ్లు ఎన్నోరకాల ఒత్తిడికి లోనవుతుంటారు. ఆర్థికంగా, సామాజికంగా ఆమెకు ఎన్నో సౌలభ్యాలు సమకూర్చితే తప్ప ఆమె రెండు ఆప్షన్స్‌ను ఎంచుకునే వీలుండదు. కానీ ఈ వెసులుబాట్లేమీ లేవు. ఉండవు. అలాంటప్పుడు ఏది కావాలో ఎంచుకునే స్వేచ్ఛను ఆమెకివ్వడమే కరెక్ట్. అబార్షన్‌ను ఆమె హక్కుగా గుర్తించి, గౌరవించాలి.



– అపర్ణ తోట,
జెండర్ కన్సల్టెంట్,
ది పర్పుల్ వరండా

స్త్రీ యంత్రం కాదు

స్త్రీ శరీరం ఒక యంత్రం కాదు. బిడ్డను మోసి, కని, పెంచేందుకు ఆమె మానసికంగా, శారీరకంగా సిద్ధపడి ఉండాలి. అందుకే అది పూర్తిగా ఆమె స్వేచ్ఛకు సంబంధించిన అంశం. పురుషుడికి ఆ విషయంలో ఎటువంటి హక్కు ఉండదు, ఉండకూడదు. నా ఉద్దేశంలో Roe vs. Wade కేసును అమెరికా సుప్రీంకోర్టు తిరగ రాయడం సమంజసం కాదు.



– శ్రీకాంత్ చింతల, హైకోర్ట్ అడ్వకేట్

కలవరపెట్టే విషయం..

ఈ మధ్యకాలంలో డోనాల్డ్ ట్రంప్, కమల హారిస్ మధ్య roe vs wade పై జరిగిన చర్చ డెవలప్డ్ కంట్రీ అనే పిలవబడే అమెరికా, అక్కడి రాజకీయాల్లోని ఆలోచన ధోరణుల్లోని వ్యత్యాసాన్ని తెలుపుతోంది. అబార్షన్ హక్కులను పరిమితం చేయడానికి ఒత్తిడి తెచ్చిన వాళ్లలో ట్రంప్ ఒకడు. అతని హయాంలో అబార్షన్ హక్కులను పరిమితం చేసే ప్రయత్నాలు చాలా జరిగాయి. Anti abortion ఉద్యమానికి అతను మద్దతు ఇచ్చాడు. మరోవైపు పునరుత్పాదక హక్కులు అనేవి వ్యక్తిగత స్వేచ్ఛకి, అలాగే హెల్త్ కేర్ యాక్సెస్‌కి ప్రాథమికం అనే ప్రగతిశీల దృక్పథం కమలది. బిడ్డని కనాలా వద్దా అని నిర్ణయం తీసుకునే హక్కు ఆడవాళ్ళ అధికారాన్ని సమానత్వాన్ని సూచిస్తుందని ఆమె వాదన. అబార్షన్ హక్కులు లేకపోవడం వలన వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా ప్రజారోగ్యం మీద, సోషియో ఎకనామిక్ స్టేటస్ పైనా ప్రభావం ఉంటుందనే ముఖ్యమైన అంశాన్ని ఆమె లేవనెత్తింది. ఈ చర్చలో వచ్చినవి వ్యక్తిగత అభిప్రాయాలే కాదు, భవిష్యత్తులో అమెరికన్ సమాజం ఎలా ఉండబోతుందో కూడా తెలుపుతున్నాయి. అబార్షన్ హక్కు లేకపోవడం వల్ల ఎంతోమంది మహిళలు ప్రాణాలు కూడా కోల్పోయారు. మహిళల జననాంగాల గురించి పబ్లిగ్గా అశ్లీల వ్యాఖ్యలు చేసిన ట్రంప్ లాంటి పురుషహంకారులకు మహిళల స్వేచ్ఛ ఎలాగూ అర్థం కాదు. ఐతే ఇటువంటి వాదనలను సమర్థించే వాళ్లలో చదువుకున్న వాళ్లు, స్త్రీలూ కూడా ఉండడం కలవరపెట్టే విషయం.



– దీప్తి శిర్ల, జెండర్ యాక్టివిస్ట్

• నగధగలు

ఆభరణం ఇలా భద్రం

అందమైన ఆభరణాలను ఎక్కువ డబ్బు పెట్టి కొనుక్కుంటాం. వాటిని ధరించి ఆనందిస్తాం. కానీ ఆభరణాలను కలకాలం అందంగా ఉంచుకోవడం కూడా తెలుసుకోవాలి. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఆభరణాలు కాంతిహీనమవుతాయి.



- ఫంక్షన్‌లకు వెళ్లేటప్పుడు ఆభరణాలు ధరించిన తర్వాత ఒంటికి లోషన్లు– సన్‌స్క్రీన్‌లు రాయడం, పెర్‌ఫ్యూమ్ స్ప్రే చేసుకోవడం మంచిది కాదు. ఇలా చేస్తే కాస్మటిక్స్‌లోని రసాయనాలు ఆభరణాల లోహాల మధ్య రసాయన చర్యకు కారణమవుతుంది. ఆభరణాలు మెరుపు తగ్గడం, రంగుమారడం వంటి పరిణామాలు సంభవిస్తాయి. కాబట్టి ఒంటికి క్రీములు, పెర్‌ఫ్యూమ్‌లు వేసుకోవడం పూర్తయిన తర్వాత మాత్రమే ఆభరణాలను ధరించాలి.
- ఆభరణాలను ధరించిన తర్వాత తీసి బీరువాలో దాచేటప్పుడు నేరుగా డబ్బాలో పెట్టడం మంచిది కాదు. ఒంటి మీద నుంచి తీసిన తరవాత కొంతసేపు గాలికి ఆరనివ్వాలి. ఆ తర్వాత నూలువస్త్రంతో తుడవాలి. శుభ్రమైన మెత్తని నూలు వస్త్రంలో చుట్టి డబ్బాలో పెట్టాలి.
- ఆభరణాలను శుభ్రం చేయడానికి రసాయనాలను వాడరాదు. ఇలా చేస్తే బంగారు ఆభరణాల మెరుపు పోవడంతోపాటు ఆభరణం రంగుమారుతుంది. ఆభరణం రంగు మారిన వెంటనే ఇది కచ్చితమైన బంగారమేనా అనే అనుమానం వస్తుంది. ఆభరణం తయారీలో బంగారంలో కొన్ని ఇతర లోహాలను కలుపుతారు. అవి రసాయనాల కారణంగా రంగుమారుతాయి.
- ఆభరణాలను మెత్తని వస్త్రంతో మృదువుగా తుడవాలి.
- నిద్రపోయేటప్పుడు ఆభరణాలను ధరించరాదు. బంగారు మెత్తని లోహం. సున్నితమైన పనితనంతో లోహంలో రాళ్లు, వజ్రాలను పొదుగుతారు. నిద్రలో ఒత్తిడికి గురైరాళ్ల ఊడిపోయే ప్రమాదం ఉంది. రాలి పడిన రాళ్లను తిరిగి పొదగడం కష్టం. తిరిగి అమర్చినప్పటికీ అతుకు తెలిసిపోతుంది. ఆభరణానికి స్వతహాగా ఉండే అందం పోతుంది.
- రెండు వేర్వేరు లోహాలను ఒకచోట ఉంచరాదు. అంటే బంగారు, వెండి ఆభరణాలను ఒకే డబ్బాలో పెట్టకూడదు. విడిగా భద్రపరచాలి. అలాగే రెండు ఆభరణాలను కూడా ఒకే పెట్టెలో పెట్టరాదు. ఒకదానికొకటి రాసుకుని గీతలు పడతాయి, మెరుపు కూడా తగ్గుతుంది.



– రీటా షా
కన్సల్టెంట్ అండ్ జ్యూయలరీ డిజైనర్, హైదరాబాద్

రుచి కోరుకోండి

వంటిల్లు

దసరా నవరాత్రులు మొదలయ్యాయి. అమ్మవారికి ప్రసాదాలు చేయాలి. ఆ ప్రసాదాలను పిల్లలు ఇష్టంగా తినాలి. పొంగలి... పులిహోరకు తోడు ఇంకేం చేద్దాం. పచ్చికొబ్బరితో లడ్డు... ట్రై చేద్దాం. మూంగ్‌దాల్ కోకోనట్ ఖీర్ కూడా చేద్దాం.



మూంగ్‌దాల్ ఖీర్

కావలసినవి: పెసరపప్పు – అరకప్పు; నీరు – ఒకటిన్నర కప్పు; కొబ్బరిపాలు – ముప్పావు కప్పు (కొబ్బరి పాలు వీలుకాకపోతే గేదెపాలు లేదా ఆవుపాలు); బెల్లం పొడి– ముప్పావు కప్పు; యాలకుల పొడి – అర టీ స్పూన్; జీడిపప్పు – పది; కిస్‌మిస్ – పది ; ఎండుకొబ్బరి పలుకులు – 2 టేబుల్ స్పూన్‌లు; నెయ్యి – 2 టేబుల్ స్పూన్‌లు; వెన్న తీయనిపాలు – అరలీటరు (పావు వంతుకు ఇంకే వరకు మరిగించాలి).

తయారీ: • మందపాటి పెనం వేడి చేసి అందులో పెసరపప్పు వేసి మంట తగ్గించి పచ్చివాసన పోయి మంచి వాసన వచ్చే వరకు వేయించాలి. వేడి తగ్గిన తరవాత పప్పును కడిగి నీటిని పోసి ప్రెషర్ కుకర్‌లో రెండు – మూడు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి • ఈ లోపు బెల్లం పొడిని ఒక పాత్రలో వేసి నాలుగు టేబుల్ స్పూన్‌ల నీటిని పోసి మరిగించాలి. చిక్కబడేటప్పుడు దించి పక్కన పెట్టాలి • ఒక పెనంలో నెయ్యి వేడి చేసి జీడిపప్పు, కిస్‌మిస్, ఎండుకొబ్బరి పలుకులను వేయించి పక్కన పెట్టాలి • ప్రెషర్ కుకర్ వేడి తగ్గిన తర్వాత మూత తీసి పెసరపప్పును మెదపాలి. అందులో కొబ్బరి పాలు కలిపి స్టవ్ మీద పెట్టి ఒక చిన్న మంట మీద ఐదు నిమిషాల సేపు ఉడికించాలి. ఆ తర్వాత బెల్లం పాకం, యాలకుల పొడి కలిపి ఉడికించాలి. ఇప్పుడు చిక్కటి పాలను కూడా పోసి కలిపితే పెసరపప్పు పాయసం రెడీ. చివరగా నేతిలో వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్, ఎండుకొబ్బరి పలుకులను నేతితో సహా వేసి కలపాలి.

గమనిక: నీటి కొలత ప్రెషర్ కుకర్‌లో ఉడికించడానికి మాత్రమే. పాత్రను నేరుగా స్టవ్ మీద పెట్టి ఉడికిస్తే కనీసం మూడు కప్పుల నీరు అవసరమవుతుంది.



కొబ్బరి లడ్డు

కావలసినవి: పచ్చి కొబ్బరి తురుము – 2 కప్పులు; యాలకుల పొడి– పావు టీ స్పూన్ ; జీడిపప్పు – 10; నెయ్యి– టీ స్పూన్; చక్కెర – ముప్పావు కప్పు (రుచిని బట్టి మోతాదు మార్చుకోవాలి); పాలు – కప్పు.

తయారీ: • ఒక పెనంలో నెయ్యి వేడి చేసి జీడిపప్పులు వేయించి పక్కన పెట్టాలి • అదే పెనంలో కొబ్బరి తురుము, పాలు, చక్కెర, యాలకుల పొడి వేసి మరిగించాలి • మిశ్రమం అడుగుకు అంటుకోకుండా కలుపుతూ ఉండాలి. మిశ్రమం దగ్గరయ్యేటప్పుడు తరచుగా కలుపుతూ ఉండాలి • పాలు, చక్కెరలను కొబ్బరి తురుము పూర్తిగా పీల్చుకుని తేమ ఇంకిన తర్వాత స్టవ్ ఆపేయాలి • మిశ్రమం వేడి తగ్గి గోరు వెచ్చగా ఉన్నప్పుడు అందులో జీడిపప్పు వేసి కలిపి మిశ్రమాన్ని పెద్ద నిమ్మకాయంత సైజులో చేతుల్లోకి తీసుకుని లడ్డూలు చేయాలి.

గమనిక : చక్కెర బదులు బెల్లంతో కూడా చేసుకోవచ్చు. చక్కెరతో చేస్తే చూడడానికి తెల్లగా ఆకర్షణీయంగా ఉంటాయి. పిల్లలకు చక్కెర తింటే జలుబు చేసేటట్లయితే బెల్లంతో చేసుకోవచ్చు.

వంట చేస్తున్నప్పుడు నడుమునొప్పి రాకూడదంటే...

వంట చేసే సమయంలో ప్లాట్‌ఫారమ్ మీదికి ఒంగిపోయి వండాల్సిన కారణంగా మహిళల్లో ఆ టైమ్‌లో నడుమునొప్పి సమస్య కనిపించడం చాలా సాధారణం. అదీగాక కిచెన్ ప్లాట్‌ఫారమ్ దగ్గర చాలాసేపు నిలబడాల్సి రావడంతో పాటు, సింక్ దగ్గర కూడా ఒంగి పని చేయాల్సి వస్తుంది. దాంతో వారి బరువు నడుము మీద చాలాసేపు పడటం వల్ల నడుమునొప్పి వస్తుంటుంది.



ఇలాంటి వారు తమ ఎత్తుకు అనుగుణంగా ప్లాట్‌ఫారమ్ అమర్చుకోవాలి. అంతేకాదు... నిలబడాల్సిన అవసరం లేనప్పుడు కూర్చోడానికి వీలుగా ఎత్తైన లాంగ్ స్టూల్‌ను వేసుకోవడం మేలు. అలా కూర్చున్నప్పుడు కాళ్ల పెట్టుకోడానికి వీలుగా ఆ స్టూలుకు ఫుట్‌రెస్ట్ కోసం అడ్డుపట్టీలు ఉండాలి. వాటిపై కాళ్లు ఆనించి ఉంచాలి. అలా నడుముకూ, కాళ్లకూ సపోర్ట్ ఇవ్వడం వల్ల నడుమునొప్పి తగ్గే అవకాశాలు ఎక్కువ. అప్పటికీ తగ్గకపోతే డాక్టర్‌ను సంప్రదించాలి.

బ్యూటిప్

క్లియర్ స్కిన్ కోసం... ముఖం అందంగా ఉండడం కోసం ఎన్ని జాగ్రత్తలు, మరెన్ని ట్రీట్‌మెంట్లు తీసుకున్నప్పటికీ శుభ్రత పాటించకపోతే ఫలితం ఉండదు. అ శుభ్రత ప్రభావం మొదట కనిపించేది ముఖం మీదనే. బెడ్‌షీట్లు ముఖ్యంగా దిండు కవర్లను కనీసం వారానికొకసారయినా మార్చాలి. ఇవి మురికిగా ఉంటే వాటిలో బ్యాక్టీరియా పెరిగి అవి ముఖం మీద మొటిమలు రావడానికి కారణమవుతాయి.



✻ ట్రామ్‌పోలిన్

పిల్లలాటతో ఫిట్‌గా..

కొన్ని పార్కుల్లోనూ, మాల్స్‌లోనూ పిల్లలకోసం కేటాయించిన వలయాకారపు ట్రామ్‌పోలిన్‌లు చూసే ఉంటారు. వాటి మీద పిల్లలు లేడి పిల్లల్లా ఎగురుతూ ఎంతో సందడిగా కనిపిస్తారు. 'మనమూ అలా గెంతితే ఎంత బాగుంటుంది' అనుకుంటారు పెద్దవాళ్లు. కానీ, శరీరం సహకరించదేమోనని సందేహిస్తారు. ఇప్పుడు పెద్దవాళ్ల కోసం గెంతుతూ సరదాగా వ్యాయామం చేసే ట్రాంపోలిన్ వాక్ అందుబాటులోకి వచ్చింది.

పెద్ద పెద్ద మెట్రోపాలిటన్ నగరాల్లోని ఫిట్‌నెస్ కేంద్రాలు వినోదానికి– వ్యాయామాలకు మధ్య ఉన్న విభజన రేఖను తొలగిస్తూ ఈ ట్రామ్‌పోలిన్ పరికరాలను పరిచయం చేస్తున్నాయి. జిమ్‌లో రొటీన్‌గా వ్యాయామాలు చేయడం బోర్ అనిపిస్తే, ఈ వ్యాయామాలను ప్రయత్నించవచ్చు.



అనేక ప్రయోజనాలు...

- ట్రామ్‌పోలిన్‌పై గెంతడం వల్ల గంటకు 9 కిలో మీటర్ల వేగంతో పరిగెత్తేంత ఎక్కువ కేలరీలు ఖర్చు అవుతాయని నిపుణులు చెబుతున్నారు. ట్రామ్‌పోలిన్ వర్కౌట్‌లు హృదయనాళాల పనితీరును బాగుచేయడంతో పాటు ఒత్తిడిని త్వరగా నివారిస్తాయి.
- 'ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించి, మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది' అని ఢిల్లీకి చెందిన జుంబా శిక్షకుడు, ట్రామ్‌పోలిన్ ఫిట్‌నెస్ కోచ్ ఆరుషి పస్రిజా తెలియజేస్తున్నారు.
- ట్రామ్‌పోలిన్ మృదువైన ఉపరితలం రన్నింగ్ లేదా ఇతర భారీ వ్యాయామాలతో పోలిస్తే కీళ్లపై భారాన్ని తగ్గిస్తుందని వైద్యులు గమనించారు. ఇది తేలిక పాటి కీళ్ల సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

ట్రామ్‌పోలిన్ వ్యాయామాలు ఎముక ఆరోగ్యానికి, కండరాల బలోపేతానికి, సమతుల్యతకు సహకరిస్తాయి.

- కదలికలు బాగా ఉండటం వల్ల త్వరగా కేలరీలు ఖర్చవుతాయి, బరువు తగ్గుతారు. హృదయ స్పందన రేటు పెరగడం ద్వారా గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- 'జంపింగ్ ఎముక సాంద్రతను ప్రేరేపిస్తుంది, ఇది బోలు ఎముకల వ్యాధిని నిరోధించడంలో సహాయపడుతుంది' అని ఆర్థోపెడిక్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ యుగల్ తెలియజేశారు.

డెస్క్ ఉద్యోగులకు మరింత ప్రయోజనం

డెస్క్ జాబ్‌లు చేసేవారికి ట్రామ్‌పోలిన్ ఫిట్‌నెస్ ఎక్సర్‌సైజ్ అద్భుతమైనది. ఈ వ్యాయామం వల్ల కడుపు, దిగువ శరీర కదలికలు మెరుగ్గా ఉంటాయి. ఎక్కువసేపు కూర్చోవడం వల్ల కలిగే సమస్యలను అధిగమించడంలో ఈ వ్యాయామం సహాయపడుతుంది. అనేక కార్పొరేట్ కార్యాలయాలు తమ ఉద్యోగుల కోసం ట్రామ్‌పోలిన్ వర్కౌట్ సెషన్‌లను నిర్వహించడం ప్రారంభించాయి. అయితే, పిల్లల పార్కుల్లో చూసే వాటికి పెద్దవారి ఫిట్‌నెస్ ట్రామ్‌పోలిన్ భిన్నంగా ఉంటుంది. ఇంట్లోనే పెద్దవాళ్లు ఉపయోగించే ట్రామ్‌పోలిన్లు సాధారణంగా చిన్నవిగా, దృఢంగా ఉంటాయి. ఇవి క్రీడా పరికరాలు దొరికే చోట, ఆన్‌లైన్ మార్కెట్లోనూ లభిస్తున్నాయి. అయితే, బరువును మోయగలిగే దృఢమైన ట్రామ్‌పోలిన్‌లను ఎంచుకోవాలి. అదేవిధంగా ఫిట్‌నెస్ నిపుణుల సూచనలు పాటించాలి. ఇందుకు ఆన్‌లైన్ ట్రైనర్స్ సాయం కూడా తీసుకోవచ్చు.

– ఆరుషి, ఫిట్‌నెస్ ట్రైనర్



మొదట్లోనే జంపింగ్‌లు వద్దు...

ట్రామ్‌పోలిన్ వర్కౌట్‌లలో స్క్వాట్ జంప్‌లు, జంపింగ్ జాక్స్, టక్ జంప్‌లు వంటి కఠినమైన కదలికలు కూడా ఉంటాయి. కానీ అదంతా ప్రారంభ దశలో కాదు. పూర్తి శరీర వ్యాయామాలుగా మార్చడానికి వర్కౌట్స్, యోగా వంటి అనుకూలమైన వ్యాయామాలతో కలపాలి. ఈ వ్యాయామాలు చేయడానికి రెసిస్టెన్స్ బ్యాండ్‌లను కూడా ఉపయోగించవచ్చు.

ప్రమాదం.. నివారణ

ఫిట్‌నెస్‌లో ట్రామ్‌పోలిన్‌ను చేర్చాలనే ఆలోచన ఉత్తేజకరమైనదిగా అనిపించవచ్చు. అయితే గాయాలను నివారించడానికి జాగ్రత్త అవసరం. నేలపైన సరిగా సెట్ కాకపోతే ట్రామ్‌పోలిన్ పడిపోవడం, పాదాలు బెణకడం, గాయాలకు దారి తీయడం వంటివి. అందుకని నిపుణుల సూచనలు తీసుకొని, వీటి కొనుగోలులోనూ, ఉపయోగించడంలోనూ మెలకువలు తెలుసుకోవాలి.

- ట్రామ్‌పోలిన్‌పై ఉన్నప్పుడు ముందుగా మోకాళ్లను వంచి, శరీర బ్యాలెన్స్ చూసుకోవాలి.
- పరధ్యానంగా ఉండకూడదు. ట్రామ్‌పోలిన్‌పైకి ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పట్టీని గట్టిగా పట్టుకోవాలి.
- ట్రామ్‌పోలిన్ వ్యాయామాలు చేస్తున్నప్పుడు మంచి గ్రిప్ సాక్స్ లేదా షూ ధరించాలి.
- నెమ్మదిగా ప్రారంభించి, క్రమంగా తీవ్రతను పెంచాలి.
- వారానికి 2–3 సార్లు చేసి, శరీర అనుకూలతను బట్టి వ్యవధిని పెంచుకోవచ్చు.

సమస్యలు ఉంటే..

ఆస్టియోపొరోసిస్, కీళ్లనొప్పులు, వెన్ను లేదా మోకాలి సమస్యలు వంటి తీవ్రమైన సమస్యలతో బాధపడుతున్న వారు ఈ వ్యాయామాలను చేయకూడదు. గర్భిణులు, గుండె జబ్బులు ఉన్నవారు కూడా ముందుగా తమ వైద్యుడిని సంప్రదించాలి. తరచుగా కింద పడిపోయే వ్యక్తులు కూడా ఆలోచించాలి. వృద్ధులయితే తప్పకుండా ఇతరుల సాయం తీసుకోవాలి.



తొక్కలోనే ఉంది

రోజు వారీ ఆహారంలో మనం చేసే కొన్ని చిన్న పొరబాట్లు పెద్ద సమస్యలకు కారణం అవుతాయి. ధాన్యాలు, పప్పులు, పండ్లు, కూరగాయలు వంటి వాటికి క్రిములు, మురికి అంటుకుంటాయని వాటి తొక్కలు తొలగించి వంటకు వినియోగిస్తుంటాం. కానీ కొన్ని కూరగాయలకు తొక్కలు తీసి తింటే ఎంతో విలువైన పోషకాలు తొక్కలతోపాటు వృథాగా పోతుంటాయని హెచ్చరిస్తున్నారు నిపుణులు.



ముఖ్యంగా ఈ 5 రకాల కూర గాయల తొక్కలలో పాలీ ఫెనాల్స్, విటమిన్లు, మినరల్స్ వంటి వివిధ పోషకాలు ఉంటాయి. వీటిని తొక్క తీయకుండానే వినియోగించడం చాలా మంచిది.

క్యారెట్ పీల్స్‌లో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కాబట్టి క్యారెట్‌లను తొక్క తీయకుండా తినడానికి ప్రయత్నించాలి. అవసరమైతే పూర్తిగా కడిగితే సరిపోతుంది.



చాలా మంది **బంగాళాదుంప**లను ఉడికించిన తర్వాత తొక్కలను తొలగిస్తారు. నిజానికి, బంగాళాదుంప కూర తొక్క పోషకమైనది, రుచికరమైనది కూడా. బంగాళదుంప తొక్కలలో శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. బంగాళదుంప తొక్క చిప్స్ తయారు చేసి కూడా తినవచ్చు.



వంకాయ తొక్కలో విటమిన్ కె, యాంటీ ఆక్సిడెంట్లు, పొటాషియం, ఫైబర్ ఉంటాయి. ఈ పోషకాలు శరీరాన్ని అనేక వ్యాధుల నుంచి రక్షిస్తాయి. అంతేకాకుండా వంకాయ తొక్కలో ఉండే పాలీఫెనాల్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.



వంకాయ మాదిరిగానే **సొరకాయ** తొక్క ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. సొరకాయ తొక్కలో విటమిన్ సి, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. సొరకాయ తొక్క కడుపు నొప్పిని తగ్గిస్తుంది.

డయాబెటిక్ రోగులకు **కాకరకాయ** చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కాకరకాయ ఎప్పుడూ పొట్టుతో కలిపి తినాలి. కాకరకాయ తొక్కలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. రక్తాన్ని శుద్ధి చేయడంలో కూడా సహాయపడతాయి.



ఇంటా బయటా సవాళ్లే!

గ్రామీణ ప్రాంతాలలోని స్త్రీలలో సుమారు 32 శాతం మంది మాత్రమే ఇంటి పనిని చక్కబెట్టుకుంటూ ఆఫీసు బాధ్యతలను కూడా సక్రమంగా నెరవేర్చగలుగుతున్నారని ఒక నివేదికలో వెల్లడి అయింది. అయితే దీనికి స్త్రీల అసమర్థతో మరోటో కారణం కానేకాదు. సమాజం నుంచి, కుటుంబం నుంచి సరైన మద్దతు, ఆసరా లేకపోవడమే ప్రధాన కారణం భారత దేశవ్యాప్తంగా జరిగిన ఈ సర్వే నివేదిక ప్రకారం మహిళలు సగటున వారానికి ఏడుగంటల మేరకు మాత్రమే అధ్యయన నైపుణ్యాలపై దృష్టి పెట్టగలుగుతున్నారని తేలింది.

స్త్రీలలో అక్షరాస్యతా శాతం పెరిగిందని గణాంకాలు చెబుతున్నప్పటికీ, 46.1 శాతం జిల్లాలు మాత్రమే జీతం లేని ఇంటి పని తో కొనసాగుతున్న సవాళ్లను ఎత్తి చూపారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అహ్మదాబాద్ లోని జెండర్ సెంటర్ సబ్‌నేషనల్ లెవెల్ టువర్డ్స్ అచీవింగ్ జెండర్ ఈక్వాలిటీ నివేదిక పరిశోధన వివరాలు వెల్లడించింది.

ఈ అధ్యయనం జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే- దేశవ్యాప్తంగా మొత్తం 705 జిల్లాల నుంచి 15- 49 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళల డేటాను పోల్చి విశ్లేషించింది. అహ్మదాబాద్ ఐఐఎం డీన్ (ఫ్యాకల్టీ), ప్రొఫెసర్ సతీష్ దేవధర్, మహిళలు ఇంటిపనికి, ఉద్యోగ బాధ్యతలకు మధ్య సమతుల్యతను సాధించడానికి ఇంటి పనులను పంచుకోవడంలో పురుషుల అవసరాన్ని నొక్కి చెప్పారు. 32 శాతం మంది మహిళలు మాత్రమే పనికి, వ్యక్తిగత జీవితానికి సమతుల్యతను సాధించగలుగుతున్నారని నివేదించారు.

మహిళా సాధికారత సూచికను కూడా ప్రవేశపెట్టిన నివేదిక, భారత దేశం అంతటా మహిళా సాధికారత వివరణాత్మక, జిల్లా-స్థాయి విశ్లేషణను అందిస్తుంది, జిల్లా స్థాయి వైవిధ్యాలపై దృష్టి సారించి లింగ సమానత్వాన్ని ముందుకు తీసుకెళ్లడంలో సహాయపడటానికి కొన్ని సూచనలు చేసింది.

''జిల్లా స్థాయి డేటాపై దృష్టి పెట్టడం ద్వారా, వివిధ ప్రాంతాలలో, వివిధ వర్గాలలో మహిళలు ఎదుర్కొనే సవాళ్లను తెలుసుకోవడం సులువు అవుతుంది. పరిమిత విద్య, ఆర్థిక స్వాతంత్య్రం నుంచి మెరుగైన పని కోసం పోరాటం వరకు. మరింత స్పష్టంగా తెలుసుకోవాల్సి ఉందని జెండర్ సెంటర్ చైర్‌పర్సన్, నివేదిక సహ రచయిత ప్రొఫెసర్ విద్యా వేమిరెడ్డి వెల్లడించారు. ఎన్.ఎఫ్.హెచ్. సర్వే, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో మరికొన్ని ఇతర సంస్థల నుంచి డేటాను తీసుకున్నట్లు తెలిపారామె.

లైఫ్@360

అందర్ కీ బాత్

నాస్తా చేశాక కాస్త నడవండి



నడక అనేది తక్కువ శ్రమతో ఎక్కువ ఫలితాలను ఇచ్చే వ్యాయామం. తిన్న వెంటనే కాసేపు నడిస్తే అది పెరిగే పొట్టను అరికట్టి ఫ్యాట్ కాస్తా ఫ్లాట్ ఎలా అవుతుందో చూద్దాం.

యూఎస్ మేరీల్యాండ్‌లోని నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ నిర్వహించిన ఓ అధ్యయనం ప్రకారం తిన్నవెంటనే కనీసం 30 నిమిషాల పాటు వేగంగా నడక (బ్రిస్క్ వాకింగ్) సాగిస్తే అది పొట్ట రానివ్వకుండా చేస్తుంది. ఈ అధ్యయనంలో పాల్గొన్న వ్యక్తులు ఇలా తిన్న వెంటనే నడిచాక నెలలో 3 కిలోలు తగ్గారని ఆ అధ్యయనంలో తేలింది. తిన్న వెంటనే నడిస్తే రక్తంలో చక్కెర మోతాదులు తగ్గుతాయి. అలాగే బరువు తగ్గడం మొదలవుతుంది. తిన్న వెంటనే ఆహారంలోంచి శక్తికోసం చక్కెర ఉత్పన్నం అయ్యే చక్కెరను కాస్తా నడక దహించి వేయడం వల్ల పొట్ట పెరగదు.

ఇలా ప్రతి భోజనం తర్వాత కనీసం అరగంట పాటు నడక పొట్ట పెరగదని తెలిసింది కదా. అలా శ్రమ తెలియకుండా నడవడానికి ఈ కింద పేర్కొన్న ఆరు మార్గాలు బెస్ట్.

● ఫ్రెండ్స్‌కు ఫోన్ .

మీరు కాల్ చేయాల్సిన ఫ్రెండ్స్ జాబితాను రెడీ చేసుకోండి. అలా నడక సాగిస్తూ... ఒక్కో ఫ్రెండ్‌తో మాట్లాడుతూ పొండి. ఇలా ఒక్కో ఫ్రెండ్‌కు ఐదు నిమిషాలు కేటాయించినా... ఆరుగురు ఫ్రెండ్స్‌తో మాటలు పూర్తయ్యేటప్పటికి అరగంట నడక కూడా విజయవంతంగా పూర్తవుతుంది.

● తక్కువ వ్యవధిలో ఎక్కువసేపు...

రోజూ వ్యాయామం కోసం చాలాసేపు నడక బోర్‌గా అనిపించవచ్చు. దానికి బదులు మీ నడకను మూడుగా విడగొట్టుకోండి. ఉదాహరణకు రోజు ఒక 45 నిమిషాల పాటు నడిచే నడకను మూడు పూటలా మూడు 15 నిమిషాలు పాటు నడవడం వల్ల చాలా తక్కువ వ్యవధిలోనే నడక పూర్తవుతున్న ఫీలింగ్ ఉంటుంది. ఇలా తక్కువ వ్యవధుల్లో ఎక్కువసేపు వేగంగా నడుస్తుండం వల్ల పొట్టలోని కొవ్వు బాగా తగ్గుతుందని తేలింది.

● పవర్ వాక్స్...

పదిహేను నిమిషాలు నడక సాగిస్తున్న సమయంలో మరో టెక్నిక్ కూడా అవలంబించవచ్చు. అదే పవర్ వాక్. ఉదాహరణకు పవర్ వాక్‌ను అలా వేగంగా, అదేపనిగా చేస్తే అలసిపోవచ్చు. అందుకే ఐదు నిమిషాల పాటు మామూలుగా నడిచాక దాన్ని వార్మప్ వాక్‌గా పరిగణించి... ఆ తర్వాత ఓ 10 నుంచి 15 సెకన్ల పాటు చాలా వేగంగా అంటే పవర్ వాక్ రూపంలో నడవాలి. అటు తర్వాత ఆ వేగాన్ని తగ్గించి మళ్లీ మరో ఐదు నిమిషాలు మామూలుగా నడవాలి. ఇలా పవర్ వాక్‌కు ఇటూ, అటూ మామూలు నడక... మధ్యన 10 – 15 సెకండ్ల పవర్ వాక్‌తో శక్తి పెరుగుతుంది.

● ఎత్తు ఎక్కుతున్నట్లుగా ...

ఫ్లాట్ ఉపరితలం మీద నడక మంచిదే అయినా... అప్పుడప్పుడూ ఎత్తుగా ఉన్న ఉపరితలాలకు నడక సాగించడం వల్ల అదనపు వ్యాయామం సమకూరుతుంది. ఉదాహరణకు వారంలో మూడు సార్లు ఇలా ఎత్తు ప్రదేశాలకు నడక సాగించవచ్చు.

● పోశ్చర్ నిటారుగా ఉండాలి...

నడుస్తున్న క్రమంలో పోశ్చర్‌ను నిటారుగా ఉంచాలి. వాలిపోతున్నట్టు లేదా ఒరిగిపోతున్నట్టు నడవడం సరికాదు. పొట్ట కండరాలకు సపోర్ట్‌గా ఏదైనా వెడల్పాటి బెల్ట్ కట్టుకోవడం మంచిదే.

● అడుగులు లయబద్ధంగా...

నడుస్తున్నప్పుడు అడుగులు ఒకదాని తర్వాత మరొకటి లయబద్ధంగా పడుతుండాలి. బుద్ధినీ, దృష్టినీ నడక మీదే కేంద్రీకరించాలి. నడకను ఎంజాయ్ చేస్తూ లయబద్ధంగా అడుగులు పడుతున్నప్పుడు ఎండార్ఫిన్స్ అనే జీవ రసాయనాలు వెలువడి ఒత్తిడిని తగ్గించడంతో పాటు మూడ్స్‌ను ఆహ్లాదంగా మారుస్తాయి.

ఇలా ఈ ఆరు టెక్నిక్స్‌తో తిన్న వెంటనే మూడు పూటలా కనీసం 20 నిమిషాలపాటు నడక సాగిస్తుంటే పొట్ట పెరగదనీ, ఉన్న పొట్ట కూడా తరిగి ఫ్లాట్‌గా మారుతుందన్నది 'నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్' అధ్యయనవేత్తల మాట.


మీకు తెలుసా?

- స్క్రీన్‌ల నుండి వచ్చే బ్లూ రేస్ మెలటోనిన్ విడుదలను ఆలస్యం చేసి నిద్రను దూరం చేస్తుంది
- పడుకునే ముందు ఫోన్‌లను ఉపయోగించడం వల్ల మెదడు నిద్రకు సిద్ధంగా ఉండదు.
- ఫోన్‌లలో సమాచారం, మెసేజులు, నోటిఫికేషన్స్‌ను చూడడం, సమాధానాలు ఇవ్వడం వలన మానసిక ఉద్రేకం, ఒత్తిడి ఏర్పడి విశ్రాంతి తీసుకునే సామర్థ్యం దెబ్బ తింటుంది.
- మొబైల్ గేమ్‌లు, సోషల్ మీడియా ఇంటర్నెట్ బ్రౌజింగ్ నిద్ర సమయాన్ని తగ్గిస్తూ ఉంది.
- సెల్‌ఫోన్‌ను రాత్రి పూట లైట్స్ లేకుండా కానీ డిమ్ లైట్‌లో కానీ చూడటం వల్ల కంటిచూపు బాగా దెబ్బతింటుంది. ఫోన్ సెట్టింగ్స్‌లో లైట్ మధ్యస్థంగా వుండటం మంచిది.
- ఈ మధ్య జరిగిన ఒక సర్వే ప్రకారం 92% మంది ప్రజలు సెల్ ఫోన్ తమ జీవితంలో భాగంగా భావిస్తున్నారట.



81% మంది పిల్లలు కూడా ఇలాగే భావిస్తున్నారట. ఇక 90% మంది సెల్ ఫోన్ పొడైతే ఆందోళన చెందుతున్నారట. 80% మంది పిల్లలు తమను తాము ఆన్‌లైన్ ఇన్‌ఫ్లుయెన్సర్ లతో పోల్చుకుంటున్నారట.

సినిమా



అందరికీ ధన్యవాదాలు

- రజనీకాంత్

సూపర్ స్టార్ రజనీకాంత్ అస్వస్థత కారణంగా గత సోమవారం రాత్రి చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. ఆయన గుండెలోని రక్తనాళానికి వాపు రావడంతో వైద్యులు శస్త్ర చికిత్స లేకుండా స్టెంట్ అమర్చారు. శుక్రవారం ఉదయం డిశ్చార్జ్ అయ్యారు రజనీ. వైద్యులు ఆయనకు 15 రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కాగా రజనీ అనారోగ్యానికి గురైన విషయం తెలిసి ప్రధాని నరేంద్ర మోదీ, తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్‌తో సహా పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇక అభిమానులైతే గుళ్లు, గోపురాలు, చర్చిలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన రజనీకాంత్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో ''నేను ఆస్పత్రిలో ఉన్నప్పుడు త్వరగా కోలుకోవాలని శుభాకాంక్షలు తెలిపిన రాజకీయ నాయక మిత్రులకు, సినీ రంగానికి చెందిన స్నేహితులకు, నా క్షేమం కోరిన మీడియా మిత్రులకు, నన్ను బతికిస్తున్న ఫ్యాన్స్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు'' అని రజనీకాంత్ పేర్కొన్నారు.

– సాక్షి ప్రతినిధి, చెన్నై



ఆస్పత్రి నుంచి గోవిందా డిశ్చార్జ్

బాలీవుడ్ నటుడు గోవిందా ఈ నెల 1న తన వ్యక్తిగత తుపాకీ పొరపాటున పేలడంతో కాలికి గాయాలై ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. శుక్రవారం వైద్యులు ఆయన్ను డిశ్చార్జ్ చేసి, కొన్ని రోజుల పాటు బెడ్ రెస్ట్ తీసుకోవాలని సూచించారు. వీల్‌చైర్‌లో ఆస్పత్రి నుంచి బయటకు వచ్చిన గోవిందాను పలువురు అభిమానులు పరామర్శించారు. ''ప్రస్తుతం క్షేమంగా ఉన్నాను. నేను త్వరగా కోలుకోవాలని ప్రార్థించినవారికి కృతజ్ఞతలు'' అని గోవిందా తెలిపారు.

సహించేది లేదు... క్షమించేది లేదు

- అఖిల్



నాగచైతన్య-సమంత విడాకులపై మంత్రి కొండా సురేఖ మాట్లాడిన వివాదాస్పద వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఆమె వ్యాఖ్యల్ని సినీ ప్రముఖులు ముక్తకంఠంతో ఖండించారు. దీంతో ఆమె క్షమాపణలు చెప్పడంతో పాటు తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకున్నారు. కాగా కొండా సురేఖపై నాగార్జున పరువునష్టం దావా వేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే.. కొండా సురేఖ వ్యాఖ్యలపై అక్కినేని అఖిల్ మరోసారి స్పందించి, సోషల్ మీడియాలో ఘాటుగా పోస్టు పెట్టారు. దాని సారాంశం ఏంటంటే... ''కొండా సురేఖ చేసిన నిరాధారమైన వ్యాఖ్యలు అసభ్యకరంగా, జుగుప్సాకరంగా ఉన్నాయి. ప్రజా సేవకురాలిగా ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ఆమె తన నైతికత, సామాజిక సంక్షేమాన్ని మరచిపోయి ప్రవర్తించిన తీరు సిగ్గు చేటు, క్షమించరానిది. ఆమె మాటలతో మా కుటుంబ సభ్యులతో పాటు ప్రజలు కూడా బాధపడ్డారు. స్వార్థపూరితంగా గెలవడానికి ప్రయత్నిస్తున్న రాజకీయ యుద్ధంలో.. తన కంటే చాలా ఉన్నత విలువలు, సామాజిక అవగాహన ఉన్న అమాయక వ్యక్తులపై సిగ్గు లేకుండా దాడి చేసి బలిపశువులను చేశారామె. కుటుంబ సభ్యుడిగా, చిత్ర పరిశ్రమ సభ్యుడిగా మౌనంగా చూస్తూ ఉండలేను. ఇలాంటి నీచమైన వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని శిక్షించాలి. మన సమాజంలో ఆమెలాంటి వాళ్లకు చోటు, గౌరవం లేదు. ఆమెను సహించేది లేదు... క్షమించేది లేదు'' అని పేర్కొన్నారు అఖిల్.



● ఎన్టీఆర్

దేవర... వర... 'దేవర' చిత్రంలో ఈ రెండు పాత్రల్లో అభిమానులకు రెండింతల ఆనందాన్నిచ్చారు ఎన్టీఆర్. అభిమానులు విజిల్స్ వేయకుండా ఉండలేని విధంగా డైలాగ్స్ పలికారు. ఫైట్స్‌లో విజృంభించారు... సాంగ్స్‌లో స్టెప్స్ అదరగొట్టారు... ఎమోషనల్ సీన్స్‌లో మనసును తాకారు. ఇలా మొత్తం మీద ఎన్టీఆర్ మరోసారి నటుడిగా విజృంభించిన చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వంలో నందమూరి కల్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె నిర్మించిన 'దేవర' మంచి వసూళ్లు సాధిస్తూ, దూసుకెళుతోంది. దాంతో చిత్రయూనిట్ సక్సెస్ సెలబ్రేషన్స్ చేసుకుంది. ఆ విశేషాల్లోకి...

ఇకపై తెరపై దావూదీ...

'దేవర' చిత్రం విడుదలకు రెండు రోజుల ముందు ఎన్టీఆర్ అమెరికా వెళ్లిన విషయం తెలిసిందే. బుధవారం ఆయన హైదరాబాద్‌కు చేరుకున్నారు. అయితే గురువారం ఈ చిత్రం సక్సెస్ సెలబ్రేషన్స్ జరగాల్సి ఉండగా దేవీ నవరాత్రుల కారణంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో సక్సెస్‌మీట్‌కు అనుమతి లభించలేకపోవడంతో కుదరలేదు. ఇక హైదరాబాద్‌లోని ఓ స్టార్ హోటల్‌లో చిత్ర బృందం సక్సెస్ సెలబ్రేషన్స్ ఏర్పాటు చేసింది. ఈ సెలబ్రేషన్స్‌లో రాజమౌళి, ప్రశాంత్ నీల్, 'దిల్' రాజు, డీవీవీ దానయ్య, నాగవంశీ వంటివారితో పాటు పలువురు పంపిణీదారులు పాల్గొన్నారు.

ఆరేళ్లకు సోలోగా...

ఎన్టీఆర్ అభిమానులు తమ హీరోని సిల్వర్ స్క్రీన్‌పై సోలో హీరోగా చూసింది 'అరవింద సమేత వీర రాఘవ' (2018) తర్వాత 'దేవర'లోనే. ఈ గ్యాప్‌లో 'ఆర్‌ఆర్‌ఆర్'తో తెరపై కనిపించారు. ఈ చిత్రంలో రామ్‌చరణ్ మరో హీరో అని తెలిసిందే. ఇక ఆరేళ్లకు ఎన్టీఆర్ సోలోగా నటించిన చిత్రం కావడం, దేవర–వరగా రెండు పాత్రల్లో ఎన్టీఆర్ కనిపించడం ఫ్యాన్స్‌కి ఐ ఫీస్ట్ అయింది.

7 రోజులకు రూ. 400 కోట్లు

'జనతా గ్యారేజ్' వంటి సూపర్ హిట్ తర్వాత హీరో ఎన్టీఆర్–దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం కావడంతో 'దేవర'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. పైగా 'మనిషికి బతికేంత ధైర్యం చాలు, చంపేంత ధైర్యం కాదు.. కాదు కూడదు అని మీరు మళ్లీ ఆ ధైర్యాన్ని కూడగడితే ఆ ధైర్యాన్ని చంపే భయాన్ని అవుతా...', 'దేవర అడిగినాడంటే... సెప్పినాడని అదే సెప్పినాడంటే...' అంటూ విడుదలైన డైలాగ్స్, 'చుట్టమల్లె...' పాట, దివంగత ప్రముఖ నటి శ్రీదేవి కుమార్తె జాన్వీకి తెలుగులో తొలి చిత్రం వంటివన్నీ 'దేవర' సినిమాపై అంచనాలు పెంచాయి. ఆ అంచనాలను 'దేవర' చేరుకున్నాడని చెప్పడానికి వసూళ్లు నిదర్శనం. విడుదలైన ఏడు రోజులకు ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం దాదాపు రూ. 400 కోట్లకు పైగా వసూలు సాధించింది. ఇక పండగ సెలవులు మొదలయ్యాయి కాబట్టి వసూళ్ల దూకుడు ఆగదని ఊహించవచ్చు.

దసరా సెలవులు... 'దేవర' దూకుడు

దసరా పండగ సెలవులు మొదలయ్యాయి. సెలవులు, పోటీలో మరో భారీ చిత్రం లేకపోవడం 'దేవర'కి కలిసొచ్చే విషయం. ఇంకో వారం దాకా వసూళ్ల దూకుడు ఆగదనే అంచనాలు ఉన్నాయి. పైగా అభిమానులను ఖుషీ చేసేలా శుక్రవారం నుంచి 'దావూదీ...' పాటను కూడా జోడించారు. 'దేవర' విడుదలకు కొన్ని రోజులు ముందు విడుదలైన ఈ పాటకు మంచి స్పందన లభించింది. కానీ సినిమాలో లేకపోవడంతో ఫ్యాన్స్ నిరుత్సాహపడ్డారు. అయితే శుక్రవారం నుంచి అన్ని థియేటర్లలో ఈ పాట కనిపిస్తోంది.



● 'దావూదీ..' పాటలో జాన్వీ, ఎన్టీఆర్

'దేవర 2' ఎప్పుడంటే...

'దేవర 2' షూట్‌ను వచ్చే ఏడాది చివర్లో ఆరంభించాలనుకుంటున్నారని సమాచారం. 2026లో 'దేవర 2' విడుదలయ్యే చాన్స్ ఉందట. ఈ గ్యాప్‌లో ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో సినిమా చేస్తారు ఎన్టీఆర్. అలాగే హిందీలో 'వార్ 2' చేస్తున్నారు. వచ్చే ఏడాది ఈ చిత్రం విడుదలవుతుంది. ప్రశాంత్ నీల్‌తో చేసే చిత్రం 2026 జనవరిలో విడుదల కానుంది. ఒకవేళ 'దేవర 2' కూడా 2026లోనే విడుదలైతే అప్పుడు ఒకే ఏడాదిలో ఎన్టీఆర్ రెండు సినిమాల్లో కనిపించినట్లు అవుతుంది. అదే జరిగితే 2016 (నాన్నకు ప్రేమతో, జనతా గ్యారేజ్) తర్వాత... పదేళ్లకు ఒకే ఏడాది ఎన్టీఆర్ రెండు సినిమాల్లో కనిపించేది 2026లోనే అవుతుంది.

నువ్వేమన్నా అవతారా...



● సిమ్రాన్ శర్మ, మాధవ్

హీరో రవితేజ సోదరుడు, నటుడు రఘు తనయుడు మాధవ్ హీరోగా నటించిన చిత్రం 'మిస్టర్ ఇడియట్'. 'పెళ్లి సందడి' ఫేమ్ గౌరీ రోణంకి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సిమ్రాన్ శర్మ హీరోయిన్‌గా నటించారు. యలమంచి రాణి సమర్పణలో జేజేఆర్ ఎంటర్‌టైన్మెంట్స్‌పై జేజేఆర్ రవిచంద్ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'కాంతార కాంతార..' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ను హీరో నిఖిల్ సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేసి, 'పాట ఎనర్జిటిక్‌గా ఉంది. సినిమా మంచి విజయం సాధించాలి' అని ఆకాంక్షించారు. 'కాంతార కాంతార..' పాటకి కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా, రాహుల్ సిప్లిగంజ్ పాడారు. 'ఎందుకే చిట్టి నువ్వు ఇట్లా పుట్టినావు.. మందిని సంపుతావు ఏందే, మా లెక్కనే నీకు రెండు కాళ్లు చేతులు ముక్కు మూతి ఉన్నాయి గాదె, బలుపు నీకు ట్విన్ బ్రదరా, ఈగో నెత్తిమీద ఫెదరా, మనషులంటే నీకు పడరా, నువ్వేమన్నా అవతారా, ఏమి చూసుకుని నీకు ఇంత టెక్కూ...' అంటూ సాగుతుందీ పాట.



● పూజా హెగ్డే, విజయ్

దళపతి ఆరంభం

తమిళ స్టార్ హీరోల్లో ఒకరైన విజయ్ నటిస్తున్న 69వ చిత్రం 'దళపతి 69' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ చిత్రానికి హెచ్ .వినోద్ దర్శకత్వం వహిస్తుండగా, పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్‌పై ఎన్‌కే, వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్న ఈ మూవీ నటీనటులు, సాంకేతిక నిపుణుల సమక్షంలో పూజా కార్యక్రమాలతో ఆరంభమైంది. ''విజయ్ కెరీర్‌లో హిస్టారిక్ ప్రాజెక్ట్ 'దళపతి 69'. తమిళ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన విజయ్ సిల్వర్ స్క్రీన్ మీద చివరిసారిగా కనిపించనున్న చిత్రం మాదే. దళపతి ఫ్యాన్స్‌కి ఇదొక ఎమోషనల్ ప్రాజెక్ట్. నేటి నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది. విజయ్ వారసత్వాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సినిమాను అత్యంత భారీగా, తరాలు గుర్తుపెట్టుకునేలా తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. తమిళ, తెలుగు, హిందీ భాషల్లో 2025 అక్టోబర్‌లో ఈ చిత్రం విడుదల కానుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. బాబీ డియోల్, గౌతమ్ వాసుదేవ మీనన్, ప్రియమణి, ప్రకాశ్‌రాజ్, మమిత బైజు ఇతర పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకి సంగీతం: అనిరుధ్ రవిచంద్రన్, కెమెరా: సత్యన్ సూర్యన్.

అంచనాలకు మించి ఉంటుంది

- అర్జున్ సర్జా



● అర్జున్, బి. గోపాల్, ధృవ సర్జా, వైభవీ శాండిల్య

''మార్టిన్' చిత్రకథని నేను పేపర్ మీద రాశాను. కానీ, దాన్ని తెరపైకి తీసుకొచ్చేందుకు దర్శక-నిర్మాతలు, ధృవ సర్జా చాలా కష్టపడ్డారు. ఈ ట్రైలర్ చూశాక ప్రేక్షకుల్లో అంచనాలు ఏర్పడ్డాయి. వారు ఏ స్థాయిలో ఊహించుకుని థియేటర్‌కి వచ్చినా అంతకంటే ఎక్కువగానే మా చిత్రం ఉంటుంది. దసరాకి చాలా సినిమాలు వస్తున్నాయి... అన్ని చిత్రాలను చూసి, ఆదరించండి'' అని హీరో అర్జున్ సర్జా అన్నారు. ధృవ సర్జా, వైభవీ శాండిల్య జంటగా ఏపీ అర్జున్ దర్శకత్వం వహించిన చిత్రం 'మార్టిన్'. ఉదయ్ కె. మెహతా, సూరజ్ ఉదయ్ మెహతా నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈ నెల 11న రిలీజ్ కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అతిథిగా పాల్గొన్న దర్శకుడు బి. గోపాల్ మాట్లాడుతూ– ''నా మొదటి హీరో అర్జున్. తన మేనల్లుడు ధృవ నటించిన 'మార్టిన్' చిత్రం పెద్ద సక్సెస్ కావాలి'' అన్నారు. ''మా మామ అర్జున్‌గారు లేకపోతే నేను ఈ స్థాయిలో ఉండేవాణ్ని కాదు. 'మార్టిన్' నచ్చితే అందరికీ చెప్పండి'' అని ధృవ సర్జా చెప్పారు. ''మార్టిన్'ను తెలుగులో చౌదరిగారు పంపిణీ చేస్తున్నారు'' అన్నారు ఉదయ్ కె. మెహతా.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
809	236
81,688	25,015

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

● నాస్‌డాక్	18,052	△	136
● డోజోన్స్	41,894	△	85
● ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,283	△	13
● డాక్స్	19,015	△	113
● షాంఘై (సోమవారం ముగింపు)	3,337	△	249
● నికాయ్	38,636	△	84

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
75,964	△	349
బంగారం (99.5 స్వచ్ఛత)		
75,660	△	348
వెండి (కేజీ)		
92,200	△	1,528

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.55	84.57
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	109.05	111.66
€	యూరో	ఎస్‌బీఐ	91.50	93.89
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.76	58.05
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.56	58.52
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.40	67.08
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.97	23.75
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.09	12.91

ఐదేళ్లలో తలసరి ఆదాయం డబుల్

- రాబోయే దశాబ్దాల్లో సామాన్యుల జీవన ప్రమాణాలు పైపైకి..
- గత పదేళ్లలో ప్రభుత్వ సంస్కరణల చలవే ఇది...
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి



న్యూఢిల్లీ: దేశ ప్రజల తలసరి ఆదాయం వచ్చే ఐదేళ్లలో రెట్టింపు కానుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. రాబోయే దశాబ్దాల్లో ప్రజల జీవన ప్రమాణాలు భారీగా మెరుగు పడనున్నాయని, ఇదంతా గత పదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాత్మక సంస్కరణల చలవేనని ఆమె చెప్పారు. శుక్రవారమిక్కడ జరిగిన కౌటిల్య ఆర్థిక సదస్సు మూడో ఎడిషన్‌లో మాట్లాడుతూ ఆమె ఈ విషయాలను వెల్లడించారు. గడిచిన దశాబ్ద కాలంగా భారత్ ఆర్థిక వ్యవస్థ పరుగులతో ఐదేళ్ల కాలంలోనే అతిపెద్ద ప్రపంచ ఎకానమీల్లో 10వ స్థానం నుంచి ఏకంగా 5వ స్థానానికి ఎగబాకిందన్నారు. 'అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) గణాంకాల ప్రకారం దేశంలో తలసరి ఆదాయం 2,730 డాలర్లను చేరుకోవడానికి 75 ఏళ్లు పట్టింది. దీనికి మరో 2,000 డాలర్లు జతయ్యేందుకు కేవలం ఐదేళ్లే పడుతుంది. రానున్న కొన్ని దశాబ్దాల్లో సామాన్యుని జీవన ప్రమాణాలు దూసుకెళ్లను న్నాయి. భారతీయుల జీవితాల్లో ఇదొక మరపురాని కాలంగా నిలిచిపోతుంది' అని సీతారామన్ పేర్కొన్నారు. పలు దేశాల్లో ఉద్రిక్తతలతో పరిస్థితులు దిగజారుతూ, ప్రపంచ శాంతికి విఘాతం కలుగుతున్నప్పటికీ, 140 కోట్ల మంది జనాభా గల మన దేశంలో ఆర్థిక అసమానతలను తగ్గిస్తూనే తలసరి ఆదాయాన్ని కొన్నేళ్లలోనే రెట్టింపు చేసే ప్రయత్నాల్లో భారత్ ఉందని ఆమె పేర్కొన్నారు.

నవ భారత శకం...

2047 నాటికి 100 ఏళ్ల స్వాతంత్ర్య మైలురాయిని దాటనున్న నేపథ్యంలో అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరడం ద్వారా నవ భారత శకం ఆవిష్కృతమవుతుందని సీతారామన్ పేర్కొన్నారు. వికసిత భారత్‌లో అభివృద్ధి ఫలాలు ఒక్క భారతీయులకు మాత్రమే కాకుండా మిగతా ప్రపంచానికి కూడా విరజిమ్ముతాయని చెప్పారు. మొండి బకాయిలను తగ్గించడం, వాటికి ప్రొవిజనింగ్ పెంపు, లాభదాయకతను మెరుగుపరచడం వంటి స్థిరమైన విధానాలపై దృష్టి సారించడం ద్వారా దేశ బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేశామని, దీనివల్ల ఫైనాన్షియల్ వ్యవస్థ అత్యంత పటిష్టంగా మారిందన్నారు.

'బీ న్యూ' దసరా ప్రత్యేక ఆఫర్లు



హైదరాబాద్: దసరా పండుగ సందర్భంగా 'బీ న్యూ మొబైల్స్' ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఎంఐ, వివో, ఒప్పో, రియల్‌మి, మొబైల్స్ కొనుగోలుపై కచ్చితమైన బహుమతితో పాటు లక్కీడ్రా ద్వారా రూ.10 లక్షల నగదు గెలుచుకునే అవకాశం కల్పిస్తోంది. ఎంపిక చేసిన మొబైల్స్‌పై 50% వరకు, యాక్సెసరీస్‌పై 80% వరకు డిస్కౌంట్ ఇస్తోంది. ల్యాప్‌టాప్‌పై రూ.10 వేలు, టీవీ కొనుగోలుపై రూ.5000 వరకు క్యాష్ బ్యాక్ అందిస్తుంది. టీవీఎస్ కార్డు ద్వారా కొనుగోలుపై ఒక ఈఎంఐ ఉచితంగా, ఎస్‌బీఐ కార్డు ద్వారా కొనుగోలుపై 5% క్యాష్‌బ్యాక్ ఇస్తుంది. బజాజ్‌ఫిన్‌సర్వ్ ద్వారా వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండా మొబైల్స్, టీవీలు, ల్యాప్‌టాప్‌ల కొనుగోలు సదుపాయం కల్పిస్తోంది. ప్రత్యేక ఆఫర్లను ప్రజలంతా వినియోగించుకోవాలని కంపెనీ సీఎండీ బాలాజీ చౌదరి, సీఈఓ సాయి నిఖిలేశ్, ఈడీ సాయి నితీష్‌లు తెలిపారు.

ఐదో రోజూ నష్టాలు..

- కొనసాగిన పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం
- సెన్సెక్స్ 809 పాయింట్ల పతనం
- నిఫ్టీ 236 పాయింట్లు డౌన్



ముంబై: పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితులు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలతో స్టాక్ సూచీలు వరుసగా ఐదోరోజూ నష్టాలతో ముగిశాయి. ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర ప్రతీకార దాడులు, క్రూడాయిల్ సరఫరా సమస్యలు ఇన్వెస్టర్లను ఆందోళనకు గురిచేశాయి. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్ 809 పాయింట్లు పతనమై 81,688 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 236 పాయింట్లు క్షీణించి 25,015 వద్ద నిలిచింది. ఉదయం నష్టాలతో మొదలైన సూచీలు.. దిగువ స్థాయిలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో ఆరంభ నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి. అయితే మిడ్‌సెషన్‌లో ఒక్కసారి విక్రయాలు వెల్లువెత్తడంతో మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఐటీ మినహా అన్ని రంగాల షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు రికవరీ బాట పట్టడంతో 2% లాభపడ్డాయి. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 4,147 పాయింట్ల(5%) పతనంతో అయిదు ట్రేడింగ్ సెషన్లలో రూ.16.26 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. బీఎస్ఈలోని మొత్తం లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.460 లక్షల కోట్లకు దిగొచ్చింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
బంగారం రికార్డు @ రూ.78,450 | సెప్టెంబర్‌లో 'సేవలు' పేలవం

ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్ఓ) విభాగంలో చిన్న ఇన్వెస్టర్లు తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో వారిని ట్రేడింగ్‌కు దూరంగా ఉంచేందుకు సెబీ రంగంలోకి దిగింది. తాజాగా నిబంధనలను మరింత కఠినతరం చేయడంతో జీరో బ్రోకరేజీ సంస్థలకు బాగానే సెగ తగలనుంది. సెబీ చర్యలు అమల్లోకి వస్తే.. డెరివేటివ్స్ వాల్యూమ్స్ పడిపోయి బ్రోకరేజీ కంపెనీల ఆదాయాలకు గండి పడుతుంది. దీంతో జీరో బ్రోకరేజీ ప్లాన్‌లకు ఇక 'ఎక్స్‌పైరీ' తప్పదంటున్నాయి మార్కెట్ వర్గాలు!

జీరో బ్రోకరేజీలకు ఇక చెల్లు!

- సెబీ ఎఫ్ అండ్ ఓ నిబంధనల కఠినతరం ఎఫెక్ట్
- లావాదేవీ చార్జీలు, కాంట్రాక్ట్ సైజు పెంపుతో ట్రేడింగ్ వాల్యూమ్‌కు గండి
- బ్రోకరేజ్ సంస్థలకు భారీగా తగ్గనున్న ఆదాయం
- క్యాష్ లావాదేవీలపై ఇప్పటికే ఏంజెల్ వన్ చార్జీల వడ్డన
- త్వరలో ఇతర సంస్థలూ ఇదే బాట పట్టే అవకాశం



డెరివేటివ్ ట్రేడింగ్ విషయంలో సెబీ తీసుకున్న చర్యలతో జీరో బ్రోకరేజీ సంస్థల జోరుకు అడ్డకట్ట పడనుంది. ఎఫ్ అండ్ ఓ విభాగం నుంచి లభించే ఆదాయానికి చిల్లు పడుతుందన్న అంచనాలతో ఏంజెల్ వన్ 'జీరో బ్రోకరేజీ'కి చెల్లు చెబుతున్నట్లు ప్రకటించింది. క్లయింట్ల సంఖ్య పరంగా దేశంలో మూడో అతిపెద్ద బ్రోకరేజీ సంస్థగా ఇది నిలుస్తుండం విశేషం. నవంబర్ 1 నుంచి క్యాష్ మార్కెట్ లావాదేవీలు (షేర్ల కొనుగోలు, అమ్మకం)పై రూ.20 ఫ్లాట్ ఫీజు లేదా టర్నోవర్‌పై 0.1% (ఏది తక్కువైతే అది) ప్రవేశపెడుతున్నట్లు తెలిపింది. ఇప్పటిదాకా ఈ లావాదేవీలపై ఎలాంటి ఫీజులు లేవు. కాగా, రాబోయే రోజుల్లో ఇతర బ్రోకరేజీ సంస్థలు కూడా ఇదే బాట పట్టే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. 'పరిస్థితుల మార్పుతో అతి తక్కువ ఫీజులతో బ్రోకింగ్ పరిశ్రమ నిలదొక్కుకోవడం అంత సులువు కాదు. ముఖ్యంగా డిస్కౌంట్ బ్రోకింగ్ సంస్థలు ఫీజులు పెంచక తప్పదు. ఎందుకంటే అవి ఎఫ్అండ్ఓ వాల్యూమ్స్ పైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. సెబీ నిర్ణయంతో ఆదాయాలకు కోత పడుతుంది' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ ఎండీ ధీరజ్ రెల్లి పేర్కొన్నారు.

కొన్నేళ్లుగా హవా...

గతంలో ఓ వెలుగు వెలిగిన బ్యాంకింగ్ 'బ్రోకరేజ్'లకు (ఐసీఐసీ డైరెక్ట్, యాక్సిస్ డైరెక్ట్ వంటివి) జీరోధా, గ్రో వంటి కొత్త తరం బ్రోకరేజీ సంస్థలు భారీగానే గండి కొట్టాయి. ముఖ్యంగా క్యాష్ లావాదేవీలపై జీరో బ్రోకరేజీ, ఎఫ్అండ్ఓ ట్రేడింగ్‌కు అతి తక్కువ చార్జీలు, మార్జిన్లపై లీవరేజీ వంటి ప్రయోజనాలతో బ్యాంకుల వ్యాపారాన్ని కొల్లగొట్టాయి. మరోపక్క, రిటైల్ ఇన్వెస్టర్లు ముఖ్యంగా యువత సరైన అవగాహన లేకుండా, అత్యాశతో ఎఫ్అండ్ఓ ట్రేడింగ్‌లో కుదేలయ్యే పరిస్థితికి దారితీస్తోంది. చిన్న ఇన్వెస్టర్లు డెరివేటివ్స్ ట్రేడింగ్ చేయకుండా సెబీ పలు చర్యలు చేపడుతున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదు. 2022-24 మధ్య వ్యక్తిగత ట్రేడర్లు సగటున రూ.2 లక్షలు నష్టపోయారని.. రూ.1.8 లక్షల కోట్లు ఆవిరైందని సెబీ అధ్యయనం తేల్చింది. దీంతో ఇంకాస్త కఠిన నిబంధనలు తెచ్చింది.



> సెబీ కఠిన నిబంధనల కారణంగా మొత్తం ఎఫ్అండ్ఓ ట్రేడ్స్‌లో 60% మేర ప్రభావం ఉండొచ్చు. మా ప్లాట్‌ఫామ్‌లో డెరివేటివ్ ఆర్డర్లు 30% తగ్గుతాయని భావిస్తున్నాం. - నితిన్ కామత్, జీరోధా ఫౌండర్, సీఈఓ

రూ. 2,000 కోట్ల చిల్లు...

మార్కెట్ ఇన్‌ఫ్రా సంస్థలు (ఎంఐఐలు-ఎక్స్ఛేంజీలు, క్లియరింగ్ కార్పొరేషన్లు, డిపాజిటరీలు) మెంబర్లకు (బ్రోకర్లు) విధించే ఛార్జీ లతో సమానంగానే కస్టమర్లకు (ఇన్వెస్టర్లు, ట్రేడర్లు) కూడా చార్జీలు ఉండాలని సెబీ ఈ ఏడాది జూలైలో ఆదేశించింది. ప్రస్తుతం అధిక వాల్యూమ్ ఉంటే ఎంఐఐలు బ్రోకర్లకు కొంత డిస్కౌంట్ ఇస్తున్నాయి. ట్రేడర్లకు మాత్రం ఫ్లాట్ రేట్ అమలు చేస్తుండటంతో ఆమేరకు బ్రోకింగ్ కంపెనీలకు లాభం చేకూరుతోంది. అయితే, సెబీ ఏకరీతి చార్జీల నిబంధనల వల్ల బ్రోకరేజీ సంస్థల ఆదాయాల్లో రూ. 2,000 కోట్లకు పైగా చిల్లు పడుతుందని అంచనా. ముఖ్యంగా డిస్కౌంట్ ప్లాట్‌ఫామ్‌లపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు జీరో బ్రోకరేజీ మోడల్స్‌కు తెరపడవచ్చనేది పరిశ్రమ విశ్లేషకుల మాట! 'ఆదాయంలో 15-20 శాతం కోత ప్రభావంతో చాలా వరకు బ్రోకరేజీలు ఈక్విటీ డెలివరీపై ఫీజు విధించవచ్చు. మధ్య, చిన్న స్థాయి బ్రోకింగ్ కంపెనీలకు ఈ సెగ బాగా తగులుతుంది' అని ఫైయర్స్ బ్రోకరేజ్ కో-ఫౌండర్, సీఈఓ తేజస్ ఖోడే అభిప్రాయపడ్డారు. కాగా, బ్రోకింగ్ దిగ్గజం జీరోధా మాత్రం ప్రస్తుతానికి తాము షేర్ల డెలివరీపై ఎలాంటి ఫీజు విధించబోమని స్పష్టం చేసింది. 'మా ఆదాయంలో అత్యధిక భాగం ఇండెక్స్ డెరివేటివ్స్ ద్వారానే వస్తోంది. ఈ విభాగంలో కఠిన నిబంధనల వల్ల ఆదాయంలో 30-50 శాతం తగ్గుదలకు ఆస్కారం ఉంది' అని జీరోధా ఫౌండర్, సీఈఓ నితిన్ కామత్ పేర్కొనడం విశేషం! **– సాక్షి, బిజినెస్ డెస్క్**

సెబీ కీలక మార్పులు...

- ఇండెక్స్ డెరివేటివ్స్‌లో కాంట్రాక్ట్ కనీస విలువను రూ.15 లక్షలకు (గరిష్టంగా రూ.20 లక్షలు) పెంపు.
- వీక్లీ ఎక్స్‌పైరీ కాంట్రాక్టుల సంఖ్య కుదింపు, ఇంట్రాడే పొజిషన్ లిమిట్‌లను తప్పనిసరిగా పర్యవేక్షించడం.
- బ్రోకరేజీలు ఆప్షన్ ప్రీమియంను బయ్యర్ల నుంచి ముందుగానే పూర్తిగా వసూలు చేయడం.
- డెరివేటివ్స్ ఎక్స్‌పైరీ రోజున మార్జిన్ల పెంపు, క్యాలెండర్ స్ప్రెడ్ ప్రయోజనాల తొలగింపు.
- ఆప్షన్స్ ఎక్స్‌పైరీ రోజున టెయిల్ రిస్క్ కవరేజీ పెంపు.
- ఈ నిబంధనలు నవంబర్ 20 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 1 వరకు దశల వారీగా అమల్లోకి రానున్నాయి.

సాక్షి స్పోర్ట్స్



నేటి నుంచి హైదరాబాద్ టి20 మ్యాచ్ టికెట్ల అమ్మకం

సాక్షి, హైదరాబాద్: భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య హైదరాబాద్‌లో ఈ నెల 12న మూడో టి20 మ్యాచ్ జరగనుంది. ఉప్పల్ స్టేడియంలో జరిగే ఈ మ్యాచ్‌కు సంబంధించి ఈ రోజు మధ్యాహ్నం గం. 2:30 నుంచి ఆన్‌లైన్‌లో టికెట్లు అమ్మకానికి అందుబాటులో ఉంటాయి. అభిమానులు paytm insider వెబ్‌సైట్/యాప్ ద్వారా టికెట్లు కొనుగోలు చేయవచ్చు. టికెట్ల ప్రారంభ ధర రూ. 750 కాగా, గరిష్ట ధర రూ. 15 వేలు. ఆన్‌లైన్‌లో కొన్న టికెట్లను ఈ నెల 8 నుంచి 12 వరకు జింఖానా గ్రౌండ్స్‌లో మార్పిడి చేసుకొని మ్యాచ్ టికెట్లను పొందాల్సి ఉంటుంది. ఇందు కోసం ఏదైనా ఐడీ కార్డును చూపించాల్సి ఉంటుంది. అన్ని టికెట్లను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే అమ్ముతున్నామని...ఆఫ్‌లైన్‌లో/కౌంటర్ల వద్ద ఎలాంటి టికెట్లూ విక్రయించడం లేదని హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు తెలిపారు. ఉప్పల్ స్టేడియంలో భారత జట్టు గతంలో రెండు టి20 మ్యాచ్‌లు ఆడింది. 2019లో వెస్టిండీస్‌పై, 2022లో ఆస్ట్రేలియాపై జరిగిన ఈ మ్యాచ్‌లలో టీమిండియానే విజయం సాధించింది. ఈ ఏడాది జనవరిలో భారత్-ఇంగ్లండ్ మధ్య టెస్టు మ్యాచ్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇచ్చింది.

కివీస్ ముందు తలవంచారు

ప్రపంచకప్‌కు ముందు ఈ ఏడాది ఆడిన 13 మ్యాచ్‌లలో న్యూజిలాండ్ ఒకటే గెలవగా... 17 మ్యాచ్‌ల్లో 11 గెలిచిన భారత్ ఫేవరెట్‌గా అడుగు పెట్టింది. కానీ అసలు సమయంలో మాత్రం టీమిండియా చేతులెత్తేసి టోర్నీని ఓటమితో మొదలు పెట్టింది. ముందుగా పేలవ బౌలింగ్‌తో కివీస్ మెరుగైన స్కోరు సాధించే అవకాశం కల్పించిన మన మహిళలు... ఆ తర్వాత బ్యాటింగ్‌లోనూ పూర్తిగా తడబడ్డారు. టాప్-5 స్మృతి, హర్మన్, షఫాలీ, జెమీమా, రిచా సమష్టిగా విఫలం కావడంతో భారత జట్టుకు పరాజయం తప్పలేదు.

- టి20 వరల్డ్ కప్ తొలి పోరులో భారత మహిళల జట్టు పరాజయం
- 58 పరుగులతో న్యూజిలాండ్ గెలుపు
- హర్మన్‌ప్రీత్ బృందం సమష్టి వైఫల్యం
- రేపు పాకిస్తాన్‌తో మ్యాచ్





దుబాయ్: తొలి వరల్డ్ కప్ గెలిచే లక్ష్యంతో ఉత్సాహంగా బరిలోకి దిగిన భారత మహిళల జట్టుకు తొలి పోరులోనే షాక్ తగిలింది. శుక్రవారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో న్యూజిలాండ్ 58 పరుగుల తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. కెప్టెన్ సోఫీ డివైన్ (36 బంతుల్లో 57 నాటౌట్; 7 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించగా... ఓపెనర్లు జార్జియా ప్లిమ్మర్ (23 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్), సుజీ బేట్స్ (24 బంతుల్లో 27; 2 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. అనంతరం భారత్ 19 ఓవర్లలో 102 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (15)దే అత్యధిక స్కోరు. రేపు తమ రెండో లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో భారత్ ఆడుతుంది.

రాణించిన ఓపెనర్లు

న్యూజిలాండ్ ఓపెనర్లు ప్లిమ్మర్, బేట్స్ జట్టుకు ఘనమైన ఆరంభం అందించారు. పూజ వేసిన తొలి ఓవర్లో బేట్స్ రెండు ఫోర్లు కొట్టగా, దీప్తి ఓవర్లో ప్లిమ్మర్ ఫోర్, సిక్స్ బాదింది. అరుంధతి తొలి ఓవర్లో ప్లిమ్మర్ మరో రెండు ఫోర్లు కొట్టడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 55 పరుగులకు చేరింది. ఇదే ఓవర్లో బేట్స్ ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను కీపర్ రిచా వదిలేసింది. వీరిద్దరిని నిలువరించేందుకు ఇబ్బంది పడిన భారత బౌలర్లకు ఎట్టకేలకు ఎనిమిదో ఓవర్లో తొలి వికెట్ దక్కింది. మొదటి వికెట్‌కు 46 బంతుల్లో 67 పరుగులు జోడించిన ఓపెనర్లు ఒకే స్కోరు వద్ద వెనుదిరిగారు. ఆ తర్వాత అమేలియా కెర్ (13) ప్రభావం చూపలేదు కానీ డివైన్ దూకుడైన ఆటతో ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లింది. ఆశ శోభన, రేణుక ఓవర్లలో డివైన్ రెండేసి ఫోర్లు కొట్టగా... ఆమె, హ్యాలీడే (16) కలిసి దీప్తి ఓవర్లో మూడు ఫోర్లతో 16 పరుగులు రాబట్టారు. చివరి ఓవర్లో మరో ఫోర్‌తో డివైన్ 33 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకుంది.

టపటపా...

మ్యాచ్ గెలవాలంటే వరల్డ్ కప్ చరిత్రలో రెండో అత్యధిక ఛేదన రికార్డును నమోదు చేయాల్సిన స్థితిలో బరిలోకి దిగిన భారత్‌కు ఏదీ కలిసి రాలేదు. పవర్‌ప్లే ముగిసేలోపే జట్టు మూడు వికెట్లు కోల్పోయింది. కార్సన్ తన తొలి రెండు ఓవర్లలో షఫాలీ వర్మ (2), స్మృతి మంధాన (12)లను వెనక్కి పంపించగా... మూడో స్థానంలో బరిలోకి దిగిన కెప్టెన్ హర్మన్ కూడా విఫలమైంది. అంపైర్ ఎల్బీ నిర్ణయాన్ని ఆమె సవాల్ చేసినా ఫలితం దక్కలేదు. ఆ తర్వాత జెమీమా (13) కూడా ప్రభావం చూపలేకపోయింది. 11వ ఓవర్ చివరికి బంతి రిచా ఘోష్ (12) రూపంలో తమ ఐదో వికెట్ కోల్పోయిన భారత్ ఆ తర్వాత ఓటమి దిశగా సాగిపోయింది.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: బేట్స్ (సి) శ్రేయాంక (బి) అరుంధతి 27; ప్లిమ్మర్ (సి) స్మృతి (బి) శోభన 34; అమేలియా కెర్ (సి) పూజ (బి) రేణుక 13; డివైన్ (నాటౌట్) 57; హ్యాలీడే (సి) స్మృతి (బి) రేణుక 16; గ్రీన్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు)** 160. **వికెట్ల పతనం:** 1-67, 2-67, 3-99, 4-145. **బౌలింగ్:** పూజ వస్త్రకర్ 1-0-9-0, రేణుకా సింగ్ 4-0-27-2, దీప్తి శర్మ 4-0-45-0, అరుంధతి రెడ్డి 4-0-28-1, ఆశా శోభన 4-0-22-1, శ్రేయాంక పాటిల్ 3-0-25-0.

భారత్ ఇన్నింగ్స్: స్మృతి (సి) గ్రీన్ (బి) కార్సన్ 12; షఫాలీ (సి అండ్ బి) కార్సన్ 2; హర్మన్‌ప్రీత్ (ఎల్బీ) (బి) రోజ్‌మేరీ 15; జెమీమా (సి) గ్రీన్ (బి) తహుహు 13; రిచా (సి) డివైన్ (బి) తహుహు 12; దీప్తి (సి) డివైన్ (బి) తహుహు 13; అరుంధతి (సి) బేట్స్ (బి) రోజ్‌మేరీ 1; పూజ (బి) కెర్ 8; శ్రేయాంక (సి) (సబ్) పెన్‌ఫోల్డ్ (బి) రోజ్‌మేరీ 7; శోభన (నాటౌట్) 6; రేణుక (సి) డివైన్ (బి) రోజ్‌మేరీ 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (19 ఓవర్లలో ఆలౌట్)** 102. **వికెట్ల పతనం:** 1-11, 2-28, 3-42, 4-55, 5-70, 6-75, 7-88, 8-90, 9-102, 10-102. **బౌలింగ్:** జెస్ కెర్ 3-0-13-0, ఈడెన్ కార్సన్ 4-0-34-2, రోజ్‌మేరీ 4-0-19-4, అమేలియా కెర్ 4-0-19-1, తహుహు 4-0-15-3.

దక్షిణాఫ్రికా ఘన విజయం

- రాణించిన ఎమ్‌లాబా, వోల్‌వార్ట్
- 10 వికెట్లతో వెస్టిండీస్ చిత్తు



దుబాయ్: మహిళల టి20 వరల్డ్ కప్‌లో మాజీ చాంపియన్ వెస్టిండీస్‌కు తొలి పోరులో ఘోర పరాజయం ఎదురైంది. శుక్రవారం జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు 10 వికెట్ల తేడాతో విండీస్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. స్టెఫానీ టేలర్ (41 బంతుల్లో 44 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా, మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. సఫారీ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నాన్‌కులులెకో ఎమ్‌లాబా (4/29) నాలుగు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీయగా, మరిజాన్ కాప్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం దక్షిణాఫ్రికా 17.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 119 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ లారా వోల్‌వార్ట్ (55 బంతుల్లో 59 నాటౌట్; 7 ఫోర్లు), తజ్మీన్ బ్రిట్స్ (52 బంతుల్లో 57 నాటౌట్; 6 ఫోర్లు) అభేద్యంగా నిలబడి జట్టును గెలిపించారు. మహిళల టి20 వరల్డ్ కప్ చరిత్రలో ఒక జట్టు 10 వికెట్ల తేడాతో గెలవడం ఇది ఐదోసారి కాగా... వికెట్ కోల్పోకుండా అత్యధిక పరుగుల లక్ష్యాన్ని (119) అందుకున్న జట్టుగా దక్షిణాఫ్రికా నిలిచింది. **నేడు జరిగే మ్యాచ్‌ల్లో శ్రీలంక జట్టుతో ఆస్ట్రేలియా; బంగ్లాదేశ్‌తో ఇంగ్లండ్ తలపడతాయి.**

ఏడేళ్ల విరామం తర్వాత...

తిరిగి ప్రారంభం కానున్న హాకీ ఇండియా లీగ్



న్యూఢిల్లీ: ఏడేళ్ల విరామం తర్వాత హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) తిరిగి అభిమానుల ముందుకు రానుంది. 2013లో ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైన హెచ్ఐఎల్ ఐదు సీజన్ల తర్వాత 2017లో నిలిచిపోయింది. హాకీ ఇండియా (హెచ్ఐ) అధ్యక్షుడిగా దిలీప్ టిర్కీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఈ లీగ్‌ను తిరిగి తీసుకురావాలని ప్రయత్నాలు చేయగా... ఎట్టకేలకు శుక్రవారం దీనికి ఆమోద ముద్ర లభించింది. ఈ ఏడాది డిసెంబర్ 28న ప్రారంభం కానున్న ఈ లీగ్ సరికొత్త రూపంలో ప్రేక్షకులను అలరించనుంది. గతంలో పురుషుల విభాగంలో మాత్రమే పోటీలు జరగగా... ఇప్పుడు మహిళల విభాగంలోనూ నిర్వహించనున్నారు. పురుషుల విభాగంలో 8 జట్లు (చెన్నై, లక్నో, పంజాబ్, కోల్‌కతా, ఢిల్లీ, ఒడిశా, రాంచీ, హైదరాబాద్)... మహిళల విభాగంలో 6 జట్లు (పంజాబ్, కోల్‌కతా, ఢిల్లీ, ఒడిశా, మరో 2 జట్లను ప్రకటించాలి) పోటీపడతాయి. పురుషుల మ్యాచ్‌లను రౌర్కెలాలో, మహిళల పోటీలను రాంచీలో నిర్వహించనున్నారు. మహిళల లీగ్ ఫైనల్ వచ్చే ఏడాది జనవరి 26న, పురుషుల తుదిపోరు ఫిబ్రవరి 1న జరగనుంది. లీగ్ కోసం ఈ నెల 13 నుంచి 15 వరకు ప్లేయర్ల వేలం జరగనుంది. మూడు కేటగిరీల్లో (రూ. 10 లక్షలు, 5 లక్షలు, 2 లక్షలు) ప్లేయర్లను విభజించారు. ఒక్కో జట్టులో 24 మంది ప్లేయర్లు ఉండనున్నారు. అందులో కనీసం 16 మంది భారత ఆటగాళ్లు, 8 మంది విదేశీయులకు అవకాశం ఉంటుంది. భారత ఆటగాళ్లలో నలుగురు జూనియర్లు తప్పనిసరి అనే నిబంధనను తీసుకొచ్చారు. ఈ లీగ్‌తో దేశంలో మహిళల హాకీకి మరింత ఆదరణ దక్కుతుందని హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ ఆశాభావం వ్యక్తం చేశాడు. 2017లో చివరిసారి జరిగిన హాకీ ఇండియా లీగ్‌లో కళింగ లాన్సర్స్ జట్టు విజేతగా నిలిచింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

గూగుల్‌లో చూసి దొంగతనం

- పార్శ్వనాథ విగ్రహం అపహరించిన బీటెక్ విద్యార్థులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

టేక్మాల్: వెయ్యేళ్ల చరిత్ర ఆనవాళ్లు కలిగిన జైనమత పార్శ్వనాథ తీర్థంకర విగ్రహాన్ని గూగుల్‌లో చూసి ఎత్తుకెళ్లిన దుండగులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన వివరాలను మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం మీడియాకు వెల్లడించారు. టేక్మాల్ మండలంలోని తుంబురేశ్వరాలయ ప్రాంగణంలో జైనమత పార్శ్వనాథ విగ్రహం కొలువై ఉంది. ఆగస్టు 30న విగ్రహం అపహరణకు గురైందని గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు నల్ల గొండలో విగ్రహాన్ని గుర్తించారు. నిందితులను సైతం అదుపులోకి తీసుకున్నారు. నిందితులు చిలుకురి అనువింద్ (పశ్చిమగోదావరి), పోలిశెట్టి తేజ సాయిబాబు (కృష్ణా జిల్లా), జొన్నలగడ్డ మహేశ్ బాబు (కృష్ణా జిల్లా), తోట జగత్ (పశ్చిమగోదావరి), బందెల శుభానంద్ (పశ్చిమగోదావరి) కలసి హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేసి ఇక్కడే ఉంటున్నారు. చెడు వ్యసనాలకు బానిసలైన విద్యార్థులు అత్యాశతో రాత్రికి రాత్రే రూ.లక్షలు సంపాదించాలని విగ్రహాన్ని దొంగిలించినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. విగ్రహాన్ని గ్రామస్తులకు అప్పగించి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

31568 ఎంబీఏ, ఎంసీఏ సీట్ల భర్తీ

సాక్షి, హైదరాబాద్: టీజీ ఐసెట్ ప్రత్యేక అడ్మిషన్లలో 31568 మందికి ఎంబీఏ, ఎంసీఏ సీట్లు కేటాయించారు. సాంకేతిక విద్య కమిషనర్ ఎ.దేవసేన శుక్రవారం ఈ వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 268 ఎంబీఏ కాలేజీల్లో 26800 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 25690 సీట్లు భర్తీ చేశారు. ఇంకా 2933 సీట్లు మిగిలాయి. 89 ఎంసీఏ కాలేజీల్లో 6966 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 5878 సీట్లు భర్తీ చేశారు. 1088 సీట్లు మిగిలాయి. మొత్తంగా 88.7 శాతం ఎంబీఏ, ఎంసీఏ సీట్లు భర్తీ చేసినట్టు అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది టీజీఐసెట్‌కు 71647 మంది అర్హత సాధించారు. 287 ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల్లోని సీట్లకు 170255 వెబ్ ఆప్షన్లు వచ్చాయి. 100 కాలేజీల్లో వందశాతం సీట్ల భర్తీ జరిగింది. సీట్లు వచ్చిన అభ్యర్థులు ఈ నెల 7వ తేదీలోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలని సాంకేతిక విద్య కమిషనరేట్ పేర్కొంది.

డిక్లరేషన్ కోసం ఢీ

కదం తొక్కిన అన్నదాతలు
జగిత్యాల కలెక్టరేట్ ఎదుట 4 గంటల పాటు ధర్నా


కలెక్టరేట్ వద్ద బైఠాయించిన రైతులు

జగిత్యాల టౌన్: జగిత్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం రైతులు వివిధ డిమాండ్లతో ఆందోళనకు దిగారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ప్రకటించిన విధంగా షరతుల్లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, మద్దతు ధర, బోనస్, మూతపడిన చక్కర ఫ్యాక్టరీని తెరిపించాలన్న డిమాండ్లతో కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. జిల్లా నలుమూలల నుంచి వేలాదిమంది రైతులు తరలిరాగా.. నిజామాబాద్ రోడ్డులోని మార్కెట్ యార్డు నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్, పటేల్‌చౌక్ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా చేపట్టారు. దాదాపు 4 గంటల పాటు ఆందోళన నిర్వహించారు. కథలాపూర్‌కు చెందిన ఒక రైతు సొమ్మసిల్లి పడిపోవడంతో పోలీసులు ఆస్పత్రికి తరలించారు. అనంతరం రైతులు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సత్యప్రసాద్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం రైతు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పన్నాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీఎం నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు మిట్టపల్లి తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి కర్నె రాజేందర్, బందెల మల్లన్న, బద్దం మహేందర్, వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ఆఫర్ల పేరిట బురిడీ!

పండుగల వేళ సైబర్ మోసాలకు తెరతీస్తున్న నేరగాళ్లు
మెసేజ్‌లలోని ఫిషింగ్ లింక్‌లను తెరవొద్దంటున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: పండుగల ఆఫర్లు, గిఫ్ట్ కూపన్లు, ప్రత్యేక బహుమతుల పేరిట సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. నిజమైన కంపెనీలను పోలినట్లుగా ఆన్‌లైన్ యాప్స్‌లో ప్రకటనలు గుప్పిస్తున్నారు. 'మీకు సర్‌ప్రైజ్ గిఫ్ట్ వచ్చింది.. ఈ పండుగకు మా కంపెనీ తరఫున మీకు బెస్ట్ ఆఫర్ ఇస్తున్నాం. మీరు ఈ కూపన్‌లోని నంబర్లను మేం చెప్పిన నంబర్‌కు ఎస్ఎంఎస్ చేయండి' అంటూ మోసపూరితమైన మెసేజ్‌లను మొబైల్ ఫోన్లు, వాట్సాప్‌లకు పంపుతున్నారు. అందులో కొన్ని ఫిషింగ్ లింక్‌లను జత చేస్తున్నారు. ఇలాంటివి నమ్మి మోసపోవద్దని పోలీసులు సూచిస్తున్నారు.



ఈ లాజిక్ మిస్సవ్వొద్దు..

షాపింగ్ చేయకుండానే ఉచితంగా ఏ కంపెనీ, ఏ షాపింగ్ మాల్ కూడా గిఫ్ట్ కూపన్ లేదా ఫ్రీ గిఫ్ట్ ఇవ్వదన్న విషయాన్ని మరిచిపోవద్దని చెబుతున్నారు. గతంలో ఎప్పుడో షాపింగ్ చేసిన దానికి ఇప్పుడు లక్కీ డ్రా వచ్చినా నమ్మకూడదంటున్నారు. వాట్సాప్‌లకు వచ్చే మెసేజ్‌లలోని అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయవద్దని.. ఒకవేళ పొరపాటున క్లిక్ చేస్తే వెంటనే ఫోన్‌లోకి మాల్‌వేర్ వైరస్ ఇన్‌స్టాల్ కావడంతోపాటు ఫోన్ సైబర్ నేరగాళ్ల అధీనంలోకి వెళ్తుందని హెచ్చరిస్తున్నారు.

ఆఫర్ల పేరిట మోసాలకు అవకాశం ఇలా..

- ప్రముఖ ఈ-కామర్స్ వెబ్‌సైట్లను పోలినట్లుగా ఫేక్ వెబ్‌సైట్లు సృష్టించి మోసాలు. సోషల్ మీడియా వేదికల ద్వారా ఫేక్ ఆఫర్ మెసేజ్‌లు.
- ఫ్రీ గిఫ్ట్‌లు, లక్కీ డ్రాలో బహుమతులు గెల్చుకున్నట్లు ఫేక్ ఫోన్ కాల్స్‌తో, ఎస్ఎంఎస్‌లతో మోసాలు.
- ఫిషింగ్ మెయిల్స్ పంపి అందులోని లింక్‌లపై క్లిక్ చేయాలని సూచనలు.
- పండుగ సీజన్‌లో ఫ్రీ గిఫ్ట్‌ల కోసం తాము పంపే ఆన్‌లైన్ గేమ్స్ ఆడి పాయింట్స్ గెలవాలంటూ నకిలీ ఆన్‌లైన్ గేమ్స్ లింక్‌లతో సందేశాలు.

9, 10 తరగతుల పరీక్షల్లో మార్పులు

సాక్షి, హైదరాబాద్: తొమ్మిది, పది తరగతుల పరీక్షల్లో విద్యాశాఖ స్వల్ప సవరణలు చేసింది. రెండు భాగాలుగా నిర్వహించే సైన్స్ సబ్జెక్టుకు అదనంగా 20 నిమిషాలు ఇచ్చే పరీక్ష సమయాన్ని రద్దు చేసింది. 2022–23 సంవత్సరంలో సైన్స్ సబ్జెక్టును బయాలజీ, ఫిజికల్ సైన్స్‌ను విడివిడిగా రెండు పేపర్లతో పరీక్ష నిర్వహించేవారు. దీంతో ఇతర సబ్జెక్టులకు 3 గంటల సమయం ఇస్తే, సైన్స్ పేపర్లు ఒకే రోజు చేపట్టడం వల్ల అదనంగా 20 నిమిషాలు ఇచ్చారు. కానీ గత ఏడాది నుంచి సైన్స్ రెండు పేపర్లను వేర్వేరు రోజుల్లో నిర్వహిస్తున్నారు. ఈ కారణంగా 20 నిమిషాల అదనపు సమయాన్ని ఎత్తివేస్తూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇది మీ జిల్లా కాదు.. వెళ్లిపోండి

ఓ గర్భిణిని ఆస్పత్రి నుంచి వెళ్లిపోమని చెప్పిన డాక్టర్లు

జనగామ: 'ఇది మీ జిల్లా కాదుకదా.. ప్రసూతి కోసం ఇక్కడికి ఎందుకు వచ్చారు. అడ్మిట్ చేసుకోం..వెళ్లిపోండి' అంటూ జనగామ చంపక్‌హిల్స్ మాతా, శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) వైద్యులు ఓ గర్భిణిని గదమాయించడంతో ఆస్పత్రికి వచ్చిన మిగతా గర్భిణులు, రోగులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. శుక్రవారం ఆస్పత్రి వద్ద ఓ గర్భిణీ సోదరుడు గొల్లపల్లి రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. జనగామ జిల్లా కేంద్రం జూబ్లీగార్డెన్ ఏరియాకు చెందిన శృతిని భువనగిరి జిల్లా యాదగిరిగుట్టకు చెందిన మిట్ట వేణుకు ఇచ్చి వివాహం చేశారు. ఆమెకు నాలుగవ నెల నుంచి ఈ ఎంసీహెచ్‌లోనే పరీక్షలు చేయిస్తున్నారు. చివరి నెల పరీక్ష కోసం శృతిని ఆమె తల్లి ఎంసీహెచ్‌కు తీసుకువెళ్లింది. ఈ నేపథ్యంలో యాదాద్రి జిల్లాకు చెందిన గర్భిణీవి ఇక్కడికి ఎందుకు వచ్చావంటూ ప్రశ్నించిన ప్రసూతి వైద్యులు.. 'వేరే జిల్లాకు చెందిన వారికి ఇక్కడ కాన్పు చేయం. మీ జిల్లాలో పెద్దాస్పత్రి ఉంది కదా' అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ యాదాద్రి జిల్లా ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో ముగ్గురు గైనిక్ డాక్టర్లు ఉన్నా.. గత నెల ఆ ప్రాంతానికి చెందిన 80 మందికి ఇక్కడ డెలివరీ చేసినట్లు తెలిపారు. అక్కడ డెలివరీలు ఎందుకు జరగడం లేదో తెలియడం లేదన్నారు. హనుమకొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి, నల్లగొండ జిల్లాలకు చెందిన వారు డెలివరీల కోసం ఇక్కడికే రావడం.. స్థానికంగా ప్రసూతి డాక్టర్ల కొరత ఉండటంతో అందుబాటులో ఉన్న ఆస్పత్రిలో కాన్పు చేయించుకోవాలంటున్నామే తప్ప సొంత జిల్లా కాదని నిరాకరించడం లేదన్నారు. శృతిని అడ్మిట్ చేసుకోవాలని డాక్టర్లకు చెప్పామని ఆయన వివరించారు.

సీఎం సహాయ నిధికి విరాళాలు

బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రూ.1.01 కోట్లు


సీఎం రేవంత్‌కు విరాళాన్ని అందజేస్తున్న బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వరద బాధితులను ఆదుకోవడానికి బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సీఎం సహాయ నిధికి రూ.1,01,75,000 విరాళంగా ఇచ్చింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు వి.సురేందర్, ఎస్.ఎన్.రెడ్డిలు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలసి చెక్‌ను అందచేశారు. అలాగే విన్స్ బయో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎం సహాయ నిధికి రూ.51 లక్షల విరాళాన్ని అందజేసింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ఎన్. డాగ, సీఈవో సిద్ధార్థ డాగ సీఎం రేవంత్‌రెడ్డిని కలసి చెక్‌ను అందించారు. బొండాడ గ్రూప్ సీఎండీ బొండాడ రాఘవేంద్రరావు రూ.25 లక్షలు, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ఎండీ రామ్మోహన్ రావు రూ.25 లక్షల విరాళాలను సీఎం రేవంత్‌కు అందజేశారు. ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.సుబ్బయ్య, డైరెక్టర్ సోమలింగం సీఎం సహాయ నిధికి రూ.10 లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు.

కృష్ణానదిలో ఉత్తమ్ తండ్రి అస్థికల నిమజ్జనం


మట్టపల్లి వద్ద కృష్ణానదిలో తన తండ్రి అస్థికలను నిమజ్జనం చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కుటుంబసభ్యులు

మఠంపల్లి: నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన తండ్రి నలమాద పురుషోత్తంరెడ్డి అస్థికలను శుక్రవారం సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. మంత్రి ఉత్తమ్ తండ్రి ఇటీవల మృతి చెందడం తెలిసిందే. కార్యక్రమంలో మంత్రి కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రూ.4 కోట్ల విలువైన గంజాయి దహనం


గంజాయిని దహనం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

తల్లాడ: ఖమ్మం జిల్లాలోని 4 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో కొన్నేళ్లుగా స్వాధీనం చేసుకున్న రూ.4 కోట్ల విలువైన 1,611.94 కిలోల గంజాయిని అధునాతన పద్ధతిలో దహనం చేశారు. తల్లాడ మండలం గోపాలపేటలోని ఏడబ్ల్యూఎం కన్సల్టింగ్ కేంద్రంలో ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జి.గణేశ్ ఆధ్వర్యాన ఈ గంజాయిని శుక్రవారం నిర్వీర్యం చేశారు. కొన్నేళ్లుగా స్వాధీనం చేసుకుంటూ నిల్వ చేస్తున్న గంజాయి భారీగా పోగవడంతో దహనం చేసినట్లు అధికారులు తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
శనివారం: 5-10-2024

ఆరోగ్యానికి సైబర్ ముప్పు

ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య రంగంపై పెరుగుతున్న సైబర్ దాడులు

- రెండేళ్ల కాలంలో 2 కోట్ల మంది ఆరోగ్య వివరాల చోరీ
- సైబర్ దాడుల్లో 53% ఆరోగ్యరంగానివే అంటున్న ప్రపంచ ఆరోగ్య సంస్థ
- వ్యక్తిగత ఆరోగ్య వివరాలను బీమా కంపెనీలకు అమ్మేయడం ఒకటైతే...
- బెదిరించి డబ్బులు వసూలు చేయడం సైబర్ నేరస్తుల మరో టార్గెట్
- భవిష్యత్తులో మరింత పెరుగుతాయంటున్న ఆరోగ్య నిపుణులు



సాక్షి, హైదరాబాద్: శ్రీనివాస్ అనే మధ్యతరగతి వ్యాపారికి తీవ్రమైన గుండెపోటు వచ్చింది. రూ.10 లక్షల ఆరోగ్య బీమా ఉన్నందున వెంటనే ఒక ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రిలో చేరేందుకు వెళ్లాడు. బీమా కంపెనీ కార్డును కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చూపించారు. ఆ కార్డును చూసిన బీమా సిబ్బంది...అప్పటికే శ్రీనివాస్ ఒక రోగానికి రూ.10 లక్షలు వాడుకున్నట్లు తేల్చారు. కాబట్టి ఇప్పుడు డబ్బులు చెల్లించి వైద్యం చేయించుకోవాల్సిందేనని చెప్పడంతో కుటుంబ సభ్యులు విస్తుబోయారు. అంతకుముందు అతను ఎక్కడా ఆరోగ్య బీమాను ఉపయోగించుకోలేదు. అయితే అక్కడ అసలేం జరిగింది?

→ తీవ్ర అస్వస్థతకు గురైన ఒక రోగిని అంబులెన్స్ డ్రైవర్ తనకు సమీపంలో ఉన్న ఒక మంచి ఆసుపత్రికి తరలించుకుపోతున్నాడు. ఆ ఆసుపత్రికి వస్తున్నట్లు సమాచారం ఇచ్చాడు.

కొద్దిసేపట్లో వెంటనే ఆసుపత్రి నుంచి డ్రైవర్‌కు ఫోన్ వచ్చింది. ఆ రోగికి అవసరమైన వైద్య వసతులు, డాక్టర్లు లేరనీ, కాబట్టి మరో ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో దూరంలో ఉన్న మరో ఆసుపత్రికి తీసుకెళ్లారు. తర్వాత తెలిసిందేంటంటే మొదటి ఆసుపత్రి వర్గాలు ఎవరూ ఆయనకు ఫోన్ చేసి చెప్పలేదని? ఇక్కడ అసలేం జరిగింది?

ఇటువంటి సంఘటనలకు కారణం ఆరోగ్యరంగంలో సైబర్ దాడులే. ప్రపంచంలో జరిగే అన్ని రకాల సైబర్ దాడుల్లో ఎక్కువగా ఆరోగ్యరంగంపైనే జరుగుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. 'ఆరోగ్యరంగాన్ని డిజిటలైజేషన్ చేయడం వల్ల భవిష్యత్తులో వచ్చే సైబర్ దాడులను ఎలా ఎదుర్కోవాల'నే దానిపై రెండ్రోజుల క్రితం ఒక నివేదిక విడుదల చేసింది. ప్రస్తుతం ఆరోగ్య రంగం సైబర్ ఎటాక్‌లతో ప్రమాదంలో ఉందని, ఆ పరిస్థితి నుంచి బయటపడి, మున్ముందు అటువంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు పటిష్టమైన సైబర్ భద్రతా చర్యలు చేపట్టాలని సూచించింది. యూరోపియన్ యూనియన్‌కు చెందిన సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ లెక్కల ప్రకారం 2023లో జరిగిన సైబర్ దాడుల్లో 53% ఆరోగ్య రంగానికి సంబంధించినవేనని తేల్చిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. 2022లో వారానికి సగటున 1,463 దాడులు ఆరోగ్యరంగంపై జరిగిన సైబర్ దాడులేనని తెలిపింది. ఈ దాడుల్లో ఎక్కువగా బ్లాక్‌మెయిల్‌కు సంబంధించినవే.

ఆరోగ్యరంగం డిజిటలైజేషన్...

వేగంగా సేవలు అందించడం, మరోవైపు అనవసర ఖర్చు తగ్గించుకోవడం కోసం ఆరోగ్య రంగాలకు సంబంధించిన వ్యవస్థలు ప్రపంచవ్యాప్తంగా డిజిటలైజేషన్‌పై దృష్టిపెట్టాయి. అలాగే నిపుణుల కొరత, బడ్జెట్ సమస్యల వల్ల కూడా డిజిటలైజేషన్‌కు వెళ్తున్నారు. అయితే భద్రత ఎక్కువగా లేని సాఫ్ట్‌వేర్‌లను ఎంచుకోవడం, నాణ్యతలేని వ్యవస్థల వల్ల అటువంటి సంస్థలపై సైబర్ దాడులు పెరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో సైబర్ భద్రత కోసం 40 లక్షల మంది నిపుణులు కావాలి. ప్రస్తుత పరిస్థితితో పోలిస్తే 70%కొరత నెలకొంది. దీనివల్ల సైబర్ దాడులకు అంతేలేకుండా పోయిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. ఏ వ్యవస్థ అయినా వంద శాతం సక్రమంగా ఉండదు. కాబట్టి డేటాకు బ్యాకప్ సిస్టం ఉండాలి. లేకుంటే సమస్యలు వస్తాయని హెచ్చరించింది. సైబర్ దాడులను ఎదుర్కొనేందుకు ఒక వ్యవస్థ ఉండాలి. సైబర్ దాడికి గురైన వారు తమ గోడు చెప్పుకునేందుకు ఒక వేదిక ఉండాలని సిఫార్సు చేసింది. సైబర్ భద్రతపైన సాఫ్ట్‌వేర్ నిపుణులకు పూర్తిస్థాయి అవగాహన లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పింది. సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలో పనిచేసే వారు తక్కువగా ఉన్నారు. ఆయా సైబర్ దాడులను ఎదుర్కోవడంలో వారికి శిక్షణ లేదు. కాబట్టి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, ఆసుపత్రులు సైబర్ సెక్యూరిటీపై దృష్టిసారించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ విజ్ఞప్తి చేసింది.

డేటా అమ్ముకోవడం... బ్లాక్‌మెయిల్ చేయడం

ఆసుపత్రులు, వైద్య ఆరోగ్య సంస్థల్లో జరిగే దాడుల్లో సేకరించిన డేటాను సైబర్ నేరగాళ్లు అమ్ముకుంటారు. ప్రస్తుతమున్న ఆసుపత్రిని దెబ్బకొట్టడానికి వాటిని ఉపయోగిస్తారు. అంతేగాక పరిశోధకులకు, బహుళజాతి కంపెనీలకు, ఫార్మా కంపెనీలకు అమ్ముకుంటారు. అలాగే సైబర్ దాడుల్లో సేకరించిన డేటాను మార్పు చేసే అవకాశం ఉంది. రోగి సమాచారాన్ని మార్చుతారు. దీనివల్ల రోగికి ఉన్న అసలు జబ్బుకు కాకుండా మరో వ్యాధికి చికిత్స చేసే పరిస్థితి నెలకొంటుంది. ఆసుపత్రిని దెబ్బతీసేందుకు సైబర్ నేరగాళ్లు ఇలాంటివి చేసేందుకు కుట్ర పన్నుతున్నారు. రోగి తాను ఇతరులకు చెప్పుకోలేని జబ్బు వచ్చినా...ఆ రోగి జబ్బు బయటకు తెలిస్తే పెద్దఎత్తున ఆర్థిక, సామాజిక నష్టం జరిగే పరిస్థితుల్లో సైబర్ నేరగాళ్లు వారి డేటాను ఉపయోగించి బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేస్తారు.

500 సైబర్ దాడుల్లో 2 కోట్ల మంది రోగుల డేటా తస్కరణ...

2020 జూన్ నుంచి 2022 సెప్టెంబర్ వరకు 43 దేశాల్లో ఆసుపత్రులు, ఆరోగ్య రంగానికి చెందిన వ్యవస్థలపై జరిగిన 500 సైబర్ దాడులను సైబర్ నిపుణులు పరిశోధించారు. ఒక్కొక్క సంఘటనకు సంబంధించి 1.63 లక్షలమంది రోగుల సమాచారం లీక్ అయిందని గుర్తించారు. ఆ రెండేళ్ల కాలంలో మొత్తం ఆ 500 దాడుల్లో 2 కోట్ల మంది రోగుల సమాచారం లీక్ అయిందని నిర్ధారణకు వచ్చారు. వారి సమాచారం లీక్‌తో భద్రతకు భంగం కలిగింది. దాన్ని రికవరీ చేయడానికి ఒక సంస్థకైతే గరిష్టంగా 115 రోజులు పట్టింది. దీనివల్ల సగం కంటే ఎక్కువ సంస్థలు ఆఫ్‌లైన్‌లో పనిచేయాల్సి వచ్చింది. 70% ఆసుపత్రుల్లో రోగుల సమాచారం లీక్ అయింది. దీనివల్ల రోగులను ఇతర ఆసుపత్రులకు తరలించాల్సి వచ్చింది. కొందరు రోగుల అపాయింట్‌మెంట్లు రద్దు చేయాల్సి వచ్చింది. కొన్ని ఆసుపత్రులను మూసి వేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ఐసీఎంఆర్‌పై 6 వేల సార్లు సైబర్ ఎటాక్‌కు యత్నం

2023 నవంబర్ 23న ఢిల్లీ ఎయిమ్స్‌లో 100 సర్వర్లలో సైబర్ దాడి జరిగింది. 11 సర్వర్లు స్తంభించాయి. అప్పుడు 4 కోట్లమంది రోగుల డేటా ప్రమాదంలో పడింది. అందులో రాజకీయ నాయకుల డేటా కూడా ఉంది. ఆ డేటాను రికవరీ చేయడానికి ఎయిమ్స్‌కు మూడు వారాల సమయం పట్టింది. అదే ఏడాది డిసెంబర్‌లో ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలోనూ సైబర్ ఎటాక్ జరిగింది. దీనివల్ల ఒక రోజు మొత్తం సర్వర్లు ఆగిపోయాయి. జార్ఖండ్‌లో 2023 సెప్టెంబర్‌లో ఆయుష్ శాఖపై సైబర్ ఎటాక్ జరిగింది. 3 లక్షల రోగుల సమాచారాన్ని దొంగిలించారు. అలాగే భారతీయ వైద్య పరిశోధనా మండలి(ఐసీఎంఆర్)పై 6 వేలసార్లు సైబర్ ఎటాక్ జరిగితే...దాన్ని ఆ సంస్థ తిప్పికొట్టింది. ఎంత రిస్క్ ఉందనేందుకు ఇదే ఉత్తమ ఉదాహరణ.

–డాక్టర్ కిరణ్ మాదల, ప్రొఫెసర్, గాంధీ మెడికల్ కాలేజీ, హైదరాబాద్

ఆరోగ్య బీమాలోనూ అక్రమాలకు అవకాశం..

ఇక ఆరోగ్య బీమాలోనూ అక్రమాలు చేయవచ్చని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక రోగికి ఆపరేషన్ కాకుండానే అతనికి తెలియకుండా బీమా కంపెనీ నుంచి క్లెయిమ్స్ చేసుకోవచ్చు. దీనివల్ల రోగులకు తీవ్రంగా నష్టం వాటిల్లనుంది. రోగుల డేటాతో ఒక పేరొందిన ఆసుపత్రి వ్యవస్థను స్తంభింపచేసి మార్కెట్లో బద్నాం చేయవచ్చు. దాన్ని మూసివేయించే పరిస్థితికి తీసుకురావచ్చు. అలాగే అంబులెన్సులను డైవర్ట్ చేయవచ్చు. ఆ అంబులెన్సును మరో ఆసుపత్రికి పంపించేలా చేయవచ్చు. ఇదంతా అంబులెన్స్ డ్రైవర్‌కు తెలియకుండా ఫోన్ ద్వారానే సైబర్ నేరగాళ్లు డైవర్ట్ చేస్తారు. ఒక ఆసుపత్రి అకస్మాత్తుగా సైబర్ ఎటాక్‌కు గురైతే, ఆ ఆసుపత్రిలోని రోగుల సమాచారం, వైద్య పరీక్షల రిపోర్టులు మాయం అవుతాయి. వైద్యులు, సిబ్బంది ఆ సమాచారం చూడలేరు. ఐసీయూలో ఒక రోగి ఐదు రోజులుగా ఉంటే...ఆ ఐదు రోజుల డేటాను డాక్టర్ తిరిగి చూసే పరిస్థితి ఉండదు.

దీంతో తదుపరి చికిత్స ఇవ్వలేని పరిస్థితి నెలకొంటుంది. ఒక్కోసారి ఒక రోగికి ఇచ్చే మందులను ఇతరులకూ ఇచ్చే ప్రమాదమూ ఉంటుంది.



శుక్రవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి తో భేటీ అయిన జీ మీడియా గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ సుభాష్ చంద్ర

డీఎస్సీ ఆపమనడానికి మందకృష్ణ ఎవరు?

- మందకృష్ణ మాదిగపై కాంగ్రెస్ నేత గజ్జల కాంతం ధ్వజం

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగుల భర్తీ నిరంతర ప్రక్రియ అని, డీఎస్సీ నియామకాలు ఆపమని చెప్పడానికి మందకృష్ణ ఎవరని టీపీసీసీ నేత లు గజ్జల కాంతం, కాంగ్రెస్ సీనియర్ నేత ఊట్ల వరప్రసాద్ ప్రశ్నించారు. ఎస్సీల వర్గీకరణకు అనుకూలంగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వా న్ని విమర్శించడమే మందకృష్ణమాదిగ పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. గాంధీభవన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ... రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత మందకృష్ణ మాదిగకు లేదన్నా రు. వర్గీకరణ కోసం రేవంత్‌రెడ్డి ఒక కమిటీ వేశారని, మరో జ్యుడీషియల్ కమిటీ వేసేందుకు సైతం ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పా రు. గతంలో మందకృష్ణమాదిగ మద్దతు ఇచ్చి న సీఎంలు వర్గీకరణ కేసును వాదించేందుకు ఎందుకు సుప్రీంకోర్టులో అడ్వొకేట్లను పెట్టలే దని ప్రశ్నించారు. వర్గీకరణ జరగాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్వయంగా చెప్పారని, కొప్పుల రాజు వర్గీకరణను ఏనా డూ వ్యతిరేకించలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

వందకొట్టు.. మేకను పట్టు

దసరా బొనాంజా అంటూ టోకెన్లు



వాట్సాప్ గ్రూపులో పోస్టు

లింగాలఘణపురం: దసరా పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో కొందరు యువకులు 'దసరా బొనాంజా' పేరుతో ప్రకటించిన ఆఫర్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. రూ.100తో మీ అదృష్టాన్ని పరీక్షించుకోండంటూ.. మద్యం, మాసం పేరుతో సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. రూ.100కు ప్రథమ బహుమతిగా మేక, రెండో బహుమతిగా రెండు బ్లెండర్స్ ప్రైడ్ ఫుల్ బాటిళ్లు, మూడో బహుమతిగా ఒక కార్టన్ బీర్లు, నాలుగో బహుమతిగా 2 నాటు కోళ్లు, అయిదో బహుమతిగా రాయల్‌స్టాగ్ ఫుల్ బాటిల్ అని పేర్కొన్నారు. 4వ తేదీ సాయంత్రం నుంచి అంబేద్కర్ విగ్రహం వద్ద టోకెన్లు అమ్ముతారని, 11వ తేదీన డ్రా తీస్తామంటూ.. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు, పేర్లు సైతం పెట్టారు. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన వాట్సాప్ గ్రూప్‌లో ఇది వైరల్ అవుతోంది.



శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో హైదరాబాద్ ఎన్ఎండీసీ వద్ద ట్రాఫిక్ జామ్

అసెంబ్లీని సందర్శించిన ఆస్ట్రేలియా ప్రతినిధుల బృందం

మండలి ఛైర్మన్‌తో ఆస్ట్రేలియా ప్రజా ప్రతినిధులు భేటీ



సాక్షి, హైదరాబాద్: ఆస్ట్రేలియా దేశానికి చెందిన ప్రజా ప్రతినిధుల బృందం శుక్రవారం తెలంగాణ అసెంబ్లీని సందర్శించింది. ఆస్ట్రేలియా ప్రతినిధి బృందంతో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాశ్, పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు భేటీ అయ్యారు. తెలంగాణ శాసనసభ, శాసన మండలి సమావేశ మందిరాలను ఆస్ట్రేలియా ప్రతినిధి బృందానికి మండలి ఛైర్మన్ స్వయంగా చూపించారు. ఉభయ సభల్లో జరిగే సమావేశాల తీరుతెన్నులు, సభ్యుల ఎన్నిక, వారి విధులు, బాధ్యతలు వంటి అంశాలను వివరించారు. ఈ బృందానికి నేతృత్వం వహిస్తున్న ఆస్ట్రేలియా మంత్రులు రిచర్డ్ రీయర్డాన్, బ్రాండ్ బట్టిన్‌ను మండలి ఛైర్మన్ శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. రాష్ట్ర అసెంబ్లీ ఉభయ సభల నిర్వహణ బాగా ఉందని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ఉభయ సభలు మూలస్తంభాలుగా పనిచేస్తున్నాయని రిచర్డ్ రీయర్డాన్, బ్రాండ్ బట్టిన్ కితాబునిచ్చారు. అసెంబ్లీని సందర్శించడం ఎంతో సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు.

'పండుగ' చేసుకోండి

సాక్షి, హైదరాబాద్: పండుగలకు కొన్ని రోజుల ముందునుంచే పిల్లలు, పెద్దలు తేడా లేకుండా అన్ని వయసుల వారిలో కొత్త ఉత్సాహం పుట్టుకొస్తుంది. మరీ ముఖ్యంగా దసరా, దీపావళి వంటి పెద్ద పండుగలు 2, 3 వారాల వ్యవధిలోనే వస్తున్నాయంటే ఇక ఆ ఉత్సాహమే వేరు. పండుగలను ఎలా జరుపుకోవాలో, ఏమేం వస్తువులు కొనుగోలు చేయాలో అధిక శాతం మంది ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారు. ఇక.. ఈ నెల 12న విజయదశమి, 31న దీపావళి పండుగలు రానుండటంతో కొనుగోలుదారుల సందడి చెప్పనక్కర్లేదు. దసరాకు ముందే రెండు తెలుగు రాష్ట్రాల్లో తొమ్మిది రోజుల పాటు నవ రాత్రి ఉత్సవాలు జరుపుకొంటారు, తెలంగాణలో ప్రకృతిపూల ఉత్సవం 'బతుకమ్మ'తో.. ముందే పండుగ హడావుడి మొదలైపోయింది. దాదాపు అన్ని రాష్ట్రాల్లో దసరా, దీపావళి పండుగలు పెద్ద ఎత్తున జరుపుకోవడం తెలిసిందే. ప్రస్తుత పండుగల సీజన్ నేపథ్యంలో.. మిఠాయిలు, స్నాక్స్, బంధువులు, మిత్రులకు కానుకల కొనుగోలు, ఇంటి అలంకరణ సామగ్రి, కొత్త బట్టలు, టీవీలు, ఫ్రిజ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, వస్తువులు, కార్లు, వాహనాల కొనుగోళ్లు, ముఖ్యమైన వస్తువుల కొనుగోలుకు కొనుగోలుదారులు సిద్ధమైపోయారు. తమ ప్రాధాన్యాలు, ప్రణాళికలు, అందుబాటులో ఉన్న బడ్జెట్‌కు అనుగుణంగా ఆయా మార్కెట్లకు వెళ్లి షాపింగ్ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 36.18 శాతం వినియోగదారులు ఈ పండుగల షాపింగ్ కోసం అధికంగా ఖర్చు చేసేందుకు ముందుకొస్తున్నారు. తాజాగా.. భారత్ ల్యాబ్ సంస్థ, రీడిఫ్యూజన్ యాడ్ ఏజెన్సీ, లఖ్‌నవూ యూనివర్సిటీ జరిపిన పరిశీలన ఆధారంగా 'దీపావళి పల్స్ రిపోర్ట్–2024' నివేదికను విడుదల చేశారు. ప్రధానంగా ఈ పరిశీలనలో వివిధ వర్గాల వినియోగదారుల షాపింగ్ ట్రెండ్ ఏ విధంగా ఉండబోతోంది?, ఈ విషయంలో కస్టమర్ల మనోభావాలు ఏ విధంగా ఉండబోతున్నాయనే దానిపై దృష్టి కేంద్రీకరించారు. దేశవ్యాప్తంగా ఒకవైపు ద్రవ్యోల్బణ పరిస్థితులు, ధరల పెరుగుదల వంటి సమస్యలున్నా పండుగ షాపింగ్ విషయంలో మాత్రం వెనక్కి తగ్గేది లేదన్న అభిప్రాయం వ్యక్తమైనట్లు ఆ నివేదికలో పేర్కొన్నారు. కోవిడ్ మహమ్మారి నుంచి పూర్తిస్థాయిలో కోలుకున్న వాతావరణంలో సంప్రదాయ కొనుగోళ్లతో పాటు బంగారు ఆభరణాలు కొనేందుకు కూడా వివిధ వర్గాల్లో డిమాండ్ పెరుగుతున్నట్టు నివేదిక వెల్లడించింది.



వివిధ కేటగిరీల వారీగా బడ్జెట్ ప్లానింగ్ ఇలా...

- → ఈ పండుగ సీజన్‌లో కొనుగోలు బడ్జెట్ పెంపునకు 36.18 శాతం మంది మొగ్గు
- → 35.02 శాతం మంది గతేడాది మాదిరిస్థాయిలోనే కొనుగోళ్లకు సిద్ధం.
- → ప్రస్తుత ధరల నేపథ్యంలో తమ బడ్జెట్‌ను కొంత తగ్గిస్తామంటున్నవారు 29.52 శాతం మంది.

పండుగ కొనుగోళ్లలో వయసుల వారీగా వివరాలు

- → 20–30 ఏళ్ల మధ్యనున్న వారిలో 85 శాతం మంది పండుగ కొనుగోళ్లు చేస్తామంటున్నారు
- → 30–40 ఏళ్ల మధ్య వారిలో 71 శాతం..
- → 40–50 ఏళ్ల వయసు వారిలో 66 శాతం..
- → 50–60 ఏళ్ల మధ్య వయసువారిలో 57 శాతం మంది..

ఫెస్టివల్ షాపింగ్‌కు ఆకర్షిస్తున్న వివిధ మాధ్యమాలివి..

- సామాజిక మాధ్యమాలు–53.7 శాతం
- ఆన్‌లైన్ యాడ్స్–50.8 శాతం
- ఫ్యామిలీ, ఫ్రెండ్స్–43.9 శాతం
- టీవీ, పత్రికా ప్రకటనలు–41.2 శాతం
- ఇన్‌స్టోర్ ప్రమోషన్స్–26.3 శాతం

గతేడాది పండుగ సీజన్ సందర్భంగా... 'మూడ్ ఆఫ్ భారత్ స్టడీ' పేరిట ఒక అధ్యయనం నిర్వహించాం. ఐతే గతేడాదికి మించి.. ఈ ఏడాది మరింత విస్తృతస్థాయిలో, లోతైన, సమగ్ర పరిశీలన నిర్వహించాం. ఇందులో భాగంగా వివిధ కేటగిరీల వారీగా కస్టమర్లు ఏయే రకాల వస్తువుల కొనుగోలుకు ప్రణాళికలు సిద్ధం చేశారో ప్రత్యేక దృష్టి నిలిపాం. ఈ అధ్యయనంలో ఆయా వయస్కులు, ఆదాయవర్గాల వారీగా ఎలాంటి కొనుగోళ్లకు సిద్ధమౌతున్నారనే దానిపై పలు ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి.

– డాక్టర్ సందీప్ గోయల్, ఛైర్మన్, రీ డిఫ్యూజన్

పండుగ షాపింగ్‌కు సై..

- దసరా–దీపావళి సీజన్‌కు పెరగనున్న జోష్
- షాపింగ్‌కు ఈ ఏడాది 36.18 శాతం మంది అధికంగా మొగ్గు
- కొత్త దుస్తుల కొనుగోలుకు 86.35 శాతం మంది మక్కువ
- బంధువులు, స్నేహితులకు పండుగ కానుకలు ఇచ్చేందుకు 72.84 శాతం సుముఖత
- గృహాలంకరణకు 70.83 శాతం మంది ప్రాధాన్యం
- ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోలుకు 60.92 శాతం
- భారత్ ల్యాబ్ సంస్థ, రీడిఫ్యూజన్ యాడ్ ఏజెన్సీ, లఖ్‌నవూ యూనివర్సిటీ 'దీపావళి పల్స్ రిపోర్ట్–2024' నివేదికలో వెల్లడి

ఫ్యాషన్.. వస్త్రాలదే అగ్రస్థానం

- 86.35 శాతం మంది మారుతున్న ఫ్యాషన్ ట్రెండ్లకు అనుగుణంగా కొత్త దుస్తుల కొనుగోలుకు సై అంటున్నారు. వీరిలో పురుషుల సంఖ్య అధికంగా ఉండడం ఆసక్తికరం.
- బంధువులు, స్నేహితులకు పండుగ కానుకలు ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నవారు 72.84 శాతం
- 70.83 శాతం మంది గృహాలంకరణకు ప్రాధాన్యం ఇస్తామంటున్నారు.
- ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోలుకు మక్కువ చూపుతున్న వారు 60.92 శాతం (ఇందులోనూ పురుషుల సంఖ్యే ఎక్కువ)
- సంప్రదాయబద్ధంగా బంగారం కొనుగోలుకు మొగ్గుతో పాటు బంగారం రూపంలో పెట్టుబడులకు అవకాశం ఉంటుందని భావిస్తున్నవారు 55.26 శాతం
- 40.74 శాతం రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడుల్లో భాగంగా ప్లాట్లు, ఫ్లాట్ల వంటివి కొనేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు

పండుగ



అయ్యవారికి చాలు ఐదు వరహాలు

పిల్లలూ... దేవీ నవరాత్రులను దసరా పండగగా పిలుస్తారు. పూర్వపు రోజుల్లో దసరా సెలవలప్పుడు ఉపాధ్యాయులు తమ తమ పాఠశాలలో చదువుకునే బాల బాలికలను వెంటబెట్టుకుని గ్రామం లోని ఇంటింటికీ వెళ్ళే వారు, గృహస్తులను ఆశీర్వదించేవాళ్ళు. పిల్లలు కొత్త బట్టలు వేసుకుని చేతుల్లో విల్లంబులు పట్టుకుని అయ్యవారి వెంట వెళ్ళే వారు. ఈ అంబులను గిలకలు అంటారు. వీటిని సంధించి వదిలితే, ఎదుటి వారి మీద పూలూ ఆకులు పడేవి. బడి పిల్లలు అలా ఊరంతా తిరుగుతూ పాటలు, పద్యాలు పాడేవారు. వీటినే దసరా పద్యాలు అంటారు. దసరా పద్యాలు చాలా సులభంగా, వీనులకు విందుగా ఉంటాయి. ఈ పద్యం చూడండి.

ఏ దయా మీ దయా మా మీద లేదు,
ఇంత నిర్లక్ష్యమా ఇది మీకు తగదు,
దసరాకు వస్తిమనీ విసవిసలు పడక
చేతిలో లేదనక అప్పివ్వరనక
పావలా.. .అర్ధయితే ...పట్టేది లేదు,
ముప్పావలా అయితే ముట్టేది లేదు,
హెచ్చు రూపాయియితే పుచ్చుకుంటాము,
అయ్య వారికి చాలు ఐదు వరహాలు
పిల్ల వారికి చాలు పప్పు బెల్లాలు
జయీభవా...దిగ్విజయీభవా

(ఈ ఫొటోలో ఉన్నది రావణుడు. దసరాకి రావణ దహనం చేస్తారు. అందుకు తయారవుతున్న బొమ్మ ఇది. ఢిల్లీలోనిది ఈ ఫొటో)

దసరాకు ఆ పేరు ఎలా వచ్చింది?

దసరా పండగకు కొత్త బట్టలు కొనుక్కోవడం, అమ్మ చేసిన రకరకాల పిండివంటలు తినడం, సెలవలకు ఊళ్లకెళ్లడం అందరికీ తెలుసు. అయితే అంతకన్నా ముందు అసలు దసరా పండగకు ఆ పేరు ఎందుకు వచ్చిందో కూడా తెలుసుకోవాలి కదా... అక్కడికే వద్దాం... దశ అహః అంటే పది రోజులు అని అర్థం. దశ అహః అనే పదమే దశహర అయింది. దశహర, పది రోజులు అనే పదం కాలక్రమంలో 'దసరా' గా మారింది. దసరా అంటే పది జన్మల పాపాలను, పది రకాలైన పాపాలను పోగొట్టేది అనే అర్థం కూడా వ్యాప్తిలో ఉంది.

దుష్టరాక్షసులయిన రావణ కుంభకర్ణమేఘనాథులను సంహరించినందుకు గుర్తుగా కొన్ని ప్రాంతాలలో వారి దిష్టిబొమ్మలను తయారు చేసి టపాసులతో పేల్చేయడమో లేదా దహనం చేయడమో ఒక ఉత్సవంగా నిర్వహిస్తారు

దసరా అంటే దక్షిణాదిన అమ్మవారి పూజకు ఎంత ప్రాధాన్యం ఇస్తారో, ఉత్తరాదిన రాముని లీలలను గానం చేసేందుకు అంతే ఉత్సాహం చూపుతారు. వారి దృష్టిలో దసరా అంటే అమ్మవారు మహిషాసురుని సంహరించిన రోజు మాత్రమే కాదు, రాముడు, రావణుని చంపిన రోజు కూడా. అందుకే ఈ పది రోజుల పాటు అక్కడ రామాయణంలో ఘట్టాలను వర్ణిస్తూ.. చివరి రోజున 'రావణ దహన్' పేరుతో రావణుడి భారీ దిష్టిబొమ్మను దహనం చేస్తారు. దాదాపు 50 ఏళ్ల నుంచి ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఏటా ఈ వేడుకలు అట్టహాసంగా సాగుతాయి. ఈ వేడుకలను ప్రత్యక్షంగా చూడటానికి వేలాది భక్తులతో పాటు రాజకీయ, సినీ, పారిశ్రామిక రంగాలకు చెందిన ప్రముఖులు కూడా తరలివస్తారు.

సమయం, వ్యక్తిగత కారణాల రీత్యా కొంత మందికి రామ్‌లీలా మైదానంలో జరిగే వేడుకలను వీక్షించడం కుదరదు. చాలా మందికి ఈ వేడుకల విశిష్టత కూడా తెలియదు. ఈ నేపథ్యంలో ప్రసిద్ధ రెలీజియస్ యాప్ 'హౌస్ ఆఫ్ గాడ్' సరికొత్త ఆలోచనతో ముందుకొచ్చింది. రామ్‌లీలా మైదానంలో వేడుకలను ఈ యాప్ ద్వారా లైవ్ స్ట్రీమింగ్ అందించనుంది.

సైన్సు సినిమా

అక్టోబర్ స్కై





'అక్టోబర్ స్కై' 1999లో విడుదలైన హాలీవుడ్ సినిమా. అమెరికాలోని వెస్ట్ వర్జీనియాలో కోల్ వుడ్ అనే ఓ చిన్న గ్రామంలో జరిగిన నిజజీవిత కథ ఆధారంగా తీశారు. ఆ గ్రామానికి చెందిన నలుగురు కుర్రాళ్ల కథ ఇది. కథ జరిగిన కాలం 1957. పెద్దగా సౌకర్యాలు లేని ఓ కుగ్రామానికి చెందిన ఆ కుర్రాళ్లకి కొన్ని కారణాల వల్ల రాకెట్ తయారు చెయ్యాలని ఆలోచన వస్తుంది. ఎన్నో కష్టనష్టాలకి ఓర్చి ఎంతో వ్యతిరేకతని ఎదుర్కొని చివరికి చిన్న రాకెట్ తయారు చేస్తారు. ఆ రాకెట్‌ని ఓ జాతీయ స్థాయి సైన్స్ ప్రాజెక్ట్ పోటీలో ప్రదర్శించి మొదటి స్థానంలో విజయం సాధిస్తారు. అత్యంత స్ఫూర్తిదాయకమైన ఈ కథలో ముఖ్య పాత్ర పేరు 'హోమర్ హికమ్'. ఆ హోమర్ హికమ్ ఆ తర్వాతి కాలంలో తన రాకెట్ తయారీ అనుభవాన్ని 'రాకెట్ బోయ్స్' పేరుతో పుస్తకం రాశాడు. యూనివర్సల్ స్టూడియోస్ వారు పుస్తకం హక్కులు కొని 'అక్టోబర్ స్కై' పేరుతో సినిమాగా విడుదల చేసి హిట్ సాధించారు. పుస్తకం పేరు 'రాకెట్ బోయ్స్'ను యథాతథంగా సినిమాకు కూడా పెడితే 'ముప్ఫై ఏళ్లు నిండిన స్త్రీలుససేమిరా చూడరు' అని యూనివర్సల్ స్టూడియోస్ వారు అభిప్రాయపడడం చేత Rocket Boys అన్న పేరుని కాస్తా Ocober Sky అని మార్చవలసి వచ్చింది. ఇక్కడ తమాషా ఏంటంటే 'Rocket Boys' అన్న పదజాలంలోని అక్షరాలని తారుమారు చేస్తే అది 'October Sky' అవుతుంది. ఈ కథ పిల్లలకి ఎంత స్ఫూర్తి దాయకంగా ఉంటుందంటే ఈ పుస్తకాన్ని అమెరికాలో ఎన్నో బళ్లు పిల్లలు తప్పనిసరిగా సిలబస్‌లో పెట్టాయి.

మన సామెతలు



- అనుభవమే శాస్త్రం....
  మాటలే మంత్రాలు
- దిగులును మించిన వ్యాధి :
  విశ్వాసాన్ని మించిన ఔషధం లేదు
- చితి చచ్చిన వానిని,
  చింత బతికిన వారిని కాలుస్తుంది
- ఆయుష్మ తీరిన వాడు ఆరు నెలలకు చస్తే....
  అనుమాన పడిన వాడు అప్పుడే చస్తాడు
- పుండు మీద కారం చల్లినట్లు
- నిద్ర సుఖం ఎరుగదు-ఆకలి రుచెరుగదు
- జరుగుబాటుంటే జ్వరమంత సుఖం లేదు
- కొండనాలుకకు మందు వేస్తే
  ఉన్న నాలిక కాస్తా ఊడిపోయిందట

కథ



బాబాయి స్కూటర్

బాబాయి స్కూటర్ పాతది. ఆ స్కూటర్ని రిపేర్ చేయించడానికి బాబాయి దగ్గర డబ్బులు లేవు. చిన్న ఉద్యోగం అతనిది. ఇద్దరు పిల్లలు. జీతం సరిపోదు. అతను వీధిలో అందరితో సరదాగా ఉంటాడు కాబట్టి అందరూ బాబాయి అని పిలుస్తారు. ఆ రోజు బాబాయికి ఇంక్రిమెంట్ వచ్చింది. సంతోషం కలిగింది. ఇంక్రిమెంట్ డబ్బులతో స్కూటర్‌ని రిపేర్ చేయించడానికి బయలుదేరాడు. రోడ్డు మీద జాగ్రత్తగా నడుపుతున్నాడు. కాని అప్పుడే ఒక పిల్లవాడు పరిగెత్తుకుంటూ అడ్డం వచ్చాడు. బాబాయి బ్రేకులు నొక్కాడు. కాని పడలేదు. పాత స్కూటర్ కదా. పిల్లవాడికి కొద్దిగా డ్యాష్ ఇచ్చింది. పిల్లవాడు పడ్డాడు. మోకాలికి కొద్దిగా దెబ్బ తగిలింది. బాబాయి స్కూటర్ ఆపి, పరిగెత్తి వెళ్లి, పిల్లవాణ్ణి లేపాడు.

పిల్లవాడు ఏడుస్తూ చుట్టూ చూస్తున్నాడు.

'సారీ బాబూ... బ్రేక్ పడలేదు. చిన్న దెబ్బే ఏడవకు' అన్నాడు బాబాయి.

'నా డబ్బులు పోయాయి... నా డబ్బులు' అని వెతుకుతున్నాడు పిల్లవాడు.

'ఏం డబ్బులు?' అడిగాడు బాబాయి.

'ఇవాళ నా బర్త్ డే. క్రికెట్ బ్యాట్ కొనుక్కోమని మా నాన్న ఐదువందలు ఇచ్చాడు. అవి తీసుకుని పరిగెడుతుంటే మీరు డ్యాష్ ఇచ్చారు' అన్నాడు పిల్లాడు ఏడుస్తూ.



బాబాయి కూడా కంగారుగా చుట్టూ చూశాడు. ఎక్కడా డబ్బు కనిపించలేదు. గాలికి ఎటుపోయిందో నోటు. పిల్లాడు ఏడుస్తూ ఉన్నాడు. బాబాయికి ఏం చేయాలో తోచలేదు. జేబులో ఉన్న డబ్బులు గుర్తుకొచ్చాయి. కాని చాలారోజుల తర్వాత ఇంక్రిమెంట్ వల్ల వచ్చిన కాసింత డబ్బు. స్కూటర్ రిపేర్ కోసం ఉపయోగించాల్సిన డబ్బు. పిల్లవాడి ఏడుపు చూసి ఆగలేకపోయాడు. ప్రపంచంలో ఏ చిన్నపిల్లాడూ ఏడవకూడదని బాబాయ్ అనుకుంటాడు. పిల్లలు ఎప్పుడూ సంతోషంగా ఉండాలి.

'రా... స్కూటర్ ఎక్కు' అన్నాడు.

పిల్లవాణ్ణి కూచోబెట్టుకుని షాప్ దగ్గర ఆపి బ్యాట్ కొని పెట్టాడు. పిల్లాడు సంతోషంగా 'థ్యాంక్యూ అంకుల్' అన్నాడు. బాబాయిని హగ్ చేసుకున్నాడు గట్టిగా. పిల్లాడి బెంగ తీర్చినందుకు బాబాయికి చాలా సంతోషంగా అనిపించింది.

తన స్కూటర్ ఇక ఏ పిల్లాడికీ డాష్ ఇవ్వకుండా కాస్త అప్పు పెట్టయినా ఇవాళే పూర్తిగా రిపేర్ చేయించడానికి బయలుదేరాడు బాబాయి.



గాలి బుడగపై ఎలా తేలారు?

1780 కాలం.

ఫ్రెంచ్ దేశస్థుడు జోసెఫ్ మాంట్గోల్ఫియర్, అతని తమ్ముడు ఎతియన్ ఓసారి మంటలోంచి పుట్టిన పొగ పైకిపోతూ దాంతో పాటు చిన్న తేలికైన వస్తువులని మోసుకుపోవడం గమనించారు. అంటే చల్లగాలి కన్నా వేడిగాలి తేలికైనది (తక్కువ సాంద్రత కలది) అన్నమాట. నీట్లో విడిచిన కర్ర పైకి తేలినట్టు చల్లగాలిలో వేడిగాలి పైకి కదులుతుంది అన్నమాట.

1783లో, జూన్ 5వ నాడు ఆ అన్నదమ్ములు ఫ్రాన్స్‌లో తమ స్వగ్రామం అయిన ఆనోనేల బట్టతో చేసిన ఓ సంచిని వేడిగాలితో నింపారు. వేడిగాలి పైకి లేస్తూ దాంతో పాటు సంచినీ మోసుకుపోయింది. అలా ఆ వేడిగాలి నిండిన సంచి 10 నిముషాలలో 2.4 కిలోమీటర్ల దూరం ప్రయాణించింది. త్వరలోనే వేడిగాలి చల్లారి ఆ గాలిబుడగ నేలకి దిగి వచ్చింది. నవంబర్‌లో ఆ అన్నదమ్ములు తమ వేడిగాలి బుడగని పారిస్‌లో ప్రదర్శించారు. ఆ ప్రదర్శనలో 3 లక్షల జనం గాల్లోకి లేచిన గాలిబుడగని ప్రత్యక్షంగా చూశారు. ఈసారి గాలి బుడగ 9.6 కిలోమీటర్లు గాలిలో ప్రయాణించింది.

ఆ కాలంలోనే హైడ్రోజన్ అనే అతి తేలికైన వాయువు కనుక్కోబడింది. ఇది వేడిగాలి కన్నా కూడా చాలా తేలికైనది. అప్పటికి తెలిసిన వాయువులు అన్నిట్లోకి అది అతితక్కువ సాంద్రత కలది. ఫ్రెంచ్ శాస్త్రవేత్త జాక్ చార్లెస్ గాలిబుడగలని వేడి గాలితో కాక హైడ్రోజన్‌తో నింపాలని సూచించాడు. ఆ సూచన అమలు అయ్యింది. హైడ్రోజన్ నిండిన గాలిబుడగలు మనుషులని మోస్తూ గాల్లో ప్రయాణించాయి. పందొమ్మిదవ శతాబ్దపు ఆరంభంలో ఎంతోమంది అలాంటి బుడగలలో ప్రయాణించారు. మొట్టమొదటిసారిగా మనుషులు కొన్ని కిలోమీటర్ల ఎత్తువరకు గాల్లోకి పోగలిగారు. అయితే ఈ గాలిబుడగలు కేవలం గాలిలో కొట్టుకుపోగలవు అంతే. అలా కాకుండా దాని బుట్టలో ప్రొపెల్లర్‌ని నడిపించగలిగే ఓ యంత్రాన్ని అమరిస్తే? ఓడ ప్రొపెల్లర్ దానిని ఎటు కావాలంటే అటు ఎలా తీసుకుపోతుందో అదే విధంగా ఈ ప్రొపెల్లర్ గాలిబుడగని కావలసిన దిశలో తీసుకుపోతుంది. అలా ప్రొపెల్లర్ చేత ప్రేరేపింపబడే గాలిబుడగని డిరిజిబిల్ (dirgible) అంటారు. అంటే ఒక ప్రత్యేక దిశ (direction)లో ప్రేరేపింప శక్యమైనది అని అర్థం. మొట్టమొదటి డిరిజిబిల్‌ని ఫెర్డినాండ్ ద జెప్పెలిన్ అనే జర్మన్ దేశస్థుడు నిర్మించాడు. అతడు గాలిబుడగని ఓ బార్రైన, పొగ చుట్ట ఆకారం గల తేలిక లోహమైన అల్యూమినియంతో నిర్మించిన ఓ పై తొడుగులో అమర్చాడు.



అటువంటి పొడవైన ఆకృతి గాలినీ సులభంగా ఛేదించగలదు. 1900 జులై 2 నాడు మొట్ట మొదటి డిరిజిబిల్ గాల్లోకి లేచింది. మనుషులకి వాళ్లు కావలసిన దిశలో ప్రయాణించే అవకాశం ఏర్పడింది.

అప్పట్నుండి 40 ఏళ్ళుగా ఈ డిరిజిబిల్స్ ఇంకా ఇంకా పెద్దవవుతూ, మెరుగవుతూ వచ్చాయి. కాని వాటిలో నింపే హైడ్రోజన్ చాలా ప్రమాదకరమైనది. హైడ్రోజన్ మండే వాయువు. నిప్పు అంటుకుంటే పేలుతుంది. దానికి బదులుగా మరో వాయువు హీలియమ్ వాడొచ్చు. అది హైడ్రోజన్ అంత తేలికైనది కాదు గానీ ఎప్పుడూ నిప్పు అంటుకోదు. అయినా ఈ డిరిజిబిల్స్ అంత వేగంగా కదలగలిగేవి కావు. పైగా తుఫానుల్లో చిక్కుకుంటే ధ్వంసం అయిపోయేవి. అయినప్పటికీ రైట్ బ్రదర్స్ వచ్చి విమానాలపై ప్రయోగాలు చేసే వరకు గాలి బుడగలు మానవుడికి ఎగరాలనే అభిలాషను తీర్చాయి. నేటికీ పర్యాటక స్థలాల్లో ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. టర్కీలో ఎయిర్ బెలూన్స్ ప్రత్యేక ఆకర్షణ.

మన పాట



దాగుడు మూతలు దండాకోర్
పిల్లీ వచ్చే
ఎలకా భద్రం!
ఎక్కడి దొంగలు
అక్కడే గప్‌చిప్
కళ్ళు మూసి కోలికోల్
ఎక్కడి దొంగలు అక్కడే!
అణుక్కో... ముణుక్కో... దాక్కో
గప్‌చిప్...గప్‌చిప్!

మన పొడుపు కథలు

బ్రెయిన్ జిమ్



1) జోడు నిట్రాళ్లు
నిట్రాళ్ల మీద కుడితి గోళెం
కుడితి గోళెంపై గుమ్మడికాయ
గుమ్మడికాయ మీద గరిక పోచలు

2) చిన తాంబాలం-పెద తాంబాలం
నూకల బువ్వ-నూనె ధార

3) మా తాత మూడెద్దులను
కాలవ అవతల నుండి తీసుకొస్తుంటే
ఒక ఎద్దు మునిగింది
ఒక ఎద్దు తేలింది
ఒక ఎద్దు కరిగింది

జవాబులు: 3. 1. (కాళ్ళు-పొట్ట-తల-జుట్టు) - 2) (భూమి-ఆకాశం-చుక్కలు-వర్షం) - (వక్క, ఆకు, సున్నం)

ఇంగ్లిష్‌లో మాట్లాడడం, రాయడం మంచిదే. అలా అని మన తల్లి భాషను మరవకూడదు. ఇక్కడ ఉన్న పదాలు మీకు తెలియపోతే తెలుసుకోండి. రాతలోనో, మాటలలోనో వాడితే అది మీ సొంతం అవుతుంది.

ఈ వారం కొన్ని పదాలు...



చిత్రభానుడు	అగ్ని, సూర్యుడు
చిన్నిదము	చిన్న పువ్వు
చిలుకకొయ్య	బట్టలు తగిలించే కొయ్య
చివుక	రూపాయిలో నాల్గవ వంతు
చీకిలి	చీపురు కట్ట
చుంబనం	ముద్దు
చెంగావి	అందమైన ఎరుపు వస్త్రం
చెచ్చెర	వేగంగా
చెన్నుడు	అందగాడు
రుధిరము	నెత్తురు
రేయెండ	వెన్నెల
రేవ	నది
ఉదుంబరము	గడప రావిచెట్టు



● కామెడీ క్లాస్

మా నాయినే!

టీచర్ : హోంవర్క్ ఎందుకు చేయలేదు?
పప్పు : నేను హోంవర్క్ చేయడానికి కూర్చోగానే కరెంట్ పోయింది టీచర్
టీచర్ : పోయిన కరెంట్ రాలేదా?
పప్పు : వచ్చింది టీచర్
టీచర్ : మరి హోంవర్క్ ఎందుకు చేయలేదు?
పప్పు : నేను హోంవర్క్ చేస్తే మళ్లీ కరెంట్ ఎక్కడ పోతుందోనని భయపడి చేయలేదు టీచర్

బిజినెస్ రీల్

పసిడి ధరల సరికొత్త రికార్డు

ఢిల్లీలో 10 గ్రాముల ధర రూ.78,450కి అప్



న్యూఢిల్లీ: బంగారం ధర సరికొత్త రికార్డులను చూస్తోంది. ఢిల్లీ మార్కెట్‌లో పూర్తి స్వచ్ఛత (99.9) 10 గ్రాముల ధర క్రితం ముగింపుతో పోల్చితే రూ.150 పెరిగి రూ.78,450 వద్ద ముగిసింది. 99.5 స్వచ్ఛత ధర రూ. 200 పెరిగి రూ.78,100 వద్దకు చేరింది. ఈ రెండు ధరలు ఆల్ టైమ్ హై కావడం గమనార్హం. పండుగల సీజన్‌తో ఆభరణ వర్తకుల నుంచి డిమాండ్ పెరగడం, రూపాయి బలహీన ధోరణితో దేశీయంగా పసిడి ధరలకు రెక్కలు వస్తున్నాయి. ఇక వెండి ధర రూ.1,035 పెరిగి రూ.94,200కు ఎగసిందని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ తెలిపింది. ప్రస్తుతం జరుగుతున్న 'నవరాత్రి' పండుగ కారణంగా ఆభరణాల వ్యాపారులు, రిటైలర్ల భారీ కొనుగోళ్లు విలువైన మెటల్ ధరలు పెరగడానికి కారణమని బులియన్ వ్యాపారులు తెలిపారు.


సైయంట్ చేతికి ఈఎంఎస్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రానిక్స్ తయారీలో ఉన్న సైయంట్ డీఎల్ఎం తాజాగా యూఎస్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ సర్వీసెస్ కంపెనీ ఆల్టెక్ ఎలక్ట్రానిక్స్‌ను కొనుగోలు చేసింది. ఉత్తర అమెరికాలో విస్తరణకు ఈ డీల్ దోహదం చేస్తుందని సైయంట్ శుక్రవారం తెలిపింది. మెడికల్, హెల్త్‌కేర్, ఇండస్ట్రియల్ విభాగాల్లో బలమైన ముద్రవేసిన ఆల్టెక్‌కు 80,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో తయారీ కేంద్రం ఉంది.

యూఎస్‌లో విప్రో అనుబంధ సంస్థ

ఐటీ కన్సల్టెన్సీ సర్వీసులపై దృష్టి



న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం విప్రో తాజాగా యూఎస్‌లో అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. తద్వారా ఐటీ కన్సల్టెన్సీ, సర్వీసుల బిజినెస్‌లలో ఇన్వెస్ట్ చేయనుంది. పూర్తి అనుబంధ సంస్థగా విప్రో ఇంక్‌కు తెరతీసినట్లు విప్రో పేర్కొంది. వెరసి ఐటీ కన్సల్టింగ్ సర్వీసులలో కొత్త బిజినెస్‌లు, పెట్టుబడి అవకాశాలను అన్వేషించనున్నట్లు తెలియజేసింది.

బీఎస్ఈలో విప్రో షేరు 0.7 శాతం బలపడి రూ. 534 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-10-2024	
విశాఖ	535-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	535-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INFY	1,922.00	1.51
ONGC	295.5	1.18
HDFCLIFE	709.3	1
TATAMOTORS	933.55	0.85
WIPRO	533.6	0.65

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
M&M	3,019.00	-3.54
BAJFINANCE	7,221.00	-2.86
ASIANPAINT	3,073.85	-2.4
NESTLEIND	2,612.60	-2.33
BPCL	340.8	-2.31

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	9,722
ఎన్ఎస్ఈ	1,27,530
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,72,835
ఎఫ్ఐఐ	- 9,897
డీఐఐ	+ 8,906

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	74.92	$ 73.71
బ్రెంట్	78.60	$ 77.62

సెప్టెంబర్‌లో 'సేవలు' పేలవం



10 నెలల కనిష్టానికి సూచీ

న్యూఢిల్లీ: సేవల రంగం సెప్టెంబర్‌లో పేలవ పనితీరును ప్రదర్శించింది. హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ సెప్టెంబర్‌లో 57.7 వద్ద ముగిసింది. గడచిన 10 నెలల కాలంలో సూచీ ఇంత తక్కువ స్థాయిలో నమోదు కావడం ఇదే తొలిసారి. కొత్త వ్యాపారం, అంతర్జాతీయ అమ్మకాలు, ఉత్పత్తిలో వృద్ధి మందగించినట్లు నెలవారీ సర్వే పేర్కొంది. తీవ్ర పోటీ పరిస్థితులు, ద్రవ్యోల్బణ సవాళ్లు, వినియోగదారుల ఎంపికలో మార్పు (ఆన్‌లైన్ సర్వీసుల్లోకి మారడం), కొత్త ఎగుమతి ఆర్డర్లలో అంతగా పెరుగుదల లేకపోవడం వంటి అంశాలు కూడా సేవల రంగం మందగమనానికి కారణమయ్యాయి. ఆగస్టులో సూచీ 60.9 వద్ద ఉంది. కాగా సూచీ 50 పైన ఉంటే దానిని వృద్ధి ధోరణిగానే పరిగణించడం జరుగుతుంది. ఆ దిగువకు పడిపోతేనే క్షీణతగా భావిస్తారు. అయితే 2024లో సూచీ 60 లోపునకు పడిపోవడం సెప్టెంబర్‌లోనే మొదటిసారి.

తయారీ-సేవలు కలిపినా డౌన్...

కాగా, సేవలు-తయారీ రంగం కలగలిపిన హెచ్ఎస్‌బీసీ ఇండియా కాంపోజిట్ అవుట్‌పుట్ ఇండెక్స్ ఆగస్టులో 60.7 వద్ద ఉంటే, సెప్టెంబర్‌లో 58.3కు తగ్గింది. అయితే సూచీలో మందగమనం చోటుచేసుకున్నప్పటికీ, ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పన మెరుగ్గానే ఉందని, ఆగస్టు నుంచి వ్యాపార విశ్వాసంసైతం పటిష్ఠంగా ఉందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు ఒక్క తయారీ రంగాన్ని చూస్తే సెప్టెంబర్‌లో పేలవ పనితనాన్ని ప్రదర్శించింది. హెచ్ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 56.5కు తగ్గింది. గడచిన ఎనిమిది నెలల్లో ఇంత తక్కువ స్థాయిలో సూచీ నమోదుకావడం ఇదే తొలిసారి. ఆగస్టులో సూచీ 57.5 వద్ద ఉంది. 400 తయారీ సంస్థల ప్యానల్‌లోని పర్చేజింగ్ మేనేజర్‌లకు పంపబడిన ప్రశ్న పత్రాల ప్రతిస్పందనలను అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజం ఎస్అండ్‌పీ గ్లోబల్ మదింపుచేసి, హెచ్ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ పీఎంఐని రూపొందిస్తుంది. భారత్ ఆర్థిక వ్యవస్థలో సేవల రంగం వాటా మెజారిటీ కాగా, పారిశ్రామిక రంగం వాటా దాదాపు 25 శాతం. ఇందులో తయారీ రంగం వాటా దాదాపు 75 శాతం.

ఇండియా పోస్ట్, అమెజాన్ జత

దేశవ్యాప్త డెలివరీ సర్వీసులకు సై



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా డెలివరీ సర్వీసుల సామర్థ్యాన్ని పెంపొందించుకునే బాటలో ఈకామర్స్ దిగ్గజం అమెజాన్, పోస్టల్ శాఖ(ఇండియా పోస్ట్) చేతులు కలిపాయి. ఇందుకు అమెజాన్ ట్రాన్స్‌పోర్టేషన్ సర్వీసెస్, ఇండియా పోస్ట్ అవగాహనా ఒప్పందాన్ని(ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. తద్వారా దేశవ్యాప్త లాజిస్టిక్స్ సర్వీసులలో వ్యూహాత్మక భాగస్వామ్యానికి తాజాగా తెరతీశాయి. వెరసి సామర్థ్యాల గరిష్ఠ పెంపు, వనరుల పటిష్ఠ వినియోగం, రవాణా నెట్‌వర్క్‌లను పంచుకోవడం తదితరాలకు పరస్పరం సహకరించుకోనున్నట్లు సంయుక్త ప్రకటనలో వివరించాయి. 1,65,000 పోస్టాఫీసుల నెట్‌వర్క్ కలిగిన ఇండియా పోస్ట్ దేశవ్యాప్తంగా ఈకామర్స్‌ను విస్తరించేందుకు దోహదపడనున్నట్లు పోస్టల్ సెక్రటరీ వందితా కౌల్ పేర్కొన్నారు. ఇండియా పోస్ట్ సర్వీసులను ఆధునీకరించడం, నూతన సాంకేతికతలను వినియోగించడం తదితర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అమెజాన్‌తో చేతులు కలిపినట్లు వివరించారు. నిజానికి 2013లోనే కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ దేశవ్యాప్త డెలివరీలకు అమెజాన్ ఇండియా పోస్ట్‌తో భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకుంది. ఇక 2023లో సమీకృత విదేశీ లాజిస్టిక్స్ సొల్యూషన్ల కోసం రెండు సంస్థలు ఎంవోయూ కుదుర్చుకున్నాయి. తద్వారా సూక్ష్మ, చిన్న, మధ్యతరహాసంస్థ (ఎంఎస్ఎంఈ)ల ఈకామర్స్ ఎగుమతులకు తెరతీశాయి.

యాపిల్ మరో నాలుగు స్టోర్స్

న్యూఢిల్లీ: ఐఫోన్స్ తయారీ సంస్థ యాపిల్ మరో నాలుగు స్టోర్స్‌ను భారత్‌లో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. పుణే, బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబైలో ఇవి రానున్నాయని వెల్లడించింది. వచ్చే ఏడాది ఇవి కార్యరూపంలోకి వస్తాయని సమాచారం. 2023 ఏప్రిల్‌లో ఢిల్లీ, ముంబైలో ఒక్కో ఔట్‌లెట్‌ను యాపిల్ తెరిచింది. మేడిన్ ఇండియా ఐఫోన్ 16 ప్రో, ఐఫోన్ 16 ప్రో మ్యాక్స్ సిరీస్‌ను ఈ నెలలోనే ప్రవేశపెట్టనున్నట్లు తెలిపింది. భారత్‌లో తయారైన ఈ స్మార్ట్‌ఫోన్లను ఎంపిక చేసిన పలు దేశాలకూ సరఫరా చేయనున్నట్లు కంపెనీ ప్రకటించింది. యాపిల్ 2017 నుంచి భారత్‌లో ఐఫోన్స్ తయారు చేస్తోంది.



అక్టోబర్ 9 నుంచి లావా అగ్ని-3 విక్రయాలు



న్యూఢిల్లీ: మొబైల్‌ఫోన్స్ తయారీలో ఉన్న దేశీయ కంపెనీ లావా అక్టోబర్ 9 నుంచి అగ్ని-3 స్మార్ట్‌ఫోన్‌ను విక్రయించనుంది. అమెజాన్‌లో ఎక్స్‌క్లూజివ్‌గా ఈ మోడల్ లభించనుంది. ధర రూ.19,999 నుంచి ప్రారంభం. బార్ ఫోన్లో రేర్ డిస్‌ప్లేతో వస్తున్న ఏకైక మోడల్ ఇదేనని కంపెనీ తెలిపింది. 1.74 అంగుళాల సెకండరీ అమోలెడ్ డిస్‌ప్లే పొందుపరిచారు. ఆన్‌డ్రాయిడ్ 14 ఓఎస్, 6.78 అగుళాల 1.5కె కర్వ్‌డ్ అమోలెడ్ డిస్‌ప్లే, 2.5 గిగాహెర్ట్జ్ ప్రాసెసర్, సోనీ 50 ఎంపీ ఓఐఎస్ కెమెరా, 8 ఎంపీ టెలిఫోటో, 8 ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా, సామ్‌సంగ్ 16 ఎంపీ ఫ్రంట్ కెమెరా, డ్యూయల్ వ్యూ వీడియో మోడ్, డాల్బీ అట్మోస్ డ్యూయల్ స్టీరియో స్పీకర్స్‌తో రూపుదిద్దుకుంది. 66 వాట్స్ సూపర్ ఫాస్ట్ చార్జింగ్‌తో 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, 8 జీబీ ర్యామ్, 8 జీబీ వరకు వర్చువల్ ర్యామ్, 128/256 జీబీ ఇంటర్నల్ మెమరీ వంటి హంగులు ఉన్నాయి. అగ్ని-3 రాకతో రూ.20-25 వేల ధరల శ్రేణిలో ఆన్‌లైన్ విభాగంలో 2025-26 నాటికి 10 శాతం మార్కెట్ వాటా లక్ష్యంగా చేసుకున్నట్లు లావా ఇంటర్నేషనల్ ఈడీ సునీల్ రైనా తెలిపారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ల కొనుగోలు

జాబితాలో మోర్గాన్ స్టాన్లీ, సిటీగ్రూప్



న్యూఢిల్లీ: ఫైనాన్షియల్ సర్వీసుల విదేశీ దిగ్గజాలు మోర్గాన్ స్టాన్లీ, సిటీగ్రూప్ తాజాగా ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ఇన్వెస్ట్ చేశాయి. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా బ్యాంక్ షేర్లను కొనుగోలు చేశాయి. బీఎస్ఈ బ్లాక్ డీల్ గణాంకాల ప్రకారం ఒక్కో షేరుకీ రూ. 1,726.2 సగటు ధరలో ఉమ్మడిగా 43.75 లక్షల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లను కొనుగోలు చేశాయి. వీటి విలువ రూ. 755.3 కోట్లు. బీఎన్‌పీ పారిబాస్ ఫైనాన్షియల్ మార్కెట్స్ వీటిని విక్రయించింది. కాగా.. గత వారం ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ బీఎన్‌పీ పారిబాస్ రూ. 543.3 కోట్ల విలువైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లను విక్రయించిన సంగతి తెలిసిందే.

బీఎస్ఈలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 2.6 శాతం క్షీణించి రూ. 1,682 వద్ద ముగిసింది.

ఎరిస్ లైఫ్‌లో మోతీలాల్‌కు వాటా

న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ రంగ కంపెనీ ఎరిస్ లైఫ్‌సైన్సెస్‌లో మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 1.53 శాతం వాటాను సొంతం చేసుకుంది. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి రూ. 1,350.18 సగటు ధరలో 20.79 లక్షల షేర్లను కొనుగోలు చేసింది. వీటి విలువ రూ. 281 కోట్లు. వీటిలో 20 లక్షల షేర్ల(1.47 శాతం వాటా)ను పబ్లిక్ వాటాదారుడు రాకేష్ షా విక్రయించారు. ఈ ఏడాది జులైలోనూ రాకేష్ షా 1.5 శాతం వాటాను రూ. 200 కోట్లకు విక్రయించడం గమనార్హం!

ఎన్ఎస్ఈ ఎరిస్ లైఫ్ షేరు 0.6 శాతం నీరసించి రూ. 1,316 వద్ద ముగిసింది.

మాగ్నైట్‌కు ఎగుమతి కేంద్రంగా భారత్

- మరో 100 మిలియన్ డాలర్ల పెట్టుబడి
- ఆపరేషన్స్ ప్రెసిడెంట్ ఫ్రాంక్ టోరెస్



న్యూఢిల్లీ: వాహన తయారీ సంస్థ నిస్సాన్ తన కాంపాక్ట్ ఎస్‌యూవీ మాగ్నైట్‌కు ఎగుమతి కేంద్రంగా భారత్‌ను బలోపేతం చేయడానికి 100 మిలియన్ డాలర్ల అదనపు పెట్టుబడిని పెట్టినట్లు శుక్రవారం తెలిపింది. కొత్త ఉత్పత్తి అభివృద్ధి, దేశంలో అదనపు అమ్మకాల మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం కంపెనీ ఇప్పటికే 600 మిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడి ప్రకటించింది. తాజాగా ప్రకటించిన పెట్టుబడి దీనికి అదనం. 2026 నాటికి దేశీయంగా విక్రయాలను మూడింతలు చేయడం ద్వారా ఒక లక్ష యూనిట్లకు, అదే స్థాయిలో ఎగుమతులను చేయాలని కంపెనీ లక్ష్యంగా చేసుకుంది. భారత్ పట్ల సంస్థ నిబద్ధతకు అదనపు పెట్టుబడి నిదర్శనమని నిస్సాన్ ఇండియా ఆపరేషన్స్ ప్రెసిడెంట్ ఫ్రాంక్ టోరెస్ తెలిపారు. మాగ్నైట్ కొత్త వర్షన్‌ను విడుదల చేసిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. మాగ్నైట్ లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్ వర్షన్ సైతం తయారీ చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే 20 మార్కెట్లకు మాగ్నైట్ ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్ వర్షన్ తయారీతో 65 మార్కెట్లకు ఎగుమతి చేయడానికి వీలు కలుగుతోందని వివరించారు. నిస్సాన్‌కు ఎగుమతులకు భారత్ గ్లోబల్ హబ్‌గా ఉందనడానికి ఇది స్పష్టమైన నిదర్శనమని టోరెస్ తెలిపారు.

మూడు మోడళ్ల విడుదల..

వచ్చే 30 నెలల్లో కంపెనీ మరో మూడు మోడళ్లను విడుదల చేయాలని భావిస్తోంది. మాస్ మార్కెట్ సెగ్మెంట్‌లో రెండు మిడ్-సైజ్ ఎస్‌యూవీలను ప్రవేశపెట్టనుంది. ఇందులో ఒకటి ఐదు సీట్లు, ఇంకొకటి ఏడు సీట్ల సామర్థ్యంతో రానుంది. అలాగే ఒక ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని పరిచయం చేయాలని కంపెనీ యోచిస్తోంది. 2026 చివరి నాటికి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని తీసుకురావాలన్నది ప్రణాళిక అని టోరెస్ వెల్లడించారు. ఆ సమయానికి ఎలక్ట్రిక్ కార్లకు డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నట్లు చెప్పారు. దేశీయ మార్కెట్ కోసం హైబ్రిడ్, సీఎన్‌జీతో సహా వివిధ పవర్‌ట్రెయిన్స్‌ను కంపెనీ అధ్యయనం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌లో ఏటా 32,000 యూనిట్లను విక్రయిస్తున్నట్లు నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీ సౌరభ్ వత్స తెలిపారు. 30 నెలల్లో కంపెనీ మార్కెట్ వాటా ప్రస్తుతం ఉన్న ఒక శాతం నుంచి మూడు శాతానికి చేరుతుందని ధీమా వ్యక్తం చేశారు.

యస్ బ్యాంక్‌పై ఎంయూఎఫ్‌జీ కన్ను

- మెజారిటీ వాటా కొనుగోలు యోచన
- హెచ్‌డీబీలో పెట్టుబడి ప్రతిపాదన విఫలం



ముంబై: దేశీ ప్రయివేట్ రంగ సంస్థ యస్ బ్యాంక్‌పై జపనీస్ దిగ్గజం మిత్సుబిషి యూఎఫ్‌జే ఫైనాన్షియల్ గ్రూప్(ఎంయూఎఫ్‌జీ) ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం యస్ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ) రూ. 68,838 కోట్లకు చేరింది. దీంతో యస్ బ్యాంక్‌లో 51 శాతం వాటా కొనుగోలుకి సుమారు రూ. 34,000 కోట్లకు పైగా వెచ్చించవలసి రావచ్చునని బ్యాంకింగ్ వర్గాలు అంచనా వేశాయి. వెరసి దేశీ బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద కొనుగోలు డీల్‌గా రికార్డ్ అవకాశమున్నట్లు అభిప్రాయపడ్డాయి. ఆస్తులరీత్యా యస్ బ్యాంక్ ప్రస్తుతం దేశీ ప్రయివేట్ బ్యాంకింగ్ రంగంలో ఆరో పెద్ద సంస్థగా నిలుస్తున్న సంగతి తెలిసిందే.

ఎన్‌బీఎఫ్‌సీ ఆఫర్‌కు నో

ప్రపంచంలోనే రెండో పెద్ద బ్యాంక్ హోల్డింగ్ సంస్థ ఎంయూఎఫ్‌జీ ఇంతక్రితం ఎన్‌బీఎఫ్‌సీ.. హెచ్‌డీబీ ఫైనాన్షియల్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు ప్రయత్నించి విఫలమైంది. ప్రయివేట్ రంగ దేశీ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అనుబంధ సంస్థ హెచ్‌డీబీ ఫైనాన్షియల్‌లో 2 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 16,800 కోట్లు) విలువైన వాటా కొనుగోలుకి ఎంయూఎఫ్‌జీ ముందుకొచ్చినట్లు తెలుస్తోంది. అయితే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బోర్డు ఆగస్టులో ఈ ప్రతిపాదనను తిరస్కరించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దీంతో తాజాగా యస్ బ్యాంక్‌లో మెజారిటీ వాటాకు పావులు కదుపుతున్నట్లు బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. ఇందుకు ప్రాథమిక బిడ్‌ను దాఖలు చేసినట్లు తెలుస్తోంది. కాగా.. ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్‌బ్యాంక్(ఎస్‌బీఐ) కొద్ది రోజులుగా యస్ బ్యాంక్‌లో 23.99 శాతం వాటాను విక్రయించాలని చూస్తోంది. యస్ బ్యాంక్‌లో ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీకి 11.34 శాతం వాటా ఉన్న విషయం ఇక్కడ ప్రస్తావనార్హం!

క్యూ2లో అదానీ విల్మర్ జోరు



ముంబై: ఈ ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో 10 శాతం పరిమాణ వృద్ధి నమోదు చేసినట్లు అదానీ విల్మర్ శుక్రవారం తెలిపింది. ఫుడ్, ఎఫ్ఎంసీజీ విభాగంలో పరిమాణం 31 శాతం దూసుకెళ్లిందని వెల్లడించింది. '2024 సెప్టెంబర్ చివరి నాటికి 36,000 చిన్న పట్టణాలకు నేరుగా కంపెనీ తన పంపిణీ నెట్‌వర్క్‌ను విస్తరించింది. 2024-25 చివరి నాటికి 50,000 చిన్న పట్టణాలకు చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వంట నూనెలు, ఫుడ్ విభాగం మెరుగైన పనితీరుతో సెప్టెంబర్ త్రైమాసికంలో 16 శాతం వృద్ధిని సాధించాం. విక్రయాల ఉత్పాదకతను పెంచడం, ప్రీమియం ఔట్‌లెట్స్ కోసం అనుకూల గో-టు మార్కెట్ వ్యూహాన్ని అమలు చేయడం, విక్రయ కార్యకలాపాలలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంపై దృష్టి సారించాం. 12 నెలల్లో రూ.3,000 కోట్లకు పైగా అమ్మకాలతో ప్రత్యామ్నాయ ఛానెల్స్ ద్వారా వచ్చే ఆదాయం రెండవ త్రైమాసికంలో బలమైన రెండంకెల రేటుతో పెరిగింది. ఈ-కామర్స్ విభాగం మరింత వేగవంతమైన వృద్ధిని సాధించింది. ఈ విభాగం ఆదాయం నాలుగేళ్లలో దాదాపు నాలుగు రెట్లు దూసుకెళ్లింది. ఔట్‌లెట్స్ పెరగడం, కస్టమర్లు పదేపదే కొనుగోలు చేయడం కారణంగా ఫుడ్, ఎఫ్ఎంసీజీ సెగ్మెంట్ 36 శాతం ఆదాయ వృద్ధిని నమోదు చేసింది. తక్కువ తలసరి వినియోగం ఉన్న మార్కెట్లలో చిన్న ప్యాక్ సైజులను ప్రవేశపెట్టడం వల్ల కూడా అమ్మకాలు లాభపడ్డాయి' అని కంపెనీ బీఎస్ఈకి వివరించింది.

ఎంటీఎన్ఎల్ అప్పు 'మొండి బకాయి..'

- ఎస్‌బీఐ ప్రకటన
- సెప్టెంబర్ 30కి సంస్థపై రూ.326 కోట్ల రుణ భారం



న్యూఢిల్లీ: ప్రభుత్వ యాజమాన్యంలోని ఎంటీఎన్ఎల్ రుణ ఖాతాలను సబ్-స్టాండర్డ్ నాన్-పెర్ఫార్మింగ్ అసెట్స్‌గా (ఎన్‌పీఏ) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రకటించింది. సెప్టెంబర్ 28వ తేదీ నుంచి ఇది అమల్లోకి వస్తుందని ఎస్‌బీఐ తెలిపింది. సంస్థ జూన్ 30 నుండి వాయిదాలు, వడ్డీని చెల్లించనందున ఎస్‌బీఐ ఈ చర్య తీసుకున్నట్లు అప్పుల ఊబిలో ఉన్న టెలికం సంస్థ ఒక రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఎంటీఎన్ఎల్ రుణ ఖాతాలో మొత్తం బకాయిలు సెప్టెంబర్ 30 నాటికి రూ. 325.52 కోట్లని ఎస్‌బీఐ అక్టోబర్ 1న పంపిన లేఖను ఎంటీఎన్ఎల్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు అందజేసింది. రుణ బకాయిల చెల్లింపుల వైఫల్యం 12 నెలలకన్నా తక్కువ ఉంటే, ఈ పరిస్థితిని సబ్-స్టాండర్డ్ నాన్-పెర్ఫార్మింగ్ అసెట్స్‌గా బ్యాంకుల ప్రకటిస్తాయి. రుణ బకాయిల చెల్లింపుల సామర్థ్యాన్ని ఈ స్థాయి సూచిస్తుంది.

చట్టపరమైన చర్యలకూ సిద్ధం...

రుణ బకాయిలు చెల్లించడంలో విఫలమైతే చట్టపరమైన చర్యలకు సిద్ధమని కూడా ఎస్‌బీఐ సూచించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్‌సహా బకాయిలను చెల్లించనందుకు అనేక బ్యాంకులు ఎంటీఎన్ఎల్‌పై చర్యలు తీసుకున్నాయి. బకాయిలు చెల్లించనందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంటీఎన్ఎల్ అన్ని ఖాతాలను స్తంభింపజేసింది. నష్టాల్లో ఉన్న టెలికం సంస్థ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుండి మొత్తం రూ. 7,873.52 కోట్ల రుణాలను కలిగి ఉంది. కంపెనీ మొత్తం రుణ భారం రూ. 31,945 కోట్లుగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సావరిన్ గ్యారెంటీ బాండ్ల నుండి వచ్చే వడ్డీ చెల్లింపు కోసం ఎంటీఎన్ఎల్ ప్రభుత్వం నుండి రూ. 1,151.65 కోట్లను కోరింది. ఎంటీఎన్ఎల్ బాండ్ల ప్రధాన మొత్తం చెల్లింపు కోసం 3,669 కోట్ల రూపాయలను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) కేటాయించింది.

ఇక దేశీ కంపెనీ సావరిన్ రేటింగ్స్

39 దేశాలకు సేవలతో తొలి కంపెనీ



ముంబై: విదేశాలలో సావరిన్ రేటింగ్స్ అందించే తొలి దేశీ కంపెనీ ఆవిర్భవించింది. ప్రపంచ దిగ్గజాలు మూడీస్, ఫిచ్, ఎస్అండ్‌పీ గ్లోబల్ తరహాలో కేర్‌ఎడ్జ్ గ్లోబల్ ఊపిరి పోసుకుంది. కేర్ రేటింగ్స్ లిమిటెడ్‌కు అనుబంధ సంస్థగా సావరిన్ రేటింగ్స్‌లోకి ప్రవేశించింది. భారత్‌సహా 39 దేశాలకు సావరిన్ రేటింగ్స్ సేవలను ప్రారంభించింది. దీనిలో భాగంగా భారత్‌కు బీబీబీ+ రేటింగ్‌ను ప్రకటించింది. ఇటీవల ఇండియా దీర్ఘకాలిక రేటింగ్‌ను బీబీబీ-గా ఫిచ్ పేర్కొన్న సంగతి తెలిసిందే. కాగా.. గిఫ్ట్ సిటీలో కేర్‌ఎడ్జ్ సావరిన్ రేటింగ్ కార్యకలాపాలకు తెరతీసింది. దేశీ కంపెనీ సావరిన్ రేటింగ్స్‌ను చేపట్టడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా భారత్ గుర్తింపు మరింత బలపడుతుందని గుజరాత్‌లోని ఐఎఫ్ఎస్‌సీఏ చైర్‌పర్సన్ కె.రాజరామన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. తద్వారా గ్లోబల్ స్థాయిలో పెట్టుబడి నిర్ణయాలు, రుణ వ్యయాలను ప్రభావితం చేయనున్నట్లు తెలియజేశారు. ప్రస్తుతం గ్లోబల్ క్రెడిట్ రేటింగ్స్ విభాగంలో అభివృద్ధి చెందిన దేశాల ఏజెన్సీలే ఆధిపత్యం వహిస్తున్నాయి. ఇవి ప్రభుత్వాలు, కార్పొరేషన్లు, ఇతర సంస్థల రుణ(క్రెడిట్) బలిమిని అంచనా వేస్తున్నాయి. తద్వారా ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడి నిర్ణయాలు, రుణ వ్యయాలను ప్రభావితం చేస్తున్నాయి. వెరసి ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లలో ఇవి కీలకపాత్రను పోషిస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో దేశీ కంపెనీ సావరిన్ రేటింగ్స్‌ను చేపట్టడం ప్రాధాన్యతను సంతరించుకున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.

సాక్షి ప్లస్
శనివారం | 5-10-2024

కొత్త హంగులతో పునరాగమనం

హాకీ ఇండియా లీగ్ పునరుద్ధరణ | డిసెంబర్ 28 నుంచి ప్రారంభం

పురుషుల విభాగంలో 8 జట్లు | మహిళల విభాగంలో 6 జట్లు పోటీ

రౌర్కెలా, రాంచీలో పోటీలు | దిలీప్ టిర్కీ కృషికి దక్కిన ఫలితం



2017 హెచ్ఐఎల్ విజేత కళింగ లాన్సర్స్ (ఫైల్)

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) స్ఫూర్తితో ప్రారంభమైన హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) తిరిగి అభిమానులను అలరించేందుకు సిద్ధమైంది. 2017లో నిలిచిపోయిన హెచ్ఐఎల్‌ను తిరిగి ఆరంభించాలని హాకీ ఇండియా (హెచ్ఐ) నిర్ణయించింది. ఈసారి లీగ్‌కు సరికొత్త హంగులు అద్దగా... పురుషులతో పాటు మహిళల విభాగంలో పోటీలు జరగనున్నాయి. డిసెంబర్ 28 నుంచి ప్రారంభం కానున్న ఈ లీగ్ కోసం ఈ నెల 13 నుంచి మూడు రోజులపాటు ప్లేయర్ల వేలం జరగనుంది. ఒక్కో జట్టులో 24 మంది ప్లేయర్లు ఉండనున్నారు. ఇందులో నలుగురు జూనియర్ ఆటగాళ్లు తప్పనిసరి అనే నిబంధనను తీసుకొచ్చారు. పురుషుల విభాగంలో హైదరాబాద్ జట్టును రెసల్యూట్ స్పోర్ట్స్ కంపెనీ సొంతం చేసుకుంది. మహిళల లీగ్ తుదిపోరు వచ్చే ఏడాది జనవరి 26న, పురుషుల ఫైనల్ ఫిబ్రవరి 1న నిర్వహించనున్నట్లు హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ ప్రకటించాడు. ఏడేళ్ల తర్వాత తిరిగి ప్రారంభం కానున్న లీగ్ విశేషాలను పరిశీలిస్తే... – సాక్షి, క్రీడావిభాగం

దేశంలో హాకీ క్రీడకు మరింత ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో మొదలు పెట్టిన హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) ఏడేళ్ల విరామం తర్వాత పునఃప్రారంభం కానుంది. 2013లో ప్రారంభమైన లీగ్ ఐదు సీజన్‌లు పాటు విజయవంతంగా కొనసాగిన తర్వాత 2017లో అనివార్య కారణాల వల్ల నిలిచిపోయింది. ఇప్పుడు తిరిగి ఈ ఏడాది నుంచి ప్రారంభించనున్నట్లు హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ శుక్రవారం వెల్లడించాడు. గతంలో పురుషుల విభాగంలో మాత్రమే పోటీలు జరగగా... ఈ సారి మహిళల విభాగంలోనూ మ్యాచ్‌లు జరగనున్నాయి. హెచ్ఐఎల్ తిరిగి ప్రారంభమవడం ద్వారా ఆటకు మరింత ఆదరణ దక్కడంతో పాటు... మహిళల హాకీలో కొత్త జోష్ రానుంది. భారత మాజీ కెప్టెన్ దిలీప్ టిర్కీ హాకీ ఇండియా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి... ఈ లీగ్‌ను తిరిగి తీసుకురావాలని ప్రయత్నాలు చేయగా... ఇప్పటికి కార్యరూపం దాల్చింది. హెచ్ఐఎల్‌కు టిర్కీనే చైర్మన్‌గా వ్యవహరించనున్నాడు. 'జాతీయ జట్టుకు నాణ్యమైన ఆటగాళ్లను అందించడంలో హాకి ఇండియా లీగ్ కీలక పాత్ర పోషించనుంది. హాకీ క్రీడలో కొత్త అధ్యాయానికి నేడు తెర లేచినట్లు అనిపిస్తోంది. అడగ్గానే హెచ్ఐఎల్ కోసం 35 రోజుల సమయాన్ని కేటాయించిన అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్)కు ధన్యవాదాలు. హాకీ ఇండియా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి దీని కోసం కృషి చేశా. ఇప్పటికి కల సాకారమైంది' అని టిర్కీ పేర్కొన్నాడు. హాకీ ఇండియా కార్యదర్శి భోళానాథ్ సింగ్ మాట్లాడుతూ... భారత్‌లో హాకీ కేవలం క్రీడ మాత్రమే కాదని దీనికి భారతీయుల గుండెల్లో ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. 2036 వరకు భారత హాకీకి ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం స్పాన్సర్‌గా వ్యవహరించనుందని పునరుద్ఘాటించారు.

జట్ల వివరాలు

పురుషుల విభాగంలో ఎనిమిది జట్లు పాల్గొననున్నాయి. వాటిలో చెన్నై జట్టుకు చార్లెస్ గ్రూప్, లక్నో జట్టుకు యదు స్పోర్ట్స్, పంజాబ్ జట్టుకు జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్, పశ్చిమ బెంగాల్ జట్టుకు శ్రాచీ స్పోర్ట్స్, హైదరాబాద్ జట్టుకు రెసల్యూట్ స్పోర్ట్స్, రాంచీ జట్టుకు నవోయమ్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ యజమానులుగా కొనసాగనున్నారు. టెన్నిస్ దిగ్గజం మహేశ్ భూపతికి చెందిన ఎస్‌జీ స్పోర్ట్స్ కంపెనీ ఢిల్లీ జట్టును సొంతం చేసుకుంది. మహిళల విభాగంలో హరియాణా జట్టును జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్, పశ్చిమ బెంగాల్ టీమ్‌ను శ్రాచీ స్పోర్ట్స్, ఢిల్లీ జట్టును ఎస్‌జీ స్పోర్ట్స్, ఒడిశా జట్టును నవోయమ్ స్పోర్ట్స్ సొంతం చేసుకున్నాయి. మరో రెండు ఫ్రాంచైజీల యజమానులను త్వరలోనే వెల్లడించనున్నారు.

- పురుషుల విభాగంలో 8 జట్లు, మహిళల విభాగంలో 6 జట్లు లీగ్‌లో పాల్గొననున్నాయి. గతంలో కేవలం పురుషుల విభాగంలోనే పోటీలు జరగగా.. తొలిసారి మహిళా లీగ్‌ను ప్రవేశ పెడుతున్నారు.
- పురుషుల విభాగంలో పోటీలను రౌర్కెలాలో, మహిళల మ్యాచ్‌లను రాంచీలో నిర్వహించనున్నారు.
- ఒక్కో జట్టులో 24 మంది ఆటగాళ్లు ఉండనున్నారు. వారిలో 16 మంది భారత ఆటగాళ్లు, 8 మంది విదేశీయులకు అవకాశం ఉంటుంది. భారత ఆటగాళ్లలో నలుగురు జూనియర్ ప్లేయర్లు తప్పనిసరి.
- డిసెంబర్ 28న ఈ లీగ్ ప్రారంభం కానుండగా... మహిళల విభాగంలో వచ్చే ఏడాది జనవరి 26న రాంచీలో ఫైనల్ జరగనుంది. పురుషుల విభాగంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 1న రౌర్కెలాలో తుదిపోరు జరగనుంది.
- ఈనెల 13 నుంచి 15 వరకు న్యూఢిల్లీలో జరగనున్న ప్లేయర్ల వేలంలో అన్ని ఫ్రాంచైజీలు పాల్గొననున్నాయి. ప్లేయర్ల కనీస ధరను మూడు కేటగిరీలుగా (రూ. 10 లక్షలు, 5 లక్షలు, 2 లక్షలు) విభజించారు.
- ఆటగాళ్లను ఎంపిక చేసుకునేందుకు పురుషుల విభాగంలో ఒక్కో ఫ్రాంచైజీ రూ. 4 కోట్లు... మహిళల విభాగంలో ఒక్కో ఫ్రాంచైజీ రూ. 2 కోట్లు ఖర్చు చేయవచ్చు.
- 2013లో తొలిసారి నిర్వహించిన హెచ్ఐఎల్‌లో రాంచీ రైనోస్ టైటిల్ సాధించగా.. ఆ తర్వాత 2014లో ఢిల్లీ వేవ్‌రైడర్స్, 2015లో రాంచీ రాయ్స్, 2016లో పంజాబ్ వారియర్స్, 2017లో కళింగ లాన్సర్స్ చాంపియన్‌గా నిలిచాయి.
- పారిస్ ఒలింపిక్స్ తర్వాత హాకీ ఆటకు గుడ్‌బై చెప్పిన భారత దిగ్గజ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ ఢిల్లీ జట్టుకు డైరెక్టర్‌గా వ్యవహరించనున్నాడు.

హైదరాబాద్‌ను గెలిపించిన ధృతి



రాజ్‌కోట్: బీసీసీఐ మహిళల అండర్–19 టి20 క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ జట్టు 'హ్యాట్రిక్' విజయం నమోదు చేసింది. కేరళతో శుక్రవారం జరిగిన గ్రూప్ 'సి' మూడో లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ 23 పరుగుల తేడాతో గెలిచింది. 149 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన కేరళ జట్టు 18.4 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. హైదరాబాద్ బౌలర్ కేసరి ధృతి 3.4 ఓవర్లు వేసి 22 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. మరో బౌలర్ వైష్ణవి యాదవ్ 2 వికెట్లు తీసుకుంది. అంతకుముందు తొలుత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 148 పరుగులు సాధించింది. కావ్య (35; 6 ఫోర్లు), నిధి (25; 4 ఫోర్లు) రాణించారు. ఆరు జట్లున్న గ్రూప్ 'సి'లో హైదరాబాద్ 12 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. రేపు జరిగే నాలుగో లీగ్ మ్యాచ్‌లో పంజాబ్‌తో హైదరాబాద్ ఆడుతుంది.

బోపన్న జోడీ గెలుపు



న్యూఢిల్లీ: షాంఘై ఓపెన్ మాస్టర్స్ సిరీస్ ఏటీపీ–1000 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)–ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) జోడీ శుభారంభం చేసింది. చైనాలో శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న–డోడిగ్ ద్వయం 6–4, 6–3తో పాబ్లో కరెనో బుస్టా–పెడ్రో మార్టినెజ్ (స్పెయిన్) జోడీపై విజయం సాధించింది. 63 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న ద్వయం ఐదు ఏస్‌లు సంధించడంతో పాటు మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయిన బోపన్న, డోడిగ్ ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది.



పృథ్వీ షా

రాణించిన పృథ్వీ షా

- ముంబై రెండో ఇన్నింగ్స్ 153/6
- రెస్ట్ ఆఫ్ ఇండియాతో ఇరానీ కప్

లక్నో: ఆఖరి రోజు అద్భుతం జరిగితే తప్పించి రంజీ చాంపియన్ ముంబై జట్టు 27 ఏళ్ల తర్వాత మళ్లీ ఇరానీ కప్ ట్రోఫీని సొంతం చేసుకోవడం లాంఛనం కానుంది. రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టుతో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ముంబై జట్టుకు 121 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ముంబై రెండో ఇన్నింగ్స్‌లో 40 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. శనివారం ఆటకు చివరి రోజు కాగా... చేతిలో మరో నాలుగు వికెట్లు ఉన్న ముంబై జట్టు ఓవరాల్‌గా 274 పరుగుల ఆధిక్యంలో ఉంది. రెస్టాఫ్ ఇండియా బౌలర్లలో సారాన్ష్ జైన్ 4, మానవ్ సుతార్ రెండు వికెట్లు పడగొట్టారు. ముంబై ఓపెనర్ పృథ్వీ షా (105 బంతుల్లో 76; 8 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధశతకంతో రాణించాడు. కెప్టెన్ అజింక్యా రహానే (9), శ్రేయస్ అయ్యర్ (8), ఆయుష్ (14), హార్దిక్ (7), షమ్స్ ములానీ (0) పెవిలియన్‌కు క్యూ కట్టారు. తొలి ఇన్నింగ్స్ డబుల్ సెంచరీ హీరో సర్ఫరాజ్ ఖాన్ (9 బ్యాటింగ్), తనుశ్ కొటియాన్ (20 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 289/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన రెస్ట్ ఆఫ్ ఇండియా 416 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ (292 బంతుల్లో 191; 16 ఫోర్లు, ఒక సిక్సర్) త్రుటిలో డబుల్ సెంచరీ చేజార్చుకోగా... వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ (121 బంతుల్లో 93; 13 ఫోర్లు, ఒక సిక్సర్) సత్తా చాటాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 165 పరుగులు జోడించారు. అయితే ఆ తర్వాత ముంబై స్పిన్నర్లు రాణించడంతో 23 పరుగుల తేడాతో రెస్ట్ ఆఫ్ ఇండియా ఆరు వికెట్లు కోల్పోయింది. ముంబై బౌలర్లలో తనుశ్ కొటియాన్, షమ్స్ ములానీ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. తొలి మూడు రోజులు బ్యాటింగ్‌కు స్వర్గధామంగా కనిపించిన పిచ్ నాలుగు రోజు స్పిన్నర్లకు సహకరించగా... ఆఖరి రోజు రెస్ట్ ఆఫ్ ఇండియాకు లక్ష్యఛేదన కష్టతరం కానుంది. ఒకవేళ మ్యాచ్ 'డ్రా' అయితే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించిన ముంబై జట్టుకు ఇరానీ కప్ సొంతమవుతుంది.

ప్రత్యర్థిని కొరికేశాడు

- ఇంగ్లండ్ సెకండ్ డివిజన్ ఫుట్‌బాల్ లీగ్ మ్యాచ్‌లో ఘటన
- సస్పెండ్ చేసిన అసోసియేషన్



మిలుటిన్



ప్రిస్టన్ (ఇంగ్లండ్): హోరాహోరీగా సాగుతున్న ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఒక ఆటగాడు తన ప్రత్యర్థి మెడ దగ్గర గట్టిగా కొరికేశాడు. అంతే ఇంగ్లండ్ ఫుట్‌బాల్ సంఘం (ఈఎఫ్ఏ) ఆగ్రహానికి గురయ్యాడు. నిషేధం, జరిమానా రెండు పడ్డాయి. ఇక వివరాల్లోకెళితే... ఇంగ్లండ్‌లో సెకండ్ డివిజన్ ఫుట్‌బాల్ పోటీలు జరుగుతున్నాయి. ప్రిస్టన్, బ్లాక్‌బర్న్‌ల మధ్య పోటాపోటీగా మ్యాచ్ జరుగుతోంది. ప్రిస్టన్ ఆటగాడు మిలుటిన్ ఉస్మాజిక్ ఉన్నపళంగా తనను నిలువరిస్తున్న బ్లాక్‌బర్న్ డిఫెండర్ ఒవెన్ బెక్ మెడ వెనుక కొరికేశాడు. ఇంత జరిగినా... రిఫరీకి చెప్పినా ఉస్మాజిక్‌కు మాత్రం రెడ్‌కార్డ్ చూపలేదు. బయటికి పంపలేదు. గత నెల 22న ఈ మ్యాచ్ జరుగగా... అప్పీల్ తదుపరి విచారణ అనంతరం తాజాగా ఈఎఫ్ఏ ఉస్మాజిక్‌పై ఎనిమిది మ్యాచ్‌ల నిషేధం విధించడంతో పాటు 15 వేల పౌండ్లు (రూ.16.80 లక్షలు) జరిమానాగా విధించింది. ఇలా కొరకడంలో ఉరుగ్వే స్ట్రయికర్ లూయిస్ స్వారెజ్ ఫుట్‌బాల్ అభిమానులకు చిరపరిచితుడు. 2013లో జరిగిన ఇంగ్లీష్ ప్రీమియర్ లీగ్‌లో బార్సిలోనా స్ట్రయికర్ స్వారెజ్... చెల్సియా డిఫెండర్ బ్రానిస్లావ్ ఇవానోవిచ్‌ను కొరకడంతో ఏకంగా 10 మ్యాచ్‌ల నిషేధం విధించారు. అయినా అతని బుద్ధి మారలేదు. ఆ మరుసటి ఏడాది బ్రెజిల్‌లో జరిగిన ఫుట్‌బాల్ ప్రపంచకప్ (2014)లో స్వారెజ్ ఇటలీ డిఫెండర్ జియోర్జియో చిలినిని కొరికాడు. దీంతో మళ్లీ నాలుగు మ్యాచ్‌ల నిషేధం ఎదుర్కొన్నాడు.

బీసీసీఐ ఏసీయూ చీఫ్‌గా రిటైర్డ్ ఐపీఎస్ శరద్ కుమార్



న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి చెందిన అవినీతి నిరోధక విభాగానికి (ఏసీయూ) ప్రముఖ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి శరద్ కుమార్‌ను నియమించారు. ఆయన టెర్రరిజం కార్యకలాపాల్ని నిరోధించేందుకు భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) డైరెక్టర్ జనరల్‌గా నాలుగేళ్ల పాటు క్లిష్టమైన టెర్రరిజం దర్యాప్తులను చేపట్టారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 68 ఏళ్ల శరద్ 1979 బ్యాచ్‌కు చెందిన హరియాణా క్యాడర్ ఐపీఎస్. ముంబై ఉగ్రదాడి అనంతరం కేంద్రం ఎన్ఐఏను ఏర్పాటు చేసింది. 2013 నుంచి 2017 వరకు శరద్ ఎన్ఐఏ హెడ్‌గా వ్యవహరించారు. అనంతరం 2018 నుంచి 2020 వరకు సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. ఈ సమయంలోనే మ్యాచ్ ఫిక్సింగ్ కేసులో కీలకంగా పనిచేశారు. ఇప్పుడు ఆ అనుభవమే ఏసీయూ చీఫ్‌ను చేసింది. నిజాయితీ అధికారిగా పేరున్న శరద్ 1996లో, తిరిగి 2004లో రాష్ట్రపతి పోలీస్ మెడల్స్‌ను పొందారు. ఈ నెల 1 నుంచి బోర్డు ఏసీయూ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన ఈ పదవిలో మూడేళ్లపాటు పనిచేస్తారని బోర్డు వర్గాలు తెలిపాయి. ఇంతకుముందు ఏసీయూ చీఫ్‌గా ఉన్న కేకే మిశ్రా కూడా హరియాణా క్యాడర్‌కే చెందిన ఐపీఎస్ అధికారి. కానీ ఏడాది మాత్రమే పదవిలో ఉన్న ఆయన రాజీనామా చేశారు. దీనికి సంబంధించిన కారణాలు మాత్రం వెల్లడి కాలేదు.

ముకేశ్ ఖాతాలో నాలుగో స్వర్ణం



లిమా (పెరూ): ప్రపంచ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల జోరు కొనసాగుతోంది. శుక్రవారం భారత్ ఖాతాలో 11వ స్వర్ణ పతకం చేరింది. పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్ షూటర్ ముకేశ్ నెలవల్లి, రాజ్‌వర్ధన్ పాటిల్, హర్‌సిమర్ సింగ్‌లతో కూడిన భారత జట్టు 1722 పాయింట్లతో పసిడి పతకాన్ని దక్కించుకుంది. ముకేశ్, రాజ్‌వర్ధన్ 579 పాయింట్ల చొప్పున స్కోరు చేయగా... హర్‌సిమర్ 564 పాయింట్లు సాధించాడు. ముకేశ్, రాజ్‌వర్ధన్ వ్యక్తిగత విభాగం ఫైనల్లోనూ పోటీపడ్డారు. ఆరుగురి మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో రాజ్‌వర్ధన్ 17 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలువగా... ముకేశ్ 10 పాయింట్లతో ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. గుంటూరు జిల్లాకు చెందిన ముకేశ్ ఈ టోర్నీలో నిలకడగా రాణించి నాలుగు స్వర్ణ పతకాలు సాధించడం విశేషం. ఓవరాల్‌గా ఈ టోర్నీలో భారత్ 11 స్వర్ణాలు, ఒక రజతం, 4 కాంస్యాలతో కలిపి 16 పతకాలతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతోంది.

టైటిల్ పోరుకు అనిరుధ్ జోడీ



అనిరుధ్

విలేనా (స్పెయిన్): హైదరాబాద్ టెన్నిస్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ ఈ ఏడాది నాలుగో ఏటీపీ చాలెంజర్ టోర్నమెంట్‌లో ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన విలేనా ఓపెన్ ఏటీపీ చాలెంజర్–100 టోర్నీ సెమీఫైనల్లో అనిరుధ్–నిక్కీ కలియంద పునాచా (భారత్) ద్వయం 6–3, 7–6 (7/5)తో సెజార్ క్రెటు (రొమేనియా)–వాలెంటిన్ రోయర్ (ఫ్రాన్స్) జంటపై గెలిచింది. 88 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అనిరుధ్–నిక్కీ ఐదు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశారు. 26 ఏళ్ల అనిరుధ్ ఈ ఏడాది మనాకోర్ ఓపెన్, ఓల్‌రాస్ ఓపెన్, క్వింపెర్ ఓపెన్ టోర్నీలలో ఫైనల్‌కు చేరాడు. ఓల్‌రాస్ ఓపెన్‌లో టైటిల్ సాధించి, మిగితా రెండు టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచాడు.

గోవా, నార్త్ ఈస్ట్ యునైటెడ్ మ్యాచ్ 'డ్రా'

గోవా: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో భాగంగా శుక్రవారం గోవా ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ), నార్త్ ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 3–3 గోల్స్‌తో 'డ్రా'గా ముగిసింది. గోవా తరఫున అర్మాండో సాదికు (45+2వ ని.లో, 47వ ని.లో) రెండు గోల్స్ చేయగా...బొర్జా హెరెరా (90+4వ ని.లో) ఒక గోల్ సాధించాడు. నార్త్ ఈస్ట్ జట్టుకు నెస్టర్ అల్‌బియాచ్ (6వ, 51వ ని.లో) రెండు గోల్స్ చేయగా... అజారెయి (56వ ని.లో) ఒక గోల్ అందించాడు. గత నెల 13న మొదలైన ఐఎస్ఎల్‌లో ఇప్పటి వరకు 13 మ్యాచ్‌లు ముగిశాయి. ఇందులో ఏడు మ్యాచ్‌లు 'డ్రా'గా ముగియగా... ఆరు మ్యాచ్‌ల్లో ఫలితాలు వచ్చాయి. నేడు జంషెడ్‌పూర్‌లో ఈస్ట్ బెంగాల్‌తో జంషెడ్‌పూర్... కోల్‌కతాలో మోహన్ బగాన్ సూపర్ జెయింట్ క్లబ్‌తో మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్ తలపడతాయి.

సెమీస్‌లో విష్ణువర్ధన్ ఓటమి



న్యూఢిల్లీ: ఫెనెస్టా ఓపెన్ జాతీయ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో టాప్ సీడ్, తెలంగాణ క్రీడాకారుడు విష్ణువర్ధన్‌కు అనూహ్య ఓటమి ఎదురైంది. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో విష్ణువర్ధన్ 7–5, 4–6, 2–6తో నితిన్ కుమార్ సిన్హా (రైల్వేస్) చేతిలో ఓడిపోయాడు. మరో సెమీఫైనల్లో రెథిన్ ప్రణవ్ (తమిళనాడు) 6–3, 6–2తో అభినవ్ సంజీవ్‌పై నెగ్గి ఫైనల్లో నితిన్‌తో తలపడేందుకు సిద్ధమయ్యాడు.

డాల్ఫిన్లూ నవ్వుతాయి!



మనిషి తర్వాత అత్యంత తెలివైన జీవుల జాబితాలో డాల్ఫిన్లు అగ్ర స్థానంలో ఉంటాయన్నది తెలిసిందే. మన సైగలను ఇట్టే అర్థం చేసుకోవడంలో, తదనుగుణంగా స్పందించడంలో వాటికవే సాటి. అయితే, సహచరులతో కలిసి సరదాగా ఆడుకునేటప్పుడు అవి నోరంతా తెరిచి నవ్వుతాయి కూడానట! కొన్నేళ్లపాటు లోతుగా పరిశోధనలు చేసి మరీ సైంటిస్టులు ఈ మేరకు తేల్చారు. ఇటలీలోని యూనివర్సిటీ ఆఫ్ పీసా పరిశోధకులతో కూడిన బృందం డాల్ఫిన్ల హావభావాలపై అధ్యయనం చేసింది. అవి బృందంగా ఏర్పడి ఆటలాడుకుంటున్న, శిక్షకులతో కలసి ఆడతున్న 80 గంటలకు పైగా ఫుటేజీని లోతుగా పరిశీలించింది. మనుషులతో ఆడేటప్పుడు మామూలుగానే ఉంటున్నా, తోటి నేస్తాలతో ఆడుకుంటున్నప్పుడు మాత్రం అవి తరచూ నోరంతా తెరిచి చక్కగా నవ్వుతున్నట్టు తేల్చారు. ఈ నవ్వుల్లో ఏకంగా 89 శాతం తన జట్టు సభ్యుడు దృష్టి పథంలోకి వచ్చినప్పుడే చోటుచేసుకుంటున్నాయట. ఆ వెంటనే సదరు సభ్యులు కూడా చిరునవ్వుతో ప్రతిస్పందిస్తున్నాయట. అంతేకాదు, అవతలి వారి ముఖకవళికలను అచ్చుగుద్దినట్టుగా అనుకరిస్తూ ఆటపట్టిస్తున్నాయట కూడా. డాల్ఫిన్లలో ఈ రెండు లక్షణాలను ఇంతకు ముందెప్పుడూ గుర్తించలేదని అధ్యయన బృంద సారథి ఎలిజబెటా పలాగీ వివరించారు. నవ్వు మనుషులకు మాత్రమే పరిమితమని ఇంతకాలంగా ఉన్న భావన తప్పని డాల్ఫిన్లు నిరూపించాయని చెప్పుకొచ్చారు. ఈ అధ్యయన ఫలితాలను సెల్ ప్రెస్ జర్నల్‌లో ప్రచురించారు.

- రోమ్

సంక్షేమం కాదు.. సంఘర్షణ

కోతులకు ఆహారం వేయడంపై ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్య



జనావాసాల మధ్య సంచరించే వానరాలకు ఆహారం అందుబాటులో ఉంచడం జంతు సంక్షేమం కిందికి రాదని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. ఇది ఒక రకంగా మనుషులతో వాటి సంఘర్షణకు దారి తీస్తోందని తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్, జస్టిస్ తుషార్ రావు గేదెల ధర్మాసనం సెప్టెంబర్ 30వ తేదీన వెలువరించిన తీర్పులో కీలక వ్యాఖ్యలు చేసింది. అడవుల్లో చెట్లపై సంచరిస్తూ కాయలు, పండ్లు లాంటివి తినే వానరాలు సహజ ఆవాసాలను వదిలి జనాల మధ్యకు, వీధుల్లోకి రావడానికి కారణం మనమేనని పేర్కొంది. బ్రెడ్, చపాతీ, అరటి పండ్లులాంటివి ఇస్తూ వాటికి హానిని, ప్రజలతో ఘర్షణ పడే స్థితికి వాటిని తీసుకొస్తున్నామని వ్యాఖ్యానించింది. 'పబ్లిక్ పార్కులు, హోటళ్లు, క్యాంటీన్లలో పోగయ్యే చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడేస్తుండటంతో కోతులు అక్కడ పోగవుతున్నాయి. కోతులకు ఆహారం ఇవ్వడం వల్ల అవి మనుషులపై ఆధారపడటాన్ని పెంచుతుంది. ఆహారం దొరకని సందర్భాల్లో అవి హాని కలిగిస్తాయి. ఈ పరిణామం మనుషులతో జంతు సంఘర్షణకు దారి తీస్తుంది. పౌర సంస్థలు దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలి. సురక్షితంగా ఉండాలనుకునే వారు ఆహార వ్యర్థాలను ఎక్కడిపడితే అక్కడ పడేయడం మానుకోవాలి' అని హితవు పలికింది.

- న్యూఢిల్లీ

హిమాచల్‌లో టాయ్‌లెట్ ట్యాక్స్!

అలాంటి ఆలోచన లేదన్న ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్ సుఖూ



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పాలిత హిమాచల్‌ప్రదేశ్‌లో టాయ్‌లెట్ సీటు ట్యాక్స్ వ్యవహారం పెను వివాదంగా మారిపోయింది. నగరాలు, పట్టణ ప్రాంతాల్లోని ఇళ్లల్లో ఒక్కో టాయ్‌లెట్ సీటుపై నెలకు రూ.25 చొప్పున ప్రభుత్వం పన్ను విధించినట్లు మీడియాలో వార్తలు వెలువడ్డాయి. ఈ సొమ్మును నీటి సరఫరా, పారిశుధ్య సేవలను పర్యవేక్షించే జల శక్తి విభాగం ఖాతాకు బదిలీ చేస్తారని పత్రికలు వెల్లడించాయి. దీంతో ఒక్కసారి గగ్గోలు మొదలైంది. విపక్ష బీజేపీ నేతలు విమర్శలు ప్రారంభించారు. టాయ్‌లెట్ సీటు పన్ను అనేది నమ్మశక్యం కాకుండా ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఒక ప్రజా ఉద్యమంగా మార్చారని చెప్పారు. హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం టాయ్‌లెట్ పన్ను వేస్తోందని ఆక్షేపించారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓట్లు వేసిన గెలిపించిన ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం పన్నులు వేసి శిక్షిస్తోందని మండిపడ్డారు. ఈ వివాదంపై హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖూ శుక్రవారం స్పందించారు. తమ రాష్ట్రంలో టాయ్‌లెట్ సీటు పన్ను అనేది లేనేలేదని స్పష్టంచేశారు. అలాంటి ఆలోచన కూడా లేదని అన్నారు. ఆధారాల్లేకుండా ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ నాయకులపై ధ్వజమెత్తారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందడానికి తమ ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని ఆరోపించారు. మరోవైపు రూ.25 చొప్పున టాయ్‌లెట్ సీటు ట్యాక్స్ విధిస్తూ జారీ చేసిన నోటిఫికేషన్‌ను సెప్టెంబర్ 21న వెనక్కి తీసుకున్నామని ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి ఓంకార్ శర్మ వెల్లడించారు.

అనుమతి లేకుండా కూల్చేస్తే మళ్లీ మీరే నిర్మించాలి

గుజరాత్‌లో ఇళ్ల కూల్చివేతలపై సుప్రీంకోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ: గుజరాత్‌లో ఇళ్ల కూల్చివేతలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నేరగాళ్ల నివాసాలైనా సరే ముందస్తుగా అనుమతి లేకుండా కూల్చివేయొద్దని సెప్టెంబర్ 17న ఉత్తర్వులు ఇచ్చామని వెల్లడించింది. ఈ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ కూల్చివేతలు చేపట్టినట్లు తేలితే, ఆయా ఇళ్లను అధికారులే తిరిగి నిర్మించాలని ఆదేశిస్తామని స్పష్టం చేసింది. గుజరాత్‌లో గిర్ సోమనాథ్ జిల్లాలోని సోమనాథ్ ఆలయ సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన భవనాలను గత నెల 28న ప్రభుత్వ అధికారులు కూల్చివేశారు. ఆక్రమణలను తొలగించారు. ఈ చర్యను వ్యతిరేకిస్తూ సుమస్త పాట్నీ ముస్లిం జమాత్ అనే సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కోర్టు ఇచ్చిన ఉత్తర్వును అపహాస్యం చేస్తూ అనుమతి లేకుండానే నిర్మాణాలు కూల్చివేశారని ఆక్షేపించింది. అధికారులపై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. నిజంగా కోర్టు ధిక్కరణ జరిగినట్లు తేలితే సంబంధిత అధికారులను జైలుకు పంపిస్తామని, అంతేకాకుండా కూల్చేసిన ఇళ్లను మీరే నిర్మించాలని ఆదేశిస్తామని పేర్కొంది. కూల్చివేతలపై నివేదిక ఇవ్వాలని గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 16వ తేదీకి వాయిదా వేసింది. సోమనాథ్ ఆలయం వద్ద కూల్చివేతలపై యథాతథ స్థితి ఉత్తర్వులు జారీ చేయడానికి ధర్మాసనం నిరాకరించింది.



రిపోర్టర్లపై క్రిమినల్ కేసులొద్దు

యూపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు హితవు

న్యూఢిల్లీ: ప్రభుత్వాన్ని విమర్శిస్తూ రాశారనే కారణంతో జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు పెట్టకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. యూపీలో సాధారణ పరిపాలన యంత్రాంగంలో కుల సమీకరణాలపై కథనం రాసినందుకు తనపై నమోదైన కేసును కొట్టేయాలంటూ అభిషేక్ ఉపాధ్యాయ్ అనే జర్నలిస్ట్ వేసిన పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిల ధర్మాసనం విచారణ చేపట్టింది. అభిషేక్ ఎలాంటి నేరం చేశారనేది కూడా ఆ ఎఫ్ఐఆర్‌లో పేర్కొనలేదని ధర్మాసనం తెలిపింది. ప్రజాస్వామ్యంలో భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను గౌరవించాలని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) ద్వారా జర్నలిస్ట్ హక్కులకు రక్షణ కల్పించబడిందని గుర్తు చేసింది. ఈ కేసులో అభిషేక్‌పై ఎలాంటి చర్యలు తీసుకోరాదని ఆదేశిస్తూ యూపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

60 ఏళ్ల నుంచి 25 ఏళ్లకు తగ్గిస్తామని..

యూపీలో ఓ జంట ఘరానా మోసం

కాన్పూర్: టైమ్ ట్రావెలింగ్ అంటే ఎవరికైనా ఆసక్తికరంగానే ఉంటుంది. మళ్లీ బాల్యంలోకి, నవ యవ్వనంలోకి వెళ్లాలని కోరుకోని వారుండరు..! అలాంటి బలహీనతనే వాడుకుని మోసం చేసి రూ.35 కోట్లు దండుకుందో కాన్పూర్ జంట. కాన్పూర్‌కు చెందిన రాజీవ్ కుమార్ దూబే, అతని భార్య రష్మి కలిసి కిద్వాయ్‌నగర్ ప్రాంతంలో 'రివైవల్ వరల్డ్' అనే థెరపీ సెంటర్‌ను ప్రారంభించారు. ఆక్సిజన్ థెరపీతో ఇజ్రాయెల్ నుంచి తెచ్చిన ఓ టైమ్ మెషీన్ ద్వారా వృద్ధులను యువకులుగా మారుస్తామని ప్రచారం చేసుకున్నారు. కలుషిత గాలి కారణంగా తొందరగా వృద్ధులవుతున్నారని, ఆక్సిజన్ థెరపీతో కొన్ని నెలల్లోనే వృద్ధులు కాస్తా యవ్వనంతో ఉరకలు వేస్తారని నమ్మించింది. 10 సెషన్లకు రూ.6 వేలు, మూడేళ్ల రివార్డు సిస్టమ్ కోసం రూ.90 వేల ప్యాకేజీలు ఆఫర్ చేసింది. ఇంకేముంది, వందలాది మంది వారి దగ్గరకు వచ్చారు. టైమ్ మెషీన్, ఆక్సిజన్ థెరపీ అంతా బోగస్ అని తెలుసుకుని రేణూ సింగ్ అనే బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను రూ.10.75 లక్షలు పోగొట్టుకున్నానని చెప్పారు. పోలీసుల దర్యాప్తులో వందలాది మంది నుంచి రూ.35 కోట్లకు పైగా మోసం చేసినట్లు తేలింది. దీంతో పోలీసులు దూబే దంపతుల కోసం గాలింపు చేపట్టారు. వారు విదేశాలకు పరారైనట్లు అనుమానిస్తున్నారు.

కూతురి గురించి స్పామ్ కాల్‌తో తల్లి మృతి

ఆగ్రా(యూపీ): స్పామ్ కాల్ ఓ ఉపాధ్యాయురాలి ప్రాణాలను బలిగొంది. తన కూతురు గురించి స్పామ్ కాల్ రావడంతో ఆందోళనకు గురైన తల్లి.. గుండెపోటుతో మరణించింది. ఈ విషాద ఘటన ఆగ్రాలో గురువారం జరిగింది. స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు మాలతి వర్మ(58)కు ఓ వ్యక్తి నుంచి వాట్సప్ కాల్ వచ్చింది. 'కాలేజీకి వెళ్లే మీ కూతురు సెక్స్ రాకెట్‌లో చిక్కుకుంది. ఆమె క్షేమంగా ఇంటికి రావాలంటే రూ.లక్ష మా ఖాతాలో వేయండి' అంటూ డిమాండ్ చేశాడు. మధ్యాహ్నం కాల్ రావడంతో మాలతి.. కొడుకు దీపాన్షుకు ఫోన్ చేసి చెప్పింది. 'అది స్పామ్ కాల్' అతను తల్లికి నచ్చచెప్పాడు. కాలేజీలో ఉన్న చెల్లెలిని తల్లితో ఫోన్లో మాట్లాడించారు. అయినా గుండెలో నొప్పిగా ఉందని పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన మాలతి.. 15 నిమిషాలకే ప్రాణాలు కోల్పోయారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించామని అదనపు పోలీసు కమిషనర్ మయాంక్ తివారీ తెలిపారు.

సావర్కర్‌పై వ్యాఖ్యలు.. రాహుల్‌కు సమన్లు

పుణె: హిందుత్వ సిద్ధాంత కర్త వీడీ సావర్కర్‌పై అభ్యంతరకరంగా వ్యాఖ్యలు చేశారంటూ దాఖలైన పిటిషన్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి పుణె కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ నెల 23వ తేదీన స్వయంగా హాజరుకావాలని ఆదేశించింది. 2023 మార్చి 5వ తేదీన లండన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ సావర్కర్‌పై ఉద్దేశపూర్వకంగా వ్యాఖ్యలు చేశారని సావర్కర్ సోదరుని మనవరాలైన సాత్యకి సావర్కర్ పుణె మేజిస్ట్రేట్ కోర్టులో అదే ఏడాది ఏప్రిల్‌లో పిటిషన్ దాఖలు చేశారు. సావర్కర్‌పై చేసే ఆరోపణలు తప్పని తెలిసినా కూడా రాహుల్ అనేక సందర్భాల్లో అవే వల్లెవేస్తున్నారని అందులో పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో సావర్కర్ పేరును తక్కువ చేయడంతోపాటు ఆయన కుటుంబ మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఇందుకుగాను రాహుల్‌కు గరిష్ట స్థాయి శిక్షతోపాటు జరిమానా విధించాలని అభ్యర్థించారు. రాహుల్‌కు ఇటీవల నాసిక్ కోర్టు కూడా నోటీసులు జారీ చేయడం తెలిసిందే. 2022లో హింగోలిలో జరిగిన మీడియా సమావేశంలో సావర్కర్ ప్రతిష్టను దిగజార్చేలా మాట్లాడారంటూ ఎన్జీవో డైరెక్టర్ ఒకరు ఫిర్యాదు చేశారు.

పాక్‌లో ఎస్‌సీవో భేటీకి జై శంకర్


న్యూఢిల్లీ: పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో ఈ నెల 15, 16వ తేదీల్లో జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) ప్రభుత్వాధినేతల భేటీకి విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ హాజరుకానున్నారు. భారత ప్రతినిధి బృందానికి మంత్రి జై శంకర్ నాయకత్వం వహిస్తారని విదేశాంగ శాఖ శుక్రవారం తెలిపింది. ఎస్‌సీవో భేటీకి రావాలంటూ పాకిస్తాన్ ఆగస్టులోనే ప్రధాని మోదీకి ఆహ్వానం పంపింది. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడంతోపాటు, ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా ప్రకటించిన 2019 ఆగస్టు నుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. ఈ పరిస్థితుల్లో విదేశాంగ మంత్రిని పాకిస్తాన్‌కు పంపించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సీనియర్ మంత్రిని పంపాలనే నిర్ణయం ప్రాంతీయ భద్రతా సహకారాన్ని పెంపొందించడంలో కీలకంగా ఉన్న ఎస్‌సీవోపై భారత్ నిబద్ధతకు నిదర్శనమని భావిస్తున్నారు.

శ్రీలంక అధ్యక్షుడితో జై శంకర్ సమావేశం

కొలంబో: భారత విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ శుక్రవారం శ్రీలంక అధ్యక్షుడు అనూర కుమార దిస్సనాయకేతో సమావేశమయ్యారు. శ్రీలంకకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు భారత్ కట్టుబడి ఉంటుందని భరోసా ఇచ్చారు. రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు గల అవకాశాలపై చర్చించారు. అనంతరం జై శంకర్ ప్రధాని హరిణి అమరసూర్యతో, ఆ దేశ విదేశాంగ మంత్రి విజిత హెరత్‌తోనూ సమావేశమయ్యారు. సెప్టెంబర్ 23వ తేదీన దిస్సనాయకే సారథ్యంలోని నేషనల్ పీపుల్స్ పవర్(ఎన్‌పీపీ) అధికార పగ్గాలు చేపట్టాక శ్రీలంకను సందర్శించిన మొట్టమొదటి విదేశీ నేత మంత్రి జై శంకర్.

ఉత్తర భారతాన్ని డ్రగ్స్‌కు కేంద్రంగా మార్చింది

- కాంగ్రెస్‌పై హోం మంత్రి అమిత్ షా నిప్పులు
- ఢిల్లీ డ్రగ్స్ రాకెట్‌లో ఆ పార్టీ నేత హస్తం సిగ్గుచేటన్న షా



అహ్మదాబాద్: 2014కు ముందు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఉత్తర భారతాన్ని డ్రగ్స్ దందాకు నిలయంగా మార్చివేసిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా నిప్పులు చెరిగారు. ఇటీవల రూ.5,620 కోట్ల విలువైన డ్రగ్స్ రాకెట్‌లో పట్టుబడిన తుషార్ గోయెల్ కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ విభాగం ఐటీ సెల్ అధ్యక్షుడని ఆరోపించారు. ఇది ప్రమాదకర ధోరణి, సిగ్గు చేటు అని ఆయన అభివర్ణించారు. శుక్రవారం ఆయన గుజరాత్‌లోని మాన్సాలో పలు కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. 2004–14 సంవత్సరాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉండగా దేశంలో పట్టుబడిన డ్రగ్స్ సుమారు 1.52 లక్షల కిలోలు కాగా, 2014–2024 సంవత్సరాల్లో డ్రగ్స్ రహిత భారత్ కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా దాడులు చేపట్టి ఏకంగా 5.43 లక్షల కిలోల మాదక ద్రవ్యాలను పట్టుకున్నామన్నారు. కాంగ్రెస్ పదేళ్ల హయాంలో పట్టుబడిన మాదక ద్రవ్యాల విలువ రూ.768 కోట్లు మాత్రమే కాగా, గత పదేళ్లలో వెలుగు చూసిన డ్రగ్స్ విలువ ఏకంగా రూ.27,600 కోట్లన్నారు. ఒక రాజకీయ పార్టీ సొంత సభ్యులే డ్రగ్స్ వ్యాపారంలో నిమగ్నమై ఉంటే వీటిని నివారించడం సాధ్యమేనా? అని ఆయన ప్రశ్నించారు. మోదీ ప్రధాని కాకముందు, జమ్మూకశ్మీర్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ డ్రగ్స్ వ్యాపారానికి కేంద్ర బిందువులుగా ఉండేవన్నారు. గుజరాత్‌లో కూడా మూడేళ్లలో రూ.8,500 డ్రగ్స్ వెలుగుచూశాయని చెప్పారు. మోదీ ప్రభుత్వం యువతను క్రీడలు, విద్య, ఆవిష్కరణలవైపు తీసుకెళ్లాలని చూస్తుంటే.. కాంగ్రెస్ మాత్రం డ్రగ్స్ చీకటి ప్రపంచం దిశగా నడిపించాలని చూస్తోందని అనంతరం మంత్రి 'ఎక్స్'లో పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం ఢిల్లీ పోలీసులు రూ.5,620 కోట్ల విలువైన 560 గ్రాముల కొకైన్, 40 కిలోల మారిజువానాను పట్టుకున్నారు. అయితే, ఈ కేసులో పట్టుబడిన తుషార్ గోయెల్ తో తమ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని యూత్ కాంగ్రెస్ స్పష్టం చేసింది. తుషార్‌ను రెండేళ్ల క్రితమే పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున బహిష్కరించామని ప్రకటించింది.

కొత్తింట్లోకి మకాం మార్చిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఆప్ అధ్యక్షుడు, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి ఎ.కేజ్రీవాల్ తొమ్మిదేళ్లుగా ఉంటున్న ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులోని నివాసం నుంచి ల్యుటెన్స్ ప్రాంతంలోని కొత్త నివాసానికి మకాం మార్చారు. రెండు మినీ ట్రక్కుల్లో సామానంతా కొత్త నివాసానికి తరలించారు. అంతకు ముందు పాత ఇంట్లోని సిబ్బందిని ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న కేజ్రీవాల్.. భార్య, తల్లిదండ్రులు, కుమారుడు, కుమార్తెతో కలిసి ఫిరోజ్‌షా రోడ్డులోని మండిహౌస్ దగ్గరున్న 5వ నంబర్ ఇంటికి వెళ్లారు. గృహ ప్రవేశ పూజల అనంతరం, లోపలికి ప్రవేశించారు.

అత్యంత బుల్లి రూబిక్స్ క్యూబ్



ఇది ప్రపంచంలోనే అత్యంత బుల్లి రూబిక్స్ క్యూబ్‌గా గిన్నిస్ రికార్డులకెక్కింది. దీని పరిమాణం కేవలం 5 మిల్లీమీటర్లు! బ్రిటిష్ కంపెనీ టోనీ ఫిషర్ తయారు చేసిన 5.6 మి.మీ. క్యూబ్ పేరిట ఉన్న 2016 నాటి గత రికార్డును బద్దలు కొట్టింది. ఇంత చిన్నగా ఉన్నా ఇది ఎంచక్కా పని చేస్తుంది కూడా. కాకపోతే దీన్ని సాల్వ్ చేయాలంటే ఫొటోలో చూపించినట్టుగా పట్టకారు వంటిదాని సాయం అవసరమవుతుంది. దీని బరువు కేవలం 0.3 గ్రాములు! సాధారణ క్యూబ్ సైజులో కేవలం వెయ్యో వంతు ఉండే ఈ బుల్లి క్యూబ్ తయారీదారు జపాన్ ఆటబొమ్మల తయారీ దిగ్గజం మెగాహౌజ్. గురువారమే దీన్ని వెబ్‌సైట్లో పెట్టింది. ఏప్రిల్ నుంచి డెలివరీ మొదలవుతుందట. ఈ మీనియేచర్ రూబిక్స్ క్యూబ్ నాలుగేళ్ల కష్టానికి ఫలితమని కంపెనీ చెబుతోంది. రూబిక్స్ క్యూబ్‌ను కనిపెట్టి సరిగ్గా 50 ఏళ్ల వుతున్న సందర్భంగా బుల్లి వెర్షన్‌ను విడుదల చేస్తోంది. 1974 నుంచి ఇప్పటిదాకా ప్రపంచవ్యాప్తంగా 50 కోట్ల పై చిలుకు క్యూబ్‌లు అమ్ముడైనట్టు అంచనా. దీన్ని కేవలం 3.13 సెకన్లలో సాల్వ్ చేసిన రికార్డు కొరియన్ అమెరికన్ మాక్స్ పార్క్ పేరిట ఉంది. 3.38 సెకన్లతో రెండో స్థానంలో ఉన్నది వాంగ్ యీహెంగ్ అనే పదేళ్ల చైనా బుడతడు కావడం విశేషం.

- సాక్షి, నేషనల్ డెస్క్

యూపీలో రోడ్డు ప్రమాదం..10 మంది మృతి

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మిర్జాపూర్ కచ్వా పోలీస్ స్టేషన్ పరిధిలోని గురువారం అర్ధరాత్రి 1 గంట సమయంలో ట్రాక్టర్‌ను ట్రక్కు ఢీకొట్టింది. ఘటనలో 10మంది చనిపోగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. భదోహ జిల్లాలో పని పూర్తి చేసుకొన్న మొత్తం 13 మంది కూలీలు ట్రాక్టర్‌పై వారణాసి వైపు వెళ్తున్నారు. కచ్వా సరిహద్దులోని జీటీ రోడ్‌లో వెనుక నుంచి వచ్చిన ట్రక్కు ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టింది. రోడ్డు ప్రమాదంపై వారణాసి–ప్రయాగ్‌రాజ్ హైవేను గ్రామస్తులు దిగ్బంధించారు. రోడ్డు ప్రమాద ఘటనపై ప్రధాని మోదీ, సీఎం యోగి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఎంసీడీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో మీ జోక్యం ఏమిటి?

- ఎన్నికల విషయంలో ఎందుకు తొందరపడ్డారు?
- ఢిల్లీ ఎల్జీ కార్యాలయంపై సుప్రీంకోర్టు అసహనం

న్యూఢిల్లీ: మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ(ఎంసీడీ) స్టాండింగ్ కమిటీ ఎన్నికల ప్రక్రియలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏమిటని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ ఎన్నికల విషయంలో ఎందుకంత తొందరపడ్డారు అని లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయంపై అసహనం వ్యక్తం చేశారు. తదుపరి విచారణ జరిగే వరకూ ఎంసీడీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ పోస్టుకు ఎన్నిక నిర్వహించవద్దని లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనాను ఆదేశించింది. ఆరుగురు సభ్యులున్న స్టాండింగ్ కమిటీకి సెప్టెంబర్ 27న జరిగిన ఎన్నికలను సవాలు చేస్తూ ఢిల్లీ మేయర్ షెల్లీ ఒబెరాయ్ సుప్రీంకోర్టు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఆర్.మహాదేవన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం తీరును తప్పుపట్టింది. పరిధులు మర్చిపోయి ఇలా ఇష్టారాజ్యంగా ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకుంటే రాజ్యాంగం ప్రమాదంలో పడుతుందని తేల్చిచెప్పింది. వివరణ ఇవ్వాలని లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయాన్ని ఆదేశించింది. లెఫ్టినెంట్ గవర్నర్ అధికారాల చట్టబద్ధత, చెల్లుబాటుపై తమకు అనుమానాలు ఉన్నాయని వెల్లడించింది. ఇదిలా ఉండగా, స్టాండింగ్ కమిటీ చైర్మన్ పదవిని దక్కించుకోవడానికి బీజేపీ కుట్రలు పన్నుతోందని, అందుకోసం లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయాన్ని దుర్వినియోగం చేస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు శుక్రవారం ఆరోపించారు. బీజేపీ కుట్రకు అనుగుణంగానే వి.కె.సక్సేనా పని చేస్తున్నారని మండిపడ్డారు. ఎంసీడీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ పదవిని దక్కించుకొనేందుకు తగిన బలం బీజేపీకి లేదని స్పష్టంచేశారు.

హారిస్‌కు రిపబ్లికన్ లిజ్ చెనీ మద్దతు

విస్కాన్సిన్: అమెరికా మాజీ ఉపాధ్యక్షుడు డిక్ చెనీ కుమార్తె, రిపబ్లికన్ పార్టీ కీలక నేత లిజ్ చెనీ డెమొక్రాటిక్ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్‌కు మద్దతు పలికారు. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను దుర్మార్గుడిగా అభివర్ణించారు. ట్రంప్‌కు ఓటేయవద్దని ఓటర్లను కోరారు. విస్కాన్సిన్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో హారిస్‌తో కలిసి చెనీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెనీ మాట్లాడుతూ.. 'డొనాల్డ్ ట్రంప్ ప్రమాదకరమైన వ్యక్తి. నేనెప్పుడూ డెమొక్రాట్ అభ్యర్థికి ఓటు వేయలేదు. కానీ ఒక సంప్రదాయవాదిగా, రాజ్యాంగాన్ని విశ్వసించే వ్యక్తిగా, ఎంతో ఆలోచించాను. ఈ దఫా కమలా హారిస్‌కే ఓటేయాలని నిర్ణయించుకున్నానని సగర్వంగా ప్రకటిస్తున్నా' అని తెలిపారు. 'ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేశారు. ఆమె మన దేశాన్ని ప్రేమిస్తున్నారు. దేశభక్తురాలిగా, తల్లిగా, రాజ్యాంగాన్ని గౌరవించే వ్యక్తిగా ఈ అత్యవసర కార్యక్రమంలో ఆమెతో కలిసి పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాను' అని లిజ్ చెనీ పేర్కొన్నారు. అమెరికా ఎన్నికల సమగ్రతపై సందేహాలకు తావిస్తూ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను కూడా చెనీ స్పష్టంగా ప్రస్తావించారు. అయితే తాను అత్యంత గౌరవించే వ్యక్తిత్వం చెనీదని, ప్రజలను కించపరిచేందుకు, చిన్నచూపు చూడడానికి, భయభ్రాంతులకు గురిచేయడానికి ఇన్ని శక్తులు ప్రయత్నిస్తున్నప్పుడు.. చెనీలాంటివారు ఓ ధైర్యమని హారిస్ ప్రశంసించారు. అమెరికా ప్రతినిధుల సభకు లిజ్ చెనీ 2017–23 సంవత్సరాల మధ్య ప్రాతినిధ్యం వహించారు. 2019–21 కాలంలో కీలకమైన హౌస్ రిపబ్లికన్ కాన్ఫరెన్స్‌కు అధ్యక్షత కూడా వహించారు.

హైతీలో సాయుధ ముఠా దాడి

20 మంది మృతి, 50 మందికి గాయాలు

పోర్ట్ ఆవ్ ప్రిన్స్: హైతీలో సాయుధ ముఠా జరిపిన దాడిలో 20 మంది చనిపోగా 50 మందికి పైగా గాయపడ్డారు. గ్రాన్ గ్రిఫ్ ముఠా పాంట్ సోండే పట్టణంలో పెద్ద ఎత్తున గృహ దహనాలకు పాల్పడింది. కార్లను అడ్డుకుని అగ్నికి ఆహుతి చేసింది. దీంతో భయభ్రాంతులకు గురైన ప్రజలు పట్టణాన్ని విడిచి పారిపోయారు. క్షతగాత్రులు చికిత్స పొందుతున్న సెయింట్ మార్క్‌లోని ఆస్పత్రి వద్ద వందలాదిగా జనం గుమిగూడారు. ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు ముఠా దాడిని మారణహోమంగా అభివర్ణించారు.

సాక్షి ప్లస్
శనివారం। 5-10-2024

అర్ధరాత్రి స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న వేళ



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారత రాజ్యాంగం - చారిత్రక నేపథ్యం

సి.ఆర్. ఫార్ములా (1944) (సి. రాజగోపాలాచారి సూత్రం)

ముస్లిం లీగ్ సహకారం కోసం, మతసమస్యల పరిష్కారం కోసం 1944 మార్చిలో గాంధీజీ ఆమోదంతో కాంగ్రెస్ తరఫున సి.రాజగోపాలాచారి ఒక సూత్రాన్ని ప్రతిపాదించారు. స్వయం నిర్ణయాధికార హక్కు కోసం పాకిస్తాన్‌ను ఏర్పాటు చేయాలనే ముస్లిం లీగ్ కోరికను ఆయన అంగీకరించారు. కాంగ్రెస్‌కు కావాల్సిన స్వతంత్ర సాధన, దాని కోసం ముస్లింల సహకారాన్ని పొందేందుకు ఎంత నష్టాన్నైనా భరించటానికి కాంగ్రెస్ సిద్ధమైంది. ముస్లిం లీగ్ మాత్రం దేశ స్వాతంత్ర్యం గురించి పట్టించుకోకుండా, ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రచారంలోకి తీసుకువచ్చి, ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా దేశ విభజనకు అంగీకరించాలని కాంగ్రెస్‌ను కోరింది.

వేవెల్ ప్రణాళిక (1945)

భారత వైస్రాయ్, గవర్నర్ జనరల్ లార్డ్ వేవెల్ నాటి బ్రిటన్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్‌తో చర్చించి కొన్ని ప్రతిపాదనలు చేశారు.

ముఖ్యాంశాలు

- భారతదేశంలోని ప్రధాన మతాలకు సంబంధించిన వారికి సముచిత ప్రాతినిధ్యం కోసం వైస్రాయ్ కార్యనిర్వాహక మండలిని విస్తరించడం.
- భారతదేశంలోని బ్రిటిష్ వారి ప్రయోజనాలు కాపాడేందుకు హైకమిషనర్‌ను నియమించడం.
- వైస్రాయ్ కార్యనిర్వాహక మండలిలో ముఖ్య సైన్యాధికారిగా భారతీయుడిని నియమించడం.
- వైస్రాయ్ కార్యనిర్వాహక వర్గం జాతీయ ప్రభుత్వంగా వ్యవహరించడం. దీని కోసం వైస్రాయి 1945 జూలైలో సిమ్లాలో ఒక సమావేశాన్ని నిర్వహించారు. కానీ కాంగ్రెస్ అవిభాజ్య భారత దేశం (యునైటెడ్ ఇండియా) కోసం పట్టు బట్టింది. ముస్లిం లీగ్ మాత్రం దేశ విభజనను సమర్థించింది.

కేబినెట్ మిషన్ (1946) (కేబినెట్ రాయబారం)

బ్రిటన్ ప్రధాని అట్లీ.. 1946 మార్చిలో పార్లమెంటులో భారతదేశానికి అధికార బదిలీకి సంబంధించి ఒక చరిత్రాత్మక ప్రకటన చేశారు. 'అల్ప సంఖ్యాకుల హక్కులపై మాకు అవగాహన ఉంది. అల్పసంఖ్యాకులు నిర్భయంగా జీవించాలి. అయి తే అధిక సంఖ్యాకుల పురోగతిని కాదనే అల్ప సంఖ్యాక వర్గాన్ని కూడా మనం అనుమతించలేం' అని పేర్కొన్నారు. అందులో భాగంగా బ్రిటన్‌లో కేబి నెట్ మంత్రులైన సర్ స్టాఫర్డ్ క్రిప్స్, ఎ.వి.అలెగ్జాండర్, లార్డ్ పెథిక్ లారెన్స్ సభ్యులుగా మంత్రుల బృందం భారత పర్యటన ప్రారంభించింది. ఈ బృందానికి సర్ పెథిక్ లారెన్స్ నేతృత్వం వహించారు. 1946 మే 16న వీరు తమ ప్రణాళికను వెల్లడించారు.

ముఖ్యాంశాలు

- బ్రిటిష్ పాలిత భారతదేశం, స్వదేశీ సంస్థానాలు, ఇండియన్ యూనియన్ అనే రాజకీయ వ్యవస్థ ఏర్పడుతుంది. ఆ యూనియన్ విదేశీ వ్యవహారాలు, రక్షణ, కమ్యూనికేషన్ లాంటి జాతీయ ప్రాముఖ్యమున్న అంశాలను నిర్వహిస్తుంది.
- కేంద్ర ప్రభుత్వ పరిధిలో లేని పాలనాంశాలపై శాసనాధికారం రాష్ట్రాలకు సంక్రమిస్తుంది.
- ప్రాంతీయ ప్రభుత్వాలకు శాసన నిర్మాణ శాఖలు ఏర్పడుతాయి. పరిపాలనా నిర్వహణ కోసం 14 మంది సభ్యులతో కూడిన ఒక తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటవుతుంది.
- పాకిస్తాన్ అనే మరొక దేశం ఏర్పడే భావన ఆచరణ సాధ్యం కాదు.
- రాజ్యాంగాన్ని రూపొందించేందుకు ప్రత్యేక రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటవుతుంది.

తాత్కాలిక ప్రభుత్వం (1946)

బ్రిటిష్ ప్రభుత్వం 1946 ఆగస్టు 24న తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రకటించింది. దీనికి అనుగుణంగా 1946 సెప్టెంబర్ 2న తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది. ప్రారంభంలో సందేహించిన ముస్లిం లీగ్, 1946 అక్టోబర్ 29న తాత్కాలిక ప్రభుత్వంలో చేరింది. కాంగ్రెస్ తరఫున వల్లభాయ్ పటేల్, రాజేంద్ర ప్రసాద్, అరుణా అసఫ్ అలీ, రాజగోపాలాచారి, జగ్జీవన్‌రామ్ లాంటి ప్రముఖులు, ముస్లిం లీగ్ తరఫున లియాఖత్ అలీఖాన్, జె.ఎన్.మండల్, గజ్నేఫర్ అలీఖాన్ లాంటి నాయకులు మంత్రులుగా, జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా వ్యవహరించారు.

అట్లీ ప్రకటన (1947)

1947 ఫిబ్రవరి 20న కామన్స్ సభలో మాట్లాడుతూ 1948 జూన్ నాటికి బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశం నుంచి వైదొలుగుతుందని ప్రకటించారు. దీన్నే అట్లీ ప్రకటన అంటారు. ఈ ప్రకటనను బ్రిటిష్‌వారు జారీచేసిన వాటిలో అత్యుత్తమమైందిగా మహాత్మాగాంధీ వర్ణించారు.

మౌంట్‌బాటన్ ప్రణాళిక(1947)

భారతదేశ రాజ ప్రతినిధి, గవర్నర్ జనరల్ గా నియమితుడైన మౌంట్‌బాటన్ దేశంలోని రాజకీయ ప్రముఖులతో సంప్రదింపులు జరిపి, సమైక్య భారతదేశ ప్రాతిపదికన కాంగ్రెస్, ముస్లిం లీగ్ పార్టీల మధ్య అంగీకారం కుదర్చడం సాధ్యం కాదనీ, దేశ విభజన ఒక్కటే పరిష్కారంగా భావించి ప్రణాళిక తయారు చేశారు.

ముఖ్యాంశాలు

- ఇండియన్ యూనియన్‌ను భారత్, పాకిస్తాన్ అనే రెండు రాజ్యాలుగా విభజిస్తారు.
- 1948 జూన్‌కు బదులుగా 1947 ఆగస్టు 15 న రెండు దేశాలుగా విడిపోతాయి.
- అసోం భారత్‌లో అంతర్భాగంగా ఉండగా బెంగాల్, పంజాబ్‌లను మత ప్రాతిపదికన విభజించారు. అయితే ముస్లింలు అధికంగా ఉండే సిల్హట్ (బెంగాల్) జిల్లా విషయంలో మాత్రం అది తూర్పు బెంగాల్‌లో లేదా అసోంలో చేరడమా అనే విషయం ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా జరుగుతుంది.
- బెలూచిస్థాన్ వాయవ్య ప్రాంతాలు భారత్ లేదా పాకిస్తాన్‌లో కానీ చేరే విషయంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుంది.
- పంజాబ్, బెంగాల్, అసోం లాంటి రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలను విభజించే విషయంలో రెండు సరిహద్దు సంఘాలను నియమించారు.
- బ్రిటన్ ఆధ్వర్యంలోని కామన్‌వెల్త్ కూటమిలో చేరే విషయంలో భారత్, పాకిస్తాన్‌లకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది.

భారత స్వాతంత్ర్య చట్టం (1947)

భారతదేశ వ్యవహారాల నిర్వహణ, నియంత్రణ కోసం రూపొందించిన చివరి చట్టం ఇదే. బ్రిటన్ ప్రధాని క్లిమెంట్ అట్లీ ఆధ్వర్యంలో భారత గవర్నర్ జనరల్ లార్డ్ లూయిస్ మౌంట్‌బాటన్ సలహా మేరకు 1947 జూలై 4న బ్రిటిష్ పార్లమెంటులో భారత స్వాతంత్ర్య ముసాయిదాను ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై బ్రిటిష్ రాణి 1947 జూలై 18 న సంతకం చేసింది. ఇది 1947 ఆగస్టు 14 అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చింది.

ముఖ్యాంశాలు

- ఇండియా, పాకిస్తాన్ అనే రెండు స్వతంత్ర దేశాలు ఏర్పడతాయి. వీటికోసం వేర్వేరు రాజ్యాంగ పరిషత్తులు కూడా ఏర్పాటవుతాయి.
- స్వదేశీ సంస్థానాలపై బ్రిటిష్ సార్వభౌమాధికారంతోపాటు భారత వ్యవహారాల కార్యదర్శి పదవి కూడా రద్దవుతుంది.
- బ్రిటిష్ రాజు లేదా రాణికి ఉన్న భారత చక్రవర్తి అనే బిరుదు రద్దవుతుంది.
- వైస్రాయ్ పదవి రద్దు అవుతుంది.
- రాజ్యాంగ పరిషత్తు తాత్కాలిక పార్లమెంటుగా పనిచేసి చట్టాలను రూపొందిస్తుంది.
- గవర్నర్ జనరల్, రాష్ట్ర గవర్నర్లు రాజ్యాంగ పరమైన అధిపతులుగా వ్యవహరిస్తారు.
- లార్డ్ మౌంట్‌బాటన్ మొదటి గవర్నర్ జనరల్‌గా నియమితులయ్యారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. 1833 చార్టర్ చట్టం ప్రకారం ప్రవేశపెట్టిన అంశాల్లో కింది వాటిలో సరికానిది?
   ఎ)ఈస్టిండియా కంపెనీ వాణిజ్య కార్యకలాపాల రద్దు
   బి) కౌన్సిల్‌లోని ఉన్నతాధికారిని గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియాగా మార్చడం
   సి) కౌన్సిల్‌లో న్యాయ చట్టాలను చేసే అధికారం గవర్నర్ జనరల్ ఇచ్చింది
   డి) గవర్నర్ జనరల్ కౌన్సిల్‌లోని న్యాయమండలికి మొదటిసారిగా భారతీయుడిని నియమించారు
2. కింది వాటిలో సరైంది?
   ఎ)బ్రిటన్ తరహాలో భారతదేశంలో రెగ్యులర్ పోలీసు దళాన్ని ఏర్పాటు చేసిన మొదటి గవర్నర్ జనరల్ వారెన్‌హేస్టింగ్స్
   బి) రెగ్యులేటింగ్ చట్టం-1773 ద్వారా కలకత్తాలో సుప్రీంకోర్టు ఏర్పాటు ప్రతిపాదన
   సి) ఎ, బి డి) ఏదీకాదు
3. భారత ప్రభుత్వ చట్టం-1935 ప్రకారం ఎన్ని జాబితాలు ఉండేవి?
   ఎ) రెండు బి) మూడు
   సి) అయిదు డి) ఆరు
4. భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యానికి పునాది వేయడానికి కారకుడు?
   ఎ) వాట్సన్ బి) రాబర్ట్ క్లైవ్
   సి) డూప్లెక్స్ డి) వారెన్ హేస్టింగ్స్
5. భారతదేశ పాలన బ్రిటిష్ చక్రవర్తి పరిధిలోకి వచ్చినట్లు విక్టోరియా రాణి ప్రకటన చేసిన రోజు?
   ఎ) 1858 నవంబర్ 1
   బి) 1857 నవంబర్ 1
   సి) 1859 డిసెంబర్ 1
   డి) 1857 డిసెంబర్ 1
6. భారత ప్రభుత్వ చట్టం-1919లోని ప్రధాన అంశం/ అంశాలు?
   ఎ) రాష్ట్రాల కార్యనిర్వాహక ప్రభుత్వంలో ద్వంద్వ పాలనను ప్రవేశపెట్టడం
   బి) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారాల నిర్వచనం
   సి) కేంద్ర, రాష్ట్రాలకు శాసన నిర్మాణ అధికార సంక్రమణం
   డి) పైవన్నీ
7. పాలనలో భారతీయులకు భాగస్వామ్యం కల్పించటానికి ఉద్దేశించిన మొదటి బ్రిటిష్ చట్టం?
   ఎ) ఇండియన్ కౌన్సిళ్ల చట్టం- 1861
   బి) ఇండియన్ కౌన్సిళ్ల చట్టం-1862
   సి) ఇండియన్ కౌన్సిళ్ల చట్టం- 1909
   డి) భారత ప్రభుత్వ చట్టం- 1919
8. 'గట్టి బ్రేకులు ఉండి ఇంజన్ లేని యంత్రం' గా నెహ్రూ దేన్ని పేర్కొన్నారు?
   ఎ) కేబినెట్ మిషన్
   బి) మౌంట్‌బాటన్ ప్రణాళిక
   సి) వేవెల్ ప్రణాళిక
   డి) భారత ప్రభుత్వ చట్టం-1935

సమాధానాలు

1) డి 2) సి 3) బి 4) బి
5) ఎ 6) డి 7) ఎ 8) డి

మాదిరి ప్రశ్నలు

1. భారత రాజ్యాంగ రచనలో అత్యంత ప్రభావం చూపిన అంశం?
   ఎ) అమెరికా రాజ్యాంగం
   బి) బ్రిటిష్ రాజ్యాంగం సి) ఐరిష్ రాజ్యాంగం
   డి) భారత ప్రభుత్వ చట్టం
2. జతపరచండి.
   1) పోర్ట్ ఫోలియో పద్ధతి
   2) సివిల్ సర్వీసులు
   3) మత నియోజక వర్గాలు
   4) భారత న్యాయ సంస్కరణలు
   ఎ) లార్డ్ మెకాలే
   బి) లార్డ్ కార్న్ వాలిస్
   సి) లార్డ్ కానింగ్
   డి) లార్డ్ మింటో
   ఎ) 1-సి, 2-బి, 3-డి, 4-ఎ
   బి) 1-బి, 2-సి, 3-ఎ, 4-డి
   సి) 1-డి, 2-ఎ, 3-బి, 4-సి
   డి) 1-ఎ, 2-బి, 3-డి, 4-సి
3. కాలక్రమం ప్రకారం కింది వాటిని గుర్తించండి?
   1) ప్రత్యేక నియోజకవర్గాలు
   2) శాసన అధికారాల బదలాయింపు
   3) ద్విసభా విధానం
   4) డొమినియన్ ప్రతిపత్తి
   ఎ) 1, 2, 3, 4, బి) 2, 1, 3, 4
   సి) 3, 2, 1, 4 డి) 3, 4, 1, 4
4. ప్రభుత్వానికి ఉండే అధికారం దేనికి ఉదాహరణ?
   ఎ) సంప్రదాయ అధికారం
   బి) సమ్మోహనాధికారం
   సి) చట్టబద్ధ, హేతుబద్ధ అధికారం
   డి) పైవన్నీ

సమాధానాలు

1) డి 2) ఎ 3) ఎ 4) సి

ఉద్యోగాలు

టీటీడీలో మిడిల్ లెవల్ కన్సల్టెంట్ పోస్టులు

తిరుపతిలోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో శ్రీలక్ష్మీ శ్రీనివాస మ్యాన్‌పవర్ కార్పొరేషన్(ఎస్ఎల్ఎస్ఎంపీసీ) రెండేళ్ల కాంట్రాక్ట్ ప్రాతిపదికన మిడిల్ లెవల్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
- **అర్హత:** ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు జనరల్ అడ్మినిస్ట్రేషన్ లేదా ఆఫీస్ మేనేజ్‌మెంట్ లేదా రెలిజియస్ ఆర్గనైజేషన్ తదితరాల విభాగంలో 10 నుంచి 15 ఏళ్ల పని అనుభవం ఉండాలి. ఐటీ/అనలిటికల్/కమ్యూనికేషన్ తదితరాల్లో నైపుణ్యం ఉండాలి.
- **వయసు:** 45 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.2 లక్షలతో పాటు అవసరమైన వసతి, ల్యాప్‌టాప్ సౌకర్యం కల్పిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:

- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శ్రీలక్ష్మీ శ్రీనివాస మ్యాన్‌పవర్ కార్పొరేషన్, పాత అలిపిరి గెస్ట్ హౌస్, తిరుపతి చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్:** recruitments.slsmpc@gmail.com.
- **దరఖాస్తులకు చివరితేది:** 07.10.2024.
- **వెబ్‌సైట్:** http://slsmpc.in/

నంద్యాల జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో వివిధ ఖాళీలు

నంద్యాల జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయం ఒప్పంద ప్రాతిపదికన పాన్యాపురంలోని శిశుగృహ, ఆళ్లగడ్డలోని బాలసదనంలో వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 09.
- **ఖాళీల వివరాలు:** డాక్టర్-జనరల్(పార్ట్ టైమ్)-01, ఆయా(మహిళ)-05, ఎడ్యుకేటర్ (పార్ట్ టైమ్)-01, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కమ్ మ్యూజిక్ టీచర్(జనరల్)-01, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కమ్ యోగా టీచర్(జనరల్)-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి ఏడో తరగతి, పదో తరగతి, డిప్లొమా, ఎంబీబీఎస్, డిగ్రీ, బీఈడీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **గరిష్ఠ వయో పరిమితి:** 42 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, సంజీవ నగర్, నంద్యాల చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 11.10.2024.
- **వెబ్‌సైట్:** https://nandyal.ap.gov.in/

లక్ష్యాలను ఆచరణలో సాధించాలంటే?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

సోషల్ స్టడీస్

మెథడాలజీ

1. మానసిక చలనాత్మక రంగంలో ఉన్నత లక్ష్యం?
   1) స్వభావీకరణ 2) న్యాయనిర్ణయం
   3) సమన్వయం 4) ప్రేరణ
2. అభిరుచులను పెంపొందించుకోవడం అనే లక్ష్యానికి సంబంధించిన స్పష్టీకరణ?
   1) నిర్ధారించడం
   2) ఒక రూపం నుంచి మరో రూపానికి అనువదించడం
   3) సామాజిక సమస్యలకు సంబంధించిన చర్చల్లో పాల్గొని ఆనందించడం
   4) జాతీయ పతాకం పట్ల గౌరవభావాన్ని పెంపొందించుకోవడం
3. ఒక విద్యార్థి... మూడు రోజుల నివేదిక ఆధారంగా తర్వాత రోజు ఉష్ణోగ్రతను ఊహించగలిగే సామర్థ్యం ఏ లక్ష్య సాధనకు సంబంధించింది?
   1) జ్ఞానం 2) అభిరుచి
   3) వినియోగం 4) అవగాహన
4. జట్టు సభ్యులతో పనిచేసే సామర్థ్యం, ఇతర సభ్యుల సహకారం తీసుకోవడం ఏ రకమైన నైపుణ్యానికి సంబంధించినవి?
   1) నిశిత ఆలోచన నైపుణ్యం
   2) భావవ్యక్తీకరణ నైపుణ్యం
   3) బౌద్ధిక నైపుణ్యం
   4) సాంఘిక నైపుణ్యం
5. ఇతరుల మాటలపై గౌరవం కలిగి ఉండడం ఏ బోధనా లక్ష్యానికి సంబంధించింది?
   1) అవగాహన 2) వైఖరి
   3) నైపుణ్యం 4) జ్ఞానం
6. ఒక విద్యార్థి నీటి సంరక్షణ పద్ధతులపై సమాచారాన్ని సేకరించి ఒక చిరు పుస్తకాన్ని తయారు చేయడం ఏ లక్ష్య సాధనకు చెందుతుంది?
   1) వైఖరి 2) ప్రశంస
   3) అభిరుచి 4) నైపుణ్యం
7. ఒక పబ్లిక్ నీటి కుళాయి నుంచి వృథాగా పోతున్న నీటిని ఆపడానికి ఒక విద్యార్థి చేసిన ప్రయత్నం ఏ లక్ష్య సాధనకు సంబంధించింది
   1) నైపుణ్యం 2) అభిరుచి
   3) అవగాహన 4) వైఖరి
8. బడ్జెట్ పాఠం విన్న ఒక విద్యార్థి ప్రభుత్వం ప్రవేశపెట్టే లోటు బడ్జెట్ వల్ల కలిగే ఫలితాలను ఊహించగలిగితే ఏ లక్ష్యం నెరవేరినట్లు భావించొచ్చు?
   1) వినియోగం 2) జ్ఞానం
   3) అవగాహన 4) అభిరుచి
9. విద్యార్థుల్లో సామాజిక సమర్థతను పెంపొందించడం?
   1) గమ్యం 2) లక్ష్యం
   3) విలువ 4) ఆశయం
10. ధర, డిమాండ్ మధ్య సంబంధాన్ని వివరించండి అనే ప్రశ్న ఏ లక్ష్య సాధనను ఉద్దేశించింది?
    1) జ్ఞానం 2) నైపుణ్యం
    3) వైఖరి 4) అవగాహన
11. 'మీ నియోజకవర్గంలో పోలింగ్ శాతాన్ని మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించండి' అనే ప్రశ్న ఏ లక్ష్యాన్ని పరీక్షిస్తుంది?
    1) వినియోగం-సంశ్లేషణ
    2) అవగాహన - వివరణను ఇవ్వడం
    3) నైపుణ్యం-అనువాదం చేయడం
    4) వినియోగం -కారణాలను చెప్పడం
12. 'వివిధ మతాలున్న భారతీయ సమాజంలో లౌకికత్వం ఒక నిర్బంధ జీవన విధానం.. దీన్ని అంగీకరిస్తారా? లేదా?' అనే ప్రశ్న ఏ లక్ష్య సాధనకు ఉద్దేశించింది?
    1) నైపుణ్యం 2) జ్ఞానం
    3) వైఖరి 4) అవగాహన
13. పాఠం నేర్చుకొన్న తర్వాత ఒక విద్యార్థి పబ్లిక్ ఆస్తులను కాపాడగలగడం అనే సామర్థ్యం ఏ లక్ష్య సాధన ఫలితం?
    1) వైఖరి 2) ప్రశంస
    3) అభిరుచి 4) అవగాహన
14. అభిరుచి లక్ష్యం స్పష్టీకరణ?
    1) ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం
    2) సరైన సమయంలో పన్నులు చెల్లించడం
    3) సెమినార్‌లలో పాల్గొనడం
    4) భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని అభినందించడం
15. సాంఘికశాస్త్ర బోధనలో నోట్స్ రాయించే పద్ధతి ఉద్దేశం?
    1) సాంఘిక శాస్త్ర సిలబస్ అధిక భారంగా ఉంది
    2) పాఠ్య పుస్తకాల నుంచి విషయాన్ని చదవడం కష్టమైన పని, ఇది సగటు విద్యార్థి అవగాహన సామర్థ్యానికి మించినది
    3) ఎక్కువ మార్కులు సంపాదించేందుకు నోట్స్ తోడ్పడుతుంది
    4) ఇది శాశ్వత రికార్డుగా, సులభంగా రిఫర్ చేసేందుకు అనువుగా ఉంటుంది
16. సాంఘిక శాస్త్ర అధ్యయనం ద్వారా విద్యార్థి హింసావాదాన్ని తిరస్కరించాడు.. అనేది?
    1) లక్ష్యం 2) ఆశయం
    3) విలువ 4) ఉద్దేశం
17. నావ గమ్యం చేరాలంటే దిక్సూచి ఎంత ముఖ్యమో, పాఠం బోధించడానికి అంతే ముఖ్యమైనది ఏది?
    1) ఉపాధ్యాయుడు 2) పాఠ్యపుస్తకం
    3) లక్ష్యం 4) విద్యాప్రణాళిక
18. కింది వాటిలో లక్ష్యాల లక్షణం కానిది?
    1) ఆచరణ యోగ్యంగా ఉంటాయి
    2) పాఠ్యాంశాలన్నింటికీ ఏకరీతిగా ఉంటాయి
    3) అభ్యసన ఫలితాల్లో కనిపిస్తాయి
    4) బోధన ద్వారా తరగతిలో సాధించడం జరుగుతుంది
19. లక్ష్యాలను ఆచరణలో సాధించాలంటే ?
    1) శీఘ్ర మూల్యాంకనం
    2) విద్యార్థులకు తగిన అభ్యసనాను భవాలను కల్పించడం
    3) విద్యార్థుల ఆసక్తులకు అనుగుణంగా బోధన 4) పైవన్నీ
20. విద్యార్థి మంచి అభ్యసన కోసం మనం ఆశించే స్పందనలను ప్రణాళికలో స్పష్టంగా పేర్కొనడాన్ని ఏమంటారు?
    1) లక్ష్యాలు 2) ఆశయాలు
    3) స్పష్టీకరణలు 4) విలువలు
21. లక్ష్యాల స్పష్టీకరణలను ఏ విధంగా పిలుస్తారు?
    1) విద్యాలక్ష్యాలు 2) జ్ఞానలక్ష్యాలు
    3) మనోచలనాత్మక లక్ష్యాలు
    4) ప్రవర్తనా లక్ష్యాలు
22. కింది వాటిలో భావావేశ లక్ష్యానికి మూలం కానిది?
    1) ఆసక్తి 2) అభిమతం
    3) ప్రశంస 4) వివేచన
23. విద్యార్థి భూమికి, సూర్యుడికి మధ్య దూరాన్ని కచ్చితంగా చెప్పాడు.. ఇది ఏ లక్ష్యాన్ని తృప్తి పరుస్తుంది?
    1) అవగాహన 2) నైపుణ్యం
    3) జ్ఞానం 4) వినియోగం
24. అవగాహనకు సోపానం?
    1) జ్ఞానం 2) నైపుణ్యం
    3) వినియోగం 4) అభిరుచి
25. విద్యార్థులు పబ్లిక్ వస్తువులు, ఆర్థిక వస్తువులతో ప్రజలకు గల సంబంధాన్ని తెలుసుకున్నారు... అనే దృగ్విషయం ఏ లక్ష్యాన్ని మాపనం చేస్తుంది?
    1) వైఖరి 2) అవగాహన
    3) వినియోగం 4) అభిరుచి
26. కింది వాటిలో సరికానిది?
    1) అవగాహన - పోలికలు, భేదాలను విద్యార్థి తెలిపాడు
    2) వినియోగం - ప్రజాస్వామ్య వ్యవస్థ లాభాలను విద్యార్థి చెప్పాడు
    3) వైఖరి- సర్వే ద్వారా సేకరించిన సమాచారాన్ని విద్యార్థి నివేదికగా తయారు చేశాడు
    4) అభిరుచి-పాఠశాలలో జరిగిన మాక్‌పార్లమెంట్‌లో విద్యార్థి ఆసక్తిగా పాల్గొన్నాడు
27. భారతదేశ సాంస్కృతిక వారసత్వ గొప్పతనాన్ని రాయండి.. అనే ప్రశ్న ద్వారా ఏ లక్ష్యాన్ని సాధించొచ్చు?
    1) అభిరుచి 2) జ్ఞానం
    3) ప్రశంస 4) వైఖరి
28. గ్రామంలోని నిరక్షరాస్యుల సమాచారాన్ని విద్యార్థి సేకరించాడు. ఇది ఏ లక్ష్యానికి సంబంధించింది?
    1) నైపుణ్యం 2) అవగాహన
    3) వినియోగం 4) అభిరుచి
29. ఏమిటి? ఎక్కడ? ఎప్పుడు? ఎవరు? అనే ప్రశ్నలకు వచ్చే సమాధానాలు దేనికి సంబంధించిన అంశాలు?
    1) జ్ఞానం 2) అవగాహన
    3) వైఖరి 4) వినియోగం
30. కింది వాటిలో వినియోగ స్పష్టీకరణ?
    1) దోషాలు కనుక్కోవడం
    2) దత్తాంశాలను వ్యాఖ్యానించడం
    3) జరగబోయే ఫలితాన్ని చెప్పడం
    4) ఉదాహరణలివ్వడం
31. వ్యక్తిలో దాగిన మహత్తర శక్తులను వెలికితీసే సాధనమే విద్య అనే నిర్వచనాన్ని బలపర్చే లక్ష్యం?
    1) ప్రశంస 2) వైఖరి
    3) జ్ఞానం 4) అవగాహన
32. వైఖరి అనే లక్ష్యాన్ని సాధించిన వ్యక్తికి ఏ లక్షణంతో సంబంధం ఉండాలనే నియమం లేదు?
    1) దేశభక్తి
    2) నిష్పక్షపాతం
    3) ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం
    4) ఇతరులకు సేవ చేయడానికి ఆసక్తి చూపడం
33. విద్యార్థి ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీల తీరును మెచ్చుకుంటూ, రాజకీయ నాయకులను విమర్శించాడు.. ఇది ఏ లక్ష్యాన్ని నెరవేరుస్తుంది?
    1) ప్రశంస 2) అభిరుచి
    3) వైఖరి 4) నైపుణ్యం
34. బ్లూమ్స్ విద్యా లక్ష్యాల వర్గీకరణలో పరిమితి కానిది?
    1) జ్ఞానాత్మక రంగానికి ఇచ్చిన అధిక ప్రాధాన్యత
    2) ప్రశ్న పత్రాల్లోని నిర్దిష్టత
    3) మానసిక ప్రక్రియకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం
    4) లక్ష్యాల సాధనకు అధిక ప్రాధాన్యతనివ్వడం
35. మన రాష్ట్రంలో ఏ సంవత్సరం నుంచి 7, 10 తరగతులు మినహా మిగతా తరగతుల్లో విద్యార్థులకు డిటెన్షన్ విధానాన్ని రద్దు చేశారు?
    1) 1970 2) 1971 3) 1973 4) 1974
36. జ్ఞానాత్మక, భావావేశ, మానసిక చలనాత్మక రంగాల ప్రాముఖ్యతను 3 'H' లుగా గుర్తిస్తారు. ఆ మూడు 'H'లు ఏమిటి?
    1) హెడ్, హార్ట్, హ్యాండ్స్
    2) హోమ్, హెవెన్, హెల్త్
    3) హ్యూమానిటీ, హ్యూమిలిటీ, హాస్పిటలిటీ
    4) హానర్, హ్యూమర్, హానెస్టీ
37. కింది వాటిలో జ్ఞానాత్మక రంగంలో లేని లక్ష్యం?
    1) సంశ్లేషణ 2) విశ్లేషణ
    3) మూల్యాంకనం 4) సమన్వయం
38. కింది వాటిలో సరికానిది?
    ఎ) మానసిక చలనాత్మక రంగం - ప్రతిస్పందించడం, విలువ కట్టడం
    బి) జ్ఞానాత్మక రంగం - అవగాహన, హస్తలాఘవం
    సి) భావావేశ రంగం - గ్రహించడం, శీలస్థాపనం
    1) పైవన్నీ 2) ఏవీ కావు
    3) ఎ, బి 4) బి, సి
39. విద్యార్థి వివిధ శీతోష్ణస్థితి ప్రాంతాల్లో సంభవించే మార్పులను ఊహించి చెప్పగలిగాడు ఇది ఏ లక్ష్యాన్ని సాధిస్తుంది?
    1) అవగాహన - అనువదించడం
    2) అవగాహన - వ్యాఖ్యానించడం
    3) అవగాహన - ఎక్స్‌ట్రాపొలేషన్
    4) అవగాహన - సునిశితత్వం
40. జ్ఞానాత్మక రంగంలోని అత్యున్నత లక్ష్యం?
    1) జ్ఞానం 2) అవగాహన
    3) విశ్లేషణ 4) మూల్యాంకనం

సమాధానాలు

1) 1; 2) 3; 3) 3; 4) 4; 5) 2;
6) 4; 7) 4; 8) 1; 9) 3; 10)4;
11) 1; 12) 4; 13) 1; 14) 3; 15)4;
16) 1; 17) 3; 18) 2; 19) 2; 20)3;
21) 4; 22) 4; 23) 3; 24) 1; 25)2;
26) 3; 27) 3; 28) 1; 29) 1; 30)3;
31) 2; 32) 4; 33) 1; 34) 2; 35)2;
36) 1; 37) 4; 38) 3; 39) 3; 40)4


కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సిటీ ఆఫ్ లేక్స్ అని ఏ నగరాన్ని అంటారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ



మాదిరి ప్రశ్నలు

1. వైష్ణోదేవి ఆలయం ఏ రాష్ట్రంలో ఉంది?
1) అరుణాచల్‌ప్రదేశ్
2) రాజస్థాన్ 3) గుజరాత్
4) జమ్మూ కశ్మీర్

2. సిక్కు యువకులు నిర్వహించే 'చక్కర్' అంటే?
1) అశ్వాల పోటీ
2) అస్త్ర విన్యాసం 3) పడవల పందేలు
4) ఏనుగుల ఊరేగింపు

3. విక్రమశిల విశ్వవిద్యాలయాన్ని నిర్మించినవారు ఎవరు?
1) ధర్మపాలుడు
2) కర్ణదేవుడు 3) లక్ష్మణ సేనుడు
4) అతిశదీపాంకరుడు

4. పాండిచ్చేరిలో సేవలందించిన అరవిందుని శిష్యురాలు ఎవరు?
1) మీరాబెన్ 2) ఎడ్వినా
3) మదర్ మిర్రా రిచర్డ్
4) సిస్టర్ నివేదిత

5. కింది వాటిలో సరైన జత ఏది?
1) మీనాక్షి దేవాలయం - మదురై
2) విశాలాక్షి ఆలయం - కాశీ
3) జోగులాంబ ఆలయం - అలంపూర్
4) పైవన్నీ సరైనవే

6. హార్న్‌బిల్ నృత్యం ఏ రాష్ట్రంలో చేస్తారు?
1) త్రిపుర 2) మణిపూర్
3) నాగాలాండ్ 4) మేఘాలయ

7. పూరీ జగన్నాథాలయాన్ని నిర్మించిన వారు?
1) చైతన్య ప్రభు
2) అనంతవర్మన్ చోడగాంగుడు
3) మార్తాండ వర్మ
4) గాంగయ నరసింహ దేవుడు

8. 'రుమీ దర్వాజ' ఎక్కడ ఉంది?
1) మీరట్ 2) లక్నో
3) ఆగ్రా 4) జబల్‌పూర్

9. కింది వాటిలో తేలు ఆకారంలో ఉన్న నిర్మాణం ఏది?
1) చౌమొహల్లా ప్యాలెస్
2) మక్కా మసీదు
3) చార్మినార్
4) ఫలక్‌నుమా ప్యాలెస్

10. కళింగ యుద్ధం ఏ నదీ తీరాన జరిగింది?
1) దయాభాగ 2) పినాకిని
3) తుంగభద్ర 4) కిన్నెరసాని

11. 'సిటీ ఆఫ్ లేక్స్' అని ఏ నగరాన్ని అంటారు?
1) నాగ్‌పూర్ 2) ఉదయ్‌పూర్
3) జైపూర్ 4) జబల్‌పూర్

12. రామప్ప దేవాలయ శిల్పాల్లో ఏ నాట్య భంగిమలు ఉన్నాయి?
1) పేరిణీ శివతాండవం
2) మోహినీ ఆట్టం
3) రాసలీల 4) థింసా

13. సాంచీ స్థూపాన్ని అశోకుడు ఏ కొండపై నిర్మించాడు?
1) మనోరమ 2) మహేంద్రగిరి
3) ఇంద్ర కీలాద్రి 4) ఏదీకాదు

14. 'పారిస్ ఆఫ్ ఇండియా' అని ఏ నగరాన్ని పిలుస్తారు?
1) న్యూ ఢిల్లీ 2) ఉదయ్‌పూర్
3) జైపూర్ 4) చండీగఢ్

15. హుస్సేన్ సాగర్‌ను ఎప్పుడు నిర్మించారు?
1) 1462 2) 1562
3) 1662 4) 1762

16. బ్రిటిష్ వైస్రాయ్ డల్హౌసీ పేరు మీదుగా ఏర్పడిన నగరం ఏ రాష్ట్రంలో ఉంది?
1) హిమాచల్‌ప్రదేశ్
2) ఉత్తరప్రదేశ్
3) అరుణాచల్‌ప్రదేశ్
4) ఆంధ్రప్రదేశ్

17. 'గాడ్స్ ఓన్ కంట్రీ' అని ఏ రాష్ట్రాన్ని అంటారు?
1) కేరళ 2) గుజరాత్
3) రాజస్థాన్ 4) జమ్మూ కశ్మీర్

18. ఎల్లోరాలోని కైలాసనాథాలయం ఏ శతాబ్దం నాటిది?
1) క్రీ.శ. 4 2) క్రీ.శ. 5
3) క్రీ.శ. 6 4) క్రీ.శ. 8

19. ఆసియాలోనే అతిపెద్ద గజశాల ఉన్న దేవాలయం ఏది?
1) పళని కుమారస్వామి ఆలయం
2) నాగర్‌కోయిల్ నాగేశ్వరాలయం
3) గురువాయుర్ శ్రీకృష్ణాలయం
4) అనంత పద్మనాభస్వామి ఆలయం

20. చాంద్ మినార్ నిర్మాత ఎవరు?
1) ఫిరోజ్‌షా తుగ్లక్ 2) అల్లావుద్దీన్ ఖిల్జీ
3) ఇబ్రహీంలోడి
4) మహమ్మద్ కులీ కుతుబ్‌షా

21. 'గేట్ వే ఆఫ్ ఇండియా' నమూనా సృష్టికర్త ఎవరు?
1) గెరాల్డ్ ఆంగ్లియర్
2) జాబ్ చార్నాక్
3) ఫ్రాంకోయిస్ మార్టిన్ 4) జార్జి విట్టెట్

22. అగ్ని నక్షత్ర వేడుకలను ఏ రాష్ట్రంలో జరుపుకుంటారు?
1) తమిళనాడు 2) ఒడిశా
3) మధ్యప్రదేశ్ 4) గుజరాత్

23. కింది వాటిలో పారశీకుల ఆధ్యాత్మిక కేంద్రం ఏది?
1) అలహాబాద్ 2) సూరత్
3) చెన్నై 4) కాలికట్

24. పోర్‌బందర్‌లో గాంధీజీ జన్మించిన ఇంటిని ఏమని పిలుస్తారు?
1) వేదవనం 2) కిసాన్ స్థల్
3) కీర్తిమందిర్ 4) సమతాస్థల్

25. 'నాగోబా జాతరను' ఏ తెగవారు జరుపుకుంటారు?
1) సవరలు 2) గోండులు
3) మేర్‌లు 4) సంతాలులు

26. గౌహతి ప్రాచీన నామం ఏది?
1) కామరూప 2) గోపకపట్నం
3) రేవతీ ద్వీపం 4) ప్రాగ్జ్యోతిషపురం

27. ఖుష్ మహల్ ఎక్కడ ఉంది?
1) మెదక్ 2) వరంగల్
3) కరీంనగర్ 4) బోధన్

28. 'స్కాట్లాండ్ ఆఫ్ ది ఈస్ట్' అని ఏ ప్రాంతాన్ని అంటారు?
1) షిల్లాంగ్ 2) ఇంఫాల్
3) ఈటానగర్ 4) దిస్పూర్

29. షాలిమార్ గార్డెన్స్ నిర్మాత ఎవరు?
1) బాబర్ 2) హుమాయూన్
3) జహంగీర్ 4) రెండో షా ఆలం

30. కింది వాటిలో సరైన జత ఏది?
1) వేదాంగాలు - 6
2) వేదాంతాలు - 108
3) ఉప వేదాలు - 4
4) పైవన్నీ సరైనవే

31. చాపకూడు విధానాన్ని ప్రవేశపెట్టినవారు?
1) బ్రహ్మనాయుడు
2) తాండ్ర పాపారాయుడు
3) వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు
4) కాటమరాజు

32. అంజాద్ అలీఖాన్ ఏ తంత్రీ వాద్యంలో దిట్ట?
1) సరోద్ 2) వీణ
3) గిటార్ 4) సితార

33. అవనీంద్రనాథ్ ఠాగూర్ ఏ రంగంలో కీర్తి గాంచారు?
1) కార్టూన్లు 2) క్రీడలు
3) డ్రామా 4) పెయింటింగ్

34. విష్ణువు అవతారాల్లో నృసింహావతారం ఎన్నోది?
1) 3 2) 4
3) 5 4) 6

35. అమరశిల్పి జక్కనను ఆదరించిన పాలకులు ఎవరు?
1) హోయసలులు 2) పల్లవులు
3) చోళులు 4) శాతవాహనులు

36. విక్టోరియా మెమోరియల్ నిర్మాణం ఎక్కడ ఉంది?
1) బేలూరు 2) కలకత్తా
3) అగర్తల 4) ముర్షిదాబాద్

37. కింది వాటిలో సరైన జత?
1) కుతుబ్ మినార్ - ఢిల్లీ సుల్తానులు
2) ఎం.ఎస్. సుబ్బులక్ష్మి - కర్ణాటక సంగీతం
3) వేద్ - జ్ఞానం 4) అన్నీ సరైనవే

38. కింది వాటిలో బొమ్మల తయారీకి ప్రసిద్ధి చెందిన ప్రాంతం?
1) కడియం 2) నిర్మల్
3) ఆలేరు 4) పిల్లలమర్రి

39. నాణేలపై 'ఖలీమా' ముద్రణను (సూక్తి) నిలిపివేసిన మొగల్ రాజు?
1) అక్బర్ 2) జహంగీర్
3) షాజహాన్ 4) ఔరంగజేబు

40. జక్కనాచారి అవార్డును ప్రదానం చేసే రాష్ట్రం?
1) మధ్యప్రదేశ్ 2) ఒడిశా
3) కర్ణాటక 4) తమిళనాడు

41. మిద్దె రాములు కింది ఏ కళలో పేర్గాంచారు?
1) థింసా నృత్యం 2) హరికథ
3) ఒగ్గు కథ 4) బుర్రకథ

42. వేదకాలంలో 'పురంధరుడు' అని ఏ దేవుడిని అనేవారు?
1) సూర్యుడు 2) చంద్రుడు
3) వరుణుడు 4) ఇంద్రుడు

43. పోర్చుగీసువారు 'పింటాడో' అని ఏ కళను పిలిచారు?
1) మధుబని కళ
2) కొయ్య బొమ్మల తయారీ
3) కలంకారీ కళ
4) నీలిమందు తయారీ

44. గాయత్రి మంత్రం ఏ వేదంలో ఉంది?
1) రుగ్వేదం 2) యజుర్వేదం
3) సామవేదం 4) అధర్వణవేదం

45. 'ఒగ్గుకథ'ను ప్రధానంగా ఎవరి కథను చెప్పేందుకు రూపొందించారు?
1) బీరప్ప 2) కట్టప్ప
3) రామప్ప 4) సిద్దప్ప

46. 'అసతోమా సద్గమయా.. తమసోమా జ్యోతిర్గమయా' అనే మంత్రాన్ని ఏ ఉపనిషత్ నుంచి స్వీకరించారు?
1) ముండకోపనిషత్
2) ఈశోపనిషత్
3) బృహదారణ్యకోపనిషత్
4) మాండూక్యోపనిషత్

47. అశోకుని సారనాథ్ స్థూపంలోని ధర్మ చక్రంలో ఉన్న గీతలు (ఆకులు) ఎన్ని?
1) 22 2) 24
3) 26 4) 28

48. తమ గ్రామం సుభిక్షంగా ఉండాలని హోలీ పండుగ రోజు పిడిగుద్దులాటను కింది ఏ ప్రాంతంలో నిర్వహిస్తారు?
1) హున్సా (నిజామాబాద్)
2) అచ్చంపేట (మహబూబ్‌నగర్)
3) దేవరకొండ (నల్లగొండ)
4) జగ్గయ్యపేట (కృష్ణా)

49. వేదకాలంలో యాగాశ్వాన్ని ఏమని పిలిచేవారు?
1) హమామ్ 2) దద్రీక
3) గవిష్ఠి 4) హవిస్సు

50. 'సంగీతంలో తుంబురుడు' అని ఎవరిని అంటారు?
1) కన్నప్ప 2) క్షేత్రయ్య
3) త్యాగరాజు 4) మల్లప్ప

51. ఆడ శిశువు పుట్టగానే చంపే దురాచారం ఏ వంశస్థుల్లో ఉండేది?
1) చోళులు 2) ఢిల్లీ సుల్తానులు
3) రాజపుత్రులు 4) గుప్తులు

52. మౌంట్‌అబూలో ఉన్న ప్రసిద్ధాలయం ఏది?
1) దిల్వారా జైనాలయం
2) కైలాసనాథాలయం
3) చెన్నకేశవాలయం
4) జగన్నాథాలయం

53. కింది వాటిలో సరైన జత ఏది?
1) కపోతేశ్వరాలయం - చేజెర్ల
2) ఏడుపాయల జాతర - మెదక్
3) ఫణిగిరి - బౌద్ధమతం
4) పైవన్నీ

54. పురాణాల ప్రకారం 'అరుంధతి' ఎవరి భార్య?
1) వశిష్ఠుడు 2) అత్రి
3) భరద్వాజుడు 4) అగస్త్యుడు

55. భారతదేశ వాణిజ్యాన్ని వివరించే 'పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ' గ్రంథం ఏ భాషలో ఉంది?
1) గ్రీక్ 2) స్పానిష్
3) అరబ్బీ 4) లాటిన్

56. స్వస్తిక్ గుర్తు దేనికి సంకేతం?
1) సర్వాలకేళి 2) సర్వాభివృద్ధి
3) శుభం 4) పైవన్నీ

సమాధానాలు

1) 4	2) 2	3) 1	4) 3
5) 4	6) 3	7) 2	8) 2
9) 4	10) 1	11) 2	12) 1
13) 1	14) 3	15) 2	16) 1
17) 1	18) 4	19) 3	20) 2
21) 4	22) 1	23) 2	24) 3
25) 2	26) 4	27) 2	28) 1
29) 3	30) 4	31) 1	32) 1
33) 4	34) 2	35) 1	36) 2
37) 4	38) 2	39) 4	40) 3
41) 3	42) 4	43) 3	44) 1
45) 1	46) 3	47) 2	48) 1
49) 2	50) 4	51) 3	52) 1
53) 4	54) 1	55) 1	56) 4

What will come in place of...



BANK EXAMS

Arithmetic

Number Series

What will come in place of the question mark (?) in each of the following number series?

1. 2, 8, 26, ?, 242
1) 78 2) 72 3) 82
4) 84 5) 242
A: 5; The series × 3 + 2
2 ×3 + 2 = 8
8 × 3 + 2 = 26
26× 3 + 2 =80
80× 3 + 2 = 242

2. 3, 4, 12, ?, 196
1) 45 2) 40 3) 41
4) 49 5) None of these
A: 1; The given number series is based on the following pattern
3 ×1 +1 = 4
4 × 2 +4 = 12
12 × 3 + 9 = 45
45 × 4 + 16 = 196

3. 9, 17, ?, 65, 129
1) 32 2) 24 3) 35
4) 33 5) None of these
A: 4; The series is ×2–1
9×2 – 1 = 17
17×2 – 1 = 33
33×2 –1 = 65
65×2 – 1 = 129

4. 7, 13, ?, 49, 97
1) 27 2) 25 3) 23
4) 29 5) None of these
A: 2; The series is × 2 – 1
7 ×2 –1 = 13
13×2 –1 = 25
25×2–1 = 49
49×2–1 = 97

5. 5, 3, 6, ?, 64.75
1) 15 2) 15.5 3) 17.5
4) 5) None of these
A: 3; The given number series is based on the following pattern.
5× (1/2)+(1/2) = 3
3× (3/2)+(3/2) = 6
6× (5/2)+(5/2) = 17.5
17.5× (7/2)+(7/2) = 64.5

6. 12, 6.5, 7.5, 12.75, 27.5, 71.25, ?
1) 225.75 2) 216.75
3) 209.75 4) 236.75
5) 249.75
A: 2; The given number series is based on the following pattern
12 × 0.5+0.5 = 6.5
6.5×1+1 = 7.5
7.5×1.5 + 1.5 =12.75
12.75 × 2 +2 = 27.5
27.5×2.5+ 2.5= 71.25 and
71.25 ×3+ 3 = 216.75
So the answer is 216.75

7. 16, 24, 36, 54, 81, 121.5, ?
1) 182.25 2) 174.85
3) 190.65 4) 166.55
5) 158.95
A: 1; The given number series is based on the following pattern
16× (3/2) = 8 × 3 = 24
24× (3/2) = 12 × 3 = 36
36× (3/2) = 18 × 3 = 54
54× (3/2) = 27 × 3 = 81
81× (3/2) = 121.5 then
121.6× (3/2) = 182.25
So the answer is 182.25

8. 12, 12, 18, 45, 180, 1170, ?
1) 13485 2) 14675
3) 15890 4) 16756
5) 12285
A: 5; The given number series is based on the following pattern
12 ×1 =12 12×1.5 =18
18×2.5= 45 45× 4 = 180
180×6.5 = 1170
Here each number multiply with 1, 1.5, 2.5, 4, 6.5, ——
In this series the sum of any two numbers is third number. So last number is 4+ 6.5 = 10.5, now last number multiply with 10.5
1170×0.5 = 12285

9. 22, 23, 27, 36, 52, 77, ?
1) 111 2) 109 3) 113
4) 117 5) 115
A: 3; Here given number series is based on the following pattern
22+1^2=22+1=23
23+2^2=23+4=27
27+3^2=27+9=36
36+4^2=36+16=52
52+5^2=52+25=77 and
77+6^2=77+36=113

10. 16, 14, 24, 66, 256, 1270, ?
1) 85 2) 5672
3) 4561 4) 7608 5) 6340
A: 4; The given number series is based on the following pattern
16×1–2=14 14×2–4=24
24×3–6=66 66×4–8=256
256×5–10=1270 and
1270×6–12=7608

11. 5, 11, 32, ?, 444
1) 108 2) 109 3) 96
4) 98 5) None of these
A: 1; The given number series is based on the following pattern
(5 + 6) ×1 = 11
(11 + 5)×2 =32
(32 + 4)×3 = 108
(108 + 3)× 4 = 444

12. 7, 15, ?, 63, 127
1) 32 2) 29 3) 33
4) 31 5) None of these
A: 4; The series ×2 + 1
7 × 2 + 1 = 15
15 × 2 + 1 = 31
31 × 2 + 1 = 63
63 × 2 + 1 = 127

13. 2, 3, 10, ?, 172
1) 45 2) 39 3) 36
4) 42 5) None of these
A: 2; The given number series is based on the following pattern
2 × 1 + 1^2 = 3
3×2 + 2^2 = 10
10×3 + 3^2 = 39
39×4 + 4^2 = 172

14. 8, 4, 6, ?, 52.5
1) 9 2) 12.5
3) 15 4) 16 5) None of these
A: 3; The series is ×0.5, ×1.5, ×2.5, × 3.5
8 × 0.5 = 4 4 × 1.5 = 6
6 × 2.5 = 15 15 × 3.5 = 52.5

15. 5, 6, ?, 45, 184
1) 5 2) 12 3) 16
4) 9 5) None of these
A: 5; The series is (×n + n), Here n is natural number
5 × 1 + 1 = 6 6 × 2 + 2 = 14
14 × 3 + 3 = 45
45 × 4 + 4 = 184

16. 9, 62, ?, 1854, 7415, 22244
1) 433 2) 309 3) 406
4) 371 5) None of these
A: 4; The given number series is based on the following pattern
9 × 7 - 1 = 62
62 × 6 - 1 = 371
371 × 5 - 1 = 1854
1854 × 4 - 1 = 7415
7415× 3 - 1 = 22244

17. 4, 8, 24, 60, ?, 224
1) 178 2) 96 3) 109
4) 141 5) None of these
A: 5; The given number series is based on the following pattern
4 + 2^2 = 8 8 + 4^2 = 24
24 + 6^2 = 60 60 + 8^2 = 124
124 + 10^2 = 224

18. 8000, 1600, 320, 64, 12.8, ?
1) 2.56 2) 3.5
3) 3.2 4) 2.98 5) None of these
A: 1; The series is ÷ 5
8000 ÷ 5 = 1600
1600 ÷ 5 = 320
320 ÷ 5 = 64
64 ÷ 5 = 12.8
12.8 ÷ 5 = 2.56

19. 6, 9, 15, 27, 51, ?
1) 84 2) 99 3) 123
4) 75 5) None of these
A: 2; The series is +3, +6, +12, +24, +48, ...
6 + 3 = 9 9 + 6 = 15
15 + 12 = 27 27 + 24 = 51
51 + 48 = 99

20. 7, 8, 18, ?, 232, 1165
1) 84 2) 42 3) 57
4) 36 5) None of these
A: 3; The series is (× n + n), Here n is natural number
7 × 1 + 1 = 8
8 × 2 + 2 = 18
18 × 3 + 3 = 57
57 × 4 + 4 = 232
232 × 5 + 5 = 1165

21. 325, 314, 288, 247, 191, ?
1) 126 2) 116 3) 130
4) 120 5) None of these
A: 4; The series is
325, 314, 288, 247, 191, ?
-11 -26 -41 -56 -71
-15 -15 -15 -15

22. 45, 46, 70, 141, ?, 1061.5
1) 353 2) 353.5
3) 352.5 4) 352
5) None of these
A: 2; The given number series is based on the following pattern
45×1 + 1 = 46
46 ×1.5+1 = 70
70×2 + 1 = 141
141×2.5+1 = 353.5
353.5×3+1 = 1061.5

23. 620, 632, 608, 644, 596, ?
1) 536 2) 556 3) 656
4) 646 5) None of these
A: 3; The given number series is based on the following pattern
620 + 12 = 632
632 – 24 = 608
608 + 36 = 644
644 – 48 = 596
596 + 60 = 656

24. 15, 25, 40, 65, ?, 195
1) 115 2) 90
3) 105 4) 120
5) None of these
A: 5; The given number series is based on the following pattern
15× 2 – 5 = 25
25× 2 – 10 = 40
40×2 – 15 = 65
65× 2 – 20 = 110
110×2– 25 = 195

25. 120, 320, ?, 2070, 5195, 13007.5
1) 800 2) 920
3) 850 4) 900
5) None of these
A: 5; The given number series is based on the following pattern
120 × 2.5 + 20 = 320
320 × 2.5 + 20 =820
820 × 2.5 + 20 = 2070
2070 × 2.5 + 20 = 5195
5195×2.5 + 20 = 13007.5

26. 9, 19, 40, 83, ?, 345, 696
1) 162 2) 170 3) 175
4) 166 5) None of these
A: 2; The given number series is based on the following pattern
9× 2 + 1 = 19
19 × 2 + 2 = 40
40× 2 + 3 = 83
83 × 2 + 4 = 170
170 × 2 + 5 = 345
345 × 2 + 6 = 696

27. 980, 484, 236, 112, 50, ?, 3.5
1) 25 2) 17 3) 21
4) 29 5) None of these
A: 5; The given series is (÷2 - 6)
980 ÷2 - 6 = 484
484 ÷2 - 6 = 236
236 ÷2 - 6 = 112
112 ÷2 - 6 = 50
50 ÷2 - 6 = 19
19 ÷2 - 6 = 3.5

28. 8, 9, 20, 63, 256, 1285, ?
1) 6430 2) 7450
3) 7716 4) 7746
5) None of these
A: 3; The given series is (× n + n), n is natural number
8 × 1 + 1 = 9
9 × 2 + 2 = 20
20 × 3 + 3 = 63
63 × 4 + 4 = 256
256 × 5 + 5 = 1285
1285× 6 + 6 = 7716

29. 1015, 508, 255, 129, 66.5, ?, 20.875
1) 34.50 2) 35
3) 35.30 4) 35.75
5) None of these
A: 4; The given number series is based on the following pattern
(1015 + 1) ÷ 2 = 508
(508 + 2) ÷ 2 = 255
(255 + 3) ÷ 2 = 129
(129 + 4) ÷ 2 = 66.5
(66.5+5) ÷ 2 = 35.75
(35.75+6) ÷ 2 = 20.875

30. 12, 12, 18, 36, 90, 270, ?
1) 945 2) 810
3) 1080 4) 1215
5) None of these
A: 1; The given series is ×1, ×1.5, ×2, ×2.5, ×3, …
12 × 1 = 12
12 × 1.5 = 18
18 × 2 = 36
36 × 2.5 = 90
90 × 3 = 270
270× 3.5 = 945